S & D

సోమవారం 1-1-2018

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10

సంచిక: 281



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

కొత్త రాష్ట్రం తెలంగాణ మూడున్నరేళ్ళలో ఆవిష్కరించిన అద్భుతం

నేటి నుండి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్

Reliable Power Supply to all sectors in Telangana 24x7 Hrs POWER

దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి కృషితో మూడున్నర దశాబ్దాల కరెంటు కష్టాలకు చరమగీతం



తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నేటి నుండి 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది.

ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖిస్తున్నది.

సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత వల్ల గంటల కొద్దీ విద్యుత్ కోతలతో జనజీవనం దుర్భరంగా మారింది. కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంటు అందక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి, అపరాత్రి నీళ్ల పెట్టుకోవడానికి పోయిన రైతుల ప్రాణాలు కరెంటు షాకులకు బలైపోయినయి. లో ఓల్టేజి సమస్యతో ట్రాన్స్ ఫార్మర్లు పటాకుల వలె పేలిపోయేవి. నిరంతరం మోటార్లు కాలిపోయేవి.

పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వారంలో కొన్నిరోజులు పవర్ హాలిడేలు ప్రకటించే దుస్థితి ఆవరించి, పరిశ్రమలు మూతపడే స్థాయికి సంక్షోభం చేరింది.

సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో, కార్యదీక్షతో కృషి చేసి, మూడున్నరేళ్ల అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తెలంగాణలో కరెంటు కోతలు ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన గతం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇప్పుడు ప్రజల నిత్యానుభవం. పవర్ హాలిడేలు పోయి ఎవ్రీ డే ఈజ్ పవర్ డే అనే రోజులొచ్చినయి. నిరంతర విద్యుత్ సరఫరాతో పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగింది. కార్మికులకు కావాల్సినంత పని దొరుకుతున్నది. పెరిగిన వ్యవసాయోత్పత్తులతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కొద్ది కాలంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించబోతున్నది.

వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

తెలంగాణలో ఇప్పుడిక అన్ని రంగాలకు 24x7 నాణ్యమైన విద్యుత్

ఎత్తిపోతల పథకాలకు 12వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి సర్వసన్నద్ధం.

లోటు నుంచి మిగులు వరకు

2వ జూన్ 2014 తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు.

1 జనవరి 2018 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 మెగావాట్లు.

కొద్ది కాలంలోనే అందుబాటులోకి వచ్చే విద్యుత్ 28,000 మెగావాట్లు.

రూ.12,316 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థల పటిష్టం

వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1,724 కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించింది.

సోలార్ పవర్‌లో దేశంలో నెంబర్ వన్

3,142 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

జాతీయ సగటును దాటిన తలసరి విద్యుత్ వినియోగం

ఆర్థిక ప్రగతికి సూచికగా చెప్పబడే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,200 యూనిట్లు, నేడు 1,505కు పెరిగింది. ఇది తెలంగాణలో జీవన ప్రమాణాల పెరుగుదలకు అద్దం పడుతున్నది.

శరవేగంగా అల్ట్రా మెగా & సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం


- 4000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో టి.ఎస్.జెన్‌కో సారథ్యంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణం జరుగుతున్నది.
- 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిశంబరు 2018 లో పూర్తి కానున్నవి
- 800 మెగావాట్లు కెటిపిఎస్ పవర్ ప్లాంటు ఈ మార్చిలో ఉత్పత్తి ప్రారంభం కానున్నది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్-765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

- జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది.
- విద్యుత్ సంస్థల్లో 24,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత. దళారీ వ్యవస్థను నిర్మూలించింది.



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

R.O.No.62/17

S & D

సాక్షి స్పోర్ట్స్

సోమవారం 1-1-2018


ప్రపంచకప్ ఫుట్‌బాల్ డిఫెండింగ్ చాంపియన్ జర్మనీ

కొత్త ఏడాదిలో కొత్త ఆలోచనలు, కొత్త ఆశలు, మరికొన్ని కొత్త ఆశయాలు... ప్రపంచాన్ని గెలిచేందుకు, ప్రపంచానికి పరిచయమయ్యేందుకు మీ కోసమే అంటూ ఎన్నో వేదికలు, మరెన్నో ఆహ్వానాలు... క్రీడాకారులు అద్భుతాలు సృష్టించేందుకు ప్రతీ ఏడూ కొత్త రూపంలో అవకాశాలు వెతుక్కుంటూనే వస్తాయి. గత పరాజయాలను మరచి విజయాల వైపు దూసుకెళ్లేవారు కొందరైతే, సాధించిన ఘనతలతో సరిపెట్టుకోకుండా ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేసే వారు మరికొందరు. అలాంటి క్షణాలను ఆస్వాదిస్తూ ఆటగాళ్ల గెలుపును తమ గెలుపుగా భావించే అభిమానులందరి కోసం కొత్త సంవత్సరం పసందైన క్రీడా సమరాలతో సిద్ధంగా ఉంది.

క్రికెట్‌లో మన పదునేమిటో చూపించేందుకు దక్షిణాఫ్రికా నుంచి మొదలు పెట్టి ఇంగ్లండ్, ఆపై ఆస్ట్రేలియా వరకు మూడు కఠిన పర్యటనలు. క్రికెట్ మాత్రమేనా అనుకునే భారత అభిమానులు ఆనందించేందుకు అటు కామన్వెల్త్ క్రీడలు, ఇటు ఆసియా క్రీడల సంబరం......లోకం మరిచి ఊగిపోయేందుకు ఫుట్‌బాల్ ప్రపంచ కప్...అసలు విరామమే లేకుండా ఏడాది పొడవునా కొత్త బ్యాడ్మింటన్ షెడ్యూల్... ఎప్పటిలాగే టెన్నిస్‌లో గ్రాండ్‌స్లామ్ గలగలలు... మనింటి ఆట హాకీలో మరోసారి ప్రపంచ కప్ ఆతిథ్యం... ఇవి మాత్రమే కాదు ప్రతీ సంవత్సరం ఒకసారి నేనున్నానంటూ వేర్వేరు క్రీడాంశాల్లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లు... 2018లోనూ స్పోర్ట్స్‌ను ఎంజాయ్ చేసేందుకు మీరు రెడీనా...!

స్పోర్ట్స్ క్యాలెండర్ 2018



తప్పక చూడండి

కామన్వెల్త్ క్రీడలు
ఏప్రిల్ 4-15
గోల్డ్ కోస్ట్, ఆస్ట్రేలియా

ప్రపంచకప్ ఫుట్‌బాల్
జూన్ 14-జూలై 15
మాస్కో, రష్యా

ఆసియా క్రీడలు
ఆగస్టు 18-సెప్టెంబర్ 2
జకార్తా, ఇండోనేసియా

యూత్ ఒలింపిక్స్
అక్టోబర్ 6-18
బ్యూనస్ ఎయిర్స్, అర్జెంటీనా

క్రికెట్



జనవరి 5-9: భారత్-దక్షిణాఫ్రికా, తొలి టెస్టు (కేప్‌టౌన్)
జనవరి 13-17: భారత్-దక్షిణాఫ్రికా, రెండో టెస్టు (సెంచూరియన్)
జనవరి 24-28: భారత్-దక్షిణాఫ్రికా, మూడో టెస్టు (జోహన్నెస్‌బర్గ్)
జనవరి 27-28: బెంగళూరులో ఐపీఎల్-11 వేలం కార్యక్రమం
ఫిబ్రవరి 1: భారత్-దక్షిణాఫ్రికా, తొలి వన్డే (డర్బన్)
ఫిబ్రవరి 4: భారత్-దక్షిణాఫ్రికా, రెండో వన్డే (సెంచూరియన్)
ఫిబ్రవరి 7: భారత్-దక్షిణాఫ్రికా, మూడో వన్డే (కేప్‌టౌన్)
ఫిబ్రవరి 10: భారత్-దక్షిణాఫ్రికా, నాలుగో వన్డే (జోహన్నెస్‌బర్గ్)
ఫిబ్రవరి 13: భారత్-దక్షిణాఫ్రికా, ఐదో వన్డే (పోర్ట్ ఎలిజబెత్)
ఫిబ్రవరి 16: భారత్-దక్షిణాఫ్రికా, ఆరో వన్డే (సెంచూరియన్)
ఫిబ్రవరి 18: భారత్-దక్షిణాఫ్రికా, తొలి టి20 (జోహన్నెస్‌బర్గ్)
ఫిబ్రవరి 21: భారత్-దక్షిణాఫ్రికా, రెండో టి20 (సెంచూరియన్)
ఫిబ్రవరి 24: భారత్-దక్షిణాఫ్రికా, మూడో టి20 (కేప్‌టౌన్)
మార్చి 8-20: శ్రీలంకలో టి20 ముక్కోణపు టోర్నీ (భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్)
ఏప్రిల్ 4-మే 27: ఐపీఎల్-2018
జూలై 3: భారత్-ఇంగ్లండ్, తొలి టి20 (మాంచెస్టర్)
జూలై 6: భారత్-ఇంగ్లండ్, రెండో టి20 (కార్డిఫ్)
జూలై 8: భారత్-ఇంగ్లండ్, మూడో టి20 (బ్రిస్టల్)
జూలై 12: భారత్-ఇంగ్లండ్, తొలి వన్డే (నాటింగ్‌హమ్)
జూలై 14: భారత్-ఇంగ్లండ్, రెండో వన్డే (లార్డ్స్)
జూలై 17: భారత్-ఇంగ్లండ్, మూడో వన్డే (లీడ్స్)
ఆగస్టు 1-5: భారత్-ఇంగ్లండ్, తొలి టెస్టు (బర్మింగ్‌హమ్)
ఆగస్టు 9-13: భారత్-ఇంగ్లండ్, రెండో టెస్టు (లార్డ్స్)
ఆగస్టు 18-22: భారత్-ఇంగ్లండ్, మూడో టెస్టు (నాటింగ్‌హమ్)
ఆగస్టు 30-సెప్టెంబర్ 3: భారత్-ఇంగ్లండ్, నాలుగో టెస్టు (సౌతాంప్టన్)
సెప్టెంబర్ 7-11: భారత్-ఇంగ్లండ్, ఐదో టెస్టు (లండన్)
సెప్టెంబర్: ఆసియా కప్ (భారత్, పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, క్వాలిఫయర్)
అక్టోబర్-నవంబర్: భారత్‌లో వెస్టిండీస్ పర్యటన (3 టెస్టులు, 5 వన్డేలు, ఒక టి20)
నవంబర్-డిసెంబర్: ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన (4 టెస్టులు)

బ్యాడ్మింటన్

జనవరి 14: పీబీఎల్ ఫైనల్ (హైదరాబాద్)
జనవరి 16-21: మలేసియా మాస్టర్స్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; కౌలాలంపూర్)
జనవరి 23-28: ఇండోనేసియా మాస్టర్స్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; జకార్తా)
జనవరి 30-ఫిబ్రవరి 4: అఖిలేశ్ దాస్ గుప్తా ఇండియా ఓపెన్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; న్యూఢిల్లీ)
ఫిబ్రవరి 6-11: ఆసియా టీమ్ చాంపియన్‌షిప్ (మలేసియా)
ఫిబ్రవరి 20-25: స్విస్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; బాసెల్)
మార్చి 6-11: జర్మన్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; ముల్హీమ్ యాండెరుర్)
మార్చి 14-18: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 2 ; బర్మింగ్‌హమ్)
ఏప్రిల్ 24-29: ఆసియా వ్యక్తిగత చాంపియన్‌షిప్ (చైనా)
మే 1-6: న్యూజిలాండ్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; ఆక్లాండ్)
మే 8-13: ఆస్ట్రేలియన్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5, సిడ్నీ)
మే 20-27: థామస్ కప్, ఉబెర్ కప్ ఫైనల్స్ (గ్రేడ్ 1 టీమ్ చాంపియన్‌షిప్ ; బ్యాంకాక్)
జూన్ 12-17: యూఎస్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; అనాహీమ్)
జూన్ 26-జూలై 1: మలేసియా ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 3 ; కౌలాలంపూర్)
జూలై 3-8: ఇండోనేసియా ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 2 ; జకార్తా)
జూలై 10-15: థాయ్‌లాండ్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; బ్యాంకాక్)
జూలై 17-22: సింగపూర్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; సింగపూర్)
జూలై 30-ఆగస్టు 5: ప్రపంచ చాంపియన్‌షిప్ (గ్రేడ్ 1 వ్యక్తిగత చాంపియన్‌షిప్, చైనా)
ఆగస్టు 28-సెప్టెంబరు 2: స్పానిష్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; గ్రనాడా)
సెప్టెంబర్ 4-9: హైదరాబాద్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 6 ; హైదరాబాద్)
సెప్టెంబర్ 11-16: జపాన్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 3, టోక్యో)
సెప్టెంబర్ 18-23: చైనా ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 2 ; చాంగ్‌జూ)
సెప్టెంబర్ 25-30: కొరియా ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్



4 ; సియోల్)
అక్టోబర్ 2-7: చైనీస్ తైపీ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; తైపీ సిటీ)
అక్టోబర్ 16-21: డెన్మార్క్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 3 ; ఒడెన్స్)
అక్టోబర్ 23-28: ఫ్రెంచ్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 3 ; పారిస్)
అక్టోబర్ 30-నవంబర్ 4: మకావు ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; మకావు సిటీ)
నవంబర్ 5-18: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (గ్రేడ్ 1 టీమ్, వ్యక్తిగత చాంపియన్‌షిప్ ; కెనడా)
నవంబర్ 6-11: చైనా మాస్టర్స్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 3 ; ఫుజూ)
నవంబర్ 13-18: హాంకాంగ్ ఓపెన్ (గ్రేడ్ 2-లెవెల్ 4 ; హాంకాంగ్)
నవంబర్ 20-25: సయ్యద్ మోదీ ఓపెన్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; లక్నో)
నవంబర్ 27-డిసెంబర్ 2: కొరియా మాస్టర్స్ టోర్నీ (గ్రేడ్ 2-లెవెల్ 5 ; క్వాంగ్‌జు)

టెన్నిస్



జనవరి 1-6: టాటా ఓపెన్ (పుణే)
జనవరి 15-28: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
మార్చి 8-18: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ
మార్చి 21-ఏప్రిల్ 1: మయామి ఓపెన్ మాస్టర్స్ టోర్నీ
ఏప్రిల్ 6-7: డేవిస్‌కప్ ఆసియా జోన్‌లో భారత్ రెండో రౌండ్ మ్యాచ్
ఏప్రిల్ 15-22: మోంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నీ
మే 6-13: మాడ్రిడ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ
మే 13-20: రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ
మే 27-జూన్ 10: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
జూలై 2-15: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
ఆగస్టు 6-12: రోజర్స్ కప్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ
ఆగస్టు 12-19: సిన్సినాటి మాస్టర్స్ సిరీస్ టోర్నీ
ఆగస్టు 27-సెప్టెంబర్ 9: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ
అక్టోబర్ 7-14: షాంఘై మాస్టర్స్ సిరీస్ టోర్నీ
అక్టోబర్ 29-నవంబర్ 4: పారిస్ మాస్టర్స్ సిరీస్ టోర్నీ
నవంబర్ 11-18: ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ

ఫార్ములావన్



మార్చి 25: ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి (మెల్‌బోర్న్)
ఏప్రిల్ 8: బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి (సాఖిర్)
ఏప్రిల్ 15: చైనా గ్రాండ్‌ప్రి (షాంఘై)
ఏప్రిల్ 29: అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి (బాకు)
మే 13: స్పెయిన్ గ్రాండ్‌ప్రి (బార్సిలోనా)
మే 27: మొనాకో గ్రాండ్‌ప్రి (మోంటెకార్లో)
జూన్ 10: కెనడా గ్రాండ్‌ప్రి (మాంట్రియల్)
జూన్ 24: ఫ్రెంచ్ గ్రాండ్‌ప్రి (లె కాస్టెలెట్)
జూలై 1: ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి (స్పీల్‌బెర్గ్)
జూలై 8: బ్రిటిష్ గ్రాండ్‌ప్రి (సిల్వర్‌స్టోన్)
జూలై 22: జర్మనీ గ్రాండ్‌ప్రి (హాకెన్‌హీమ్)
జూలై 29: హంగేరి గ్రాండ్‌ప్రి (బుడాపెస్ట్)
ఆగస్టు 26: బెల్జియం గ్రాండ్‌ప్రి (స్పా ఫ్రాంకోర్ చాంప్స్)
సెప్టెంబర్ 2: ఇటలీ గ్రాండ్‌ప్రి (మోంజా)
సెప్టెంబర్ 16: సింగపూర్ గ్రాండ్‌ప్రి (మరీనా బే)
సెప్టెంబర్ 30: రష్యా గ్రాండ్‌ప్రి (సోచి)
అక్టోబర్ 7: జపాన్ గ్రాండ్‌ప్రి (సుజుకా)
అక్టోబర్ 21: యూఎస్ గ్రాండ్‌ప్రి (ఆస్టిన్)
అక్టోబర్ 28: మెక్సికో గ్రాండ్‌ప్రి (మెక్సికో సిటీ)
నవంబర్ 11: బ్రెజిల్ గ్రాండ్‌ప్రి (సావోపాలో)
నవంబర్ 25: అబుదాబి గ్రాండ్‌ప్రి (యాస్ మరీనా)

చెస్



మార్చి 10-28: క్యాండిడేట్స్ టోర్నమెంట్ (బెర్లిన్)
ఏప్రిల్ 1-10: ఆసియా యూత్ చాంపియన్‌షిప్ (చైనా)
మే 25-జూన్ 3: ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ (మంగోలియా)
సెప్టెంబర్ 4-16: ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్ (టర్కీ)
సెప్టెంబర్ 23-అక్టోబర్ 6: వరల్డ్ చెస్ ఒలింపియాడ్ (బాతూమి, జార్జియా)
అక్టోబర్ 19-నవంబర్ 1: వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్ (గ్రీస్)
నవంబరు 2-12: ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (ఫిలిప్పీన్స్)
నవంబరు 9-28: వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్ (లండన్)
నవంబరు 24-డిసెంబరు 3: వరల్డ్ యూత్ చెస్ ఒలింపియాడ్ (టర్కీ)

ఆర్చరీ



మార్చి 2-9: ఆసియా కప్ (థాయ్‌లాండ్)
ఏప్రిల్ 23-29: వరల్డ్ కప్ స్టేజ్-1 (చైనా)
మే 21-26: వరల్డ్ కప్ స్టేజ్-2 (టర్కీ)
జూన్ 19-24: వరల్డ్ కప్ స్టేజ్-3 (అమెరికా)
జూలై 17-22: వరల్డ్ కప్ స్టేజ్-4 (జర్మనీ)

అథ్లెటిక్స్




మార్చి 2-4: వరల్డ్ ఇండోర్ చాంపియన్‌షిప్ (బర్మింగ్‌హమ్)
ఏప్రిల్ 16: బోస్టన్ మారథాన్
ఏప్రిల్ 22: లండన్ మారథాన్
మే 4: డైమండ్ లీగ్ మీట్-1 (దోహా)
మే 12: డైమండ్ లీగ్ మీట్-2 (షాంఘై)
మే 26: డైమండ్ లీగ్ మీట్-3 (యూజిన్, అమెరికా)
మే 31: డైమండ్ లీగ్ మీట్-4 (రోమ్)
జూన్ 7: డైమండ్ లీగ్ మీట్-5 (ఓస్లో)
జూన్ 10: డైమండ్ లీగ్ మీట్-6 (స్టాక్‌హోమ్)
జూన్ 30: డైమండ్ లీగ్ మీట్-7 (పారిస్)
జూలై 5: డైమండ్ లీగ్ మీట్-8 (లుజానే)
జూలై 13: డైమండ్ లీగ్ మీట్-9 (రాబట్, మొరాకో)
జూలై 20: డైమండ్ లీగ్ మీట్-10 (మొనాకో)
జూలై 21-22: డైమండ్ లీగ్ మీట్-11 (లండన్)
ఆగస్టు 18: డైమండ్ లీగ్ మీట్-12 (బర్మింగ్‌హమ్)
ఆగస్టు 30: డైమండ్ లీగ్ మీట్-13 (జ్యూరిక్)
ఆగస్టు 31: డైమండ్ లీగ్ మీట్-14 (బ్రస్సెల్స్)

హాకీ



జూన్ 23-జూలై 1: పురుషుల చాంపియన్స్ ట్రోఫీ (అమ్‌స్టర్‌డామ్)
జూలై 21-ఆగస్టు 5: మహిళల ప్రపంచకప్ (లండన్)
నవంబర్ 17-25: మహిళల చాంపియన్స్ ట్రోఫీ (చైనా)
నవంబర్ 28-డిసెంబర్ 16: పురుషుల ప్రపంచకప్ (భువనేశ్వర్)

రెజ్లింగ్



ఫిబ్రవరి 27-మార్చి 4: ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (కిర్గిస్తాన్)
జూలై 17-22: ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ)
సెప్టెంబర్ 17-23: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (స్లొవేకియా)
అక్టోబర్ 20-28: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (హంగేరి)
నవంబర్ 12-18: ప్రపంచ అండర్-23 చాంపియన్‌షిప్ (రొమేనియా)

వెయిట్‌లిఫ్టింగ్



ఏప్రిల్ 20-30: ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్ (ఉజ్బెకిస్తాన్)
జూలై 6-14: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (ఉజ్బెకిస్తాన్)
నవంబర్ 24-డిసెంబర్ 3: ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్ (తుర్క్‌మెనిస్తాన్)

టేబుల్ టెన్నిస్



ఏప్రిల్ 6-8: ఆసియా కప్ (జపాన్)
ఏప్రిల్ 29-మే 6: వరల్డ్ టీమ్ చాంపియన్‌షిప్ (జర్మనీ)
డిసెంబర్ 2-9: ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్ (ఆస్ట్రేలియా)


షూటింగ్



మార్చి 1-13: వరల్డ్ కప్-1 (రైఫిల్, పిస్టల్, షాట్‌గన్; మెక్సికో)
ఏప్రిల్ 20-30: వరల్డ్ కప్-2 (రైఫిల్, పిస్టల్, షాట్‌గన్; కొరియా)
మే 22-29: వరల్డ్ కప్-3 (రైఫిల్, పిస్టల్; జర్మనీ)
జూన్ 5-15: వరల్డ్ కప్-4 (షాట్‌గన్; మాల్టా)
జూలై 9-19: వరల్డ్ కప్-5 (షాట్‌గన్; అమెరికా)
ఆగస్టు 31-సెప్టెంబర్ 15: ప్రపంచ చాంపియన్‌షిప్ (కొరియా).

పట్టు బిగించిన విదర్భ

అక్షయ్ వాడ్కర్ సెంచరీ
విదర్భ 528/7


అక్షయ్

ఇండోర్: ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీలో తొలిసారి ఫైనల్ చేరిన విదర్భ జట్టు బ్యాట్స్‌మెన్ సమష్టిగా రాణించడంతో పటిష్ట స్థితిలో నిలిచింది. అక్షయ్ వాడ్కర్ అద్భుత సెంచరీకి తోడు ఆదిత్య సర్వతే, సిద్ధేశ్ నేరల్‌లు అర్ధశతకాలు సాధించడంతో ఆదివారం ఆట ముగిసే సమయానికి విదర్భ 156 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. అంతకుముందు 206/4తో ఆట కొనసాగించిన విదర్భ ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ వికెట్లను త్వరగానే కోల్పోయింది. సీనియర్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ (78), వాఖరే (17) త్వరగానే పెవిలియన్ చేరినా... వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ (243 బంతుల్లో 133 బ్యాటింగ్; 16 ఫోర్లు, 1 సిక్స్) అజేయ ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. ఆదిత్య సర్వతే (79; 11 ఫోర్లు)తో ఏడో వికెట్‌కు 169 పరుగులు జోడించిన అతను.. సర్వతే అవుటైన అనంతరం సిద్ధేశ్ నెరల్ (92 బంతుల్లో 56 బ్యాటింగ్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు అభేద్యమైన 113 పరుగుల జతచేసి జట్టును పటిష్ట స్థితిలో నిలిపాడు. మూడో రోజు మొత్తం కేవలం 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 322 పరుగులు చేయడం విదర్భ ఆధిపత్యాన్ని చూపిస్తోంది. ఢిల్లీ బౌలర్లలో సైనీకి 3, ఆకాశ్‌కు 2 వికెట్లు దక్కాయి. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో ఇప్పటికే 233 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. ఒకవేళ రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ కోలుకొని మ్యాచ్‌ను 'డ్రా' దిశగా నడిపించగలిగినా కూడా తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో విదర్భ మొదటి సారి రంజీ విజేతగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

దీనిని గొప్ప ఘనతగా భావిస్తున్నా

వరల్డ్ బ్లిట్జ్ ప్రదర్శనపై ఆనంద్ సంతోషం



చెన్నై: వరల్డ్ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్... ఆ వెంటనే జరిగిన బ్లిట్జ్ టోర్నీలో మూడో స్థానంలో నిలిచాడు. ఇందులో జరిగిన 21 గేమ్‌లలో అతను ఒక్కటి మాత్రమే ఓడాడు. తన దృష్టిలో ఇది చాలా గొప్ప ప్రదర్శనగా ఆనంద్ విశ్లేషించాడు. 'ఇంతటి పెద్ద ఈవెంట్‌లో నేను ఒక గేమ్ మాత్రమే ఓడాను. వరుసగా మూడు రోజులు ర్యాపిడ్ ఆడి ఆ వెంటనే రెండు రోజులు 21 బ్లిట్జ్ గేమ్‌లు ఆడాల్సిన స్థితిలో దానిని పెద్ద ఘనతగా చెప్పవచ్చు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాలు రెండింటిలోనూ పోడియంపై నిలబడగలిగాను. నాకు తెలిసి చాలా కొద్ది మందికి మాత్రమే ఇది సాధ్యమైంది. గతంలో ఇలాంటి సమయంలో నేను కీలక దశలో పాయింట్లు కోల్పోయి వెనుకబడేవాడిని. ఈసారి మాత్రం ఎలాంటి తప్పు చేయలేదు. ఇటీవల ఈ రెండు ఫార్మాట్‌లలో నాకు మంచి ఫలితాలు రాలేదు. దానిని సవరించే ప్రయత్నం చేశాను. నిజాయితీగా చెప్పాలంటే ఒకదాంట్లో బాగా ఆడగలననుకున్నాను. కానీ రెండింటిలో మంచి ఫలితాలు రావడం చాలా సంతోషంగా ఉంది' అని ఆనంద్ వ్యాఖ్యానించాడు.


హైదరాబాద్ హంటర్స్ ఓటమి

న్యూఢిల్లీ: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో హైదరాబాద్ హంటర్స్ జట్టు వరుసగా రెండో పరాజయాన్ని చవిచూసింది. ఢిల్లీ డాషర్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ హంటర్స్ 0-5తో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో ఇవనోవ్-సొజోనోవ్ (ఢిల్లీ) జంట 15-9, 15-11తో మార్కిస్ కిడో-యో యోన్ సెయోంగ్ జోడీని ఓడించింది. హైదరాబాద్ హంటర్స్ పురుషుల సింగిల్స్ 'ట్రంప్' మ్యాచ్‌లో లీ హున్ ఇల్ 15-13, 11-15, 4-15తో విన్సెంట్ (ఢిల్లీ) చేతిలో పరాజయం పొందాడు. మహిళల సింగిల్స్ మ్యాచ్‌లో కరోలినా మారిన్ 15-10, 15-12తో సుంగ్ జీ హున్ (ఢిల్లీ)పై గెలుపొందింది. ఢిల్లీ డాషర్స్ పురుషుల సింగిల్స్ 'ట్రంప్' మ్యాచ్‌లో తియాన్ హువీ 15-14, 14-15, 15-10తో సాయిప్రణీత్ (హంటర్స్)పై నెగ్గాడు. మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో సాత్విక్-పియా జెబాదియా (హంటర్స్) జంట 11-15, 12-15తో ఇవనోవ్-అశ్విని పొన్నప్ప (ఢిల్లీ) జోడీ చేతిలో ఓడింది.

కేప్‌టౌన్‌లో నీటికి కటకట!

పేస్ పిచ్ తయారు చేయలేని పరిస్థితి

కేప్‌టౌన్: టెస్టు సిరీస్‌లో పేస్ బౌలింగ్‌తో భారత్‌ను బెంబేలెత్తించాలని భావిస్తున్న దక్షిణాఫ్రికాకు తొలి మ్యాచ్‌లోనే సంకట స్థితి ఎదురవుతోంది. రెండేళ్ల క్రితం భారత గడ్డపై టెస్టు సిరీస్‌లో స్పిన్ దెబ్బకు చిత్తుగా ఓడిన దక్షిణాఫ్రికా ప్రతీకారం సంగతేమో కానీ చివరకు పిచ్ భారత్‌కు అనుకూలంగా మారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు! తొలి టెస్టు జరిగే ఈ ప్రాంతంలో ప్రస్తుతం తీవ్ర నీటి కొరత ఉంది. నీటి వాడకం తక్కువగా ఉంటే పిచ్‌ను పేస్, బౌన్స్‌కు అనుకూలంగా తీర్చి దిద్దడం చాలా కష్టంగా మారిపోతుంది. చివరకు వికెట్ పొడిగా మారి స్పిన్ బాగా ప్రభావం చూపించవచ్చు. ఈ నేపథ్యంలో జనవరి 5 నుంచి జరిగే తొలి టెస్టు కోసం పిచ్, అవుట్‌ఫీల్డ్‌ను సిద్ధం చేసేందుకు క్యురేటర్‌కు కష్టంగా మారింది.



సోమవారం 1-1-2018



'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 10
సంచిక: 281

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | KARIMNAGAR | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బంగారం కొనొచ్చా..

- కొంత పెరిగినా, భారీ ర్యాలీ ఉండకపోవచ్చు.. జాతీయ, అంతర్జాతీయ అంశాలతో ప్రభావం
- పెట్టుబడి కోసమైతే ఇతర అవకాశాలను చూడొచ్చు..
- హెడ్జింగ్ కోసమైతే కొనుగోలు చేసుకోవచ్చు

- 11లో

S & D



WISHING ALL OF OUR CUSTOMERS
A VERY HAPPY AND PROSPEROUS
NEW YEAR 2018
సంగీత
ప్రైస్
ఛాలెంజ్
ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్
సంగీతకు సాటి లేదు
iPhone X
₹72,990
Redmi Note 4
4GB RAM + 64 GB STORAGE
₹10,999
Mi A1
₹13,499
Mi Max 2
₹14,999
SAMSUNG GALAXY NOTE 8
₹8,000 CASHBACK
Vivo V7
TRIPLE ZERO OFFER
NO Down Payment
NO Interest
NO Processing Fee
75% OFF ON SELECT PHONES
PHONES ₹399 ONWARDS
Panasonic
P91
Multi-Mode Camera
OTG Support
Android 7.0 Nougat
Panasonic
P99
5" HD Display
Android 7.0 Nougat
ఫోను ధర తగ్గిందా...?
జల్సా చేయండి...
తగ్గిన మొత్తం మీ జేబుకే...
1-100% CASH BACK FROM BAJAJ FINSERV
ఫోను డామేజ్ అయిందా?
నో వర్రీ...
క్రొత్త ఫోను సగం రేటుకే!!
₹250 WORTH BITCOIN FROM UNOCOIN
ప్రతీ ఫోన్ తో పాటు ఎయిర్ అంబులెన్స్ సేవ
ప్రతీ స్మార్ట్ ఫోన్ తో పాటు జియో సిమ్ 100GB వరకు ఉచితం Jio
ఖచ్చితంగా పాత ఫోన్ కు బైబ్యాక్ 80% వరకు
Discount up to ₹30,000 on exchange
SBI Card Make life simple
Extra 5% Cashback* with SBI Credit Cards.
*Min. trnx: ₹11,999; Max. Cashback: ₹1,500 per card account. Validity: 21 Dec '17 - 14 Jan '18. Offer also valid on EMI trxns. T&C Apply.
*Conditions apply
You can also shop at www.sangeethamobiles.com
Sangeetha PIONEER THEN, LEADER NOW.
సంగీత
43 YEARS | 8 STATES | 416 STORES | 20 MILLION HAPPY CUSTOMERS
For feedback/suggestions, write to us at support@sangeethamobiles.com or call us at 080 4939 7000 | Connect with us SangeethaMobilesIndia | For terms and conditions, visit www.sangeethamobiles.com/sangeetha-advantage/price-challenge
ఇప్పుడు పెద్దపల్లి, భద్రాచలం, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తిలో ఆదిలాబాద్, ఆర్మూర్, గోదావరి ఖని, జగిత్యాల, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, జహీరాబాద్, హన్మకొండ, ఖమ్మం, కోదాడ, కొత్తగూడెం, మహబూబ్ నగర్, మిర్యాలగూడ, నయిమ్ నగర్, నక్కలగుట్ట, నల్గొండ, షాద్ నగర్, సూర్యాపేట, వరంగల్
హైదరాబాద్ & తెలంగాణ లో 72 స్టోర్లు
ఆంధ్రప్రదేశ్ లో 55 స్టోర్లు

S & D

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18+4+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 281
సోమవారం 1-1-2018
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగుపడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

2018
పాఠకులు, ఏజెంట్లు, ప్రకటన కర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి నూతన సంవత్సర శుభాకాంక్షలు
వై.ఎస్. భారతి
చైర్‌పర్సన్



2018కి స్వాగతం పలుకుతూ ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద న్యూ ఇయర్ వేడుకలు
ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం సిడ్నీ హార్బర్ వద్ద బాణసంచా సంబరాలు.

రాజకీయాల్లోకి వస్తున్నా!

ఎట్టకేలకు సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రకటన



- ఒక్కడితో సాధ్యం కాదు.. ప్రజలు ఆదరిస్తే మార్పు తెస్తా
- ఇప్పటికీ స్పందించకపోతే తమిళ ప్రజలకు అన్యాయం చేసిన వాణ్ణవుతా
- ఏడాదికాలంగా తమిళనాట పరిస్థితులు బాధ కలిగించాయి
- భగవద్గీతలోని 'కర్మణ్యే వాధికారస్తే' శ్లోకం ప్రస్తావన
- పొంగల్ సందర్భంగా జనవరి 14న పార్టీ పేరు ప్రకటించే అవకాశం

సాక్షి ప్రతినిధి, చెన్నై: తీవ్ర తర్జనభర్జనలు.. ఎన్నో అనూహ్య పరిణామాలు.. ఐదు రోజులుగా అభిమానులతో వరుస సమావేశాలు.. ఓవైపు సహనటుడు కమల్ ప్రభుత్వాలపై కత్తులు నూరుతున్నా మౌనంగానే పరిస్థితులను గమనిస్తూ వచ్చిన సౌతిండియా సూపర్‌స్టార్ రజనీకాంత్ ఎట్టకేలకు రాజకీయ ప్రవేశంపై అధికారిక ప్రకటన చేశారు. రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న అభిమానుల కలలను నిజం చేస్తూ రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. తమిళనాడులో రాజకీయాలు హీనదశకు చేరుకున్న నేపథ్యంలో ఓ సరైన రాజకీయ వేదిక అవసరం ఉందని.. సొంతగా ఓ పార్టీ పెట్టి ఆ లోటును భర్తీ చేయనున్నట్లు ఆదివారం ఆయన స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో పోటీ చేయనున్నట్లు రజనీ తెలిపారు. 'నేను రాజకీయాల్లోకి వస్తున్నాను. ఇది సత్యం' అని చెన్నైలో జరిగిన మిగతా 2వ పేజీలో ▶

ద్రవిడ సిద్ధాంతాలకు సవాల్?
- రజనీ 'ఆధ్యాత్మిక రాజకీయాల'తో తమిళనాట ప్రకంపనలు

తమిళనాట సినీ రాజకీయం!
- ఎంజీఆర్, జయ, కరుణానిధి అంతా చిత్ర రంగం వారే

13లో

వ్యవసాయానికి విద్యుత్తేజం



సాగుకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా షురూ..

అర్ధరాత్రి 12.01 గంటలకు అధికారికంగా ప్రారంభం

- మేడ్చల్ జిల్లా మూసాయపల్లిలో పంప్‌సెట్‌ను ఆన్ చేసిన ట్రాన్స్‌కో, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీలు
- 23 లక్షల పంప్‌సెట్లకు పవర్
- దేశంలో సాగుకు ఉచిత కరెంట్ అందిస్తున్న రాష్ట్రంగా రికార్డ్

సాక్షి, హైదరాబాద్

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుక అందించింది. రాష్ట్రంలోని 23 లక్షల పంపుసెట్లకు ఆదివారం అర్ధరాత్రి నుంచి నిరంతర విద్యుత్ సరఫరాను ప్రారంభించింది. దీంతో దేశంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ అందిస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. దేశంలోని కొన్ని రాష్ట్రాలు వ్యవసాయానికి నిర్ణీత గంటల పాటు ఉచిత విద్యుత్ ఇస్తుండగా, మరికొన్ని రాష్ట్రాలు 24 గంటల పాటు సరఫరా చేస్తున్నా చార్జీలు వసూలు చేస్తున్నాయి. 2016 జూలై నుంచి ఉమ్మడి మెదక్, నల్లగొండ, మిగతా 2వ పేజీలో ▶

ఏడాదంతా జనంలోనే సీఎం

- ఎన్నికల సమరానికి ఇప్పటినుంచే కార్యాచరణ
- ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ పనితీరుపై దృష్టి
- నెలకు రెండు జిల్లాల చొప్పున పర్యటనలు
- పథకాల లబ్ధిదారులతో ముఖాముఖి

- వివరాలు 6లో

మెట్రో ఆగింది..
సాంకేతిక లోపంతో ఆగిన రైలు - 2లో

నవ భారతానికి మీరే పునాది



మన్ కీ బాత్‌లో కొత్త ఓటర్లను ఉద్దేశించి ప్రధాని మోదీ

- నూతన సంవత్సరంలో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న దేశ యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, వారి ఓట్లు నవ భారతానికి పునాది కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఈ ఏడాది 'మన్ కీ బాత్' చివరి కార్యక్రమంలో ఆదివారం ఆయన ప్రసంగించారు.

- 13లో

3 నెలల్లోగా అనర్హత వేటు



పార్టీ ఫిరాయింపుదార్లపై వెంకయ్య నాయుడు స్పష్టీకరణ

- పార్టీ ఫిరాయింపులపై ఫిర్యాదు అందిన మూడు నెలల్లోగా అనర్హత వేటు వేయాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. చట్టసభలకు చైర్మన్‌గా, స్పీకర్‌గా వ్యవహరించే వారు ఫిరాయింపులపై అందే ఫిర్యాదులను 3 నెలలకు మించి పెండింగ్‌లో ఉంచుకోకూడదన్నారు.

- 3లో

సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రమూకల దాడి

నేలకొరిగిన ఐదుగురు జవాన్లు



- ఇద్దరు ముష్కరులను చంపిన జవాన్లు
- తమదే బాధ్యతని ప్రకటించుకున్న జైష్–ఎ– మహ్మద్

→ పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రం పుల్వామా జిల్లా లెత్‌పొరాలోని సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) క్యాంప్‌పై జైష్–ఎ– అహ్మద్ ఉగ్రవాదులు దాడి జరిపి ఐదుగురు జవాన్లను పొట్టన బెట్టుకున్నారు. గ్రెనేడ్ లాంఛర్లు, ఆటోమేటిక్ ఆయుధాలు ధరించిన కొందరు ముష్కరులు ఆదివారం వేకువజామున సీఆర్పీఎఫ్ క్యాంప్ వద్దకు వచ్చి రావటంతోనే విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. - వివరాలు 13లో

ఇంకుమార్



ఆధార్ ఉంటేనే ఎరువులు



నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమలు..

- రైతులు ఎరువులు కొనాలంటే ఇకపై ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాల్సిందే. ప్రభుత్వం ప్రైవేటు ఎరువుల దుకాణాలకు 6,641 పీవోఎస్ యంత్రాలను సరఫరా చేసింది. వాటిని సాంకేతికంగా కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది.

5లో

వారసులొస్తున్నారు!

కాంగ్రెస్‌లో పెరుగుతున్న 'యువ' సందడి



- వారికి టికెట్లు సాధించేందుకు సీనియర్ల కసరత్తు
- ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మందికి అవకాశం దక్కేనా?
- నిబంధనలపై నేతల్లో పెరుగుతున్న ఆసక్తి
- పొలిటికల్ ఎంట్రీకి 20 మందికిపైగా ముఖ్య నేతల కుటుంబీకులు రెడీ

సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్ సీనియర్లు, ముఖ్యనేతల వారసులు, కుటుంబీకులు రాజకీయాల్లోకి వచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వారి కార్యకలాపాలు వేగం పుంజుకుంటున్నాయి. అయితే జాతీయ స్థాయిలో పార్టీ నియమాలు, పోటీ చేయడానికి మార్గదర్శకాలు ఎలా ఉంటాయోనని పలు కుటుంబాలు ఆసక్తితో ఉన్నాయి. ఒక కుటుంబం నుంచి ఒక్కరే పోటీ చేయాలని ఏఐసీసీ గతంలో స్పష్టమైన నిబంధన విధించింది. అయినా ఆ నిబంధనను అధిగమించి గత ఎన్నికల్లో, అంతకుముందు ఎన్నికల్లో కుటుంబ సభ్యులు టికెట్లు సాధించారు. సోనియాగాంధీ (రాయ్‌బరేలి), ఆమె తనయుడు రాహుల్ గాంధీ(అమేథీ) ఇద్దరూ పోటీ చేశారు. దీన్ని ఆసరాగా చేసుకుని జాతీయస్థాయిలోని పలువురు సీనియర్లు, అధిష్టానం వద్ద పలుకుబడి కలిగిన నాయకులు తమతోపాటు తమ వారసులను గత ఎన్నికల్లో బరిలోకి దించారు. రాష్ట్రంలోనూ కొందరు ముఖ్యులు ఒకే కుటుంబం నుంచి ఇద్దరేసి చొప్పున పోటీ చేశారు. అయితే ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో టికెట్లపై మార్గదర్శకాలు ఎలా ఉంటాయోనని పార్టీలోని సీనియర్లు మిగతా 7వ పేజీలో ▶

కోర్సు ముగిసేలోపు ఫీజు రీయింబర్స్‌మెంట్!

పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఊరట

- 3.25 లక్షల మందికి ముందస్తు ప్రయోజనం
- రూ.650 కోట్ల నిధుల విడుదలకు కసరత్తు



- వివరాలు 3లో

ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలి: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖ ర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడపాలని భగవం తుడిని ప్రార్థించారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలన్నీ 2018లో కూడా విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలి

తెలుగు ప్రజలకు వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2018 అభివృద్ధి, ఆనందాల సంవత్సరం కావాలని, ప్రతి ఇంటా సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, తెలుగు రాష్ట్రాల ప్రజల జీవితాల్లో మంచి మార్పులు కలగాలని జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేసింది.

మెట్రో ఆగింది...



హైదరాబాద్: నగరంలో రోజూ 'లక్ష' ఇంగా నడుస్తున్న మెట్రో రైలు ఆదివారం గంటసేపు స్తంభించింది. రైలు ఇంజిన్‌లో సాంకేతికలోపం తలెత్తింది. నాగోల్ నుంచి ఉదయం 8 గంటలకు రైలు అమీర్‌పేట ఇంటర్‌చేంజ్ స్టేషన్‌కు వచ్చింది. తిరిగి నాగోల్‌కు బయలుదేరాల్సిన రైలు అకస్మాత్తుగా పట్టాలపై నిలిచిపోయింది. రైలు నిలిచిపోవడంతో నాగోల్–అమీర్‌పేట మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోజూ ఉదయం ఈ మార్గంలో నడిచే రెండు సర్వీసులను బేగంపేట, సికింద్రాబాద్ స్టేషన్లలో నిలిపివేశారు. మియాపూర్ మెట్రో డిపో నుండి వచ్చిన నిపుణులు.. రైలులో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిచేయడంతో తిరిగి 9 గంటలకు నాగోల్ బయలుదేరింది. ఆదివారం సెలవు కావడంతో ప్రయాణికుల రద్దీ కూడా అంతంతమాత్రంగానే ఉందని, మిగతా రోజుల్లో ఇలాంటి సమస్య తలెత్తితే ఉద్యోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడేవారని అధికారులు పేర్కొన్నారు. మెట్రో రైలులో రోజూ లక్ష మందికిపైగా ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న విషయం తెలిసిందే.

'కొత్త' ఆశయాలతో ముందుకెళ్దాం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ప్రజలకు ఇరిగేషన్, మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది ఎన్నో కొత్త ఆశయాలతో, సరికొత్త ఆలోచనలతో, లక్ష్యాలను సాధించి ముందుకు పోవాలని ఆకాంక్షించారు. గతేడాదిలో విద్యా, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో పెనుమార్పులు తెచ్చామన్నారు. కొత్త సంవత్సరం నుంచి రైతుల కళ్లల్లో వెలుగులు నింపాలనీ వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇవ్వబోతున్నట్టు తెలిపారు. కొత్త సంవత్సర వేడుకలను ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

2018లో చారిత్రక ఉద్యమాలు: గట్టు శ్రీకాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ శ్రేణులకు నిరంతరం పోరాటాలు చేసే విధంగా శక్తి నివ్వాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. 2018లో చారిత్రక ఉద్యమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

మరో నౌకను అదుపులోకి తీసుకున్న ద.కొరియా!

సియోల్: ఐక్యరాజ్యసమితి(ఐరాస) ఆంక్షలను ఉల్లంఘించి ఉత్తర కొరియాకు ముడి చమురును సరఫరా చేస్తున్న మరో నౌకను దక్షిణ కొరియా అదుపులోకి తీసుకుంది. ద.కొరియాలోని ప్యాంగ్‌టెక్–డాంగ్‌జిన్ పోర్టులోపనామాకు చెందిన 5,100 టన్నులున్న 'కౌటి'నౌకను డిసెంబర్ 21న స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు. ఈ నౌక ఉ.కొరియాకు చెందిన నౌకకు చమురును బదిలీ చేసిందని పేర్కొన్నారు. ఈ నౌకా సిబ్బందిని పోలీసులు, నిఘా సిబ్బంది ప్రశ్నిస్తున్నారన్నారు.

చిట్ ష్యూరిటీ కింద స్థిరాస్తుల తనఖా రద్దు

- ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీలకు సర్కారు ఝలక్
- ఆస్తులు కాదు.. డబ్బులు కట్టండి
- ఫిక్స్‌డ్ డిపాజిట్లే తీసుకోవాలని చిట్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు చిట్‌ఫండ్ కంపెనీల ఎత్తులకు సర్కారు పైఎత్తు వేసింది. రిజిస్టర్డ్ చిట్ ష్యూరిటీల కింద స్థిరాస్తుల తనఖాను రద్దు చేస్తూ రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇక నుంచి చిట్ ష్యూరిటీల కింద ఫిక్స్‌డ్ డిపాజిట్లు మాత్రమే తీసుకోవాలని, స్థిరాస్తుల తాకట్టును అనుమతించవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో రిజిస్టర్డ్ చిట్‌ల నిర్వహణ కోసం చూపించాల్సిన ష్యూరిటీల మార్కెట్ విలువ కన్నా రెట్టింపు విలువతో స్థిరాస్తులను తనఖా పెడుతూ అటు ప్రభుత్వాన్ని, ఇటు చిట్ సభ్యులను మోసం చేస్తున్న చిట్‌ఫండ్ కంపెనీలకు ముకుతాడు వేసినట్టు అయింది.

రాష్ట్రంలో 598 కంపెనీలు

రాష్ట్రవ్యాప్తంగా రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు 598 ఉన్నాయి. వీటిలో 11,068 గ్రూపులున్నాయి. ఒక్కో గ్రూపులో కనీసం 10 నుంచి 50 మంది వరకు ఉండగా, లక్ష నుంచి రూ.50 లక్షల వరకు చిట్టీలు నడుస్తున్నాయి. అయితే, రిజిస్టర్డ్ చిట్ నడిపించాలంటే సదరు వ్యాపారి ఆ చిట్ విలువకు సరిపడా ప్రభుత్వం దగ్గర ష్యూరిటీ ఉంచాలి. చాలా కంపెనీలు ఎఫ్‌డీఆర్ రూపంలోనే ష్యూరిటీలను ఉంచుతున్నాయి. ఈ క్రమంలోనే మారుమూలన ఉన్న ఓ ఎకరం భూమికి లక్షల రూపాయల విలువ చూపెట్టి చిట్టీలు రిజిస్టర్ చేస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లోని కొన్ని రిజిస్టర్డ్ చిట్‌ఫండ్ కంపెనీలు ఈ విధంగా రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను మభ్య పెడుతున్నాయి. రాష్ట్రంలో ఏటా రూ.6 వేల కోట్ల వరకు రిజిస్టర్డ్ చిట్టీల వ్యాపారం నడుస్తోందని అంచనా. అందులో 30 శాతం వరకు భూములు, ఆస్తుల తనఖా మీదనే నడుస్తున్నాయి. అంటే దాదాపు రూ.1,000 కోట్ల ప్రజల సొమ్ము ఈ తనఖాతో ముడిపడి ఉందన్నమాట.


చిట్ రిజిస్ట్రార్లే బాధ్యులు

ఈ చిట్టీల ష్యూరిటీ విషయంలో అంతిమంగా చిట్ రిజిస్ట్రార్లనే బాధ్యులను చేస్తూ ఉత్తర్వులు వెలువడటం గమనార్హం. జూలై, 2016 తర్వాత స్థిరాస్తులను మార్టిగేజ్ చేస్తూ ఇచ్చిన ష్యూరిటీలన్నింటినీ 30 రోజుల్లోగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోకి మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో స్థిరాస్తిని మార్టిగేజ్ చేసిన చిట్‌ఫండ్ కంపెనీల ఆస్తుల విలువను జిల్లా రిజిస్ట్రార్లు మరోసారి మదింపు చేయాలని ఆదేశించారు. మార్కెట్ విలువ కన్నా ఎక్కువ చూపించినట్టు తేలితే అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ల చేత నోటీసులిప్పించి చిట్ విలువ మేరకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు తీసుకోవాలని, ఈ విషయంలో చిట్ రిజిస్ట్రార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారణకు వస్తే చిట్‌కంపెనీలతో పాటు రిజిస్ట్రార్లపై కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. ఈ ఆదేశాల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని రిజిస్టర్డ్ చిట్ సభ్యులకు ఖచ్చితమైన భరోసా లభించనుందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలంటున్నాయి.

ఈ ఏడాది జగమంతటి కుటుంబం మధ్యనే ఎక్కువకాలం గడపబోతున్నా..

48వ రోజు

31–12–17, ఆదివారం
ముదివేడు,
చిత్తూరు జిల్లా.





చిత్తూరు జిల్లా ఎర్రసానిపల్లెలో అక్కచెల్లెమ్మలతో మాట్లాడుతున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

రామిగానివారిపల్లె శివారు(మూలపల్లి క్రాస్) నుంచి ఈ రోజు పాదయాత్ర మొదలైంది. పాదయాత్ర దారిలో ఎర్రసానిపల్లి దగ్గర టమాటా రైతులను కలిశాను. అక్కడే కూర్చుని వారితో మాట్లాడాను. ఈ ప్రాంతంలో విస్తారంగా టమాటా సాగవుతోంది. అదే స్థాయిలో రైతుల కష్టాలూ ఉన్నాయి. మార్కెట్‌లో ధరలు తగ్గకున్నా రైతులకు మాత్రం గిట్టుబాటు ధరలు దొరకని విషాద పరిస్థితులున్నాయి. మధ్య దళారుల చేతిలోకి ఆదాయం పోతోందట. లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే చేతికి పాతిక వేల రూపాయలు కూడా అందని దౌర్భాగ్యం ఈ టమాటా రైతులది. మార్కెట్ కమిటీలు, రైతు బజార్లు ఏమైనట్టు?

దారిలో కస్తూర్బా గురుకుల పాఠశాలలో పనిచేసే టీచర్లు కలిశారు. 2005 నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగానే పనిచేస్తున్నామని, గత ఎన్నికల వేళ తమను పర్మనెంటు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ ఊసే ఎత్తేవారు లేరని ఆ మహిళా టీచర్లు బాధపడ్డారు. వారిలో ఒక దివ్యాంగురాలు ఉంది. 'సార్.. నాకిక్కడ ఉద్యోగం ఉందని వికలాంగ పింఛన్ తీసేశారు. ఇదేమో పర్మనెంట్ ఉద్యోగం కాదు. ఎప్పుడుంటుందో, ఎప్పుడు పోతుందో తెలీదు' అంటూ ఎంతో ఆవేదనతో చెప్పుకుంది. ఏవేవో సాకులు చెప్పి, ఉన్నవి ఊడబెరకడంలో వేగంగా స్పందించే ఈ టీడీపీ పాలకులు.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో మాత్రం మిన్నకుండిపోతున్నారు.

తంబళ్లపల్లె సంఘమిత్రలు కలసి నాకో విన్నపం ఇచ్చారు. 'పదిహేనేళ్లుగా ప్రతి ప్రభుత్వ పథకాన్ని ప్రతి కుటుంబానికీ చేరవేస్తూ.. అవగాహన కలిగిస్తూ.. ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నాం. ఇంత చేస్తున్నా గతంలో ఇచ్చినట్టు ఆ రెండు వేల రూపాయల గౌరవ వేతనం కూడా ఇవ్వడం లేదు. కుటుంబాలను పోషించుకోవడానికైనా కనీస వేతనం మీ హయాంలో కచ్చితంగా ఉండేలా చూడండి సార్' అంటూ గోడు వెళ్లబోసుకున్నారు.

కొందరు హోంగార్డులు కూడా కలసి తమ సమస్యలు చెప్పుకున్నారు. 'సార్.. మా పరిస్థితి పూర్తిగా వెట్టిచాకిరీ చేస్తున్నట్టుంది. చాలీచాలని జీతాలు, ఒక్కరోజూ సెలవు లేదు. సెలవు పెడితే ఆ రోజుకు రూ.400 కట్ చేస్తున్నారు. బస్ పాస్‌లు కూడా లేవు. పక్కన తెలంగాణలో హోంగార్డుల జీతాన్ని 20 వేల రూపాయలకు పెంచారు. బస్ పాస్‌లు ఇస్తున్నారు. కానిస్టేబుళ్ల నియామకాల్లో 25 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఇక్కడ మాత్రం మాకు కుటుంబాలు గడవని దుర్భర పరిస్థితి' అని బాధపడిపోయారు. రాత్రింబవళ్లు పనిచేయించుకోవడమే కాదు, వారి అవసరాలను తీర్చడం ప్రభుత్వ కనీస బాధ్యత కాదా? ఈ పాలనలో సర్వత్రా శ్రమ దోపిడీ. దీనికి హద్దులు లేవు.

పాలకులు ప్రజాహితాన్ని విస్మరించినప్పుడు ప్రతిపక్షం బాధ్యత పెరుగుతుంది. అందుకే వారికి పూర్తి సమయం అండగా, భరోసాగా, రేపటి మంచి రోజులకు ఆశగా నిలవాలనుకున్నాను. కొత్త సంవత్సరం ముంగిట్లో అడుగుపెడుతున్న సందర్భంగా.. ఇలా మనసులో గట్టిగా సంకల్పించుకుంటూ పాదయాత్ర శిబిరానికి చేరుకున్నాను.

ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల ప్రతి కష్టంలోనూ వారికి అండగా నిలిచి, వారికి అన్యాయం జరిగిన ప్రతి సమయంలోనూ పోరాటాలు చేశాం. ఈ కొత్త సంవత్సరం 2018లో సగానికి పైగా గతంలో కంటే ఎక్కువగా.. ప్రతి దినం, అనుక్షణం పాదయాత్ర ద్వారా ప్రజల మధ్యనే ఉండబోతున్నాను. వారి కష్టాల్లో, కన్నీళ్లలో, బాధల్లో, బాధ్యతల్లో పాలుపంచుకోబోతున్నాను. కుటుంబ సభ్యులకన్నా.. జగమంతటి కుటుంబం మధ్యనే ఎక్కువ కాలం గడపబోతున్నాను.

చివరిగా ముఖ్యమంత్రిగారికి నాదొక ప్రశ్న.. మీ సొంత జిల్లా టమాటా రైతులు నష్టాల కష్టాలతో తల్లడిల్లుతుంటే వారి గురించి ఒక్క క్షణమైనా ఆలోచించారా? మీకు రైతులంటే ఎందుకంత చిన్న చూపు? వ్యవసాయాన్ని పండుగ చెయ్యాలని వైఎస్సార్ గారు పరితపించిపోతే, మీరేమో మళ్లీ.. దండగ అనేలా చేస్తున్నారు. మీరే దళారి అయ్యి రైతులను దళారులకు అమ్మేయడం ఎంతవరకు ధర్మం?

వై.యస్. జగన్.

రాజకీయాల్లోకి వస్తున్నా!

▶ మొదటి పేజీ తరువాయి

అభిమానుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. రజనీ నిర్ణయాన్ని అభిమానులతో సహా చిత్ర, రాజకీయ రంగ ప్రముఖులు స్వాగతించారు. కాగా, పొంగల్ (సంక్రాంతి) సందర్భంగా పార్టీ పేరును ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.




రాజకీయాల్లోకి వస్తానని రజనీకాంత్ ప్రకటించడంతో ఆదివారం ముంబైలో సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు

రాజకీయాల్లో నీతి ముఖ్యం

సుపరిపాలన, నీతితో కూడిన రాజకీయాలపై రజనీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. 'నేటి పరిస్థితుల్లో ప్రతీదీ మారాల్సిన అవసరం కనబడుతోంది' అని వ్యాఖ్యానించారు. 'ఆధ్యాత్మిక రాజకీయాలు' ప్రతి కులం, మతంలో పారదర్శకంగా వెల్లివిరియాలని.. అదే తన రాజకీయ ప్రవేశం ఉద్దేశమని రజనీ అభిలషించారు. తను సొంతంగా ముందుకెళ్లటం కష్టమన్న ఆయన.. తన పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులోని అన్నిస్థానాల నుంచి పోటీచేయడం తథ్యమని వెల్లడించారు. పార్టీ పేరును ప్రకటించకుండా పార్టీ సిద్ధాంతాలను మాత్రమే ఆయన ప్రస్తావించారు. డిసెంబర్ 26వ తేదీ నుంచి అభిమానులతో సమావేశమవుతున్న రజనీకాంత్ చివరి రోజైన ఆదివారం నాడు అభిమానులను ఉద్దేశించి ఉద్వేగపూరితంగా మాట్లాడారు. రజనీ ప్రసంగం కొనసాగినంతసేపు అభిమానులు ఈలలు, చప్పట్లతో అభినందనలు తెలిపారు.

రజనీ ఏమన్నారంటే..

'నాకు జీవితాన్ని ఇచ్చిన అభిమానుల్లారా, తమిళ ప్రజలారా, టీవీలో నా ప్రసంగాన్ని వీక్షిస్తున్న ప్రేక్షకుల్లారా.. మీ అందరికీ నమస్కారాలు, ధన్యవాదాలు. నా అభిమానులను ఎలా కీర్తించాలో తెలియడం లేదు. ఆర్రోజులుగా ఆరువేల మందికి పైగా అభిమానులు నాతో ఫొటో దిగేందుకు ఓర్పు, క్రమశిక్షణ పాటించడం చెప్పలేని అనుభూతిని కలిగించింది. ఇదే క్రమశిక్షణ, ఓర్పు భవిష్యత్తులో కూడా కొనసాగితే ఏదైనా సాధించగలమని అర్థమైంది. మనం సరైన దిశగా వెళ్తున్నాం. రాజకీయాల్లోకి రావడానికి నాకు భయం లేదు, మీడియాను చూస్తేనే భయం. బడా వ్యక్తులే మీడియాను చూసి భయపడుతున్నారు. నేనో పసివాడిని. నీ బాధ్యతలు నీవు నెరవేర్చు, మిగతావి నేను చూసుకుంటానని కురుక్షేత్ర యుద్ధం సమయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు ఉపదేశించాడు. యుద్ధంలో జయిస్తే రాజ్యం, ఓడితే స్వర్గం ప్రాప్తిస్తుంది. అదే యుద్ధం చేయకుండా వెళ్లిపోతే పిరికిపంద అంటారు. ఇప్పటికే అన్నీపూర్తి చేశాను. బాణాన్ని గురిచూసి వదలడమే మిగిలింది. నేను రాజకీయాల్లోకి రావడం ఖాయం. ఇదంతా పరిస్థితుల ప్రోద్బలం. తగిన సమయం లేనందున త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంటాను. పార్లమెంటు ఎన్నికల నాటికి ఒక మంచి నిర్ణయం తీసుకుంటాను. నేను రాజకీయాల్లోకి రావడం పేరు ప్రతిష్టల కోసం కాదు, కలలో కూడా ఊహించని వెయ్యింతల పేరు ప్రతిష్టలను అభిమానులు ఇప్పటికే ఇచ్చారు. 1996లోనే కుర్చీ నన్ను వెతుక్కుంటూ రాగా వద్దని చెప్పేశాను. 45 ఏళ్లప్పుడు లేని పదవీ వ్యామోహం 68 ఏళ్లకు వస్తుందా? ఆధ్యాత్మికవేత్త అని పిలిపించుకునేందుకు నాకు అర్హత ఉందా? తమిళనాడు రాజకీయాలు బాగా చెడిపోయాయి. ఏడాదిగా తమిళ రాజకీయాలను చూసి పొరుగు రాష్ట్రాలు నవ్వుకుంటున్నాయి. ప్రజాస్వామ్యం పరిహాసంగా మారింది. తమిళనాడు ప్రజలకు తలవంపులుగా తయారైంది. ఇంత జరిగినా.. నేను ఓ నిర్ణయం తీసుకోకుంటే అది తమిళనాడు ప్రజలకు ద్రోహం చేసినట్లవుతుంది. రాజకీయ వ్యవస్థలో మార్పులు తేవాలి. నీతి, నిజాయితీ కలిగి, మతసామరస్యంతో కూడిన ఆధ్యాత్మిక రాజకీయాలను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే నా లక్ష్యం. దేవుడి దయ, ప్రజల విశ్వాసం, ప్రేమ, అభిమానంతో ప్రత్యేక పార్టీ పెట్టాలని నిర్ణయించుకున్నాను. ఇందులో విజయం సాధిస్తానని సంపూర్ణమైన నమ్మకం ఉంది. రాజుల కాలంలో యుద్ధాలు చేసి పొరుగు రాజ్యాలను, ఖజానాలను, ప్రజలను కొల్లగొట్టేవారు. కానీ నేడు ప్రజాస్వామ్యం ముసుగులో నేరుగా ప్రజలను దోచుకుంటున్నారు. నాకు కార్యకర్తలు వద్దు, ప్రజా సంక్షేమం కోరే కాపలాదండు (వలంటీర్లు) కావాలి. ఎవరు తప్పు చేసినా నిలదీయగల ధైర్యమున్న దండు కావాలి. అధికారులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల దగ్గరు వ్యక్తిగత అవసరాల కోసం వెళ్లని వలంటీర్లు కావాలి. ఇలాంటి కాపలాదండుకు నేను ప్రతినిధిగా ఉంటాను. గ్రామస్థాయి నుంచి నగరాల వరకు కొన్నివేల సంఘాలు (రిజిస్టర్ అయినవి, కానివి) మనకు ఉన్నాయి. వాటన్నింటినీ ఏకతాటిపైకి తేవడం ఎంతో ముఖ్యం. క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, సత్యం ఇవే నా మొదటి శాసనం. ఇక మనం రాజకీయాలు మాట్లాడరాదు, నేనూ మాట్లాడను. ఎపుడు అసెంబ్లీ ఎన్నికలు వస్తాయో అపుడు పార్టీ స్థాపిస్తాను. ఆ పార్టీ ద్వారా ప్రజలకు ఏమి చేయగలమో, ఏమి చేయలేమో చెబుతాం. ప్రజలకు ఇచ్చిన హామీలను మూడేళ్లలోగా నెరవేర్చలేకుంటే స్వచ్ఛందంగా రాజీనామా చేస్తాను' అని రజనీ పేర్కొన్నారు. తన పార్టీ చిహ్నాన్ని స్పష్టం చేయకున్నా బాబా చిత్రంలోలా రజనీ వేలు మడతలను వేళ్లను మడిచి సంకేతాలు ఇచ్చారు. అనంతరం అభిమానులతో ఫొటోలు దిగారు.



ఆదివారం చెన్నైలో జరిగిన అభిమానుల సమావేశంలో మాట్లాడుతున్న రజనీకాంత్

చిత్రరంగం శుభాకాంక్షలు

రజనీకాంత్ నిర్ణయాన్ని అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ సహా పలువురు చిత్ర రంగ ప్రముఖులు స్వాగతించారు. సూపర్‌స్టార్ రాజకీయ భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. 'నా ప్రియ మిత్రుడు, తోటి నటుడు, వినయం, విధేయతగల మానవతావాది రజనీకాంత్ రాజకీయాల్లోకి వస్తున్నానని ప్రకటించారు. ఆయన విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని అమితాబ్ బచ్చన్ ట్వీట్ చేశారు.

'నా సోదరుడు రజనీకాంత్ సామాజిక బాధ్యత, రాజకీయ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నా' అని హాసన్ పోస్టు చేశారు. రజనీ ప్రకటన 2017 సంవత్సరానికి అతిపెద్ద వార్త 'జై హో' అని అనుపమ్ ఖేర్ వ్యాఖ్యానించారు. సూపర్‌స్టార్ కచ్చితంగా ప్రజాభిమానాన్ని పొందుతారని బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ అభిప్రాయపడ్డారు. నటి, కాంగ్రెస్ నాయకురాలు ఖుష్బూ కూడా రజనీ ప్రకటనను స్వాగతించారు.

వెల్లువెత్తిన అభిమానం

రజనీకాంత్ రాజకీయ ప్రవేశం ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం ఉరకలేసింది. సభాస్థలి ఈలలు, చప్పట్లతో మారుమోగింది. రజనీకాంత్ ప్రసంగాన్ని వినేందుకు వీలుగా రోడ్డుపైన సైతం స్పీకర్లు అమర్చారు. ప్రతి మాటకూ బాణసంచా కాల్చి ఉత్సాహాన్ని వ్యక్తపరిచారు. ఆనందంతో చిందులువేశారు. ప్రసంగాన్ని ముగించిన అనంతరం బాల్కనీలోకి వచ్చి రజనీకాంత్ చేయి ఊపుతూ, విక్టరీ చిహ్నం చూపుతూ అభివాదం చేయడంతో అభిమానుల్లో ఆనందం కట్టలుతెంచుకుంది. రజనీ ప్రకటనను కవర్ చేసేందుకు జాతీయ, అంతర్జాతీయ మీడియా ఉత్సాహం చూపించింది.

మమ్మల్ని ఓడించేవారు పుట్టలేదు: పళనిస్వామి

రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చని దీని కారణంగా అన్నాడీఎంకేకు నష్టమేమీ జరగదని తమిళనాడు సీఎం పళనిస్వామి వ్యాఖ్యానించారు. తమ పార్టీని ఓడించే వారింకా పుట్టలేదని.. ఇకపై పుట్టబోరని ఆయన పేర్కొన్నారు. ఎంజీఆర్, జయలలితలు స్థాపించిన అన్నాడీఎంకేకు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఎవరూ చీల్చలేరన్నారు. ప్రతి భారతీయుడికీ సొంతగా పార్టీ పెట్టుకునే హక్కుందని డిప్యూటీ సీఎం పన్నీర్ సెల్వం పేర్కొన్నారు. తమిళనాడు బీజేపీ చీఫ్ తమిళ్‌సాయి సౌందరరాజన్ రజనీకి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానుల ఆశలకు అనుగుణంగా రజనీకాంత్ పార్టీని పెట్టడం శుభపరిణామమని డీఎంకే కార్యాధ్యక్షుడు, విపక్ష నేత స్టాలిన్ వెల్లడించారు. ఆర్కే నగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ కూడా రజనీకి అభినందనలు తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్తేజం

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా సాగుకు 24 గంటల విద్యుత్ అందించారు. ఆ తర్వాత నవంబర్ 6 నుంచి 20 వరకు 15 రోజులపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కం) ఆదివారం అర్ధరాత్రి నుంచి అధికారికంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం మూసాయపల్లిలో రైతు చింతల వెంకట్‌రెడ్డి పొలంలో పంప్‌సెట్‌ను ఆన్‌చేసి 24 గంటల కరెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తెల్లవారుజాము వరకు పలు గ్రామాల్లో పర్యటించి విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు. సీఎం కేసీఆర్ కరెంట్ సరఫరా విశేషాలను అధికారుల నుంచి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమీక్షించారు.



పంప్‌సెట్‌ను ఆన్‌చేస్తున్న జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్‌ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి తదితరులు

వచ్చే మార్చి కీలకం

వాస్తవానికి గత మూడ్రోజుల నుంచే అనధికారికంగా సాగుకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 8,200 మెగావాట్ల నుంచి 9,400 మెగావాట్లకు ఎగబాకింది. వచ్చే మార్చిలో రబీ పంటలు చివరి దశకు రానున్నాయి. అప్పుడు నీటి అవసరాలు పెరగనున్నాయి. దానికి వేసవి కూడా తోడు కానుండటంతో ఆ నెలలో డిమాండ్ భారీగా పెరగనుంది. ఆ నెలలో రికార్డు స్థాయిలో 11 వేల మెగావాట్లకు డిమాండ్ పెరగవచ్చని ప్రభుత్వం అంచనా వేసింది. అయినా ఆ మేరకు సరఫరా చేస్తామని విద్యుత్ సంస్థలు దీమా వ్యక్తం చేస్తున్నాయి.

ఆటో స్టార్టర్లపై త్వరలో ప్రత్యేక డ్రైవ్

సాగుకు 24 గంటల కరెంట్ నేపథ్యంలో విద్యుత్‌తోపాటు భూగర్భ జలాలు వృథా కాకుండా పంపుసెట్లకు బిగించిన ఆటో స్టార్టర్లను తొలగించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతులకు పిలుపునిచ్చారు. ఆటో స్టార్టర్ల తొలగింపుపై రైతుల్లో అవగాహన, చైతన్యం కల్పించేందుకు జనవరి తొలి వారంలో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనుంది. మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా గ్రామ సభలు నిర్వహించి రైతుల్లో అవగాహన కల్పించనుంది.



ఐదు తలల క్యాబేజీ!

నారాయణఖేడ్: క్యాబేజీ సహజంగా ఒక్కొక్కటి విడివిడిగా కాస్తాయి. కానీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే ఎం.డి మోసిన్‌కు ఆదివారం ఐదు తలల క్యాబేజీ వచ్చింది. ఇది చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. ఐదు తలలు రావడం వింతగా ఉందని చర్చించుకున్నారు.

మూడు నెలల్లోగా అనర్హత వేటు

పార్టీ ఫిరాయింపుదార్లపై ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు స్పష్టీకరణ



- చట్టం ప్రకారం ఫిర్యాదులను మూడు నెలలకు మించి పెండింగ్‌లో ఉంచొద్దు
- ఫిర్యాదు అందిన వెంటనే ఇద్దరు ఎంపీలపై అనర్హత వేటు వేశా
- కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టా..
- ఏపీ, తెలంగాణలో స్పీకర్లు ఎలా స్పందిస్తారన్నది వారిష్టం
- ప్రధానమంత్రి కావాలన్న కోరిక నాకు లేదు
- ప్రజలు అభివృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయింపులపై ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఒక రాజకీయ పార్టీ తరపున గెలిచి పదవీకాలం మధ్యలోనే మరో పార్టీలోకి ఫిరాయించే వారిపై ఫిర్యాదు అందిన 3 నెలల్లోగా అనర్హత వేటు వేయాలని స్పష్టం చేశారు. చట్ట సభలకు చైర్మన్‌గా, స్పీకర్‌గా వ్యవహరించే వారు ఫిరాయింపుల వ్యవహారంపై అందే ఫిర్యాదులను 3 నెలలకు మించి పెండింగ్‌లో ఉంచుకోకూడదని చట్టమే చెబుతోందని గుర్తు చేశారు. ఇద్దరు రాజ్యసభ సభ్యులపై ఫిర్యాదు అందిన వెంటనే అనర్హత వేటు వేయడం ద్వారా తాను ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఆదివారం కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారమే పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నానని పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలువురు ప్రతిపక్ష ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయించారు. వారిపై ఫిర్యాదులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నందున రెండు రాష్ట్రాల స్పీకర్లకు మీరేమైనా సూచనలు చేస్తారా' అని విలేకరులు అడగ్గా... రాజ్యసభ చైర్మన్ హోదాలో చట్టంలో పేర్కొన్న మేరకు తాను నిబంధనల ప్రకారం నడుచుకున్నానని, లోక్‌సభ స్పీకర్, ఆయా రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు వారి విచక్షణ మేరకు నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఇంతకు మించి దీనిపై తానేమీ మాట్లాడనని చెప్పారు.

తెలుగు ప్రజలకు సేవ చేస్తా..

ఇప్పటిదాకా ప్రధానమంత్రి పదవి తప్ప ఎన్నో పదవులు చేపట్టానని, ప్రధానమంత్రి కావాలన్న కోరిక లేదని వెంకయ్య స్పష్టం చేశారు. ఆ అర్హత తనకు లేదనే విషయం తెలుసన్నారు. ఉప రాష్ట్రపతి హోదాకు ఉండే ప్రొటోకాల్ నియమ నిబంధనలు ఇబ్బంది కలిగిస్తున్నాయని చెప్పారు. నూతన ఏడాది, సంక్రాంతి వేడుకల సందర్భంగా ప్రజలకు వెంకయ్యనాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. పాలకులు, రాజకీయ పార్టీల్లో మార్పు రావాలని ఆకాంక్షించారు. ప్రజలు అభివృద్ధిని మాత్రమే కోరుకుంటున్నారని, వారిలో ప్రశ్నించే తత్వం పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో వ్యవసాయ రంగానికి ప్రభుత్వాలు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఉప రాష్ట్రపతిగా తనకున్న పరిమితుల మేరకు తెలుగు రాష్ట్రాల ప్రజలకు సేవ చేస్తానని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు, గృహ నిర్మాణం వంటి అంశాలపై సంబంధిత మంత్రులతో మాట్లాడానన్నారు. దేశ రాజకీయాల్లో ఇప్పుడు కులం, మతం, డబ్బు అనే మూడు 'సీ'లు ప్రాధాన్యతా అంశాలుగా మారిపోయాయని విచారం వ్యక్తం చేశారు. కానీ, కెపాసిటీ, క్యారెక్టర్, క్యాలిబర్, కాండక్ట్ అనే నాలుగు 'సీ'లకు ప్రాధాన్యం పెరగాలని ఆకాంక్షించారు.

ఇలా అయితే ఎలాగమ్మా!

దుర్గగుడి ఈవోతో వెంకయ్య నాయుడు

సాక్షి, విజయవాడ: ''దుర్గగుడిపై పలు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అయితే ఎలాగమ్మా'' అంటూ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎ.సూర్యకుమారిని ఉద్దేశించి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రశ్నించారు. ఆయనను ఆదివారం స్వర్ణభారత్ ట్రస్టులో దుర్గగుడి చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, ఈవో సూర్యకుమారి, పాలకమండలి సభ్యులు కలిశారు. వారితోపాటు ఏపీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మంత్రి కామినేని శ్రీనివాస్ ఉన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ... ''దుర్గగుడిలో ఒక దివ్యాంగుడిని తోసివేశారని పేపర్లో చూశాను. ప్రసాదాలు సరిగా ఉండటం లేదని, అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటివి జరగకుండా చూడాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి'' అంటూ సుతిమెత్తగా హెచ్చరించారు. అంతా సరిచేస్తామంటూ ఈవో, పాలకమండలి సభ్యులు హామీ ఇచ్చారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఢిల్లీలో దుర్గమ్మ నమూనా దేవాలయం నిర్మించాలని భావిస్తున్నామని, స్థలం ఇప్పించాలని కోరారు. వెంకయ్య నాయుడు స్పందిస్తూ... ఢిల్లీలో స్థలం కొరత ఉందని, అవకాశాన్ని బట్టి పరిశీలిస్తామని చెప్పారు.

కోర్సు ముగిసేలోపు ఫీజు రీయింబర్స్‌మెంట్!

- పోస్టుమెట్రిక్ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఊరట
- 3.25 లక్షల మందికి ముందస్తు ప్రయోజనం
- రూ.650 కోట్లు నిధుల విడుదలకు కసరత్తు



సాక్షి, హైదరాబాద్: కోర్సు ముగిసేలోపు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఇకపై కోర్సు ముగిసిన వెంటనే ఒరిజినల్ ధ్రువపత్రాలను విద్యార్థులకు అందించేందుకు సంక్షేమ శాఖలు చర్యలు మొదలెట్టాయి. ఇప్పటివరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల జాప్యంతో కోర్సు పూర్తి చేసినప్పటికీ విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇచ్చేవి కావు. దీంతో విద్యార్థులు ఉపాధి అవకాశాలను కోల్పోవాల్సి వచ్చేది. తాజాగా ఈ పరిస్థితికి చెక్ పడనుంది. ఇందులో భాగంగా విద్యాసంవత్సరం ముగిసేలోపే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులివ్వనుంది. అన్ని కేటగిరీ విద్యార్థులకు కాకుండా కేవలం ఫైనల్ ఇయర్ కోర్సు విద్యార్థులకు మాత్రమే ఈ ముందస్తు నిధులు చెల్లించనుంది.

వారి ఫీజులు, స్కాలర్‌షిప్‌లకు రూ.650 కోట్లు...

2017–18 విద్యా సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల కింద 13.05 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఇంటర్మీడియట్, డిగ్రీ, ఇంజనీరింగ్, పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ చదివే విద్యార్థులు 3.25 లక్షల మంది ఉన్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ ప్రాథమికంగా తేల్చింది. ఈ విద్యా సంవత్సరంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోర్సు ముగిసేలోపే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల అంచనాలు రూపొందించింది. ఈ మేరకు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఫీజులు, ఉపకారవేతనాల కింద రూ.650 కోట్లు కేటాయించింది. 2017–18 వార్షిక సంవత్సరంలోని ఫైనల్ ఇయర్ విద్యార్థులకు నిధుల మంజూరు సంతృప్తికర స్థాయిలో ఉండటంతో అధికారులు చర్యలు వేగవంతం చేశారు. విద్యార్థుల దరఖాస్తుల పరిశీలన సైతం త్వరితంగా చేపట్టాలని భావిస్తోంది. మొత్తంగా విద్యా సంవత్సరం ముగిసేనాటికి పరిశీలన పూర్తి చేసి నిధులు విడుదల చేసేందుకు సిద్ధమవుతోంది. ఫలితాలు వచ్చిన తర్వాత ఆయా విద్యార్థులు కాలేజీల నుంచి నేరుగా ధ్రువ పత్రాలు పొందవచ్చని, ఆలోపు ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎస్సీ అభివృద్ధి శాఖ సంచాలకుడు కరుణాకర్ 'సాక్షి'కి తెలిపారు.

గిన్నిస్ రికార్డు కోసం భరతనాట్య ప్రదర్శన



గిన్నిస్ రికార్డు ప్రదర్శనలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

రైతు శ్రమను చాటుతూ 300 మంది విద్యార్థుల నృత్యం

తిరుపతి కల్చరల్: గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో భాగంగా చేపట్టిన భరత నాట్య ప్రదర్శన ఆదివారం తిరుపతిలోని జీవకోన విశ్వం స్కూల్‌లో 300 మంది విద్యార్థులతో అద్భుతంగా సాగింది. రైతుల గురించి యువతకు తెలియజేయాలనే సంకల్పంతో హీడెన్ ఐడల్ సంస్థ వినూత్న రీతిలో ప్రపంచ వ్యాప్తంగా పదివేల మందితో భరతనాట్య ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. మలేసియా, దుబాయ్, ఆస్ట్రేలియా, లండన్, శ్రీలంక వంటి 8 దేశాలు, భారత్‌లోని 8 రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈ నృత్య ప్రదర్శనను నిర్వాహకులు చేపట్టారు. తెలుగు రాష్ట్రాల్లో అంతర్జాతీయ నృత్య నిర్వాహకుడు డాక్టర్ శరత్‌చంద్ర పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్వీ యూనివర్సిటీ వీసీ ఆవుల దామోదరం, టీటీడీ ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి ముక్తేశ్వరరావు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ వైవీఎస్.పద్మావతి, రిటైర్డ్ అధ్యాపకుడు దేవేంద్ర, విశ్వ విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. 12 నిమిషాల పాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. అనంతరం జిల్లా రైతు ఉద్యమ నాయకుడు ఈగల వెంకటాచలం నాయుడును అతిథులు సత్కరించారు.

కాస్త తగ్గినా.. రబీ ఆశలు సజీవం!

గతేడాదితో పోలిస్తే చెరువుల కింద 2 లక్షల మేర తగ్గనున్న సాగు

- గత సంవత్సరం గరిష్టంగా 7.25 లక్షల ఎకరాలకు అందిన నీరు
- ఈ ఏడాది 5.16 లక్షల ఆయకట్టుకు అందే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చిన్న నీటి వనరులుగా ఉన్న చెరువుల కింద సాగు విస్తీర్ణం గత ఏడాది రబీతో పోలిస్తే కాస్త తగ్గే అవకాశం కనిపిస్తోంది. గడిచిన పదేళ్లలో ఎన్నడూ లేనంతగా రబీలో గత ఏడాది చెరువుల కింద సాగు 7.25 లక్షల ఎకరాలు దాటగా, ఈ ఏడాది 5.16 లక్షల ఎకరాల వరకు ఉండనుంది. మిషన్ కాకతీయ కింద మూడు విడతల్లో 22,895 చెరువులను పునరుద్ధరించినా, లోటు వర్షపాతం కారణంగా చెరువుల్లో నీరు చేరకపోవడం ఆయకట్టును ప్రభావితం చేయనుంది.

పదేళ్లతో పోలిస్తే.. ఆశాజనకమే..

రాష్ట్రంలో మొత్తంగా 46,531 చెరువులు ఉండగా, వాటి కింద 24,39,515 ఎకరాల మేర సాగు విస్తీర్ణం ఉంది. కృష్ణా, గోదావరిలో కలిపి 255 టీఎంసీల మేర కేటాయింపులున్నాయి. అయినప్పటికీ పూర్తి స్థాయిలో నీటి వినియోగం జరగకపోవడంతో గరిష్టంగా 10 లక్షలకు మించి ఆయకట్టుకు నీరందించిన సందర్భాలు లేవు. 2008–09 ఏడాది నుంచి ప్రస్తుతం వరకు ఖరీఫ్, రబీ సీజన్‌ల వారీగా చూస్తే గరిష్టంగా 2013–14 ఖరీఫ్‌లో 9,04,752 ఎకరాల్లో సాగు జరిగింది. గత సంవత్సరం కంటే ముందు 2008–09లో గరిష్టంగా 2.38 లక్షల ఎకరాల్లో రబీ సాగు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. గత ఏడాది 2016–17లో విస్తారంగా వర్షాలు కురవడం, చెరువుల పునరుద్ధరణ రబీ సాగుకు ఊపిరి పోసింది. దీంతో గత ఏడాది రబీలో గరిష్టంగా 7.25 లక్షల ఎకరాల్లో సాగైంది. అయితే ఈ ఏడాది మొత్తం చెరువుల్లో 14,418 చెరువుల్లో 25శాతం కన్నా తక్కువగా నిండగా, మరో 9,289 చెరువుల్లో 25 నుంచి 50 శాతం వరకు మాత్రమే నిండాయి. రంగారెడ్డి జిల్లాలో 2,019 చెరువులు ఉండగా ఏకంగా 1,635 చెరువులు నీటి కరువు ఏర్పడింది. పెద్దపల్లి జిల్లాలోనూ 1,185 చెరువులకు గానూ 1,070 చెరువుల్లో నీరు చేరలేదు. కృష్ణా బేసిన్‌లోని మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులు, రిజర్వాయర్లలోకి పెద్దగా నీరు చేరని కారణంగా కూడా చెరువులను నింపడం సాధ్యం కాలేదు. అయినప్పటికీ మూడు విడతల్లో పునరుద్ధరించాలని తలపెట్టిన 22,895 చెరువుల్లో ప్రస్తుతం వరకు 15,649 చెరువుల పనులు పూర్తి కావడంతో వర్షాలు మెరుగ్గా ఉన్న చోట్ల నీటి లభ్యత కొంత పెరిగింది. దీంతో ఈ ఏడాది 5,16,097 ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఆయకట్టు తగ్గినా.. పదేళ్ల లెక్కలను పరిగణనలోకి తీసుకుంటే మాత్రం ప్రస్తుతం చెరువుల ద్వారా సాగయ్యే ఆయకట్టు గణనీయంగా ఉండటం ఆయకట్టు ఆశలను సజీవం చేస్తోంది.



రెవెన్యూ ఉద్యోగులు నా కుటుంబ సభ్యులు

టీజీటీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలో మహమూద్ అలీ



మహమూద్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీజీటీఏ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖ ఉద్యోగులను తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని, వారికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరిస్తానని ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ అన్నారు. పేదలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందించడంలో రెవెన్యూ వ్యవస్థ కీలకమని వ్యాఖ్యానించారు. ఆదివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ తహసీల్దార్ల సంఘం (టీజీటీఏ) రూపొందించిన 2018 డైరీ, క్యాలెండర్‌లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను ఉద్దేశించి మాట్లాడుతూ భూ రికార్డుల ప్రక్షాళనలో తహసీల్దార్లు అమోఘమైన పాత్రను పోషించారని కొనియాడారు. రెవెన్యూ ఉద్యోగులంతా కలసి ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం హర్షణీయమన్నారు. త్వరలోనే తహసీల్దార్లకు పదోన్నతులు, రెవెన్యూ శాఖలో ఖాళీల భర్తీ చేపడతామని, రెవెన్యూ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదైన ఘటనలను పునరావృతం కాకుండా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ల్యాండెస్కా డైరెక్టర్ ఎం.సునీల్‌కుమార్, టీజీటీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, అధ్యక్షుడు గౌతంకుమార్, టీజీటీఏ కార్యవర్గ సభ్యులు, ప్రతినిధులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

21న బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి: జాజుల



హైదరాబాద్: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు, క్రీమీలేయర్ ఎత్తివేయాలని, జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించాలనే డిమాండ్లతో జనవరి 21న హైదరాబాద్‌లో బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రకటించారు. ఆదివారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా తాళ్లపల్లి సురేశ్‌కు ఆయన నియామక పత్రం అందచేశారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేస్తూ బీసీ ఉద్యోగులను విస్మరించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వశాఖల్లో 37 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, జనాభా దామాషా ప్రకారం 50% ఉండాల్సిన బీసీ ఉద్యోగులు 3 లక్షల 70 వేల మందే ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించి ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బీసీ బిల్లు పెట్టాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల ఉద్యోగాలను, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న లక్ష ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస్, బీసీ ఉద్యోగుల సంఘం నేతలు నీలం ప్రవీణ్, ఈశ్వర్, నరేంద్రకుమార్, జాజుల రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.


S & D

4

సాక్షి
సాహిత్యం

హైదరాబాద్ | సోమవారం | జనవరి | 1 | 2018
అభిప్రాయాలకు: sakshisahityam@gmail.com

కథాసారం



ఏమివ్వను నాన్నా!

అదొక చిన్న పల్లె. పేరు లెంట్షిన్. దాన్నిండా గుడిసెలు, పూరిపాకలు. మధ్యనే పొలాలు. అందులో కూరగాయలు పండిస్తారు. మేకలు పెంచుతారు.

ఒక చిన్న గుడిసెలో బెల్ ఉంటాడు. ఆయన వయసు ఎనబై దాటింది. రష్యా నుండి తరిమివేయబడి పోలండ్‌కు వచ్చి స్థిరపడిన యూదు కుటుంబాల్లో వీరిదీ ఒకటి. బెల్ పొట్టివాడు. గడ్డం తెల్లబడింది. ఏ కాలమైనా తలమీద గొర్రెచర్మం టోపీ పెట్టుకుంటాడు. ఆయనకో అర ఎకరం పొలం ఉంది. ఆవు, మేక, కొన్ని కోళ్లు కూడా ఉన్నాయి.

బెల్ భార్య బెల్‌చా. ఆమె ముఖం క్యాబేజీ ఆకులాగా ముడతలు పడివుంటుంది. సగం చెవుడు. ప్రతీ మాటను రెండుసార్లు చెప్పాలి.

బెల్ దంపతులకు ఒక కొడుకు. పేరు శామ్యూల్. నలబై ఏళ్ల క్రితమే అమెరికా వెళ్లాడు. అక్కడ లక్షలు సంపాదించాడని ఊళ్లో చెప్పుకుంటారు. పోస్ట్‌మాన్ బెల్ ఇంటికి అప్పుడప్పుడు మనీయార్డర్, ఉత్తరం తెచ్చిస్తుంటాడు. ఆ ఉత్తరంలో చాలా మాటలు ఇంగ్లీషులో ఉంటాయి, కనుక ఎవరూ దాన్ని చదవలేరు. శామ్యూల్ పంపించిన డబ్బును తండ్రి ఎక్కడ పెట్టాడన్నది ఎవరికీ పట్టదు. ఆ గుడిసెలోనే బల్ల, మాంసం అర, పాల వస్తువుల షెల్ఫ్, రెండు మంచాలు, మట్టి పొయ్యి ఉంటాయి. బయట చలిగా ఉంటే కోళ్లు పొయ్యి పక్కనే చేరతాయి. ఊళ్లో కలిగినవాళ్ల ఇంట్లో కిరోసిన్ దీపాలు ఉన్నాయి. బెల్ వాళ్లకు మాత్రం కొత్త వస్తువులంటే నమ్మకం లేదు. సబ్బత్‌కు మాత్రం బెల్చా కొవ్వొత్తులు కొంటుంది.

దంపతులు సూర్యోదయంతో నిద్ర లేస్తారు. కోళ్లతో పాటు నిద్రకు ఉపక్రమిస్తారు. ఒక ఆవు దూడను ఈనింది, ఒక యువ జంటకు పెళ్లయింది లాంటి సంగతులు తప్ప లెంట్షిన్‌లో మరేమీ జరగవు.

శామ్యూల్‌కు కొడుకులు, కూతుళ్లు ఉన్నారు. వాళ్ల పేర్లన్నీ చిత్రంగా ఉంటాయి. అందుకే ముసలి దంపతులకు గుర్తుండవు. పేర్లలో ఏముంది? అమెరికా సముద్రానికి అటువైపు ఉంటుందట. అది ప్రపంచం అవతలి అంచు. ఊరికి వచ్చిన ఒక తాల్మూడ్ టీచర్, అమెరికా వాళ్లు బుర్ర నేలకు, కాళ్లు పైకి పెట్టి నడుస్తారని చెప్పాడు. అదెట్లా కుదురుతుంది? చెప్పింది టీచర్ కనుక అది నిజమే అయివుండాలి.

ఒక శుక్రవారం ఉదయాన బెల్‌చా సబ్బత్ రొట్టెల కొరకు పిండి పిసుకుతోంది. అప్పుడు తలుపు తీసుకుని ఒక పెద్దమనిషి లోపలికి వచ్చాడు. పొడుగ్గా ఉన్నందున వంగి రావలసి వచ్చింది. వెంట వచ్చిన బండి మనిషి రెండు తోలు సూట్‌కేసులు తెచ్చాడు. బెల్‌చా ఆశ్చర్యంగా కళ్లెత్తింది. బండిమనిషికి అతను వెండి రూబుల్ అందిస్తూ, ఇద్దిష్‌లో 'ఇక నువ్వు వెళ్లొచ్చు' అన్నాడు. తర్వాత, 'అమ్మా' అని పిలిచాడు. 'నేను శామ్యూల్‌ని. శాన్'. బెల్‌చా కాళ్లు మొద్దుబారాయి. పెద్దమనిషి ఆమెను కౌగిలించుకున్నాడు. నుదుటిని ముద్దాడాడు. బెల్‌చా కోడిపెట్టలాగా కిచకిచలాడింది. 'మా బాబే' అంది.

అప్పుడే బెల్ కొట్టం నుండి లోపలికి వచ్చాడు. ఆయన చేతుల నిండా కట్టెలున్నాయి. వెంట మేక కూడా ఉంది. పెద్దమనిషిని చూసి బెల్ కట్టెలు కింద పడేశాడు. ఆ పెద్దమనిషి బెల్‌చాను వదిలి బెల్‌ను వాటేసుకున్నాడు. 'నాన్నా!' బెర్ల్‌కు నోట మాట రాలేదు. కాసేపటికి 'నువ్వు శామ్యూల్‌వా?' అని అడిగాడు. 'అవును నాన్నా. నేను శామ్యూల్‌ని'. 'చల్లగా బతుకు నాయనా' అని కొడుకు చెయ్యి పట్టుకున్నాడు. అప్పటికీ ఆయనకు నమ్మకం కుదరడం లేదు. శామ్యూల్ ఈ మనిషంత పెద్దగా లేడు. అయితే అబ్బాయి అమెరికా వెళ్లినప్పుడు అతడి వయసు పదిహేనేళ్లని గుర్తొచ్చింది. 'నువ్వొస్తున్నట్టు మాకు చెప్పనేలేదు' అన్నాడు బెల్.

'నా కేబుల్ మీకు అందలేదా?' అడిగాడు శామ్యూల్. అదేమిటో బెల్‌కు అర్థంకాలేదు.

'ఇదంతా చూసేవరకు నేను బతుకుతానని అనుకోలేదు. ఇప్పుడిక ఆనందంగా చస్తాను' అన్నది బెల్‌చా.

బెల్ ఆశ్చర్యపోయాడు. సరిగ్గా ఈ మాటలే తానూ అనబోయాడు.

కాసేపైన తర్వాత బెల్, 'పేశ్చా, నువ్వు సబ్బత్ కొరకు మామూలు పులుసుతో పాటు మంచి డబుల్ పుడింగ్ కూడా చేయాలి సుమా' అన్నాడు. బెల్ తన భార్యను సొంతపేరుతో పిలిచి కొన్నేళ్లయి వుంటుంది. ఆమె కళ్ల నుంచి పసుపు నీళ్లు కారాయి. దృశ్యం అలుక్కుపోయింది. 'ఇవ్వాళ శుక్రవారం. నేను సబ్బత్ కోసం తయారీలు చేయాలి' అంది. ఆమె మళ్లీ రొట్టెల కోసం పిండి పిసకవలసివుంది. మరి ఇలాంటి చుట్టం వస్తే మరింత మంచి పులుసు కాయవలసి ఉంటుంది! మొదలే చలి రోజులు. చీకటి పడేలోగా పని జరగాలి.

అమెరికా నుంచి బెల్ కొడుకు వచ్చాడన్న శుభవార్త ఇరుగు పొరుగుకు తెలిసింది. పలకరించడానికి వచ్చారు. గది నిండా మనుషులే. ఆడవాళ్లు బెల్‌చాకు పనిలో సాయం పట్టారు. ఆమె కొవ్వొత్తులు ముట్టించింది. అప్పుడిక తండ్రి, కొడుకు వీధి అవతల ఉన్న చిన్న సినగాగ్‌కు బయల్దేరారు. కొడుకు పెద్ద అంగలుగా నడుస్తున్నాడు. 'నెమ్మదిరా' అంటూ బెల్ హెచ్చరించాడు. ఊరంతా మంచు కప్పుకుని వుంది. కిటికీల్లోంచి కొవ్వొత్తుల వెలుగు కనిపిస్తోంది. 'ఇక్కడ ఏమీ మారలేదు' అన్నాడు శామ్యూల్.

వచ్చేసరికి బెల్‌చా బియ్యంతో చికెన్ పులుసు చేసింది. చేపకూర వండింది. మాంసం, క్యారెట్ పులుసు సిద్ధం చేసింది. కుటుంబం కలిసి తాగారు, తిన్నారు.

నిశ్శబ్దంలో చిమ్మటల రొద వినబడుతోంది.

చివరి ప్రార్థన తర్వాత అడిగాడు శామ్యూల్: ''నాన్నా, నేను పంపిన డబ్బంతా ఏం చేశావు?''

బెల్ తన తెల్లటి కనుబొమ్మలను ఎగరేస్తూ, ''ఇక్కడే వుంది'' అన్నాడు.

''బ్యాంకులో వేయలేదా?''

''లెంట్షిన్‌లో బ్యాంకు లేదు.''

''మరి డబ్బులు ఎక్కడున్నాయి?''

బెల్ తటపటాయించాడు. సబ్బత్‌లో డబ్బు తాకడం తప్పు. అయినా చూపిస్తానంటూ మంచం కిందకు వంగి బరువైనదేదో బయటికి లాగాడు. ఒక బూట్. దాంట్లో పైన గడ్డి కుక్కి వుంది. అది తీసేశాడు. నిండా బంగారు నాణేలు!

''నాన్నా బోలెడు సొమ్ము!''

''సరే...''

''ఎందుకు ఖర్చు పెట్టలేదు?''

''దేనికని? దేవుడి దయ. మాకు అన్నీ ఉన్నాయి.''

''ఎక్కడికన్నా వెళ్లివుండవచ్చు కదా!''

''ఎక్కడికి? ఇదే మన ఇల్లు.''

''డబ్బు ఏమవుతుంది మరి?''


''నువ్వే పట్టుకుపో.''

బెల్ దంపతులకు నెమ్మదిగా కొడుకు అమెరికన్ యిద్దిష్ అలవాటవుతోంది. బెల్‌చా కొడుకు మాటలు బాగా పోల్చుకుంటున్నది. 'మనం ఇక్కడ ఒక పెద్ద సినగాగ్ కట్టొచ్చు' అన్నాడతను. 'ఉన్న సినగాగ్ పెద్దదే' జవాబిచ్చాడు బెల్.

''ముసలివాళ్లకొరకు ఒక ఇల్లు కడితే?''

''ఎవరూ వీధుల్లో పడుకోవడం లేదు.''

మరుసటి రోజు సబ్బత్ భోజనం తర్వాత బెల్ దంపతులు కాసేపు నడుం వాల్చారు. మేక కూడా కునికిపాట్లు పడుతున్నది. కొడుకు కోటు వేసుకుని, టోపీ పెట్టుకుని నడకకు బయల్దేరాడు. కోటు జేబులో చెక్‌బుక్, రుణపత్రాలు చేతికి తగిలాయి. అతడు ఏవో పెద్ద పథకాలు వేసుకుని వచ్చాడు. అమ్మానాన్నలకు సూట్‌కేస్ నిండా బహుమతులు తెచ్చాడు. ఊరివాళ్లకు ఏదైనా సాయం చేయాలనివుంది. న్యూయార్క్‌లోని లెంట్షిన్ సొసైటీ నుండి కూడా డబ్బు తెచ్చాడు. కానీ ఈ ఊరికి ఏదీ అవసరం లేదు. దూరంగా సినగాగ్‌లో ప్రార్థనలు వినబడుతున్నాయి.




ఐజక్ బషేవిస్ సింగర్

(నోబెల్ పురస్కారం పొందిన ఐజక్ బషేవిస్ సింగర్ కథ 'ద సన్ ఫ్రమ్ అమెరికా'కు సంక్షిప్త రూపం. ఈ కథ 1973లో ప్రచురితమైంది. దీన్ని కె.బి.గోపాలం 'అమెరికా కొడుకు' పేరుతో అనువదించారు.)

గ్రేట్ రైటర్

ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ



ప్రపంచ సాహిత్యంలో ఒక గొప్ప సైకాలజిస్టుగా ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ (1821–1881) కీర్తినొందాడు. మాస్కోలో జన్మించిన దోస్తోవ్‌స్కీ 19వ శతాబ్దపు రష్యా సంక్లిష్ట రాజకీయ, సాంఘిక, ఆధ్యాత్మిక వాతావరణంలో మనిషి అంతరంగాన్ని అన్వేషించాడు. రచయితే ఏకస్వరంగా (Monologising) రచన అంతటా వినిపించడం కాకుండా, ప్రతి పాత్రా తనదైన భిన్న స్వరాన్ని (Polyphonic) కలిగివుండే తరహా నవలా సృష్టికర్త దోస్తోవ్‌స్కీ అని మిఖాయిల్ బఖ్తిన్ అభివర్ణించాడు. రష్యా చక్రవర్తిని (జార్) విమర్శించే పుస్తకాల గురించి చర్చించిన బృందంలో ఒక సభ్యుడిగా దోస్తోవ్‌స్కీకి మరణ శిక్ష పడింది. దాని అమలులో భాగంగా, 1849 డిసెంబర్ 23న ఆయన్ని కాల్చిచంపబోయే చివరి నిమిషంలో శిక్షలో మార్పు జరిగింది. అలా సైబీరియాలో నాలుగేళ్ల కఠిన కారాగారశిక్ష అనుభవించాడు. ఆ తర్వాతే దోస్తోవ్‌స్కీ అనగానే గుర్తొచ్చే 'నోట్స్ ఫ్రమ్ అండర్‌గ్రౌండ్', 'క్రైమ్ అండ్ పనిష్మెంట్', 'ది ఇడియట్', 'ద బ్రదర్స్ కరమ్‌జోవ్', 'డీమన్స్' లాంటి సుప్రసిద్ధ రచనలు వెలువరించాడు. ఆ శిక్షలో మార్పు జరగకపోయివుంటే!

ప్రతిధ్వనించే పుస్తకం

అల్పజీవి
నవల



రావిశాస్త్రి

ఒక మనిషికి భయానికి మించిన రోగం ఏమిటి?

సుబ్బయ్యకు అధికారం అంటే భయం. పోలీసులంటే భయం. మార్కెట్లో కూరలమ్మితో బెరుకు లేకుండా బేరం చేయలేడు. ఆఫీసులో సెలవు కావాలన్నా ధైర్యం చేసి అడగలేడు. చివరికి భార్యను కూడా 'పులుసులో ఉప్పు జాస్తిగా ఎందుకు వేశా'వని అడగలేడు. అన్నింటా అంతటా భయమే. ఆ భయం వల్లే 'ఒట్టి చచ్చుపెద్దమ్మ' అనిపించుకుంటాడు. 'నంగిరి పింగిరి'గాడిగా మాటలు పడతాడు. 'సుబ్బయ్య ఈజ్ వెరీ ఇనెఫిషియంట్' అని హెడ్‌క్లర్క్ రిమార్క్ పాస్ చేస్తాడు. 'నాన్నకి అమ్మను చూస్తే భయం' అని పుత్రరత్నం కృష్ణుడు కూడా రహస్యం కనిపెట్టేస్తాడు.

దుకాణంలో ఒకటి తాగుదామని వెళ్లి, దుకాణదారు ఇది బాగుంటుంది అని ఇచ్చేస్తే అదే మారు మాట్లాడకుండా పుచ్చుకునే రకం సుబ్బయ్య. తనకు ఇది కావాలి అని చెప్పలేడు. తనకు ఏది కావాలో దానికోసం నిలబడలేడు.


అట్లాంటి సుబ్బయ్య తన బావమరిది వెంకట్రావు అడగటం వల్ల తన దగ్గరికి బిల్లుల కోసం వచ్చే కాంట్రాక్టరు గవరయ్య దగ్గర ఐదు వందలు పుచ్చుకోవడానికి సిద్ధపడతాడు. 'వాణ్ణి ఐదు వందలడుగు' అంటాడంతే వెంకట్రావు. అతడు చెప్పిందాన్ని కాదనే ధైర్యం లేని సుబ్బయ్య, నేను తీసుకోను అని గట్టిగా చెప్పలేడు. దానివల్ల చాలా పెద్ద చిక్కులో పడిపోతాడు. ఈలోపు ఆఫీసులో జరిగిన స్థానభ్రంశం వల్ల సెక్షన్ మారిపోయి, గవరయ్య బిల్లులు చేయించలేకపోతాడు. కత్తి పదునో్త పనిచేసే గవరయ్య, జీవితం కొట్టిన దెబ్బలకు రాటుదేలిన గవరయ్య ఊరుకుంటాడా? అవకాశవాది బావమరిది అండగా నిలబడతాడా? ఇంటి అద్దె ఐదు రూపాయలున్న రోజుల్లో ఐదు వందలంటే ఎంత? సుబ్బయ్య నిలువెల్లా వణికిపోతాడు. ముచ్చెమటలు పోస్తాయి. గొంతు తడారి పోతుంది.

మనిషి దగ్గర మంచితనం మాత్రమే ఉంటే సరిపోదు. దాన్ని నిలబెట్టుకోవాలన్నా ధైర్యం కావాలి. 'భయం బ్రతుకును దుర్భరం చేస్తుంది. భయానికీ మంచికీ పొందిక లేదు. పిరికివారెవరూ కూడా మంచివారు కాజాలరు, మంచికి నిలబడలేరు' అంటారు రావిశాస్త్రి.

స్వతహాగా మంచివాడే అయినప్పటికీ రక్తంలో భయం కలిసిపోయిన ఒక గుమస్తా కథ 'అల్పజీవి'. తెగింపు కరువై బతుకును ఈడ్చే చాలామంది సుబ్బయ్యల కథ. రావిశాస్త్రి చేసిన గొప్ప మేలేమిటంటే, నవలను పూర్తి నిరాశగా ముగించకపోవడం. చివర్లో సుబ్బయ్యకు ఒక వెలుగులాంటి, మెరుపులాంటి స్నేహితురాలు మనోరమను పరిచయం చేస్తాడు. అది ఒక ప్రతీక. ఆమె కోసమైనా సుబ్బయ్య సంఘాన్ని ఎదిరించి నిలబడతాడా, గౌరవం ఇవ్వని భార్యతో కాపురం చేస్తూ మగ్గిపోతాడా అన్న సందేహం దగ్గర పాఠకుణ్ని వదిలేసి రచనను ముగిస్తాడు. చిన్న చిన్న వాక్యాలతో, వేగవంతమైన కథనంతో, మహా జోరుగా కథ నడుపుతాడు రావిశాస్త్రి. తెలుగు సాహిత్యంలో వచ్చిన ఉత్తమ నవలల్లో అల్పజీవి ఒకటి. రావిశాస్త్రి బెస్ట్.

సాహిత్య మరమరాలు

నా పంక్తిన కవితా విశారద



విశాఖపట్నంలో భారతీ తీర్థ స్నాతకోత్సవం జరుగుతోంది. ఉపన్యాసాలు అయ్యాక బోటనీ లేబరేటరీ భవంతి పక్కన భోజనాలు మొదలైనాయి. పండితులందరూ అక్కడ కూర్చున్నారు. అక్కడ చోటు చాలక అబ్బూరి వరదరాజేశ్వరరావు వరండాలోకి వచ్చాడు. అక్కడ 'నల్లగా పొడుగ్గా బొద్దు మీసాల్తో' ఉన్న ఒకాయన కూర్చున్నారు. నిర్వాహకుల్లో ఒకరు ఆయనకు విస్తరీ, చెంబూ తెచ్చి పెట్టారు. అబ్బూరి వెళ్లి ఆయన పక్కన కూర్చున్నాడు. అన్నం, కూర వడ్డన జరిగింది. రెండు నిమిషాల తరువాత ఆ పెద్దమనిషి 'ఎవరబ్బాయివి నాయినా?' అని పలకరించాడు. అబ్బూరి రామకృష్ణారావు వాళ్ల అబ్బాయినని చెప్పాక, మరి 'ఇక్కడికి వచ్చి కూర్చున్నావేం?' అన్నాడాయన. 'ఇంకెక్కడా చోటు లేదండీ' అన్నాడీయన. ఆయన నవ్వి ఊరుకున్నారు. మర్నాడు కరతాళ ధ్వనుల మధ్య ఆ పెద్దమనిషి పద్యపఠనం జరిగింది. అప్పటికిగ్గానీ ఆయన గుర్రం జాషువా అని అబ్బూరికి తెలియలేదు. సాయంత్రం జాషువాకు కవితా విశారద బిరుద ప్రదానం జరిగింది. అక్కడ అబ్బూరిని గుర్తించి, 'నిన్న నువ్వు నా పక్కన కూర్చున్నందువల్ల నేను భోంచేయగలిగాను. నాలుక్కాలాల పాటు బతికి, నువ్వు కూడా కవిత్వం చెప్పు నాయనా' అన్నారు జాషువా. 'హరిజనుడని' జాషువాను వేరే పంక్తిన కూర్చోబెట్టారు. అది తెలీక అబ్బూరి అక్కడ కూర్చున్నాడు. ఈ సంగతినే తర్వాత వాళ్ల నాన్నకు చెబితే, 'భలే మంచి పనిచేశావురా' అని మెచ్చుకున్నాడు.

కొత్త బంగారం

కలకూ నిజానికీ మధ్య ఊగే బోంబే

నార్కోపోలీస్ పుస్తకం ప్రారంభమయ్యేది 1970లలో, బోంబేలో ఉన్న శుక్లాజీ ఓపియమ్ హౌస్‌లో. పట్టణానికి నడిబొడ్డునున్న కామాథీపూరా రెడ్ లైట్ ప్రాంతంలో ఉన్న చందూఖానా(ఓపియమ్ గది)కి అనునిత్యం వచ్చే కథకుడైన డోమ్ ఉలిస్, చిత్రకారుడైన జేవియర్, ఖానావాలా రషీద్, అక్కడే ఉండే లింగమార్పిడి అయిన డింపిల్/జీనత్ నుంచీ, తళతళలాడే పట్టణపు అడుగుభాగంలో– మురికిలో జీవించే లాలాజీ, రూమీ వరకూ ఇందులో పరుచుకుంటారు.

పుస్తకంలో చూపించిన చాలా సంఘటనలు ఓపియమ్ హౌసువే. నైతికంగా పతనమవుతున్న ముంబయి పట్టణపు సందుల్లో, సమాజపు అంచుల మీద నివసిస్తున్న వ్యక్తుల గురించి వర్ణిస్తుందిది. మాదకద్రవ్యాలు, లైంగిక వాంఛలు, ప్రేమ, దేవుడు గురించిన చర్చలుంటాయి. తన మాదకద్రవ్యాల వ్యసనం వల్ల అమెరికా నుండి బహిష్కరించబడిన డోమ్ 2004లో తిరిగి ఇక్కడికే వస్తాడు. అప్పటికే, పట్టణంలో అనేకమైన మార్పులు చోటు చేసుకుని ఉంటాయి. ఓపియమ్‌కి బదులు, పాకిస్తాన్ నుండి వచ్చిన హెరాయిన్ కనిపిస్తుంది.



చైతన్యస్రవంతిలో సాగే ఈ నవలకి తరచూ కొత్త సంఘటనలూ, కొత్త కథకులూ అడ్డం పడుతుంటాయి/రు. 'అతను', 'ఆమె' అన్న ప్రస్తావనలున్నప్పటికీ, కొసవరకూ వారెవరో అన్నది పాఠకులకి ఉదహరింపుల ద్వారా తప్ప అర్థం కాదు. పుస్తకం నాలుగు భాగాల్లో ఉంటుంది. 'నేను' అన్న కథకుని కంఠం మొదటి భాగపు మధ్యలోనే మాయమై, తిరిగి మూడవ భాగంలో వినిపిస్తుంది. ఈ లోగా– పాత్రల మానసిక స్థితీ, వారి వ్యక్తిగత చరిత్రల గురించీ పాఠకులకి చెప్పే, పేరు తెలియని ప్రథమ పురుష స్వరం ఒకటి ముందుకొస్తుంది. దీన్ని నవల అనేకన్నా ముంబై చీకటి వీధుల గురించిన కొన్ని పొట్టి కథల సంకలనం అనుకోవచ్చు.

జీత్ థాయిల్ దీన్ని తన జీవితపు అనుభవాలే ఆధారంగా చేసుకుని రాశారు. 20 సంవత్సరాలపాటు తనకున్న వ్యసనంతో రచయిత పడిన సంఘర్షణ గురించిన ప్రస్తావన ఉంటుంది.

నవల ఒక సామాన్యమైన అభిరుచి(ఓపియమ్) వల్ల కట్టుబడి ఉన్న కొద్దిమంది గురించినది. బోంబేకున్న ఆకర్షణనీ, జీవనశైలినీ పక్కకునెట్టి, పట్టణానికున్న మరోకోణం వైపు మన దృష్టిని మళ్లిస్తుంది. 1970ల నుంచీ 2000 వరకూ బోంబే చేసిన ప్రయాణాన్ని నవల చెబుతుంది. అందుకే కొత్త పేరైన 'ముంబయి'ని ఎక్కడా వాడరు రచయిత.



జీత్ థాయిల్

భారతదేశపు జీవితాల్లో ఉన్న సంక్లిష్టతలనీ, వైరుధ్యాలనీ, కాపట్యాలనీ ఎత్తి చూపుతారు థాయిల్. యధార్థతకీ, భ్రమకీ మధ్య రచన ఊగిసలాడుతుంది. ఆఖర్న, తన అపార్టుమెంట్లో డోమ్ ఓపియమ్ పైప్ పీలుస్తున్నప్పుడు గానీ ఈ పుస్తకం అతని ఓపియమ్ కలల్లో ఒకటి మాత్రమేనని పాఠకులు తెలుసుకోలేరు.

ముందుమాటలో ఉన్న 7 పేజీల పొడుగాటి వాక్యంలో కేవలం ఒకే ఒక ఫుల్‌స్టాప్‌ను ఉపయోగించి, తక్కిన పుస్తకాన్ని పరిచయం చేస్తారు రచయిత.

ఈ పాక్షిక స్వీయచరిత్ర 2012లో బుకర్ బహుమతి లిస్టుకి ఎంపిక అయింది. థాయిల్ అప్పటికే నాలుగు కవితా సంకలనాలు రాసి ఉండటం వల్ల, ఇందులో కూడా కవిత్వపు ఛాయలు కనిపిస్తాయి.

◆ క్రిష్ణవేణి

ఈవారం పుస్తకాలు

వాళ్ళిద్దరూ అంతేనా?




రచన: రంగనాయకమ్మ; పేజీలు: 416 (హార్డ్ బౌండ్); వెల: 150; ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్, ఏలూరు రోడ్డు, విజయవాడ-2. ఫోన్: 0866-2431181

వరకవి భూమగౌడు



రచన: వేముల ప్రభాకర్; పేజీలు: 252; వెల: 200; ప్రతులకు: వేముల రోహిత్, ఫ్లాట్ నం.103, మనస్విని హోమ్స్, రోడ్ నం.6, ఆల్వాల్ హిల్స్, సికింద్రాబాద్–500010. ఫోన్: 7893819376

అలసంది పూసింది
(మొరసునాడు పాటలు–1)




సేకరణ: స.రఘునాథ; పేజీలు: 104; వెల: 80; ప్రతులకు: కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం, హోసూరు– 635109, కృష్ణగిరి జిల్లా, తమిళనాడు. సేకర్త ఫోన్: 9980593921

వర్ణం నుండి కులం దాకా
(యలవర్తి నవీన్‌బాబు స్మృతిలో)



ఇంగ్లిష్ మూల సంపాదకులు: బచ్చు రమేశ్ బాబు; తెలుగు: ఎన్.రవి; పేజీలు: 172; వెల: 100; ప్రచురణ: చేంజ్ పబ్లికేషన్స్, హైదరాబాద్. ప్రతులకు: ప్రముఖ పుస్తక షాపులు.



ఇప్పట్లో కుక్కలకు ఎవరు భయపడుతున్నారండి?
కవి ఉన్నాను జాగ్రత్త!
అని వ్రాయించమంటే విన్నారు కాదు!

పదం పలికింది - పాట నిలిచింది

చిరుగాలి తరగలా చిన్నారి పడవలా



సినిమా పాటకు ఒక గౌరవప్రదమైన స్థాయిని కల్పించిన కవుల్లో మేటి, దేవులపల్లి కృష్ణశాస్త్రి. 1951లో విడుదలై, మునుముందు ఆణిముత్యంగా నిలువబోయే 'మల్లీశ్వరి' చిత్రం కోసం కృష్ణశాస్త్రే అన్ని పాటలూ రాయాలని కోరుకున్నారు దర్శకుడు బి.ఎన్.రెడ్డి. నిదానంగానే అయినా 'ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు', 'మనసున మల్లెల మాలలూగెనే' లాంటి గొప్ప పాటలు రాశారు దేవులపల్లి.

అందులోని, 'ఎందుకే నీకింత తొందర/ ఇన్నాళ్ల చెరసాల ఈ రేయి తీరునే' పాటలోని చివరి పాదాలైన ***'చిరుగాలి తరగలా చిన్నారి పడవలా/ పసరు రెక్కలు పరచి పరువెత్తి పోదాము'*** గొప్ప ఊహాశాలీనతకు నిదర్శనం. సాలూరి రాజేశ్వరరావు సంగీతం సమకూర్చిన ఈ గీతాన్ని చిత్ర నాయిక భానుమతే పాడారు. తెరపై భానుమతితో పాటు టి.జి.కమలాదేవి కూడా కనిపిస్తారు.

రారండోయ్

- అజో–విభో–కందాళం రజతోత్సవ వేడుకలు జనవరి 1–7 వరకు గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరగనున్నాయి.
- వారాల ఆనంద్ 'తెలంగాణ సినిమా దశ దిశ'ను జనవరి 5న కేటీఆర్ తెలంగాణ సెక్రటేరియట్‌లో ఆవిష్కరించనున్నారు.
- కొలకలూరి భాగీరథి పురస్కారానికిగానూ 2015–17 మధ్య వచ్చిన పద్య, గేయ, వచన కావ్యాలను జనవరి 18లోగా పంపాలని కొలకలూరి మధుజ్యోతి కోరుతున్నారు. వివరాలకు: 9441923172
- కొలకలూరి విశ్రాంతమ్మ పురస్కారానికిగానూ 2015–17 మధ్య వచ్చిన నాటక, నాటిక సంపుటులను జనవరి 18లోగా పంపాలని కొలకలూరి సుమకిరణ్ కోరుతున్నారు. వివరాలకు: 9963564664

గ్రహం అనుగ్రహం

శ్రీ హేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం. తిథి శు.చతుర్దశి ఉ.11.22 వరకు, తదుపరి పౌర్ణమి. నక్షత్రం మృగశిర ప.3.12 వరకు, తదుపరి ఆరుద్ర. వర్జ్యం రా.11.01 నుంచి 12.30 వరకు. దుర్ముహూర్తం ప.12.23 నుంచి 1.07 వరకు, తదుపరి ప.2.35 నుంచి 3.20 వరకు. అమృత ఘడియలు ఉ.7.01 నుంచి 8.29 వరకు.

సూర్యోదయం	6.34
సూర్యాస్తమయం	5.32
రాహుకాలం	ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం	ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు

ఫజర్	5.29
జొహర్	12.20
అసర్	4.17
మగ్రీబ్	5.53
ఇషా	7.10

ఆధార్ ఉంటేనే ఎరువులు!

నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా అమలు..

- ఏర్పాట్లు పూర్తి చేసిన వ్యవసాయ శాఖ
- ప్రైవేటు ఎరువుల దుకాణాలకు 6,641 పీవోఎస్ యంత్రాలు
- ఎరువుల సబ్సిడీ దుర్వినియోగం కాకుండా ఉండేందుకే..
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: రైతులు ఎరువులు కొనాలంటే ఇకపై ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాల్సిందే. ఇందుకోసం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఎరువుల దుకాణాలకు 6,641 పాయింట్ ఆపరేటింగ్ సేల్ (పీవోఎస్) యంత్రాలను సరఫరా చేసింది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వ్యవసాయ శాఖ కార్యదర్శి సి.పార్థసారథి 'సాక్షి'కి తెలిపారు. దీనిపై కలెక్టర్లకు లేఖలు రాసినట్లు వెల్లడించారు. రైతులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకురాకుంటే ఎరువులు విక్రయించకూడదని ఇటీవల కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని ఎరువుల దుకాణాలకు ఆదేశాలు అందాయి. అమలు ప్రక్రియపై ఇప్పటికే ట్రయల్ రన్ నిర్వహించారు. సాంకేతికంగా ఇబ్బందులు ఉన్న చోట చక్కదిద్దారు. కొన్నిచోట్ల పీవోఎస్ యంత్రాలు పని చేయకపోతే కొత్త వాటిని అందజేశారు.

సబ్సిడీ పక్కదారి పట్టకూడదనే

యూరియా, డీఏపీ తదితర ఎరువులను కంపెనీలు సబ్సిడీ ధరలకే రైతులకు అందుబాటులోకి తెస్తుంటాయి. తాజా నిర్ణయంతో సబ్సిడీ ఎరువులు రైతులకు కాకుండా మిక్సింగ్ ప్లాంట్లు, ఇతర అవసరాలకు వెళ్లకుండా అడ్డుకోవ చ్చు. పీవోఎస్ పద్ధతి ద్వారా నేరుగా లబ్ధి చేకూర్చే బదిలీ (డీబీటీ) విధానాన్ని అమలు చేయాలనేది కేంద్రం లక్ష్యం. పీవోఎస్ యంత్రాలను తీసు కోకున్నా, ఈ పద్ధతిని అమలు చేయకున్నా సంబంధిత ఎరువుల దుకాణాల లైసెన్సులు రద్దు చేయాలని కూడా సర్కారు స్పష్టం చేసింది. ఈ విధానం ఇప్పటికే అమలు కావాల్సి ఉండగా సరిపడా పీవోఎస్ యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో వాయిదా వేశారు. ఎట్టకేలకు నూతన సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు.

డబ్బులే చెల్లించాలి..

డీబీటీ విధానంలో ఎరువులు కొనుగోలు చేయాలంటే రైతు ఆధార్ కార్డు తీసుకురావాలి. అయితే ప్రస్తుతానికి డెబిట్ కార్డును ఉపయోగించే పద్ధతిని ప్రవేశపెట్టలేదు. కాబట్టి రైతులు డబ్బులు చెల్లించే ఎరువులు కొనుగోలు చేస్తారు. మున్ముందు డెబిట్ కార్డు ద్వారానే లావాదేవీలు జరిపేలా పీవోఎస్ యంత్రాలను తీర్చిదిద్దుతారు. వాటిలో డెబిట్ కార్డును ఉపయోగించేలా సాఫ్ట్‌వేర్‌ను ప్రస్తుతం ప్రవేశపెట్టడం లేదు. రైతులు పూర్తిస్థాయిలో డెబిట్ కార్డు లేదా రూపే కార్డు కలిగి ఉన్నట్లు నిర్ధారించుకున్నాక పీవోఎస్ యంత్రాల్లో సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరిస్తామని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి. అలాగే రైతులకు ఒక గుర్తింపు నంబర్ కూడా ఇస్తారు. ఈ వివరాలు పీవోఎస్ యంత్రాల్లో నిక్షిప్తమై ఎరువుల కొనుగోలు లావాదేవీలు నమోదవుతాయి. లావాదేవీల సమాచారాన్ని కేంద్రానికి సమర్పిస్తే సదరు సబ్సిడీని కంపెనీలకు చెల్లిస్తారు. ఈ విధానంలో సబ్సిడీ చెల్లింపు వ్యవహారం ప్రభుత్వం, కంపెనీల మధ్యనే ఉన్నందున రైతుకు అదనపు ఆర్థిక భారం ఉండబోదని వ్యవసాయ వర్గాలు చెబుతున్నాయి.

టీఈటీజీవోఏ 2018 డైరీ ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెనింగ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీఈటీజీవోఏ) 2018 డైరీని టీజీవో చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఈటీజీవోఏ నేతలు అరుణ్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు.

'ముస్లిం మహిళలకు సామాజిక న్యాయం'



సాక్షి, హైదరాబాద్: ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం చారిత్రాత్మకమని..సామాజికన్యాయం, సమానత్వం కోసం ముస్లిం మహిళలు చేస్తున్న పోరాటాలు ఈ బిల్లుతో ముగిశాయని కేంద్ర మాజీమంత్రి, ఎంపీ బండారు దత్తాత్రేయ చెప్పారు. ఎంఐఎం అధినేత ఒవైసీ దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ..అందరికీ సమన్యాయం కోసమే చట్టాలు కఠినతరం చేశామన్నారు. రాజకీయపార్టీలన్నీ ముస్లింలను ఓటుబ్యాంకుగానే చూశాయని.. అదే పొరపాటును కొనసాగించకూడదనే కాంగ్రెస్ కూడా ట్రిపుల్ తలాక్ చట్టానికి మద్దతు ఇచ్చిందన్నారు. 2018 బీజేపీకి ఉద్యమాల సంవత్సరమని, పోరాటాలతో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, రీడిజైన్లు, భూసేకరణ వంటివాటిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ పోలీసులకు పతకాలు

నలుగురికి తెలంగాణ స్టేట్ ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీసు అవార్డు

సాక్షి, హైదరాబాద్: నూతన ఏడాదిని పురస్కరించుకొని పోలీసు, అగ్నిమాపక, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, విజిలెన్స్, ఏసీబీ విభాగాల్లో ఉత్తమ సేవలందించిన పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం పలు అవార్డులను ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదివారం జీవోను విడుదల చేసింది. ప్రతిష్టాత్మకంగా భావించే తెలంగాణ స్టేట్ ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీసు పతకం నలుగురిని వరించింది. ఈ అవార్డును టీఎస్ఎస్పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ యారబట్టి శ్రీనివాసరావు, టీఎస్ ఐఎస్‌డబ్ల్యూ డీఎస్పీ కిరణ్ రాయ్, అఫ్జల్‌గంజ్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మాది ప్రవీణ్ కుమార్, శంషాబాద్ సెంట్రల్ క్రైం స్టేషన్ ఎస్ఐ కొక్కాడ బాలరాజు దక్కించుకున్నారు. పోలీసు, అగ్నిమాపక శాఖ విభాగాల్లో 11 మందికి శౌర్య పతకం, ఇద్దరికి మహోన్నత సేవా పతకం, 37 మందికి ఉత్తమ సేవా పతకం, 21 మందికి కఠిన సేవా పతకం, 165 మందికి సేవా పతకం దక్కాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ విభాగంలో ఒకరికి మహోన్నత సేవా పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా పతకం, 15 మందికి సేవా పతకాలు వరించాయి. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ విభాగంలో ఆరుగురికి శౌర్య పతకం, ఒకరికి ఉత్తమ సేవా పతకం, 14 మందికి సేవా పతకం, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఇద్దరికి సేవా పతకాలు దక్కాయి. ఏసీబీలో ముగ్గురికి ఉత్తమ సేవా పతకం, 12 మందికి సేవా పతకాలు వచ్చాయి.


అనగనగా ఓ అడవి..

అక్కడో డౌటు??

అది కాకులు దూరని కారడవి కాదు గాని.. ఓ చిట్టడివి.. ఏడాదికి చివరి రోజు కావడంతో అడవికి రాజు అయిన సింహం.. న్యూ ఇయర్ పార్టీ ఏర్పాటు చేసింది. రాజుగారు పెట్టిన పార్టీ కదా.. దీంతో చిన్నాచితకా నుంచి భారీ జంతువుల దాకా అన్నీ హాజరయ్యాయి. పార్టీ సాగుతోంది.. నెమళ్లు నాట్యం చేస్తున్నాయి.. కోయిలలు పాడుతున్నాయి.. కోతులు కామెడీ చేస్తున్నాయి.. పార్టీ అన్నాక సాఫీగా సాగితే ఇంక మజా ఏముంది.. అసలే నక్కబావ.. ఫిటింగ్‌లు పెట్టడంలో ఫేమసు.. మృగరాజు మిగతా జంతువులతో ముచ్చట్లాడుతుంటే.. మధ్యలో దూరింది. టాపిక్‌ను మనుషుల మీదకు మళ్లించింది.. మహరాజా.. మహరాజా.. మనలో ఎవర్ని చూస్తే.. మనుషులు భయపడి చస్తారు అని డౌట్ లేవనెత్తింది.. ఇంకెవరు నేనే.. అంటూ సింహం గర్జించింది. అదేంటి.. ఆ పెద్ద పులి ఏమో తాను అని అంటోంది అని ఫిటింగ్ పెట్టేసింది.. ఇంకేం.. ఈ చర్చ పార్టీ అం తటా మొదలైంది.. సింహం ముందు బయటకి అనకున్నా.. ప్రపంచంలో అత్యంత ప్రమా దకర జంతువు తామంటే తామే అని ఏనుగులు, పాములు, మొసళ్లు ఇలా చాలా జంతువులు తమలో తాము అనుకున్నాయి. అయితే.. బొద్దింకలు మాత్రం.. తమ భర్తలను సైతం గడగడలాడించే అతివలు మమ్మల్ని చూస్తే.. గడగడలాడుతారు తెలుసా? అని పైకి కాస్త గట్టిగానే అన్నాయి. దీంతో అసలు ప్రపంచంలో అత్యంత ప్రమాదకర జంతువు ఏది? అని తేల్చాలని అవన్నీ అనుకున్నాయి. ఇందుకోసం సర్వే చేయించాలని నిర్ణయించాయి. సర్వేకు ప్రాతిపదికగా వాటి వల్ల ఏటా ఎంతమంది మానవులు మరణించారు అన్నది తీసుకోవాలని తీర్మానం చేశాయి. సర్వే ఫలితాలు వచ్చేశాయి.. ఇంతకీ ప్రపంచంలో మానవుల ప్రాణాలు తోడేస్తున్న ఆ ప్రమాదకర జంతువు ఏమిటో తెలుసా? సింహమూ కాదూ.. పులీ కాదూ.. పాము కానే కాదు.. దోమ.. అవును దోమే.. మన పక్కనే ఉంటూ.. మనింట్లోనే తిరుగుతూ.. రకరకాల వ్యాధులతో మన ప్రాణాలను హరిస్తున్న దోమే!

– సాక్షి, తెలంగాణ డెస్క్





ఏడాదంతా జనంలోనే సీఎం

ఎన్నికల సమరానికి ఇప్పటినుంచే కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికార టీఆర్‌ఎస్ వేగంగా పావులు కదుపుతోంది. పార్టీని సంస్థాగతంగా చక్కదిద్దుకుని ఎన్నికల సమరానికి సంసిద్ధమయ్యేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఎన్నికలకు ఏడాదిన్నరే ఉన్న నేపథ్యంలో పార్టీ అధినేత, సీఎం కేసీఆర్.. ఓ వైపు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెడుతూనే మరోవైపు పార్టీ కేడర్‌లో వేడిపెంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా భావిస్తున్న సాగునీటి ప్రాజెక్టుల పనులతోపాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేశారు. ఆయా కార్యక్రమాలపై ప్రగతి భవన్ నుంచి నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ త్వరితగతిన పనులు పూర్తి చేయాలంటూ అధికారులు, మంత్రులను పురమాయిస్తున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు 2018 ఏడాది సొంతం జిల్లాల్లో పర్యటించేందుకు కార్యాచరణ ఖరారు చేసే పనిలో కేసీఆర్ నిమగ్నమై ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా..

ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రగతి భవన్ దాటి ప్రజల్లోకి రావాలని సీఎం నిర్ణయించుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2018 నుంచి జిల్లాల వారీగా నియోజకవర్గాల్లో పర్యటించాలని ఆయన నిర్ణయం తీసుకున్నారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు, వచ్చే ఎన్నికలకు సిద్ధం చేసేందుకు కేసీఆర్ ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర కమిటీ, పార్టీ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేసి బాధ్యతలు అప్పజెప్పారు. ఎమ్మెల్యేలు, ఎంపీల పనితీరుపై ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుంటూ ఓ అంచనాకు



వచ్చారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని జిల్లాల్లో పర్యటించాల్సిన అవసరాన్ని గుర్తించారని అంటున్నారు.

సమీక్షలు.. సూచనలు..

ప్రతి నెలా రెండు జిల్లాలు (పాత) చొప్పున కేసీఆర్ పర్యటనలు జరుపుతారని సమాచారం. ఇందులో భాగంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో నేరుగా ముచ్చటించేందుకు ముఖాముఖి కార్యక్రమాలూ ఏర్పాటు చేయనున్నారని తెలిసింది. అలాగే పార్టీ సంస్థాగత వ్యవహారాలపై సమీక్షలు జరుపుతారని, సూచనలిస్తారని, నాయకుల మధ్య గ్రూపు గొడవలను పరిష్కరించి ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేసేలా కేడర్‌కు మార్గదర్శనం చేస్తారని పార్టీ నేతలు పేర్కొంటున్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సమయం మినహా పూర్తిగా జిల్లా పర్యటనలపై సీఎం దృష్టి సారించనున్నారని, పార్టీ పరిస్థితి ఆధారంగా పర్యటన జరిపే నియోజకవర్గాల ఎంపిక ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే వివిధ సర్వేల ద్వారా సేకరించిన సమాచారం మేరకు ఏ నియోజకవర్గాలపై ఎక్కువ దృష్టి పెట్టాలో, ఎక్కడెక్కడ పర్యటించాలో సీఎం ఓ అంచనాకు వచ్చినట్లు తెలిసింది.

ప్రగతి భవన్‌లో పాక్షికమే..

ప్రగతి భవన్ వేదికగా వివిధ వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి కలిసే ప్రయత్నం చేసినా పాక్షికంగానే జరిగింది. ఖరీఫ్ సీజన్ నుంచి రైతులకు 2 పంటలకు రూ. 8,000 చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కొందరు రైతులు సీఎంను ప్రగతి భవన్‌లో కలసి వెళ్లారు. అలాగే 'చేప పిల్లల పంపిణీ'పై నిర్ణయం తీసుకున్నాక మత్స్యకారులు, గొర్రెల పంపిణీ పథకం అమలు తర్వాత యాదవులు.. ఇలా పలు వర్గాలు సీఎంను కలిశాయి. ఈ నేపథ్యంలో 2018లో అన్ని రకాల పథకాల లబ్ధిదారులను కలసి పార్టీ పనితీరును మరింతగా ప్రజల్లోకి సీఎం తీసుకెళ్లేందుకు ప్రణాళిక రచిస్తున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అలాగే కార్యకర్తల సమావేశాల్లో పార్టీ వ్యవహారాలను సమీక్షించి చక్కదిద్దుతారని పేర్కొంటున్నాయి. మొత్తంగా వచ్చే ఏడాది పూర్తిగా ఈ పనిలోనే సీఎం నిమగ్నమై ఉంటారని చెబుతున్నాయి.

పరీక్షల్లో నెగ్గి.. విధి చేతిలో ఓడి...

ఇది ఓ యువకుడి విషాదగాథ • గ్రూప్–2 ఇంటర్వ్యూకు అర్హత సాధించాడు..

మిర్యాలగూడ అర్బన్:

గ్రూప్–2 పరీక్షలో అర్హత సాధించిన ఆ యువకుడు.. జీవితంలో ఓడిపోయాడు. నమ్మి వచ్చే యువతిని మోసం చేయలేక.. నిజాన్ని చెప్పలేక మరణశాసనం లిఖించుకున్నాడు. ఉన్నత ఉద్యోగం.. కోరుకున్న యువతితో వివాహం.. ఇక జీవితం ఆనందమయం అనుకుంటున్న తరుణంలో అనారోగ్యం రూపంలో మృత్యువు కబళిస్తుండటంతో తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద సంఘటన ఆదివారం జరిగింది. సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువు మండల కేంద్రానికి చెందిన మోడం బస్వీర్‌రెడ్డి, వరమ్మలకు ముగ్గురు కుమారులు. చిన్నవాడైన మోడం శ్రీనివాస్‌రెడ్డి(30) గ్రూప్–2 పరీక్షలో అర్హత సాధించాడు. ఇంటర్వ్యూ కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాడు. ఉద్యోగం వస్తుందన్న ధీమాతో పెద్దలు గరిడేపల్లి మండలం పరేడ్డిగూడేనికి చెందిన యువతితో వివాహం చేయాలని నిర్ణయించారు. ఫిబ్రవరిలో వీరి వివాహం చేయాలని ఆలోచనలో పెద్దలున్నారు.


- ఇష్టపడిన యువతితో వివాహం కుదిరింది..
- అంతలోనే పెద్ద పేగుకు కేన్సర్
- సూసైడ్ నోట్ రాసి బలవన్మరణం

ఇక.. కొద్దిరోజులేనని..

శ్రీనివాస్‌రెడ్డి ఏడాదిగా (పెద్ద పేగుకు కేన్సర్) ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల సమస్య పెరగటంతో డాక్టర్ దగ్గరకు వెళ్లాడు. వైద్య పరీక్షలు నిర్వహించగా, రెండు రోజుల క్రితమే రిపోర్టులు వచ్చాయి. వాటిలో కేన్సర్ ముదిరిపోయిందని.. ఆపరేషన్ చేస్తే ప్రమాదమని డాక్టర్లు చెప్పారు. ఎక్కువ కాలం బతకటం కష్టమని వివరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీనివాస్‌రెడ్డి రెండు రోజులుగా సెల్ స్విచ్ ఆఫ్ చేసుకొని కుమిలిపోయాడు.



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)



సూసైడ్‌నోట్

ఇష్టపడిన యువతికి చెప్పలేక..

తాను ఇష్టపడిన యువతితోనే పెద్దలు వివాహానికి ఏర్పాట్లు చేస్తుండటం.. వారికి విషయాన్ని ఎలా చెప్పాలో శ్రీనివాస్‌రెడ్డికి అర్థం కాలేదు. నమ్మి వచ్చే యువతిని మోసం చేయలేక.. మృత్యువు కబళించబోతోందన్న నిజాన్ని చెప్పలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రెండు పేజీల సూసైడ్ నోట్ రాసి స్వగ్రామం నుంచి మిర్యాలగూడకు చేరుకున్న శ్రీనివాస్‌రెడ్డి గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

దళితుల మధ్య చిచ్చు అగ్రవర్ణాల కుట్ర

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితుల మధ్య చిచ్చు పెడుతున్న అగ్రవర్ణ నాయకులు కిషన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పెద్దిరెడ్డి, టీఆర్‌ఎస్ పార్టీలోని రెడ్డి నాయకులు జాగ్రత్తగా ఉండాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. బంజారాహిల్స్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాల మాదిగల మధ్య, లంబాడి, ఆదివాసీల మధ్య జరిగే ఘర్షణలు అగ్రవర్ణాల కుట్రలో భాగమేనన్నారు. దళితులందరూ ఈ కుట్రను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు, జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ బీజేపీ వర్గీకరణ వీలు కాదని చెప్పినా రాష్ట్రంలోని వివిధ పార్టీల నాయకులు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేయడం వెనుక కుట్ర జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వీరందరినీ ఓడిస్తామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ పై ఎందుకీ కక్ష సాధింపు?

సీఎం కేసీఆర్‌కు మంద కృష్ణమాదిగ ప్రశ్న



హైదరాబాద్: 'ఎమ్మార్పీఎస్ సభలకు మాదిగ ఎమ్మెల్యేలను, ఎంపీలను హాజరు కానివ్వరు. అరెస్టులు చేస్తారు. బెయిల్ కూడా లభించని కేసులు పెట్టి జైలుకు తరలిస్తారు. కానీ, ఇతర కులాల సభలకు సహకరించడంతోపాటు ప్రజాప్రతినిధులను, టీఆర్‌ఎస్ శ్రేణులను పంపిస్తారు. ఎమ్మార్పీఎస్, మాదిగల పట్ల సీఎం కేసీఆర్ ఎందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు?' అని ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌పై తమకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని అన్నారు. తెలంగాణ ఉద్యమసమయంలో మిలియన్ మార్చ్, ఇతర ఆందోళన కార్యక్రమాల్లో విధ్వంసాలు జరిగాయి. కేసీఆర్, ప్రొ.కోదండరాంపై అనేక కేసులు నమోదయ్యాయి. అయినా, అప్పటి ముఖ్యమంత్రులెవరూ వారిని అరెస్ట్ చేసి జైలులో పెట్టలేదు కదా' అని గుర్తుచేశారు. కేవలం ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నీరుకార్చేందుకే కేసీఆర్ కుట్రలు పన్ని మంత్రి కడియం శ్రీహరితో ప్రకటనలు ఇప్పిస్తున్నారని మందకృష్ణ విమర్శించారు. 'ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు టీఆర్‌ఎస్, సీఎం మద్దతు తెలిపితే ఢిల్లీలోనే దీక్షలు చేస్తాం. అందుకు మరో 24 గంటల సమయం ఇస్తున్నామని మంత్రి కడియం శ్రీహరికి తెలిపాం.'అని స్పష్టం చేశారు. ఢిల్లీలో జరిగే దీక్షకు టీఆర్‌ఎస్ మద్దతు ఇవ్వకుంటే హైదరాబాద్‌లోనే దీక్షలు చేపడతామని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాగటి సత్యం, డాక్టర్ కాశీం, ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్, రాష్ట్ర కోఆర్డినేటర్ పురుషోత్తం, ఓయూ ఇన్‌చార్జి పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాతికేళ్లకే అసెంబ్లీపై దాడి చేశా

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్య



హైదరాబాద్: బీసీలకు హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకోసం తాను పాతికేళ్ల వయసులో రెండు వేల మంది విద్యార్థులతో అసెంబ్లీపై దాడి చేశానని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, టీటీడీపీ ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య గుర్తు చేశారు. దాడి సమయంలో సభలో ఎమ్మెల్యేలంతా ఓ మూలన దాక్కున్నారని తెలిపారు. ఆ దాడి వల్లే బీసీ విద్యార్థులకు ప్రభుత్వం హాస్టళ్లను పెంచి, రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. దేశోద్ధారక భవన్‌లో ఆదివారం జరిగిన గ్రేటర్ హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్‌లలో బీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడుగుజ్జ కృష్ణ, రాష్ట్ర కార్యదర్శి నంద గోపాల్, గ్రేటర్ అధ్యక్షుడు భూపేశ్ సాగర్, కళామండలి అధ్యక్షులు రామలింగం, కోట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈనెల 8న విజయవాడలో బీసీ విద్యుత్ ఉద్యోగుల మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు పోలంకి శ్రీనివాసరావు కాపు రిజర్వేషన్ ఉద్యమంలో పాల్గొంటున్నందున ఆయనను సంఘం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం తాత్కాలిక కమిటీని ఆయన నియమించారు. అధ్యక్షుడిగా వీరభద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా గణేశ్, ఎస్‌పీడీసీఎల్ నుంచి అధ్యక్షుడిగా జి.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీధర్, ట్రాన్స్‌కో నుంచి అధ్యక్షుడు జి.రాంబాబు, కార్యదర్శిగా సుబ్బారావు నియమితులయ్యారు.

513 పీజీటీ ఫలితాల విడుదల

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లో ఖాళీగా ఉన్న 513 పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్ (పీజీటీ) పోస్టుల భర్తీలో భాగంగా పీజీటీ మ్యాథమెటిక్స్, బయోలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీఎస్‌పీఎస్సీ ఆదివారం ప్రకటించింది. 126 పీజీటీ మ్యాథమెటిక్స్ పోస్టులకుగాను 114 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేయగా మిగతా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల మెడికల్ రిపోర్టులు అందాక ఫలితాలు ప్రకటిస్తామని టీఎస్‌పీఎస్సీ పేర్కొంది. అలాగే 22 బయోలాజికల్ సైన్స్ పోస్టులకుగాను 21 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. 177 పీజీటీ సోషల్ స్టడీస్ పోస్టుల్లో 166 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. మిగతా పోస్టుల్లో వికలాంగులకు సంబంధించిన మెడికల్ రిపోర్టులు వచ్చాక ఫలితాలు ప్రకటించనుంది. 188 ఫిజికల్ సైన్స్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా 174 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. ఇటీవల పీజీటీ లాంగ్వేజెస్ పోస్టులకు ఎంపిక చేసిన అభ్యర్థులతోపాటు తాజా ఎంపిక జాబితాను కలుపుకొని మొత్తం గా 921 పోస్టుల ఫలితాలను ప్రకటించింది.

ఫారెస్టు కాలేజీ పోస్టుల ఫలితాలు విడుదల

ఫారెస్టు కాలేజీ, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. మొత్తం 19 పోస్టులకుగాను (2 ప్రొఫెసర్ పోస్టులకు ఒకే దరఖాస్తు రాగా, 4 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులే రాలేదు) 12 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టగా 11 పోస్టులకే దరఖాస్తులు వచ్చాయి. అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో వాటిలో 7 పోస్టులే భర్తీ అయ్యాయి. లైబ్రేరియన్ పోస్టుకు జనవరి 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ పేర్కొంది.

రిజర్వేషన్లు ఇవ్వకపోతే

ఓట్లు అడగను అనగలరా..?



ముస్లిం రిజర్వేషన్లపై కేసీఆర్‌కు ఉత్తమ్ సవాల్

సాక్షి, హైదరాబాద్: ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయకుంటే ఓట్లు అడగను అని ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చెప్పగలరా అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి సవాల్ చేశారు. ముస్లింలకు 4 నెలల్లో 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి ఓట్లు పొందిన కేసీఆర్.. 44 నెలలవుతున్నా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నా రని దుయ్యబట్టారు. దూరదర్శన్ రిటైర్డ్ జేడీ షుజత్ అలీ నేతృత్వంలో వివిధ వర్గాల విద్యావంతులు, మేధావులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దాసోజు శ్రవణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై, టీఆర్‌ఎస్ పాలన పై అన్ని వర్గాల ప్రజలకు భ్రమలు తొలగిపోయాయని, ఈ చేరికలే దీనికి నిదర్శనమన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీఆర్‌ఎస్ ప్రజా వ్యతిరేకపాలన కొనసాగిస్తున్నాయని.. మత సామరస్యం దెబ్బతీసేలా బీజేపీ, ముస్లింలకు రిజర్వేషన్లు అంటూ టీఆర్‌ఎస్ మోసం చేస్తున్నాయని విమర్శించారు.

'ఆసరా' ఆపడమే కొత్త ఏడాది కానుక

మండలిలో ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ



సాక్షి, హైదరాబాద్: ఆసరా పింఛన్లు ఆపడమే సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చే కొత్త ఏడాది కానుక అని శాసన మండలిలో ప్రతిపక్షనేత షబ్బీర్ అలీ విమర్శించారు. ఎన్నికల్లో 121 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ ఒక్క ఆసరా పింఛన్లనే సక్రమంగా అమలు చేసిందన్నారు. గత మూడు నెలలుగా నిలిపివేసిన ఆసరా పింఛన్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 121 హామీల్లో ముఖ్యమైన 43 హామీల గురించి సీఎం కేసీఆర్‌కు త్వరలోనే లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

అక్కడ డ్రాగన్ ఫ్రూట్.. ఇక్కడ గులాబీ పండు



నామకరణం చేసిన ఉద్యాన శాఖ

- రాష్ట్రంలో సాగును ప్రోత్సహించేందుకు నిర్ణయం
- తొలుత ఎకరానికి రూ. 4–6 లక్షల వరకు ఖర్చు
- తర్వాత ఏటా రూ. 25–30 వేలు నిర్వహణకు..
- ఒకసారి నాటితే 25–30 ఏళ్లపాటు పండ్లు
- టన్నుకు రూ.లక్షన్నర వరకు ఆదాయం
- ఇప్పటికే సాగు చేస్తున్న మంత్రి తలసాని



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 'గులాబీ పండు'పేరుతో కొత్తరకం పంటను ప్రోత్సహించాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. చైనాలో డ్రాగన్ ఫ్రూట్, యూఎస్‌లో అమెరికన్ బ్యూటీ పేర్లతో సాగు చేస్తున్న పండును నూతన సంవత్సరం సందర్భంగా రైతులకు పరిచయం చేయాలని నిర్ణయం తీసుకుంది. డ్రాగన్ ఫ్రూట్‌కు 'గులాబీ పండు అమృత రాజఫలం'గా నామకరణం చేశామని, మొక్కలను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నామని ఉద్యాన డైరెక్టర్ ఎల్.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లా శామీర్‌పేట మండలం కొల్తూరు గ్రామంలో 15 ఎకరాల్లో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ గులాబీ పండును సాగు చేస్తున్నారని చెప్పారు. మిర్యాలగూడ సమీపంలో రైతు రవి కూడా 15 ఎకరాల్లో పండించి తొలిసారి మార్కెట్లోకి పండ్లను తీసుకొచ్చారన్నారు. భువనేశ్వర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్, మిజోరంలోని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్‌లోనూ మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గతంలో బేర్ యాపిల్‌ను తెలంగాణ యాపిల్‌గా నామకరణం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెంకట్రామిరెడ్డి చెప్పారు.

30 ఏళ్లు పండ్లే పండ్లు..

'డ్రాగన్ ఫ్రూట్ తెలుపు, గులాబీ రంగుల్లో లభిస్తుంది. ఈశాన్య రాష్ట్రాలు, గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటకలో ఇప్పుడిప్పుడే పండిస్తున్నారు. తీగజాతికి చెందిన ఈ పండు డయాబెటిక్, బీపీ రోగులకు ఎంతో ఊరటనిస్తుంది. క్యాన్సర్‌పై పోరాడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది'అని వెంకట్రామిరెడ్డి తెలిపారు. పౌడర్‌గా తయారుచేసుకొని ఫ్లేవర్‌గా ఉపయోగించుకోవచ్చని, సలాడ్ రూపంలోనూ తీసుకుంటారని, తెలంగాణ వంటి వర్షాభావ ప్రాంతాలకు అనువైనదని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్, నల్లగొండ, తక్కువ నీటి వనరులున్న ఇతర ప్రాంతాల్లోనూ సాగు చేయొచ్చని.. ఒక్కో చెట్టుకు రోజుకు 2 లీటర్ల నీరు సరిపోతుందని తెలిపారు. ఒకసారి మొక్క నాటితే 25 నుంచి 30 ఏళ్లపాటు పండ్లనిస్తుందని చెప్పారు.

ఏడాదికోసారి పంట

మొదట్లో ఎకరానికి 4 లక్షల నుంచి రూ. 6 లక్షల వరకు ఖర్చవుతుందని, తర్వాత ఏటా రూ. 25 నుంచి రూ. 30 వేలు నిర్వహణకు ఖర్చు చేయాలని వెంకట్రామిరెడ్డి చెప్పారు. డ్రాగన్ ఫ్రూట్స్ ఏడాదికోసారి పండుతాయని, తొలి ఏడు ఎకరానికి టన్ను పంట పండుతుందని, లక్షన్నర వస్తుందన్నారు. రెండో ఏడాది 2 టన్నులు 3 లక్షలు, మూడో ఏడాది 3 టన్నులు 4.5 లక్షలు, నాలుగో ఏడాది 4 టన్నులు 6 లక్షలు, ఐదో ఏడాది 5 టన్నులు 7.5 లక్షలు, ఆరో ఏడాది 6 టన్నులు 9 లక్షలు ఆదాయం వస్తుందన్నారు. 25–30 ఏళ్ల వరకు 6 టన్నుల వరకు పండ్లు పండుతాయని.. 9 లక్షల ఆదాయం వస్తుందన్నారు. వివరాలకు 83744–49091 ను సంప్రదించాలని కోరారు.

నిధుల కోసమే నుమాయిష్


1937లో ప్రజల ఆర్థిక స్థితిపై సర్వే నిధుల కోసం ఏర్పాటు

80 స్టాల్స్, రూ.2.5 లక్షలతో పబ్లిక్ గార్డెన్‌లో ప్రారంభం ➤ 1946లో పబ్లిక్ గార్డెన్స్ నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు మార్పు

దేశ స్వాతంత్ర్యం, హైదరాబాద్ విలీనంతో రెండేళ్లు నిలిచిపోయిన ఎగ్జిబిషన్ ➤ నేడు 2,500 స్టాల్స్, రూ.150 కోట్ల వాణిజ్యం

ప్రపంచంలోనే అతి పెద్ద ఎగ్జిబిషన్‌గా గుర్తింపు

నుమాయిష్.. దాదాపు 2,500 స్టాల్స్, వందల కోట్ల రూపాయల వ్యాపారం, 40 లక్షల మంది సందర్శకులతో ప్రపంచంలోనే అతిపెద్దదిగా పేరుపొందిన ఈవెంట్. నగరంలో ప్రతి యేటా జనవరి 1వ తేదీన ప్రారంభమై.. 45 రోజుల పాటు కొనసాగుతుంది. నిజాం సంస్థానంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవడానికి నిర్వహించే సర్వే కోసం సుమారు 80 స్టాల్స్‌తో రూ. 2.5 లక్షల ఖర్చుతో ఈ నుమాయిష్ ప్రారంభమైంది. నేడు నుమాయిష్ ప్రారంభమౌతున్న సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం... – సాక్షి, హైదరాబాద్



నుమాయిష్ ప్రారంభోత్సవంలో శాంతికి ప్రతీకగా పావురాలను ఎగరవేస్తున్న ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్



అప్పటి స్టాల్స్

పబ్లిక్ గార్డెన్స్ నుంచి నాంపల్లికి...

1946 వరకు పబ్లిక్ గార్డెన్స్‌లో నుమాయిష్ నిర్వహించారు. 10 రోజుల నుంచి 15 రోజుల వరకు పెంచారు. ప్రజాదరణ పెరిగి స్టాల్స్ పెరగడంతో పబ్లిక్ గార్డెన్స్‌లో స్థలం సమస్య వచ్చింది. దీంతో నాంపల్లిలోని విశాలమైన 32 ఎకరాల మైదానానికి మార్చాలని నిర్ణయించారు. ఈ ప్రదేశం నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఉంటే వివిధ ప్రదేశాల నుంచి వచ్చే పారిశ్రామికవేత్తలకూ అనువుగా ఉంటుందని భావించారు. అలా 1946లో హైదరాబాద్ ప్రధాని సర్ మీర్జా ఇస్మాయిల్ ఆదేశాల మేరకు నుమాయిష్‌ను పబ్లిక్ గార్డెన్ నుంచి నాంపల్లి మైదానాని(ఎగ్జిబిషన్ గ్రౌండ్)కి మార్చారు.

నుమాయిష్ ఎక్కడ ప్రారంభించారు..

అనుమతి లభించిన వెంటనే పట్టభద్రుల సంఘం.. వివిధ పనులపై కమిటీలు ఏర్పాటు చేశారు. పరిశ్రమలు, పెద్ద దుకాణాల నిర్వాహకులను సంప్రదించి నుమాయిష్ ఆవశ్యకత ను వివరించారు. ప్రజలకు అనువుగా ఉండే ప్రదేశం కోసం వెతికారు. చివరికి బాగే ఆమ్ (పబ్లిక్‌గార్డెన్)లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాక 1938, ఏప్రిల్ 6న ఉస్మాన్ అలీఖాన్ జన్మదినం సందర్భంగా ఆయన చేతుల మీదుగానే పబ్లిక్ గార్డెన్‌లో (నుమిష్-ఇ-మాస్నావత్-ఎ-ముల్కి)గా నుమాయిష్‌ను ప్రారంభించారు. తొలి ఏడాది 10 రోజుల పాటు నుమాయిష్ నిర్వహించారు.

ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్...



1949లో నాంపల్లిలో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి వచ్చిన అప్పటి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలచారి

1947లో దేశ స్వాతంత్ర్యం.. 1948లో హైదరాబాద్ సంస్థానం ఇండియన్ యూనియన్‌లో విలీనంతో ఈ రెండేళ్లు నుమాయిష్ ఏర్పాటు చేయలేదు. తిరిగి 1949లో నాంపల్లి మైదానంలోనే నాటి హైదరాబాద్ రాష్ట్ర గవర్నర్ జనరల్ సి. రాజగోపాల్ ప్రారంభించారు. అప్పుడు నుమాయిష్ పేరును ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌గా మార్చారు. అప్పటి నుంచి నేటికీ ప్రతి ఏటా ఎలాంటి అంతరాయం లేకుండా ఎగ్జిబిషన్ సాగుతోంది. ప్రపంచంలో ఎలాంటి విరామం లేకుండా 45 రోజుల పాటు జరిగే అతిపెద్ద ఈవెంట్ హైదరాబాద్ ఎగ్జిబిషన్. గతేడాది 40 లక్షల మంది సందర్శకులను ఆకర్షించింది. వాణిజ్యంలో రూ. 150 కోట్లు దాటింది. ఇందులో రూ. 10 నుంచి మొదలు కొని లక్షల రూపాయల విలువ చేసే వస్తువులు ఉంటాయి.

నుమాయిష్ ఐడియా ఎలా వచ్చింది...

హైదరాబాద్ సంస్థాన ప్రజల ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలని 1937లో నాటి ఉస్మానియా పట్టభద్రుల సంఘ సమావేశం తీర్మానించింది. అయితే సర్వే నిర్వహించడానికి నిధుల కొరత ఉండటంతో ఏదైనా కార్యక్రమం నిర్వహించి నిధులు సేకరించాలని సభ్యులు సలహా ఇచ్చారు. సంస్థానంలో తయారయ్యే వివిధ వస్తువుల ప్రదర్శన ఏర్పాటు చేస్తే పరిశ్రమల ద్వారానే కాకుండా సందర్శకుల నుంచి కూడా నిధులు వస్తాయని ఆలోచించి నుమాయిష్ (ప్రదర్శన)కు రూపకల్పన చేశారు.

అనుమతి లభించిందిలా...

1937లో ఉస్మానియా పట్టభద్రుల సంఘం నుమాయిష్ ఏర్పాటుకు ఓ నివేదిక రూపొందించి అప్పటి సంస్థాన ప్రధాన మంత్రి సర్ అక్బర్ హైదరీకి పంపించారు. ఆయన పూర్తిస్థాయిలో నివేదిక పరిశీలించి ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్‌కు పంపించారు. నివేదిక అందిన తరువాత ఉస్మాన్ అలీ ఖాన్ నుమాయిష్ నిర్వహణకు అనుమతి ఇచ్చారు.

సరైన సమయంలో పార్టీపై నిర్ణయం

టీజేఏసీ చైర్మన్ కోదండరాం



మంచిర్యాల క్రైం: పార్టీ ఏర్పాటుపై సరైన సమయంలో.. సరైన నిర్ణయం తీసుకుంటామని టీజేఏసీ చైర్మన్ కోదండరాం అన్నారు. ఆదివారం మంచిర్యాలలో రైతు జేఏసీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొందని, ఈ క్రమంలో పార్టీ ఏర్పాటుపై సుదీర్ఘ చర్చ జరుగుతోందని కోదండరాం చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతు ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని, రైతుల సమస్యలపై ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపుతోందని విమర్శించారు. రైతుల సమస్యలపై పోరాటం చేసేందుకే ప్రత్యేకంగా రైతు టీజేఏసీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసలు రాష్ట్రంలో ప్రజాసంక్షేమాన్ని కాపాడే పాలకులున్నారా.. లేక దోపిడీదొంగలున్నారా.. అనే అనుమానం కలుగుతోందని అన్నారు. లంబాడీ, ఆదివాసీల వివాదంలో ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తోందని విమర్శించారు.

వారసులొస్తున్నారు!

➤ మొదటి పేజీ తరువాయి

ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

గత ఎన్నికల్లో ఇలా..

రాష్ట్రంలో గత ఎన్నికల్లో ఒకే కుటుంబం నుంచి దాదాపు ఏడుగురు ముఖ్య నేతలు కాంగ్రెస్ టికెట్లను సాధించారు. అప్పుడు టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తన సతీమణి పద్మావతికి కోదాడ టికెట్‌ను సాధించుకోగలిగారు. అదే జిల్లాకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సోదరులు కూడా టికెట్ సాధించారు. మాజీ మంత్రులు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, రాంరెడ్డి వెంకటరెడ్డి, పార్టీ ముఖ్య నేతలు మల్లు రవి, మల్లు భట్టివిక్రమార్క, మాజీమంత్రి జి.వినోద్, జి.వివేక్ టికెట్లు పొందారు. వీరితోపాటు మాజీమంత్రి రెడ్యానాయక్, ఆయన కుమార్తె కవిత టికెట్లు సాధించారు. మాజీ మంత్రి డీకే అరుణ, ఆమె సోదరుడు రామ్మోహన్‌రెడ్డి టికెట్లు పొందారు. అయితే ఇప్పుడు వీరిలో చాలామంది కాంగ్రెస్‌ను వీడారు. మాజీ మంత్రి రాంరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్యేగా ఉంటూ మరణించారు. జి.వివేక్, జి.వినోద్ ఇద్దరూ టీఆర్ఎస్‌లో చేరిపోయారు. మాజీ మంత్రి రెడ్యానాయక్, ఆయన కుమార్తె కవిత టీఆర్ఎస్‌లో చేరారు. మాజీమంత్రి డి.కె.అరుణ కాంగ్రెస్‌లోనే ఉండగా ఆమె సోదరుడు రామ్మోహన్‌రెడ్డి మాత్రం టీఆర్ఎస్‌లో చేరారు. దీంతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌లో వారసుల టికెట్ల కోసం పోరాడే వారి జాబితా మారనుంది.

20 మందికిపైగా సిద్ధం

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. దాదాపు 20 మందికి పైగా కాంగ్రెస్ ముఖ్య నేతల వారసులు రాజకీయాల్లోకి రావడానికి సిద్ధమవుతున్నారు. పార్టీ బాధ్యతలు రాహుల్‌కు అప్పగించిన సోనియా రాజకీయాల నుంచి కూడా వైదొలుగుతున్నట్టు ఇటీవలే ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో ఆమె ఎంపీగానైనా పోటీ చేస్తారా? రాయ్‌బరేలిలో ఆమె కూతురు ప్రియాంక పోటీలో ఉంటారా అన్న దానిపై నేతలు ఆసక్తిగా ఉన్నారు. సోనియా లేదా ప్రియాంక ఎవరైనా పోటీ చేస్తే వారసులకు టికెట్లు ఇప్పించడం సులువు అవుతుందని సీనియర్లు భావిస్తున్నారు. అలా కాకుండా రాహుల్ ఒక్కరే పోటీలో ఉండి, ఆ కుటుంబం నుంచి ఎవరూ బరిలో లేకుంటే టికెట్లు ఇప్పించుకోవడం పెద్ద సమస్య అవుతుందని అంచనా వేస్తున్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న వారసుల జాబితా..

- కె.జానారెడ్డి కుమారుడు రఘువీర్‌రెడ్డి
- పొన్నాల లక్ష్మయ్య కోడలు వైశాలి
- సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి
- సర్వే సత్యనారాయణ అల్లుడు క్రిశాంక్
- జె.గీతారెడ్డి కూతురు మేఘనారెడ్డి
- రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కుమారుడు నరోత్తమ్‌రెడ్డి
- డీకే అరుణ కుమార్తె స్నిగ్ధ
- మర్రి శశిధర్‌రెడ్డి కుమారుడు మర్రి ఆదిత్యా రెడ్డి
- ఎం.అంజన్‌కుమార్ యాదవ్ కుమారుడు అనిల్‌కుమార్ యాదవ్

పీపుల్స్ ఫ్రెండ్లీ విధానం అమలు చేస్తాం

డీజీపీ మహేందర్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్/కామారెడ్డి: పీపుల్స్ ఫ్రెండ్లీ, పటిష్ట పోలీసింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తామని డీజీపీ మహేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం సిద్దిపేట, కామారెడ్డిల్లో ఆయన పర్యటించారు. సిద్దిపేట కమిషనరేట్ పరిధిలోని సీపీ, అడిషనల్ సీపీలు, ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్షించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బాగుండి.. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉన్నప్పుడే మరింత అభివృద్ధి సాధించవచ్చన్నారు. దీనిని గుర్తించిన సీఎం కేసీఆర్ పోలీసుశాఖకు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి పోలీసు వ్యవస్థ ఎంతో ప్రగతిని సాధించిందని అన్నారు. ఆపదలో ఉన్నప్పుడు ధనిక, బీద అనే తేడా లేకుండా సామాన్యుడు కూడా పోలీసు వ్యవస్థ తమ చెంత ఉందని సరిగ్గా స్పందిస్తారని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకుండా సహాయం చేస్తారన్న నమ్మకం కల్పిస్తామని వివరించారు. 2018 సంవత్సరాన్ని ఇందుకోసం పూర్తి స్థాయిలో వినియోగించుకుంటామన్నారు.

ఇక 5 నిమిషాల్లోనే కరెంట్!

అందుబాటులోకి రానున్న ఆటోమేటిక్ సరఫరా

- రూ.280 కోట్లతో డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ ప్రాజెక్టుకు రంగం సిద్ధం
- టెండర్లు ఆహ్వానించిన డిస్కంలు

సాక్షి, హైదరాబాద్

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా కోసం 'డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్' ప్రాజెక్టుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) శ్రీకారం చుట్టబోతోంది. దీంతో సాంకేతిక సమస్యలతో ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే.. రిమోట్ సాయంతో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా కేవలం 5 నిమిషాల్లోనే కరెంట్ ఆటోమేటిక్‌గా రానుంది. రాష్ట్రంలోని పారిశ్రామికవాడలు, పారిశ్రామిక పార్కులకు నిరంతర విద్యుత్ అందించేందుకు త్వరలో ఈ ప్రాజెక్టు చేపట్టబోతున్నారు. భవిష్యత్‌లో జీహెచ్ఎంసీతోపాటు అన్ని జిల్లా కేంద్రాలకు విస్తరింపజేయాలని టీఎస్ఎస్పీడీసీఎల్ భావిస్తోంది. జీహెచ్ఎంసీతోపాటు రంగారెడ్డి, మెదక్, నల్లగొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 28 పారిశ్రామిక ప్రాంతాలు, 94 పారిశ్రామిక వాడల్లో డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ ప్రాజెక్టు పనుల కోసం కాంట్రాక్టర్ల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ)ను ఆహ్వానిస్తూ సంస్థ యాజమాన్యం తాజాగా టెండర్లను



ఆహ్వానించింది. రూ.280 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి కానుంది. తర్వాత ఏడాదిలోపు ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి తెలిపారు.

రిమోట్ నొక్కితే కరెంట్

ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే విద్యుత్ సిబ్బంది క్షేత్ర స్థాయికి చేరుకుని సమస్యను గుర్తించి మరమ్మతులు జరిపి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ప్రస్తుతం గంటల సమయం పడుతోంది. ఇలా సిబ్బంది ద్వారా (మాన్యువల్‌గా) మరమ్మతులు చేసే వరకు వేచి చూడకుండా.. స్కాడా(సూపర్వైజరీ కంట్రోల్ అండ్ డాటా అక్విజిషన్) కార్యాలయం నుంచి రిమోట్ సాయంతో ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా వెంటనే కరెంట్ సరఫరాను పునరుద్ధరించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రత్యామ్నాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన తర్వాత సాంకేతిక సమస్య ఏర్పడిన ఫీడర్‌కు మరమ్మతులు చేయనున్నారు. ప్రైవేటు డిస్కంల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్న ఢిల్లీ, కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై నగరాల్లోనే మాత్రమే ప్రస్తుతం డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ సదుపాయం ఉంది. ప్రాజెక్టు పట్టాలెక్కితే ఐదో నగరంగా హైదరాబాద్ చరిత్రకెక్కబోతోంది. హైదరాబాద్(నార్త్), సైబరాబాద్, హబ్సిగూడ, మేడ్చల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, మెదక్, నల్లగొండ విద్యుత్ సర్కిల్ కార్యాలయాల పరిధిలోని 127 సబ్‌స్టేషన్లు, 451 ఫీడర్లు, 13,530 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్(ఈఓడీబీ) కింద 100 మార్కుల కోసం వివిధ సంస్కరణలను అమలు చేయాల్సి ఉండగా.. పారిశ్రామిక ప్రాంతాలకు డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ సదుపాయం కల్పించడం ద్వారా భవిష్యత్‌లో రాష్ట్రం రెండు మార్కులను పొందనుంది.



మహాయాగం.. పరిపూర్ణం

పూర్ణాహుతితో ముగిసిన చండీమహాయాగం

సిరిసిల్ల టౌన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మానేరు తీరంలో నిర్వహించిన ఆయుత చండీ మహాయాగం పరిపూర్ణమైంది. సిరిసిల్ల అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో ఐదురోజులపాటు నిర్వహించిన ఈ యాగాన్ని తొగుట గురుమాధవానానంద సరస్వతీ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతీస్వామి ఆదివారం పూర్ణాహుతి గావించారు. చివరి రోజు 108 మంది దంపతులతో యాగం చేయించారు. యాగ నిర్వాహకులు రాచ విద్యాసాగర్ గురుస్వామి, సీఎం కేసీఆర్ మేనల్లుడు, సిరిసిల్ల వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు చీటి నర్సింగరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని, సెస్ వైస్ చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ దంపతులు తదితరులు యాగంలో పాల్గొన్నారు. కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



ముందే.. జాతర

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెల ప్రాంగణం ఆదివారం భక్తుల తాకిడితో హోరెత్తింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి జంపన్న వాగులో స్నానాలు ఆచరించారు. దేవతలను దర్శించుకుని కొత్త సంవత్సరం 2018లో కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కులు చెల్లించుకున్నారు.



కోరుట్లలో నిత్యజనగణమన జాతీయ జెండాలు సిద్ధం చేస్తున్న వర్తక సంఘం నేతలు

✦ నేటి నుంచి నిత్యజనగణమన

ఒకేసారి 101 జెండాల ఎగురవేత

కోరుట్ల: జగిత్యాల జిల్లా కోరుట్లలో కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని నిత్య జనగణమన కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. కోరుట్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో మొత్తం 33 చోట్ల మైకులు అమర్చారు. తొలిరోజు సోమవారం ఉదయం 10 గంటలకు అన్ని మైకుల్లో జనగణమన గీతాన్ని వినిపించనున్నారు. ఈ సందర్భంగా 101 జాతీయ జెండాలను ఆవిష్కరిస్తారు. తర్వాతి రోజు నుంచి ఉదయం 9 గంటలకు జాతీయ గీతం వచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమాన్ని పరిశీలించేందుకు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు రానున్నారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కలెక్టర్ శరత్, ఎస్పీ అనంతశర్మ హాజరుకానున్నారు.

✦ నిహారికకు అమెరికా ఫెలోషిప్



కాళోజీ సెంటర్: వరంగల్ రూరల్ గీసుకొండ మండలం గొర్రెకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు తౌటం నిహారిక అమెరికా ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అమెరికా ప్రభుత్వం 2011 నుంచి ఫుల్ బ్రైట్స్ కమిషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయులకు స్కాలర్‌షిప్, ఫెలోషిప్ అందజేస్తోంది. దేశవ్యాప్తంగా నలుగురు ఉపాధ్యాయులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి నిహారిక ఉన్నారు. ఫెలోషిప్ కింద జనవరి 3 నుంచి మే 14 వరకు నిహారికకు అమెరికాలో శిక్షణ ఇస్తారు. ఫెలోషిప్‌కు ఎంపికైన మిగిలిన వారికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా సహాయం అందించాలని ఆమె కోరారు.

✦ గల్ఫ్ కార్మికులపై పన్ను ఎఫెక్ట్

నేటి నుంచి 5 శాతం పన్ను విధింపు

రాయికల్ (జగిత్యాల): గల్ఫ్ దేశాల్లో జనవరి 1 నుంచి విధించిన 5 శాతం వ్యాట్ మన కార్మికులకు భారంగా మారనుంది. దుబాయ్, సౌదీ, కువైట్, బెహరాన్ దేశాల్లో ఈ కొత్త పన్నును అమలు చేయనున్నారు. ఈ దేశాల్లో సుమారు 2 లక్షల మంది తెలుగు కార్మికులున్నారు. గల్ఫ్ దేశాల్లో ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం తక్కువ ధరకు లభిస్తాయి. వాటిని కార్మికులు ఇక్కడికి తీసుకొచ్చి.. ఇక్కడి ధరలకు అటుఇటూగా అమ్ముకునేవారు. కొత్త పన్ను భారంతో ఈ కొనుగోళ్లు తగ్గుతాయని భావిస్తున్నారు. మొబైల్ వాడకంపై పన్ను వేయటంతో ఆందోళనకు గురవుతున్నారు.

✦ కలెక్టర్ 'ట్వీటర్' రికార్డు

ఆయనకు రాష్ట్రంలోనే అత్యధిక ఫాలోవర్స్



సిరిసిల్ల టౌన్: ట్వీటర్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా ఫాలోవర్స్ కలిగిన కలెక్టర్‌గా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణ భాస్కర్ రికార్డు సాధించారు. జిల్లాల పునర్విభజన తర్వాత బాధ్యతలు స్వీకరించిన ఆయన.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి ట్విటర్‌లో collrajannasircilla@collector_rsl ఖాతా తెరిచారు. ఇప్పటివరకు ఆయన 907 ట్వీట్‌లు పోస్టుచేశారు. ప్రజలు కూడా తమ సమస్యలను కలెక్టర్ ట్విటర్‌కు పోస్టు చేశారు. స్థానిక పాతబస్టాండ్‌లో అపరిశుభ్రతపై ఓ యువకుడు చేసిన ట్వీట్‌కు తొలుత కలెక్టర్ స్పందించి అధికారులతో తక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటన అప్పట్లో హాట్‌టాపిక్‌గా మారింది. తర్వాత పలు ట్వీట్‌లతో ప్రజలకు చేరువయ్యారు. ఆయన ట్వీటర్‌లో 2,003 మంది ఫాలోయర్స్ ఉండటం రాష్ట్రస్థాయిలో రికార్డు నెలకొల్పింది. వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ అమ్రపాలి రెండోస్థానంలో ఉన్నారు.

✦ పత్తి ప్రెస్సింగ్ మిల్లులో అగ్నిప్రమాదం

రూ.20 లక్షలకుపైగా ఆస్తి నష్టం

గద్వాల క్రైం: కాటన్ ప్రెసింగ్ మిల్లులో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఇందులో దాదాపు 200కు పైగా పత్తి బోరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించడంతో మరో రూ.2 కోట్ల విలువైన ఆస్తిని కాపాడారు. జోగుళాంబ గద్వాల జిల్లా కొండపల్లి గ్రామ శివారులో జయలక్ష్మి కాటన్ ఇండస్ట్రీస్ మిల్లులో ఆదివారం ఉదయం 11 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. దీంతో అక్కడే ఉన్న 200 పత్తి బోరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. గమనించిన కూలీలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు సుమారు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

✦ ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం

తోటి ఉపాధ్యాయుల వేధింపులే కారణం

జడ్చర్ల: కొన్ని రోజులుగా తోటి ఉపాధ్యాయులు మానసిక వేధింపులకు గురి చేస్తుండటంతో మనస్థాపానికి గురైన ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు యత్నించింది. మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లిలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో నివాసముంటున్న దీప.. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తోంది. నెల రోజులుగా ఆ పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు ఆమెను ద్వందార్థాలు వచ్చే మాటలతో మానసికంగా వేధిస్తున్నారు. దీంతో ఆమె నిద్రమాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీప భర్త నరేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

✦ రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

భార్య మృతి.. ఆస్పత్రిలో భర్త

లక్సెట్టిపేట (మంచిర్యాల): జిల్లాలోని లక్సెట్టిపేట మండలం చందారానికి చెందిన కౌలు రైతు దంపతులు శనివారం రాత్రి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో భార్య మృతి చెందగా.. భర్త చికిత్స పొందుతున్నాడు. బాబులాల్, విజయ(30) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, వరి, కంది పంటలు సాగు చేస్తున్నారు. పం టలు దెబ్బతినడటంతో ఆశించిన మేర దిగుబడి రాలేదు. వ్యవసాయ పెట్టుబడులకు, ఇల్లు కట్టుకోవడానికి రూ. 5 లక్షల వరకు అప్పు చేశారు. అప్పు తీరే మార్గం కనిపించక శనివారం రాత్రి భార్యాభర్తలు పురుగుల మందు తాగారు. ఆస్పత్రిలో విజయ మృతి చెందింది. బాబులాల్ మంచిర్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు అరవింద్, అనిల్ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

✦ భార్య, కుమారుడిని హత్య చేశాడు..

అనుమానంతో ఘాతుకం



బాలమ్మ, శ్రీనివాస్ (ఫైల్)

నస్పూర్(మంచిర్యాల): అనుమానం, కుటుంబకలహాలతో భార్య, ఐదు నెలల కుమారుడిని హత్య చేశాడో వ్యక్తి. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా నస్పూర్ మండలం సీసీసీలో ఆదివారం చోటు చేసుకుంది. బండలు కొట్టి జీవించే ఆలకుంట పీరక్క తన కూతురు బాలమ్మకు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సమీపంలోని రంగాపురం కొత్తపల్లికి చెందిన సంపంగి శ్రీనివాస్‌తో వివాహం జరిపించింది. శ్రీనివాస్ మద్యం మత్తులో భార్యతో తరచూ గొడవ పడేవాడు. గర్భిణిగా ఉన్న బాలమ్మను పీరక్క ఆరు నెలల క్రితం ప్రసవం కోసం ఇంటికి తీసుకొచ్చింది. పలు సార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినా శ్రీనివాస్‌లో మార్పు రాలేదు. దీంతో బాలమ్మ తల్లి వద్దే ఉంటూ కుమారుడికి జన్మనిచ్చింది. శ్రీనివాస్ హుజురాబాద్‌లో ఒక దొంగతనం కేసులో జైలుకు వెళ్లడంతో పీరమ్మే విడిపించుకు వచ్చింది. క్రిస్మస్ పండుగకు సీసీసీకి వచ్చిన శ్రీనివాస్ ఇక్కడే ఉంటానని చెప్పాడు. రెండు రోజులుగా భార్యతో గొడవ పడుతున్నాడు. ఆదివారం ఉదయం 9గంటల ప్రాంతంలో భార్య బాలమ్మ(19), కుమారుడు వివేక్ (5నెలలు)లను కత్తితో గొంతుకోశాడు. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోల్‌కతాలో రెండో టీయూ-142 మ్యూజియం

- ఇన్‌చార్జిగా రాష్ట్రానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ రమణకుమార్
- ఇటీవలే విశాఖలో ప్రారంభమైన తొలి మ్యూజియం



సాక్షి, విశాఖపట్నం: భారత నావికా దళంలో సుదీర్ఘ సేవలందించిన మరో యుద్ధ విమానం రెండో మ్యూజియంగా మారబోతోంది. ఒక దానిని ఇటీవలే విశాఖ సాగర తీరంలో ఏర్పాటుచేయగా.. ఇప్పుడు రెండో దానిని కోల్‌కతాలో మ్యూజియంగా తీర్చిదిద్దనున్నారు. రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎనిమిది టీయూ-142 యుద్ధ విమానాలు 1988లో ఇండియన్ నేవీలోకి వచ్చి 29ఏళ్ల పాటు నిరంతరాయంగా విశేష సేవలందించాయి. వీటిని 2017 మార్చిలో నేవీ విధుల నుంచి తప్పించారు. తమిళనాడులోని అరక్కోణం నేవల్ ఎయిర్ బేస్ కేంద్రంగా ఇవి సముద్ర గగనతలంలో గస్తీ విధులు నిర్వహించాయి. కార్గిల్ యుద్ధంలోనూ పాల్గొన్నాయి. వాటి స్థానంలో కొత్తగా పీ8ఐ రకం అత్యాధునిక నిఘా విమా నాలను భారత్ కొనుగోలు చేసింది. నేవీ సేవల నుంచి నిష్క్రమించిన టీయూ-142 యుద్ధ విమానాల్లో ఒకదాన్ని ఇటీవల విశాఖలో ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియంగా తీర్చిదిద్దారు. దీనిని ఈ డిసెంబర్ ఏడో తేదీన భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభిం చారు. విశాఖ ఉత్సవ్ తొలిరోజైన డిసెంబర్ 28 నుంచి ఇందులో ప్రవేశానికి అనుమతించారు. దేశంలోకెల్లా తొలి ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం ఇదే. ఈ నేపథ్యంలో రెండో టీయూ-142 యుద్ధ విమాన మ్యూజియాన్ని పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఏర్పాటుచేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం రక్షణ శాఖను కోరింది. ఇందుకు రక్షణశాఖ సూత్రప్రాయంగా అంగీకరించింది. ఈ రెండో ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియం ఆరు నెలల్లో పూర్తిచేయనున్నారు. విశాఖ ఎయిర్‌క్రాఫ్ట్ మ్యూజియాన్ని విజయవం తంగా పూర్తిచేసి అందరి ప్రశంసలందుకున్న.. ఆంధ్రకు చెందిన లెఫ్టినెంట్ కమాండర్ రమణ్‌కుమార్‌నే కోల్‌కతా మ్యూజియానికి కూడా ఇన్‌చార్జిగా పంపనున్నారు.

శాంతిభద్రతలకు అధిక ప్రాధాన్యం

- బాధ్యతలు చేపట్టిన సందర్భంగా డీజీపీ మాలకొండయ్య వెల్లడి
- సాంబశివరావుకు ఘనంగా వీడ్కోలు పలికిన పోలీస్ అధికారులు



మంగళగిరి డీజీపీ కార్యాలయంలో కొత్త డీజీపీ మాలకొండయ్యకు (కుడి వైపు) పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ డీజీపీ సాంబశివరావు

సాక్షి, అమరావతి/మంగళగిరి టౌన్: రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తానని నూతన డీజీపీ మన్న మాలకొండయ్య అన్నారు. మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన పూర్తిస్థాయి డీజీపీగా ఆదివారం మధ్యాహ్నం 12.15 గంటలకు బాధ్యతలు చేపట్టారు. నండూరి సాంబశివరావు నుంచి బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో ముచ్చటిస్తూ.. రాష్ట్రంలో తీవ్ర నేరాలను అదుపు చేయడంలో కేసుల నమోదు, అరెస్టులు, దర్యాప్తులు, ప్రాసిక్యూషన్ వంటి కీలక విషయాల్లో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.సైబర్ నేరాలను అదుపు చేసేలా ఇంటెలిజెన్సీ, ఇన్వెస్టిగేషన్ తదితర పోలీస్ శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా పదవీ విరమణ చేసిన డీజీపీ సాంబశివరావుకు పోలీసు సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన తనకు చదువు చెప్పిన గురువులను తలచుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు.


జనసేన తొలి సభ్యత్వం స్వీకరించిన పవన్

సాక్షి, అమరావతి: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదివారం ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు పార్టీ మీడియా విభాగం హెడ్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో తొలి సభ్యత్వాన్ని పవన్ స్వీకరించారు. తర్వాత పార్టీలోని ముఖ్యులకు పవన్ సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు.

తిరుమలలో రద్దీ నియంత్రణకు టైంస్లాట్!?

సాక్షి, తిరుమల: తిరుమల వైకుంఠ క్షేత్రంలో ఈసారి ఏకాదశి, ద్వాదశి పర్వదినాల్లో భక్తులు పోటెత్తడం ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. భవిష్యత్తులో తిరుమల కొండపై రద్దీని నియంత్రించాలంటే టైంస్లాట్ విధానమే పరిష్కార మార్గమనే సూచనలు వస్తున్నాయి. సామాన్య భక్తులు శుక్ర, శనివారాల్లో నరకయాతన అనుభవించిన నేపథ్యంలో ఇప్పుడు అందరి దృష్టి టైంస్లాట్ విధానంపై పడింది. రూ.300 టికెట్లు, సర్వదర్శనం, కాలిబాట దర్శనాలకు అమలుచేస్తున్నట్లుగానే పర్వదినాల్లోనూ టైంస్లాట్ విధానమే రద్దీ సమస్యకు ఏకైక పరిష్కారమని నిపుణులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ విధానంవల్ల ఆరు బయట ఎలాంటి క్యూలైన్లు ఉండవు. ముందస్తుగా టికెట్లు పొందిన భక్తులు తమకు కేటాయించిన సమయాల్లో మాత్రమే క్యూలోకి వచ్చి కనిష్టంగా 2 గంటలు గరిష్టంగా 4 గంటల్లోపే స్వామివారిని దర్శించుకునే అవకాశం ఉంది.

పర్వదినాల్లో టైంస్లాట్‌ను పరిశీలిస్తున్నాం: టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్



ప్రస్తుతం శ్రీవారి దర్శనంలో రూ.300 టికెట్లు, సర్వదర్శనం, కాలిబాట దర్శనాలకు టైంస్లాట్ పద్ధతిని అమలుచేస్తున్నాం. పర్వదినాల్లో కూడా ఈ విధానం ఎంతవరకు వీలవుతుందో? ఎంతమంది భక్తులకు టికెట్లు లభిస్తాయి? ఆన్‌లైన్ టికెట్లు పొందలేని వారికి ఎలాంటి ఏర్పాట్లు చేయాలి? అన్న విషయాలు పరిశీలిస్తున్నాం.

తెలంగాణ

విద్యుదుత్పత్తిలో సింగరేణి రికార్డు

డిసెంబర్‌లో 99.5 శాతం పీఎల్‌ఎఫ్

- సంస్థ సీఎండీ శ్రీధర్ హర్షం



సాక్షి, హైదరాబాద్: మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ డిసెంబర్‌లో అత్యధికంగా 99.5 శాతం పీఎల్‌ఎఫ్ సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పిందని సింగరేణి సంస్థ యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. 2017-18లో 90 శాతం పీఎల్‌ఎఫ్ సాధించి జాతీయ స్థాయిలో 25 అత్యుత్తమ థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాలో 4వ స్థానంలో నిలిచిందని, ఇది తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొంది. విద్యుత్ ప్లాంట్ స్థాపిత సామర్థ్యంతో పోల్చినపుడు.. ఓ నిర్ణీత కాలంలో వాస్తవంగా జరిగిన విద్యుదుత్పత్తి శాతాన్ని పీఎల్‌ఎఫ్ అంటారు. గత ఫిబ్రవరిలో 100 శాతం పీఎల్‌ఎఫ్ సాధించిన 600 మెగావాట్ల యూనిట్-2 ప్లాంటు.. మే, నవంబర్‌లలో కూడా 100 శాతం పీఎల్‌ఎఫ్ సాధించింది. మరో 600 మెగావాట్ల యూనిట్-1 ప్లాంటు ఏప్రిల్, డిసెంబర్‌లలో 100 శాతం పీఎల్‌ఎఫ్ సాధించడం గమనార్హం. అందరికీ అందుబాటులో, అన్ని వేళలా విద్యుత్తు సరఫరా చేయాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతున్న నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం 10,658 మిలియన్ యూనిట్లను ఇతర సంస్థల కన్నా తక్కువ ధరకే సరఫరా చేసింది. ఇలా ఇతర సంస్థల ధరలతో పోలిస్తే దాదాపు రూ.వెయ్యి కోట్లు ఆదా అయినట్లు సింగరేణి యాజమాన్యం తెలిపింది.

కొత్త ఏడాదిలో మరిన్ని విజయాలు

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంటు జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలవడంపై సింగరేణి బొగ్గు గనుల సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ హర్షం వ్యక్తం చేశారు. 2018లో మరిన్ని విజయాలు సాధించనున్నామని, కొత్త సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయనున్నామని తెలిపారు. సంస్థ ప్రగతి పథంలో కీలకపాత్ర పోషిస్తున్న అధికారులకు, వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్న కుటుంబీకులకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏటా సగటున 7 శాతం వృద్ధి రేటుతో సంస్థ పురోగమిస్తోందని పేర్కొన్నారు. కొత్తగా 12 గనులు రానున్నాయని, రానున్న 5 ఏళ్లలో సింగరేణి 850 లక్షల టన్నుల లక్ష్యాన్ని చేరుకోనుందని తెలిపారు.



ఆలయం.. పుష్పసోయగం

కొత్త సంవత్సరానికి శ్రీవారి ఆలయం ముస్తాబు

రేపటి నుండి మళ్లీ ఆర్జిత సేవలు

సాక్షి, తిరుమల: ఆంగ్ల నూతన సంవత్సరాది కోసం తిరుమల కొండ ముస్తాబైంది. విద్యుద్దీప కాంతులు, సుగంధ సువాసనలు వెదజల్లే పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహాద్వారం నుండి గర్భాలయం వరకు స్వదేశీ, విదేశీ పుష్పాల తోపాటు అరటి ఆకుల తోరణాలతో అలంకరించారు. ఇక ఆలయం వెలుపల మహాద్వారానికి శంఖుచక్ర, తిరునామాలతో కూడిన లక్ష్మీ సమేత శ్రీ మహావిష్ణువు పుష్పాలంకరణ, శ్రీదేవి-భూదేవి సమేత మలయప్ప ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు.

రేపటి నుండి యథావిధిగా ఆర్జిత సేవలు

డిసెంబరు 28 నుండి జనవరి ఒకటో తేదీ వరకు రద్దయిన ఆర్జిత సేవలు తిరిగి మంగళవారం నుండి యథావిధిగా నిర్వహించనున్నారు.

మరీ ఇంత దారుణమా?

హెరిటేజ్‌లో కిలో టమాటా రూ.50.. రైతు వద్ద రూ.6

- అన్నదాతల దుస్థితిపై ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఆందోళన
- టమాటా పొలం పరిశీలన.. గోడు వెళ్లబోసుకున్న రైతులు



ముదివేడులో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రతిపక్ష నేత జగన్

సాక్షి, తిరుపతి

'హెరిటేజ్ షాపుల్లో కిలో టమాటా రూ.50. రైతు నుంచి కొనుగోలు చేసేది మాత్రం ఆరు రూపాయలకా? ఇంత దారుణమా? మనందరి ప్రభుత్వం వస్తే టమాటా రైతుల కోసం జ్యూస్ ఫ్యాక్టరీతో పాటు కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తాం. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులందరినీ ఆదుకుం టాం.' అని ప్రతిపక్ష నేత, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా 48వ రోజు ఆదివారం ఆయన చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఎర్రసానిపల్లి వద్ద టమాటా పొలాన్ని పరిశీలించారు. అక్కడే ఉన్న రైతులు రామకృష్ణ, శంకర్, సురేందర్‌రెడ్డిలు.. పంట సాగు వివరాలు, గిట్టుబాటు ధర గురించి జగన్‌తో గోడు వెళ్లబోసుకున్నారు. 'ఎకరంలో పంట సాగు చేయడానికి రూ.లక్ష ఖర్చు వస్తోంది. క్రేటు (టమాటాలు వేసే ప్లాస్టిక్ బుట్ట) బాడుగ, ట్రాన్స్‌పోర్టు, కూలి, మల్చింగ్, కట్టెకట్టటం, పురుగు మందుల ఖర్చులే ఎక్కువ. దిగుబడి సుమారు 200 క్రేటులు వస్తోంది. ఒక క్రేటు అంటే 30 కిలోలు. క్రేటు రూ.100 నుంచి రూ.120 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఒక్కోసారి క్రేటు రూ.60 కూడా పలకడం లేదు. ఎకరంలో వచ్చిన పంట మొత్తం అమ్మినా రూ.15 వేలు రావటం లేదు. పంట బాగా వచ్చిందని సంతోషపడాలే తప్ప ధర రావడం లేదు. ఎంత కష్టపడినా అప్పు తీరటం లేదు. ప్రతి వంద రూపాయలకు 4 శాతం కమీషన్ చెల్లించాల్సి ఉంది. అయితే మార్కెట్‌లో 10 శాతం వసూలు చేస్తున్నారు. మరో వైపు ఎరువుల ధరలు మాత్రం తగ్గించడం లేదు. డీఏపీ బస్తా ధర రూ.1250కు అమ్ముతున్నారు. ధర పలకనప్పుడు నిల్వ చేసుకునే సదుపాయం లేదు.' అని వాపోయారు. జగన్ మాట్లాడుతూ.. 'రైతు పండించిన పంటకు కనీసం గిట్టుబాటు ధర అందటం లేదు. హెరిటేజ్ షాపుల్లో కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నారు. రైతు వద్ద మాత్రం రూ.6 చొప్పున కొంటున్నారు. ఇంత దారుణమా? కాలం మారుతున్నా మదనపల్లి టమాటా రైతుల పరిస్థితి మారడం లేదు. మనందరి ప్రభుత్వం రాగానే మండలానికో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తాను. గిట్టుబాటు లేకపోతే అందులో నిల్వ చేసుకుని ధర వచ్చినప్పుడు అమ్ముకునే వీలు కల్పిస్తా. జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం. సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు టమాటా జ్యూస్ పంపిణీ చేస్తే బాగుంటుంది. ఆ దిశగా ఆలోచన చేద్దాం.' అని అన్నారు. ఇది ఇలా ఉండగా కొత్త సంవత్సరం సందర్భంగా సాక్షి చైర్‌పర్సన్ వైఎస్ భారతి చిత్తూరు జిల్లా ముదివేడు సమీపంలోని జగన్ విడిది క్యాంపునకు వెళ్లారు. అక్కడికి వచ్చిన ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

ప్రకృతి సేద్యానికి కేరాఫ్ ఏపీ

సీఎం చంద్రబాబు వెల్లడి

- సుభాష్ పాలేకర్ ప్రాజెక్టును ప్రమోట్ చేస్తా..



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న సీఎం. చిత్రంలో స్పీకర్, మంత్రులు, పాలేకర్

సాక్షి, అమరావతి బ్యూరో: ''ప్రకృతి సేద్యానికి కేరాఫ్ అడ్రస్ ఆంధ్రప్రదేశ్. దేశానికే కాదు మొత్తం ప్రపంచానికే చిరునామాగా నిలుస్తుంది'' అని సీఎం చంద్రబాబు చెప్పారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న బైబిల్ మిషన్ ప్రాంతంలో ఆదివారం 'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం'పై రాష్ట్రస్థాయి శిక్షణ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2018 సంవత్సరాన్ని ఆంధ్రప్రదేశ్‌కు ప్రకృతి సేద్య నామ సంవత్సరంగా నామకరణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయంలో పాత పద్ధతులకు స్వస్తి పలకాలని, ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలని రైతులకు సూచించారు. సుభాష్ పాలేకర్ వద్ద మంచి ప్రాజెక్టు ఉందని, తాను మార్కెట్ మేనేజర్‌గా మారి దాన్ని ప్రమోట్ చేస్తానని బాబు వివరించారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు

రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయమేనని పద్మశ్రీ సుభాష్ పాలేకర్ తెలిపారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన పంటలు వైపరీత్యాలను తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తున్నాయని చెప్పారు. మూడేళ్లలో ప్రకృతి వ్యవసాయంలో ప్రపంచంలో ఏపీ రోల్‌మోడల్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రగతే నా ధ్యాస

రాష్ట్ర ప్రగతి, ప్రజలందరి పురోగతే తన నిరంతర ధ్యాస అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అందరి శ్రేయస్సు, సంక్షేమం, సర్వతోముఖ వికాసానికి తాను దీక్ష తీసుకున్నానని, రాష్ట్రాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నమూనాగా నిలపాలన్నదే తన ఆకాంక్ష అని వెల్లడించారు. కొత్త ఏడాదిలోకి అడుగుపెడుతున్న సందర్భంగా బాబు ఆదివారం రాష్ట్ర ప్రజలకు లేఖ రాశారు. సమాచార పౌరసంబంధాల శాఖ ద్వారా లేఖను విడుదల చేశారు. తెలుగువారు ఎక్కడున్నా ఈ పండక్కి వచ్చి సొంతగడ్డ రుణం తీర్చుకోవాలని కోరారు. తెలుగు ప్రజలందరికీ సీఎం చంద్రబాబు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఏడు ద్వీపాల్లో 7 పర్యాటక ప్రాజెక్టులు



సాక్షి, అమరావతి: రాజధాని పరిధిలోని కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీకి ఎగువన ఉన్న ఏడు ద్వీపాలను అభివృద్ధి చేసి ఏడు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో నాలుగు ద్వీపాలు, రెండో దశలో మిగిలిన మూడు ద్వీపాలను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మొదట భవానీ ద్వీపాన్ని ఎకో పార్కుగా అభివృద్ధి చేయడానికి ఇటీవలే ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అయితే దీన్ని మారిషస్ తరహాలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేలా మరింత మెరుగైన ప్రతిపాదనలు రూపొందించాలని ప్రభుత్వం కన్సల్టెన్సీలను కోరింది.

తెలంగాణ

4 జిల్లాల్లో భారీగా రీ సైక్లింగ్

ప్రభుత్వ అంచనా.. అంతర్గత విచారణకు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: 'గొర్రెల పంపిణీ'కి సంబంధించి నల్లగొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం అంచనాకు వచ్చింది. ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో ముగ్గురు అధికారులతో అంతర్గత విచారణ కమిటీని నియమించింది. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు జరిగిన గొర్రెల కొనుగోళ్లపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించింది. అలాగే గొర్రెల పంపిణీ పథకం ఆడిటింగ్ బాధ్యతలను సెస్ (సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్)కు అప్పగించింది. గొల్ల, కురుమలకు 75 శాతం సబ్సిడీతో గొర్రెలు పంపిణీ పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం.. ఇప్పటివరకు 1,67,000 యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. దాదాపు 35 లక్షల గొర్రెలు పంపిణీ చేయగా.. వాటికి 12 లక్షలు గొర్రె పిల్లలు పుట్టినట్లు అంచనా వేసింది. అయితే నవంబర్ 15 తర్వాత నెల రోజులు నల్గొండ, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జగిత్యాల జిల్లాల్లో పెద్ద ఎత్తున గొర్రెల పంపిణీ జరిగింది. దీంతో ఆ 4 జిల్లాల్లో రీసైక్లింగ్ జరిగినట్లు అనుమానం వ్యక్తం చేసిన ప్రభుత్వం.. శాఖాపరమైన విచారణ కొనసాగిస్తోంది. అలాగే సంబంధిత జిల్లా కలెక్టర్ నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేసి ఆయా జిల్లాల్లో పంపిణీ చేసిన అన్ని యూనిట్లను తనిఖీ చేయాలని ఆదేశించింది.

సెస్‌కు ఆడిటింగ్, సర్వే

మహబూబ్‌నగర్, వరంగల్ అర్బన్ జిల్లాల్లో అక్రమంగా తరలిస్తున్న వందలాది గొర్రెలు ఇటీవల పట్టుబడ్డాయి. వివిధ జిల్లాల్లో వచ్చిన ఆరోపణలపై ఇద్దరు అధికారులనూ సస్పెండ్ చేశారు. దీంతో రీ సైక్లింగ్ జరగకుండా చెవులు కత్తిరించిన గొర్రెలు కొనుగోలు చేయొద్దని ఆదేశించారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా థర్డ్ పార్టీ సర్వే చేపట్టాలని నిర్ణయించారు.శాస్త్రీయ పద్ధతిలో 10 శాతం రాండమ్ శాంపిల్‌తో సర్వే చేసే బాధ్యతను సెస్‌కు అప్పగించింది.

పేలని ప'టాస్'!

అటకెక్కిన తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్

- ఇతర రాష్ట్రాల్లో చేసిన అధ్యయనం కాగితాలకే పరిమితం
- గ్రూప్-1, గెజిటెడ్ అధికారుల సంఘాల నివేదికలు బుట్టదాఖలు
- అధికారుల ఆందోళనలు పట్టించుకోకుండా కేంద్రానికి 'కన్ఫర్డ్ ఐఏఎస్'జాబితా
- జాబితాలోని పేర్లపైనా ఉద్యోగ సంఘాల ఆందోళన
- టాస్ ఏర్పాటు చేసి.. తమకు న్యాయం చేయాలంటున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గ్రూప్-1 స్థాయి అధికారుల సేవలను అన్ని విభాగాల్లో సమర్థవంతంగా వినియోగించుకునే ఉద్దేశంతో ఏర్పాటు చేయాలనుకున్న తెలంగాణ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (టాస్) అటకెక్కింది. మూడేళ్ల కిందట టాస్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టినా ఇంతవరకు ఆచరణ దిశగా అడుగులు పడలేదు. గ్రూప్-1 అధికారుల సంఘం, రెవెన్యూ అధికారుల జేఏసీ, గెజిటెడ్ అధికారుల సంఘాలు.. కేరళ, ఒడిశా, గుజరాత్, రాజస్తాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ పనితీరు తెలుసుకుని, మన రాష్ట్రంలో ఏర్పాటుకు చేపట్టాల్సిన చర్యలపై అధ్యయనం చేసి ఏడాది కిందట నివేదికలు ఇచ్చాయి. ఆ నివేదికను పట్టించుకున్న నాథుడే లేడు. పైగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్ నేతృత్వంలో ఆరుగురు ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ.. ఎంజీ గోపాల్ రిటైర్‌మెంట్ తర్వాత ఇంతవరకు ఒక్కసారి కూడా భేటీ కాలేదు. అసలు కమిటీ ఉందా, లేదా అనే దానిపైనా స్పష్టతలేదు. ఫలితంగా అన్ని విభాగాల్లో గ్రూప్-1 స్థాయి అధికారుల సేవలను సంపూర్ణంగా వినియోగించుకోవాలన్న లక్ష్యం నెరవేరక పోగా, కన్ఫర్డ్ ఐఏఎస్ కోటాలో రెవెన్యూ యేతర విభాగాలకు చెందిన గ్రూప్-1 స్థాయి అధికారులకు తగిన ప్రాతినిధ్యం ఎండమావిగానే మిగిలింది.

కన్ఫర్డ్ ఐఏఎస్ తేనెతుట్టె!

ఓవైపు 'టాస్'ప్రక్రియ అలాగే నిలిచిపోగా, తాజాగా చేపట్టిన కన్ఫర్డ్ ఐఏఎస్ పదోన్నతుల ప్రక్రియ వివాదాస్పదం అవుతోంది. రెవెన్యూయేతర గ్రూప్-1 స్థాయి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, సీనియారిటీ విషయంలో రెవెన్యూ విభాగానికి చెందిన ప్రమోటీలు కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టాస్ ఏర్పాటు చేసి తమకు ఐఏఎస్ పోస్టుల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని నాన్ రెవెన్యూ గ్రూప్-1 స్థాయి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ, నాన్ రెవెన్యూ అనే తేడా లేకుండా టాస్‌ను ఏర్పాటు చేసి, గ్రూప్-1 స్థాయి వారందరిని స్టేట్ సివిల్ సర్వీసెస్ కిందకు తీసుకురావాలని కోరుతున్నారు. మరోవైపు రెవెన్యూలో డైరెక్ట్ రిక్రూటీస్, ప్రమోటీల సీనియారిటీ కేసుకు సంబంధించి.. హైకోర్టు తీర్పు వెలువడకముందే ఆగమేఘాలపై కన్ఫర్డ్ ఐఏఎస్ కోసం జాబితాను కేంద్రానికి పంపడంపైనా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

'పిల్ల పుట్టకముందే కుల్ల కుట్టించినట్లు..'

డిప్యూటీ కలెక్టర్ల విభజన ఈనెల 29న పూర్తయినట్టు నోటిఫికేషన్‌లో ప్రభుత్వం ప్రకటించింది. అయితే అందులో తెలంగాణకు అలాట్ అయిన వారు కొందరు ఇంకా ఆంధ్రప్రదేశ్‌లోనే పని చేస్తున్నారు. అధికారికంగా తెలంగాణలో చేరలేదు. ఇంకొందరికి 8 ఏళ్ల సర్వీసు పూర్తి కాలేదు. ఇలా తెలంగాణలో చేరని వారి పేర్లు, 8 ఏళ్ల కనీస సర్వీసు పూర్తి కాని వారి పేర్లు కన్ఫర్డ్ ఐఏఎస్ కోసం జాబితాలో చేర్చడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పైగా ఏపీ స్థానికత కలిగిన వారు కూడా అందులో ఉన్నట్లు ఉద్యోగ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

రాష్ట్ర సర్వీసుల్లో విశేష అనుభవం, సమర్థత ఉన్న అధికారులకి కన్ఫర్డ్ ఐఏఎస్‌గా పదోన్నతులు కల్పించాలని నియమ నిబంధనలు చెబుతున్నాయి. కానీ అందుకు భిన్నంగా రెవెన్యూ వారికే ప్రాధాన్యం ఇస్తుండటంపై నాన్ రెవెన్యూ అధికారుల నుంచి ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ప్రమోషన్) రెగ్యులేషన్స్-1955 ప్రకారం రాష్ట్ర సర్వీసుల్లో రెవెన్యూ, జనరల్ అడ్మినిస్ట్రేషన్‌లో డిప్యూటీ

నిబంధనలివీ..

కలెక్టర్ లేదా అంతకంటే పైహోదా కలిగిన వారు 'రాష్ట్ర సివిల్ సర్వీస్'కింద పని చేస్తూ ఉండాలి. వారికి కనీసం 8 ఏళ్ల సర్వీసు ఉండాలి. కానీ కొత్తగా ఏర్పడిన తెలంగాణలో ఇంత వరకు ఏ సర్వీసునూ 'రాష్ట్ర సివిల్ సర్వీస్'గా గుర్తించలేదు. రాష్ట్ర సివిల్ సర్వీస్ అధికారులంటే స్పష్టత లేదు. కనీసం పాత జీవోలను కూడా అడాప్ట్ చేసుకోలేదు. కానీ రెవెన్యూ వారినే పరిగణనలోకి తీసుకుని ఐఏఎస్ కోసం జాబితా రూపొందించి పంపారని నాన్ రెవెన్యూ అధికారులు ఆరోపిస్తున్నారు. 20 రాష్ట్రాల్లో గ్రూప్-1 స్థాయి అధికారులు అందరితో అడ్మినిస్ట్రేటివ్ సర్వీసును ఏర్పాటు చేశారని, కేరళ ప్రభుత్వం కూడా జనవరి 1 నుంచి అమల్లోకి తీసుకురానుందని పేర్కొంటున్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం ఆ దిశగా అడుగులు పడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్,
సాక్షి దినపత్రిక,
రోడ్ నంబర్-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సాక్షి భవిత
సోమవారం 1-1-2018
స్పర్ధయా వర్ధతే విద్య

పరిశోధనలో విజేతలు..

ఇన్ఫోసిస్ ప్రైజ్.. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ నెలకొల్పిన బహుమతి. దేశంలో సైన్స్, పరిశోధన రంగంలో అసాధారణ ప్రతిభచూపిన శాస్త్రవేత్తలను గుర్తించి, గౌరవించేందుకు దీన్ని ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్, హ్యుమానిటీస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ పరిశోధనల్లో ప్రతిభావంతులను ఇన్ఫోసిస్ అవార్డు వరిస్తుంది. ఒక్కో విజేతకు బంగారు పతకం, రూ.65 లక్షల నగదు, ప్రశంసాపత్రం అందజేస్తారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ఇటీవల 2017 సంవత్సరానికి విజేతలను నిర్ణయించింది. 2018లోకి అడుగుపెట్టిన వేళ.. యువతకు స్ఫూర్తిమంతమైన ఆ విజేతలు, వారి పరిశోధనల వివరాలు...

ప్రేరణ..

విభాగం
ఇంజనీరింగ్ అండ్ కంప్యూటర్ సైన్స్
విజేత: ప్రొఫెసర్ సంఘమిత్ర బందోపాధ్యాయ, డైరెక్టర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్, కోల్‌కతా.



బయలాజికల్ డేటా విశ్లేషణ..

కోల్‌కతాకు చెందిన ప్రొఫెసర్ సంఘమిత్ర బందోపాధ్యాయ బయో ఇన్ఫర్మాటిక్స్ రంగంలో దేశంలో సుపరిచిత శాస్త్రవేత్త. వాస్తవానికి ఆమె చదివింది కంప్యూటర్ సైన్స్ అయినప్పటికీ.. సామాజిక రుగ్మతల పరిష్కారానికి కృషిచేయాలని భావించారు. అలా ఆమె దృష్టి బయోఇన్ఫర్మాటిక్స్ వైపు మళ్లింది. అధిక శాతం మంది మహిళలు ఎదుర్కొంటున్న బ్రెస్ట్ క్యాన్సర్ కారకాలకు సంబంధించిన అంశాలను కంప్యూటర్ డేటా ఆధారంగా విశ్లేషించడంపై రెండు దశాబ్దాలుగా ఆమె పరిశోధనలు చేస్తున్నారు. బయలాజికల్ డేటా విశ్లేషణలో అల్గారిథమిక్ ఆప్టిమైజేషన్ ప్రభావంపై ఆమె చేసిన కృషికి ఇన్ఫోసిస్ ప్రైజ్ లభించింది. బ్రెస్ట్ క్యాన్సర్‌కు సంబంధించి జెనిటిక్ మార్కర్, అల్జీమర్స్ వ్యాధిలో తెల్ల రక్తకణాల పాత్రను వివరించడం ఆమె ఇతర ఘనతలు. సంఘమిత్ర పరిశోధనలకు ఇప్పటికే ఎన్నో అవార్డులు లభించాయి. దేశంలో సైన్స్ నోబెల్‌గా భావించే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు ఏడేళ్ల కిందటే దక్కింది. ఆమెకు మొదటి నుంచి సైన్స్ అంటే మక్కువ. ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి బీఎస్సీ (ఫిజిక్స్‌లో ఆనర్స్) పూర్తిచేసిన తర్వాత ఆమె దృష్టి కంప్యూటర్ సైన్స్ వైపు మళ్లింది. దాంతో 25 ఏళ్ల కిందటే కోల్‌కతా యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఐఐటీ-ఖరగ్‌పూర్ నుంచి ఎంటెక్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి పీహెచ్‌డీ (1998) సొంతం చేసుకున్నారు. తన విజయం వెనుక భర్త ఉజ్వల్ మౌలిక్ (జాదవ్‌పూర్ యూనివర్సిటీ సీఎస్ఈ ప్రొఫెసర్) తోడ్పాటు ఎంతో ఉందని ఆమె చెబుతారు. కొన్నిసార్లు గంటల తరబడి ల్యాబ్‌లో పని చేయాల్సి వచ్చేదని, అలాంటప్పుడు కుమారుడి బాగోగులు ఆయనే చూసుకునేవారని పేర్కొన్నారు. ఇలాంటి తోడ్పాటు మహిళలకు లభిస్తే మరెందరో తమ పరిశోధనల ద్వారా సామాజిక అభివృద్ధికి దోహదపడతారన్నారు. అమ్మానాన్న కూడా తన చదువు విషయంలో ఏనాడూ అడ్డు చెప్పలేదని.. అందుకే బీఎస్సీ పూర్తిచేసిన తర్వాత మళ్లీ కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్ డిగ్రీతో కెరీర్ పరంగా ముందడుగు వేయగలిగినట్లు తెలిపారు.

విభాగం
హ్యుమానిటీస్
విజేత: ప్రొఫెసర్ అనన్య జహనరా కబీర్, ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్ లిటరేచర్, కింగ్స్ కాలేజ్ లండన్.



కశ్మీర్‌పై పరిశోధన..

ప్రతిష్టాత్మక కింగ్స్ కాలేజ్ (లండన్)లో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న అనన్య జహనరా కబీర్‌ను ఇన్ఫోసిస్ అవార్డుకు ఎంపిక చేసిన కారణాన్ని తెలుసుకుంటే ఆశ్చర్యపోవాల్సిందే! ఎంతో సున్నితప్రాంతమైన కశ్మీర్‌లోని చారిత్రక పరిస్థితులు; సామాజిక, సాంస్కృతిక స్థితిగతులు, అక్కడి భాష, ప్రజల జీవన విధానం, రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘ కాలంగా చేస్తున్న అధ్యయనానికి గుర్తింపుగా ఇన్ఫోసిస్ అవార్డు లభించింది. ఇంగ్లిష్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ చేసినప్పటికీ.. మానవ సంబంధాలు, చరిత్రపై అధ్యయనం చేయడానికి కారణమేంటని అనన్యని ప్రశ్నిస్తే.. 'మనిషికి తన చరిత్ర, పూర్వీకుల మూలాలు తెలియకపోతే జీవితంలో రాణించలేరు' అని ప్రముఖ రచయిత ఎలియట్ వ్యాఖ్యలను ఉటంకిస్తారు. ఇవే తనలో మానవ సంస్కృతి, సంప్రదాయాలపై, వలసవాద పరిస్థితులపై అధ్యయనం దిశగా అడుగులు వేసేందుకు తోడ్పడినట్లు చెబుతారు. కుటుంబ పరిస్థితులు కూడా ఆమెను ఈ దిశగా కదలించాయని చెప్పొచ్చు. అనన్య తాత, తండ్రి బంగ్లాదేశ్ ఏర్పడక ముందు తూర్పు బెంగాల్‌లో ఉండేవారు. బంగ్లాదేశ్ ప్రత్యేక దేశంగా ఆవిర్భవించడంతో వారి కుటుంబం భారత్‌లోని పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడింది. ఇలా.. రాజకీయ, సామాజిక కారణాల వల్ల వ్యక్తుల జీవితాల్లో ఎన్నో మార్పులు సంభవిస్తాయని.. వాటిని తాను ప్రత్యక్షంగా తన కుటుంబంలోనే చూశానని.. అందుకే ఇంగ్లిష్ కంటే సామాజిక అధ్యయనంపైనే తనకు మక్కువ ఎక్కువని చెబుతున్నారు. ఆమె కోల్‌కతా యూనివర్సిటీ నుంచి బీఏ-ఇంగ్లిష్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఇంగ్లిష్ - పీజీ, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ఇంగ్లిష్‌లో పీహెచ్‌డీ పట్టా సొంతం చేసుకున్నారు. వలసవాదం, వలస జాతులపై మరింత అధ్యయనం చేయడం, ఆ సమస్యలను ప్రపంచం దృష్టికి తేవడమే తన భవిష్యత్తు లక్ష్యం అంటున్నారామె!!



విభాగం
లైఫ్‌సైన్సెస్
విజేత: ప్రొఫెసర్ ఉపీందర్ ఎస్.భల్లా, నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్ (ఎన్‌సీబీఎస్), టీఐఎఫ్ఆర్, బెంగళూరు.

మెదడు లెక్కలు తేల్చే పనిలో..

ఉపీందర్ ఎస్.భల్లా.. ప్రస్తుతం, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్) పరిధిలోని నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్. ఆయన న్యూరో బయాలజిస్ట్‌గా అంతర్జాతీయ స్థాయి గుర్తింపును సొంతం చేసుకున్న శాస్త్రవేత్త. ప్రధానంగా మానవ మెదడుకి సంబంధించి కంప్యూటేషనల్ మెషినరీని అవగాహన చేసుకునేందుకు విశేష పరిశోధనలు చేస్తున్నారు. ఫలితంగా ఒక వ్యక్తి ఏదైనా అంశానికి సంబంధించి సమాచారాన్ని సేకరించుకోవడం, ఆ సంక్లిష్టమైన సమాచారాన్ని దాచుకునే సామర్థ్యం; దాన్ని నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగించడం.. అందుకోసం మెదడు సంకేతాల అవసరం తదితరాలపై కొత్త విషయాలు వెల్లడయ్యాయి. ఉపీందర్ స్వస్థలం ఢిల్లీ. అమ్మానాన్న సూచన మేరకు తొలుత ఐఐటీ కాన్పూర్‌లో 1982లో ఫిజిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులో చేరారు. కానీ, ఆయన మది నిండా లైఫ్ సైన్సెస్‌కు సంబంధించిన ఆలోచనలే. దాంతో ఏడాది కూడా పూర్తి కాకుండానే ఐఐటీ కాన్పూర్‌ను విడిచిపెట్టి.. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో నేచురల్ సైన్సెస్‌లో చేరారు. ఆ తర్వాత కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి 1993లో పీహెచ్‌డీ పట్టా సొంతం చేసుకున్నారు. ఎంతో పరిశోధన, ఎన్నో ఆవిష్కరణలు చేస్తున్నప్పటికీ.. ఎలాంటి ఆడంబరాలూ లేకుండా సాధారణ వ్యక్తిగా కనిపించడం ఉపీందర్ గొప్పతనంగా చెప్పొచ్చు. 'కొత్తదనాన్ని ప్రేమిస్తాను. ఎవరికీ తెలియని విషయాల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాను'.. ఇదే తన పరిశోధనలకు ప్రేరణ అంటున్నారు ఉపీందర్. 'యువత పరిశోధనల దిశగా అడుగులు వేయాలి. పరిశోధనలు-ఆవిష్కరణలంటే బ్రహ్మపదార్థాలని భావించకూడదు. ఎంతటి నిష్ణాతులైనా ఒక పరిశోధన మొదలుపెట్టినప్పుడే దాని ఫలితం గురించి తెలియదు. అలాగని వారు పరిశోధనలు వదులుకుంటున్నారా? లేదు కదా!'. కాబట్టి అపజయం ఎదురైనా.. అదే తదుపరి విజయానికి నాంది అని గుర్తించి, ముందుకు సాగాలి' అంటూ యువతకు సలహా ఇస్తున్నారు.



విభాగం
ఫిజికల్ సైన్సెస్
విజేత: ప్రొఫెసర్ యమునా కృష్ణన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, యూనివర్సిటీ ఆఫ్ షికాగో.

నానో మెషీన్స్‌పై శోధన..

ఈ ఏడాది ఇన్ఫోసిస్ ప్రైజ్ విజేతల పరంగా మరో విశేషం.. ఫిజికల్ సైన్స్‌లో ఒక మహిళకు తొలిసారి ఈ అవార్డు లభించడం. యూనివర్సిటీ ఆఫ్ షికాగో ప్రొఫెసర్ యమునా కృష్ణన్ ఆ ఘనతను సాధించారు. డీఎన్ఏ ఆధారిత నానో మెషీన్స్ రూపొందించడం ద్వారా జీవన స్థితులను సమీక్షించడానికి, కణాల పనితీరు గురించి మరింత తెలుసుకోవడానికి చేసిన పరిశోధనలకు గుర్తింపుగా ఆమెకు ఇన్ఫోసిస్ ప్రైజ్ లభించింది. కేరళలో జన్మించిన యమునా కృష్ణన్‌కు చిన్నప్పటి నుంచి సైన్స్ ముఖ్యంగా కెమిస్ట్రీపై ఎంతో ఆసక్తి. అమ్మానాన్న కూడా ప్రోత్సహించడంతో.. బ్యాచిలర్ డిగ్రీలో కెమిస్ట్రీని ఎంపిక చేసుకుని మద్రాస్ యూనివర్సిటీ పరిధిలోని ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో బీఎస్సీ పూర్తిచేశారు. ఆ తర్వాత ఐఐఎస్సీ-బెంగళూరులో ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ పట్టాలు సొంతం చేసుకున్నారు. యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జ్ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ కూడా లభించింది. ఆ తర్వాత కొన్ని రోజులు నేషనల్ సెంటర్ ఫర్ బయలాజికల్ సైన్సెస్, టీఐఎఫ్ఆర్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 2014లో యూనివర్సిటీ ఆఫ్ షికాగోలో ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం పరిశోధనల పరంగా ప్రపంచ స్థాయి గుర్తింపు పొందారు. మనదేశంలో మహిళలు సైన్స్, అందులో రీసెర్చ్ వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఎంతో ఉందంటున్నారు యమునా కృష్ణన్. విద్యార్థినులు కెరీర్ పరంగా 9-5 వర్క్ కల్చర్ గురించే ఆలోచించకుండా.. సవాళ్లను స్వీకరించే స్థాయికి తమ ఆలోచనల పరిధిని పెంచుకోవాలని సూచిస్తున్నారు. డిగ్రీ స్థాయి వరకు సైన్స్ కోర్సుల్లో అమ్మాయిలు చేరుతున్నప్పటికీ.. పీజీ, ఆపై స్థాయిలో సంఖ్య తగ్గిపోతోందని.. దీనికి ప్రధాన కారణం మన సామాజిక-కుటుంబ పరిస్థితులే అంటున్న యమునా కృష్ణన్.. తల్లిదండ్రుల దృక్పథం కూడా మారాలని సూచిస్తున్నారు.

విభాగం
మ్యాథమెటికల్ సైన్సెస్
విజేత: ప్రొఫెసర్ రీతాబ్రతా మున్షి, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), ముంబయి.



నంబరు థియరీ విశ్లేషణ..

మ్యాథమెటిక్స్‌లో ఇప్పటికీ అనేక చిక్కుముడులతో సాగే నంబరు థియరీపై సాగిస్తున్న పరిశోధనలకు ప్రొఫెసర్ రీతాబ్రతా మున్షిని ఇన్ఫోసిస్ ప్రైజ్ వరించింది. నంబరు థియరీని విశ్లేషణాత్మక కోణంలో చూడటం, ఎల్-ఫంక్షన్స్ పరిశోధనలతో కీలక సమస్యలకు పరిష్కారం దిశగా కృషిచేస్తున్నందుకు ఆయనకు ఈ గౌరవం లభించింది. మున్షి ప్రస్తుతం టీఐఎఫ్ఆర్‌లో మ్యాథమెటిక్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు చిన్నప్పటి నుంచే లెక్కలంటే మక్కువ. ఏడెనిమిదేళ్ల వయసు నుంచే అంకెలతో కుస్తీ పట్టడం మొదలు పెట్టాడు. బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఐఎస్ఐ-కోల్‌కతాలో బీఎస్సీలో చేరినప్పటికీ.. అక్కడ ప్యూర్ మ్యాథ్స్ సబ్జెక్ట్ లేకపోవడంతో నిరాశ చెందారు. అయితే రీతాబ్రతా మున్షిలో గణితంపై ఉన్న ఆసక్తిని గమనించిన అక్కడి అధ్యాపకులు.. ప్రత్యేక అనుమతులు తీసుకుని, టీఐఎఫ్ఆర్‌లో గణితం క్లాసులకు హాజరయ్యేలా ప్రోత్సహించారు. ఇదే మున్షి జీవితాన్ని మలుపు తిప్పింది. డిగ్రీ పూర్తయ్యేసరికి నల్ స్టెలెన్‌సాట్జ్ సిద్ధాంతానికి తనదైన రీతిలో కొత్త పద్ధతి కనుగొని అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ తర్వాత ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశం లభించడం.. ఆ క్రమంలో గణితంపై చేసిన కృషికి ఎన్నో అవార్డులు, అంతర్జాతీయ ప్రశంసలు దక్కాయి. 35 ఏళ్ల వయసులోనే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డ్ సొంతమైంది. 'ఆసక్తి ఉన్న రంగంలోనే అడుగు పెట్టండి. కచ్చితంగా అవకాశాలు లభిస్తాయి. మిమ్మల్ని మీరు నిరూపించుకునే రోజు వస్తుంది' అంటూ నేటి యువతకు ఆయన సలహా ఇస్తున్నారు.



విభాగం
సోషల్ సైన్సెస్
విజేత: ప్రొఫెసర్ లారెన్స్ లియాంగ్, స్కూల్ ఆఫ్ లా, గవర్నెన్స్ అండ్ సిటిజన్‌షిప్, అంబేద్కర్ యూనివర్సిటీ, ఢిల్లీ.

న్యాయ సేవలతో..

న్యాయశాస్త్రంతో పాటు సమాజంలో ప్రస్తుతం కీలకంగా మారిన స్వేచ్ఛ, హక్కులు, సామాజిక అభివృద్ధిపై పరిశోధనలు చేస్తున్న.. అంబేద్కర్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్, లారెన్స్ లియాంగ్‌కు సోషల్ సైన్సెస్‌లో ఇన్ఫోసిస్ ప్రైజ్ లభించింది. కాపీ రైట్ చట్టం, డిజిటల్ టెక్నాలజీస్, మీడియా, సంస్కృతికి సంబంధించి ఆయన చేసిన అధ్యయన ఫలితాలు ఎన్నో సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్నాయి. నేషనల్ లా స్కూల్ యూనివర్సిటీ ఆఫ్ ఇండియాలో చదువు పూర్తయ్యాక అంబేద్కర్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరిన లారెన్స్.. యేల్, మిచిగాన్ తదితర యూనివర్సిటీలకు విజిటింగ్ స్కాలర్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఆల్టర్నేటివ్ లా ఫోరం పేరుతో సొంతంగా ఒక న్యాయ సలహా సంస్థను ఏర్పాటు చేసి పేద ప్రజలకు న్యాయపర సహాయం చేస్తున్నారు. వాస్తవానికి లియాంగ్‌కు ఇన్ఫోసిస్ ప్రైజ్ రాకముందే.. జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దీనికి కారణం.. ప్రజా సమస్యలపై ఆయన చేసిన న్యాయ పోరాటాలే. ప్రధానంగా పైరసీ, పాపులర్ కల్చర్ సమస్యలపై ఆయన పోరాటం సాగుతోంది. న్యూఢిల్లీకి చెందిన సరాయ్ సంస్థతో చేతులు కలిపి మేధో సంపత్తి-పరిజ్ఞానం/సంస్కృతి అంశాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మొదట్లో సాహిత్యంపై మక్కువ చూపిన లారెన్స్.. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో ఇంగ్లిష్ (ఆనర్స్) లిటరేచర్ పూర్తిచేశారు. మరి ఇంగ్లిష్ నుంచి లా కెరీర్ వైపు దృష్టి ఎలా మళ్లిందని అడిగితే.. 'నేను లిటరేచర్ పూర్తిచేసే సమయానికి అందులో కెరీర్ అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అదే సమయంలో బెంగళూరులో నేషనల్ లా స్కూల్ ప్రారంభమైంది. అక్కడి విద్యార్థులతో మాట్లాడినప్పుడు వారు స్పందించిన తీరుతో న్యాయ శాస్త్రంపై ఆసక్తి పెరిగింది. దీంతో తదుపరి సంవత్సరంలో అక్కడ ప్రవేశానికి అడుగులు ప్రారంభించాను' అని సమాధానం చెబుతారు. 'ఏ కోర్సులో చేరినా.. ఏ విభాగాన్ని ఎంపిక చేసుకున్నా.. దాన్ని ఆస్వాదించగలగాలి. అప్పుడు తప్పకుండా విజయం, గుర్తింపు లభిస్తుంది. ఆసక్తి లేకుండా చదివితే.. పీహెచ్‌డీ చేసినా ప్రయోజనం ఉండదు'. కాబట్టి ఆసక్తి మేరకు అడుగులు వేయాలని నేటి యువతకు సూచిస్తున్నారు లారెన్స్.

S & D

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం 1-1-2018

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్	209 ▲	34,057
నిఫ్టీ	53 ▲	10,531

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	6,903	▽ 47
డోజోన్స్	24,719	▽ 118
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,688	▲ 65
డాక్స్	12,918	▽ 62
షాంఘై	3,308	▲ 12
నికాయ్	22,765	▽ 19

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	64.80	64.93
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.48	87.66
€	యూరో	ఎస్‌బీఐ	77.76	77.92
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.70	57.82
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	50.71	50.81
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	48.63	48.73
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.47	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.85	18.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.95	11.28

ఒడిదుడుకులుంటాయి... జాగ్రత్త!

2018 స్టాక్ మార్కెట్లపై విశ్లేషకుల అంచనాలివీ...

- 2017 స్థాయి వృద్ధి ఈ ఏడాది ఉండకపోవచ్చు
- ఎన్నికలు, వడ్డీ రేట్లు, గ్లోబల్ అంశాలు కీలకం
- జెన్ సెక్యూరిటీస్ జాయింట్ ఎండీ సతీష్ కంతేటి
- 10,650 దాటితే నిఫ్టీ పరుగు 11,200కే
- టెక్నికల్ విశ్లేషకుడు మజార్ మొహమ్మద్ అంచనా
- కంపెనీల ఫలితాలే మార్కెట్‌ను నిర్దేశిస్తాయి
- అవెండాస్ క్యాపిటల్‌కు చెందిన వైభవ్ సంఘవి వ్యాఖ్య





1997 చివరి వరకూ బీభత్సమైన ర్యాలీ..! కానీ 1998లో మాత్రం అదే స్థాయి ఎగుడు దిగుళ్లు. ఆ సంవత్సరంలో స్టాక్ మార్కెట్లు ఏకంగా 40 శాతం వరకూ నష్టపోయాయి. కోలుకోవటానికి ఏడాది పట్టింది.

2007 చివరి వరకూ కూడా ఇలాంటి [illegible] ...నాలుగై[illegible]

ఇపుడు 2017లో... మునుపటి బుల్ రన్స్‌ను మైమరిపించేటంతటి డ్రీమ్ రన్. ఇండెక్స్‌లే కాదు. చాలా షేర్లు జీవితకాల గరిష్ఠ స్థాయిల్ని తాకాయి. మరి 2018లో ఏం జరుగుతుంది?

ప్రతి పదేళ్లకోసారి భారత స్టాక్ మార్కెట్లలో చరిత్ర పునరావృతమవుతుందా? ఎగుడు దిగుళ్లు కళ్లకు కడతాయా? లేకపోతే ప్రస్తుత ర్యాలీకి దేశీయ మదుపరుల వెన్నుదన్నులున్నాయి కనుక... నిధుల ప్రవాహం బాగుంది కనక ర్యాలీ ఇలాగే కొనసాగుతుందా? భవిష్యత్తును ఊహించటం కష్టమే కాగా... ఈ విషయంలో విశ్లేషకుల అభిప్రాయం ఒకింత ప్రతికూలంగానే ఉంది. అందరూ ఎత్తుపల్లాలు తప్పకపోవచ్చని చెబుతుండగా... కొందరు మాత్రం కంపెనీల ఫలితాలు బ్రహ్మాండంగా ఉంటే ఈ బుల్ పరుగు ఇలాగే కొనసాగుతుందని, నిఫ్టీ 11,000 మైలురాయిని అధిగమిస్తుందని చెబుతున్నారు. అయితే మార్కెట్లు పడకపోయినా అక్కడక్కడే కన్సాలిడేట్ కావచ్చని, కొన్ని రంగాల షేర్లు మాత్రం పరుగులు పెడతాయని ఇంకొందరు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2018పై ఎవరి అంచనాలేంటి? ఏఏ రంగాలపై బుల్లిష్‌గా ఉన్నారు? ఏఏ షేర్లను సిఫారసు చేస్తున్నారు? మొత్తంగా స్టాక్ మార్కెట్ మదుపరులకు కొత్త సంవత్సరం ఎలా ఉండబోతోంది? ఆయా వివరాలన్నీ గుదిగుచ్చి 'సాక్షి' బిజినెస్ అందిస్తున్న ప్రత్యేక కథనం మీకోసం...

“

దేశీ స్టాక్ మార్కెట్లకు 2018లో ఒడిదుడుకులు తప్పకపోవచ్చన్నది **జెన్‌మనీ జాయింట్ ఎండీ సతీష్ కంతేటి** మాట. 2017 స్థాయిలో వృద్ధి ఉండకపోవచ్చని.. అంతర్జాతీయ అంశాలతో పాటు దేశీయంగా ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు ఇందుకు కారణంగా నిలవవచ్చని 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో చెప్పారాయన. మార్కెట్ల గమనంపై ఇంకా ఆయనేమన్నారంటే...



కొత్త సంవత్సరంలో మార్కెట్లను ప్రభావితం చేయబోయే మూడు, నాలుగంశాలున్నాయి. రాబోయే బడ్జెట్‌లో మళ్లీ స్టాక్స్‌పై లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌ను (ఎల్‌టీసీజీ) ప్రవేశపెట్టొచ్చన్న అంచనాలు తక్షణం ప్రభావం చూపిస్తాయి. ఇది రెట్రాస్పెక్టివ్‌గా కాకుండా 2018 ఏప్రిల్ 1 తర్వాత కొన్న వాటికి మాత్రమే వర్తింపజేస్తే గనక మార్కెట్ మరీ నెగెటివ్‌గా రియాక్ట్ కాకపోవచ్చు. అలా కాకుండా రెట్రాస్పెక్టివ్‌గా ఉంటే మాత్రం సూచీలు పతనమయ్యే అవకాశముంది. ఏదైతేనేం.. దీనిపై అనిశ్చితితో బడ్జెట్ దాకా ఒడిదుడుకులు కొనసాగవచ్చు. మరోవైపు, డీమోనిటైజేషన్, జీఎస్‌టీ వంటి అంశాల వల్ల ఆదాయం వృద్ధి కావటానికి మరికొంత సమయం పడుతుంది. జీఎస్‌టీ తరువాత పన్నుల వసూళ్లు ఇంకా స్థిరపడలేదు. ఫలితంగా ప్రభుత్వం రూ. 50,000 కోట్ల మేర నిధులు సమీకరించాలనే యోచనలో ఉండటమనేది... ద్రవ్యలోటు పెరగటానికి దారితీయొచ్చు. అటు ఆర్‌బీఐ లక్ష్యించిన దానికన్నా కూడా ద్రవ్యోల్బణం అధికంగా ఉండొచ్చు. ఈ పరిణామాలన్నీ కూడా వడ్డీ రేట్ల పెంపునకు దారి తీయొచ్చు. ఏదైతేనేం... జీఎస్‌టీ, డీమోనిటైజేషన్ ప్రభావాల నుంచి బయటపడి ఎకానమీ పూర్తి స్థాయిలో కోలుకోవడానికి ముందే.. వచ్చే ఒకటిరెండు త్రైమాసికాల్లో వడ్డీ రేట్లు పెరిగితే మార్కెట్ నెగెటివ్‌గా స్పందించే అవకాశాలు ఉన్నాయి. ముడి చమురు ధర పెరుగుదలతో ద్రవ్యోల్బణం పెరిగి, అంతర్జాతీయ ధోరణిలోనే ఇక్కడా వడ్డీ రేట్లు పెరిగే రిస్కులున్నాయి.

ఎన్నికల ఫలితాలూ కీలకమే...



వచ్చే ఏడాది కర్ణాటక తదితర రాష్ట్రాల్లో ఎన్నికలున్నాయి. వీటి ఫలితాలను మార్కెట్ నిశితంగా పరిశీలిస్తుంది. ఆ పై ఏడాది కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుపై వీటి ప్రభావాలు ఎలా ఉండబోతున్నాయనేది చూస్తుంది. కాస్త అటూ ఇటూగా 2019లో కేంద్రంలో స్థిరమైన ప్రభుత్వమే ఏర్పడుతుందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందుకు ఏమాత్రం భిన్నమైన ఫలితాలొచ్చినా.. మార్కెట్లు నెగెటివ్‌గా స్పందించే అవకాశం ఉంటుంది. మార్కెట్లు అస్థిరతను, అనిశ్చితిని ఇష్టపడవు. పాజిటివ్‌గా కావొచ్చు.. నెగెటివ్‌గా కావొచ్చు. కొన్నాళ్లుగా చూస్తే కేంద్ర ఎన్నికలకు ముందు పరిస్థితులను బట్టి మార్కెట్లు గణనీయమైన మార్పులకు లోనవుతున్నాయి. అదే విధంగా సార్వత్రిక ఎన్నికలు 2019లోనే ఉన్నప్పటికీ ఈ రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను బట్టి మార్కెట్లు 2018 నుంచే డిస్కౌంటింగ్ చేసుకునే అవకాశాలున్నాయి. 2019లో స్థిరమైన ప్రభుత్వం వచ్చే సంకేతాలుంటే తప్ప 2018లో మార్కెట్లు... 2017 స్థాయి రిటర్నులు ఇవ్వకపోవచ్చు. 2018లో మరిన్ని ప్రతికూల పవనాలు వీచే అవకాశాలు ఉన్నందున.. కరెక్షన్ అవకాశాలు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. మార్కెట్ల వృద్ధి గతంతో పోలిస్తే తక్కువగానే ఉండొచ్చు.

కంపెనీల ఫలితాలే దిక్సూచి

"కొత్త ఏడాది భారత శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పటంతో పాటు, భారత మార్కెట్లకు టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందనేది నా అభిప్రాయం. 2008 నుంచీ ప్రపంచ ఆర్థిక ముఖచిత్రం సానుకూలంగా ఉంటోంది. 2017లో జీఎస్‌టీతో భారత ఆర్థిక వ్యవస్థ భారీ సంస్కరణలకు తెర తీసింది. పెద్ద నోట్లను రద్దు చేయటంతో సహా వీటి వాస్తవ ఫలితాలు ఇంకా తెలియాల్సి ఉంది. దేశీ స్టాక్ మార్కెట్లు మాత్రం జనవరి నుంచి వెలువడే కంపెనీల ఫలితాల్ని బట్టే ఒక మలుపు తీసుకుంటాయి."

– వైభవ్ సంఘవి, కో–సీఈఓ, అవెండాస్ క్యాపిటల్ ఆల్టర్నేటివ్ స్ట్రాటజీస్

10,650 దాటితే నిఫ్టీ @ 11,200

"2016 డిసెంబర్లో నిఫ్టీ దాదాపు 7,893 పాయింట్ల దగ్గర ఉంది. అక్కడి నుంచి ఒకే ఏడాదిలో ఏకంగా 10,500 పాయింట్లను దాటేసింది. విచిత్రమేంటంటే మధ్యలో ఎక్కడా భారీ కరెక్షన్లు కూడా రాలేదు. కాబట్టి ఈ ర్యాలీ కొనసాగుతుందనే అంచనాలున్నా... తగిన కరెక్షన్ రాకుండా ఇలా ఎంతవరకు వెళుతుందనే అనుమానాలు చాలా మందిలో ఉన్నాయి. నా ఉద్దేశం ప్రకారం నిఫ్టీ తదుపరి 10,650 పాయింట్లను చేరుతుంది. దాన్ని గనక పూర్తిస్థాయి కొనుగోళ్ల మద్దతుతో దాటేస్తే, 11,200 పాయింట్లను అవలీలగా దాటేస్తుంది. కాకపోతే కొంత జాగ్రత్తగానే ఉండాలి. ఎందుకంటే బుక్‌వేల్యూ, పీఈ రేషియో వంటి ఫండమెంటల్స్ చూసి కొనటానికి చాలా షేర్లు అనుకూలంగా లేవు. వాటిని కొంటే ఇంకా పెరుగుతాయనే నమ్మకం లేదు. కాబట్టి ముందు కంపెనీల ఫలితాలు బాగుంటేనే మరింత ర్యాలీ జరుగుతుందని ఆశించొచ్చు"

– మజార్ మొహమ్మద్, చీఫ్ స్ట్రాటజిస్ట్– చార్ట్‌వ్యూఇండియా.ఇన్

స్మాల్, మిడ్‌క్యాప్‌లో పాక్షికంగా లాభాల స్వీకరణ



మొత్తం సెక్టార్ లేదా సూచీ సంకేతాల కోసం ఎదురుచూస్తూ కూర్చోకుండా.. ఇన్వెస్టర్లు.. ఎంచుకున్న షేర్లనే కొనటం మంచిది. మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో ర్యాలీని ఉపయోగించుకుని, వేల్యుయేషన్స్ ఎక్కువగా అనిపిస్తున్న వాటిల్లో పాక్షికంగానైనా లాభాలు స్వీకరించడం శ్రేయస్కరం. తద్వారా 2018 లేదా 2019లో మార్కెట్లు కరెక్షన్‌కి లోనైనా రిస్కులు తగ్గించుకోవచ్చు.

అగ్రి,.ఇన్‌ఫ్రా స్టాక్స్‌లో అవకాశాలు ..

రంగాలవారీగా చూస్తే.. అగ్రి సంబంధిత కంపెనీలు, ఇన్‌ఫ్రా, అఫోర్డబుల్ హౌసింగ్ నిర్మాణ సంస్థల షేర్లు మెరుగ్గా ఉంటాయని అంచనా. ఇక ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాలోనూ అవకాశాలు ఉన్నాయి.. అయితే, ఈ రంగాల్లో ప్రత్యేకమైన ఉత్పత్తులు తయారు చేసే స్పెషలైజ్డ్ సంస్థల వృద్ధికి అవకాశాలు బాగా ఉండగలవు. ఫార్మా విషయానికొస్తే.. ఎక్కువగా దేశీ మార్కెట్ ప్రధానంగా కార్యకలాపాలు ఉన్న సంస్థలు మెరుగ్గా ఉండొచ్చు.



దేశీ పెట్టుబడులతో క్షీణతకు అడ్డుకట్ట..

కొన్నాళ్లుగా మార్కెట్లలోకి మ్యూచువల్ ఫండ్స్ తదితర మార్గాల్లో దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరుగుతున్నాయి. మార్కెట్ భారీగా క్షీణించకుండా ఇవి కొంత అడ్డుకట్ట వేస్తున్నాయి. 2018లోనూ ఇదే ధోరణి కొనసాగే అవకాశం ఉంది. ఇది పాజిటివ్ కోణం. అయితే, నెగటివ్ కోణం మరోటి కూడా ఉంది. మార్కెట్ బాగుంది కదాని కంపెనీలు పాలోమంటూ ఐపీవోలకి వచ్చేస్తున్నాయి. దీంతో సరఫరా భారీగా పెరిగిపోతుండటం వల్ల మార్కెట్ల పెరుగుదల ఒక స్థాయికి మాత్రమే పరిమితం అయిపోయే అవకాశాలూ ఉన్నాయి.

”

అమెరికా వడ్డీ రేట్లు, క్రూడాయిల్ రిస్కులు..

అంతర్జాతీయంగా చూస్తే.. క్రూడాయిల్ ధరలు గానీ ర్యాలీ జరిపిన పక్షంలో ఆ ప్రభావాలతో దేశీ మార్కెట్లు పెరిగే అవకాశాలు పరిమితంగానే ఉంటాయి. ఇక, 2008 నాటి మాంద్యం అనంతరం అమెరికా, యూరప్ మొదలైనవి వడ్డీ రేట్లు భారీగా తగ్గించేసి, ఉద్దీపన ప్యాకేజీలు ఇవ్వడం ద్వారా వ్యవస్థకు ఊతమిచ్చే ప్రయత్నం చేశాయి. ఆ నిధులే భారత్ తదితర మార్కెట్లలోకి ప్రవహించాయి. ప్రస్తుతం పరిస్థితులు సర్దుకుంటున్న దరిమిలా ఆయా దేశాలు క్రమంగా వడ్డీ రేట్లు పెంచడం మొదలుపెట్టాయి. అమెరికాలో పన్ను సంస్కరణలు అక్కడి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చేవిగానే ఉన్నాయి. పరిస్థితుల రికవరీతో.. అమెరికా, యూరప్ మొదలైనవి గణనీయంగా వడ్డీ రేట్లు పెంచిన పక్షంలో ఈ పరిణామాలన్నీ మన మార్కెట్‌పై ప్రభావం చూపే రిస్కుంది.

కొత్త ఏడాదికి కొన్ని బ్రోకరేజ్ సంస్థల స్టాక్ టిప్స్..!

జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

బ్యాంక్ ఆఫ్ బరోడా



దిగ్గజ బ్యాంకుల్లో ఒకటి. దేశీయంగా 5,422 శాఖలు, ప్రపంచవ్యాప్తంగా 25 దేశాల్లో 106 శాఖలతో పటిష్టమైన నెట్‌వర్క్ కలిగి ఉంది. మొండిబాకీల ప్రక్షాళనపై యాజమాన్యం దృష్టి పెట్టిన నేపథ్యంలో ఎన్‌పీఏలు తగ్గి, అసెట్ క్వాలిటీ మెరుగుపడగలదని అంచనా. ఫలితంగా లాభదాయకత పెరిగే అవకాశాలు ఉన్నాయి.

ప్రస్తుత ధర	రూ. 160
టార్గెట్ ధర	రూ. 208
వృద్ధి	30%

కెన్‌ఫిన్ హోమ్స్



ప్రస్తుత ధర	రూ. 473
టార్గెట్ ధర	రూ. 612
వృద్ధి	29%

దక్షిణాది కేంద్రంగా పనిచేస్తున్న ఈ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీని (హెచ్‌ఎఫ్‌సీ) కెనరా బ్యాంక్ ప్రమోట్ చేస్తోంది. 2022 నాటికల్లా అందరికీ గృహాలు అందించే దిశగా ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ పథకాలు మొదలైనవి కెన్‌ఫిన్ లాంటి హెచ్‌ఎఫ్‌సీలకు సానుకూలాంశం.

యూపీఎల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ (ఇండిగో), ఎన్‌బీసీసీ షేర్లూ సిఫార్సు...

హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్

జాగరణ్ ప్రకాశన్

దేశీయంగా దిగ్గజ మీడియా సంస్థల్లో ఒకటి. ప్రకటనలపరంగా ప్రింట్ మీడియాకు ఎన్నికల సీజన్ బాగా కలిసొస్తుంది. 2018లో ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలు జరగనుండటం అధిక ప్రకటనల ఆదాయం తెచ్చిపెట్టగలదు. శ్రోతల సంఖ్య పెరుగుతుండటంతో రేడియో వ్యాపార విభాగం వృద్ధి చెందుతుండటం కంపెనీకి సానుకూలాంశం.

ప్రస్తుత ధర	రూ. 179
టార్గెట్ ధర	రూ. 199-215
వ్యవధి – ఏడాది	

సౌత్ ఇండియన్ బ్యాంక్



ప్రస్తుత ధర	రూ. 31
టార్గెట్ ధర	రూ. 31-41
వ్యవధి – ఏడాది	

ప్రైవేట్ రంగంలో మధ్య స్థాయి బ్యాంకు ఇది. మొండిబాకీల భారంతో బ్యాంకింగ్ రంగం కుదేలవుతున్నప్పటికీ.. ఈ బ్యాంకు మాత్రం ఎన్‌పీఏలను గణనీయంగానే కట్టడి చేసింది. అధిక ఆదాయం ఇవ్వగలిగే రిటైల్, ఎస్‌ఎంఈ రుణ విభాగాలపై సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రధానంగా దృష్టి పెట్టింది.

సిఫార్సు చేస్తున్న మరో షేర్... ఎన్‌సీసీ

సెంట్రమ్ వెల్త్

ఆదిత్య బిర్లా క్యాపిటల్

ఆదిత్య బిర్లా గ్రూప్‌లో ఆర్థిక సేవల వ్యాపార విభాగాలన్నింటికి ఇది హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. జీవిత బీమా, అసెట్ మేనేజ్‌మెంట్, ప్రైవేట్ ఈక్విటీ, ప్రాజెక్ట్ ఫైనాన్స్, వెల్త్ మేనేజ్‌మెంట్, బ్రోకింగ్ తదితర కార్యకలాపాలు ఉన్నాయి. సంస్థ నిర్వహణలో ఆస్తుల విలువ రూ. 2,81,299 కోట్లు.



ప్రస్తుత ధర	రూ. 184
సిఫారసు– కొనొచ్చు	

మణప్పురం ఫైనాన్స్



ప్రస్తుత ధర	రూ. 123
సిఫారసు– కొనొచ్చు	

బంగారు ఆభరణాలపై రుణాలిస్తున్న పెద్ద ఎన్‌బీఎఫ్‌సీల్లో ఒకటి. సంస్థ ఏయూఎం ప్రస్తుతం రూ. 13,723 కోట్లు. కేవలం బంగారంపై రుణాల విభాగంపైనే ఆధారపడకుండా.. వ్యూహాత్మకంగా మైక్రోఫైనాన్స్, గృహ రుణాలు, వాణిజ్య వాహన రుణాలు మొదలైన వాటిల్లోకి కూడా విస్తరించింది.

ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్. పర్సిస్టెంట్ సిస్టమ్స్‌లకూ సిఫార్సు ...



“ అత్యంత ఉత్తమమైన వ్యాపార ప్రణాళిక ఏదైనా ఉందంటే అది నాణ్యతే
– జాన్ లాస్సేటర్, పిక్సర్ చీఫ్ క్రియేటివ్ ఆఫీసర్ ”

పొదుపు-మదుపు



బంగారం కొనొచ్చా?



కొంత పెరిగినా, భారీ ర్యాలీ ఉండకపోవచ్చు

జాతీయ, అంతర్జాతీయ అంశాలతో ప్రభావం ● పెట్టుబడి కోసమైతే ఇతర ఆప్షన్లు చూడొచ్చు

హెడ్జింగ్ కోసమైతే కొనుగోలు చేసుకోవచ్చు ● ఇవీ విశ్లేషకుల పసిడి పలుకులు...

అమెరికా– ఉత్తర కొరియా ఉద్రిక్త పరిస్థితులతోపాటు, అమెరికా ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో డాలర్ బలహీనత అంచనాలు ప్రపంచ వ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెంచాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో 2017లో దాదాపు 150 డాలర్లు ఎగసింది. ఒకదశలో 200 డాలర్ల పెరుగుదలనూ నమోదుచేసుకుంది. భౌగోళిక ఉద్రిక్తతలూ, అమెరికా ఆర్థిక పరిస్థితులు, డాలర్ బలహీనత వంటి అంశాలు ఈ ఏడాది పసిడిని ఏడాది గరిష్టస్థాయి 1,365 డాలర్లకు తీసుకువెళ్లాయి. అయితే 2 వారాల క్రితం 1,235 డాలర్లకు పడినప్పటికీ, మళ్లీ 1,300 డాలర్ల పైకి ఎగసింది. ఈ ర్యాలీ కొనసాగుతుందా? అన్న సందేహం రావడం సహజం. విశ్లేషకులు మాత్రం పెద్దగా ర్యాలీ ఉండకపోవచ్చంటున్నారు.

అంతర్జాతీయంగా పసిడి వరుసగా మూడవ వారమూ పరుగుపెట్టింది. వారంలో 26 డాలర్లు ఎగసి ఏకంగా కీలక నిరోధస్థాయి 1,300 డాలర్లను దాటి 1,305 డాలర్ల వద్ద ముగిసింది. దీనితో అంతర్జాతీయ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ నైమెక్స్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రా) ధర మూడు వారాల్లో దాదాపు 50 డాలర్లు పెరిగినట్లయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి 200 రోజుల కదలికల సగటు 1,277.70 డాలర్లు. డాలర్ ఇండెక్స్ భారీ పతనం దీనికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెప్పవచ్చు. గడచిన వారంలో 0.89 సెంట్లు పతనమై, 91.99 వద్ద ముగిసిన డాలర్ ఇండెక్స్, అంతక్రితం వారంలో 1.08 డాలర్లు పతనమైన సంగతి తెలిసిందే. డాలర్ ఇండెక్స్ 52 వారాల కనిష్టస్థాయి 90.99 వైపు పయనిస్తే, అది పసిడి అప్‌ట్రెండ్‌కు మరింత ఊతం ఇస్తుందన్న విశ్లేషణలు ఉన్నాయి.

భౌగోళిక ఉద్రిక్తతలు.. డాలర్ ప్రభావం

ఉత్తరకొరియా అణు క్షిపణి ప్రయోగాలతో భౌగోళికంగా ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, జపాన్, దక్షిణ కొరియాలు ఉత్తరకొరియా తీరుపై మండిపడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏం జరుగుతోందో చెప్పలేని పరిస్థితి. ఇక డాలర్ బలహీన ధోరణి కొనసాగుతోంది. ఈ రెండు అంశాలూ ఇలానే కొనసాగితే మాత్రం అంతర్జాతీయంగా బంగారం ధరలు ఔన్స్‌కు మళ్లీ 1360 డాలర్ల మార్కు వరకు వెళ్లే అవకాశాలున్నాయని ఏంజెల్ కమోడిటీస్‌కు చెందిన ముఖ్య విశ్లేషకుడు ప్రథమేష్ మాల్యా అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయంగా బంగారం ధరలు మళ్లీ పటిష్ట స్థాయికి చేరాయి. బంగారంలో ర్యాలీ మొదలైందా...? ముస్ముందు మరింత పెరుగుదల ఉంటుందా? ఈ సమయంలో పెట్టుబడి పెట్టొచ్చా...? ఇలాంటి సందేహాలు ఎన్నో సామాన్య ఇన్వెస్టర్లలో ఉండటం సహజం. ఈ నేపథ్యంలో నిపుణుల అభిప్రాయాలు ఎలా ఉన్నదీ చూద్దాం..

డాలర్ బలహీనపడితే మాత్రం...

అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచినప్పటికీ, (ప్రస్తుతం ఫెడ్ ఫండ్ రేటు 1.25–1.50 శాతం శ్రేణి) ట్రంప్ విధానాలపై ఆందోళనలు డాలర్‌ను బలహీనపరిచే అంశాలు. ఇవి బంగారానికి బలాన్నిస్తాయన్నది మరో విశ్లేషణ. రానున్న నెలల్లో బంగారం ధరలు పైదిశగా ఒక శ్రేణిలో చలిస్తాయని భావిస్తున్నట్టు జియోఫిన్ కామ్‌ట్రేడ్ రీసెర్చ్ హెడ్ హరీష్ చెప్పారు. అంతర్జాతీయంగా బంగారం ట్రేడింగ్ డాలర్లలో జరుగుతుంటుంది. ప్రధాన కరెన్సీలతో డాలర్ కొంత బలహీనం అయిందని, ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు పెంచితేనే ఇది తిరిగి బలోపేతం కాగలదని విశ్లేషకుల అభిప్రాయం. కానీ, ట్రంప్ వివాదాస్పద ఆర్థిక విధానాలు డాలర్‌ను బలహీనపరిచే అవకాశం ఉంది.

దూసుకుపోయిన పసిడి....



- వారంలో 26 డాలర్ల పెరుగుదల
- అప్‌ట్రెండ్ వరుసగా ఇది మూడవవారం
- డాలర్ ఇండెక్స్ పతనం నేపథ్యం...

దేశీయంగా పరుగు...

అంతర్జాతీయంగా పసిడి పెరుగుదల, దేశీయంగా రూపాయి పటిష్టత వల్ల (అంతర్జాతీయ మార్కెట్‌లో వారంలో 25 పైసలు బలపడి 63.87) దేశంలోనూ బంగారం మెరిసింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్– ఎంసీఎక్స్‌లో వారంలో ధర రూ.500 పెరిగి పెరిగి రూ.29,165 కు చేరింది. ఇక ముంబై స్పాట్ మార్కెట్లో వారంవారీగా 99.9 స్వచ్ఛత ధర రూ.545 పెరిగి రూ. 29,390 వద్ద ముగిసింది. వెండి ధర కేజీకి రూ.1,245 లాభపడి రూ. 38,425 వద్ద ముగిసింది. 2017లో దేశీయంగా బంగారం రూ.28,050 నుంచి రూ.29,390కి చేరింది. ఒకదశలో గరిష్టస్థాయి రూ.31,300 స్థాయినీ దాటింది.

బంగారం డిమాండ్ తక్కువే!!

బంగారం ధరలు ర్యాలీ చేయాలంటే దీనికి డిమాండ్ పెరగాలి. కానీ, ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గణాంకాలను పరిశీలిస్తే బంగారానికి డిమాండ్ 2017 తొలి ఆరు నెలల కాలంలో 14 శాతం తగ్గి ఎనిమిదేళ్ల కనిష్ట స్థాయికి పడిపోయి 2,003.8 టన్నులకు చేరింది. దేశీయంగా జీఎస్టీ తర్వాత బంగారానికి డిమాండ్ తగ్గిపోయినట్టు మోతీలాల్ ఓస్వాల్ కమోడిటీస్‌కు చెందిన సహాయ వైస్ ప్రెసిడెంట్ నవనీత్ దమాని తెలిపారు. జీఎస్టీ అన్నది భారీ పారదర్శకతను తీసుకొచ్చే సంస్కరణ అని, బంగారు ఆభరణాల వ్యాపారం ఎక్కువ శాతం అవ్యవస్థీకృత రంగంలో ఉన్నందున పరిస్థితులు సర్దుకోవడానికి 12–18 నెలలు పడుతుందని ప్రపంచ స్వర్ణ మండలి భారత విభాగం ఎండీ పీఆర్ సోమసుందరం చెప్పారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోనూ బంగారానికి డిమాండ్ తక్కువగానే ఉంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు చాలా రాష్ట్రాల్లో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో రైతుల ఆదాయం తగ్గిపోతుందని, ఆ ప్రభావం గ్రామీణ ప్రాంతాల్లో బంగారం డిమాండ్‌పై ఉంటుందని నివేష్ కమోడిటీస్ డైరెక్టర్ మనోజ్ కుమార్ జైన్ పేర్కొన్నారు.

కొనుగోలుకు ఇది సరైన సమయమా?

బంగారం ఈ స్థాయి నుంచి గణనీయంగా పెరిగే అవకాశాలు లేవని ఎక్కువ మంది అనలిస్టులు చెబుతున్నారు. ఒకవేళ ఇన్వెస్ట్ చేయాలనుకుంటే కరెక్షన్ వరకు ఆగి తగ్గిన తర్వాత పరిశీలించొచ్చన్నది వారి సూచన. అయితే, అసాధారణ పరిణామాల నుంచి తమ పెట్టుబడుల విలువను రక్షించుకునే చర్యల్లో భాగంగా పోర్ట్‌ఫోలియోలో బంగారాన్ని కొనసాగించే వారు కొందరుంటారు. వారు కొనుగోళ్లకు వెళ్లొచ్చని అవుట్‌లుక్ ఆసియా క్యాపిటల్ సీఈవో మనోజ్ నాగ్‌పాల్ సూచించారు. ఈక్విటీ మార్కెట్లు గరిష్ట విలువల్లో ఉండటం, భౌగోళిక ఉద్రిక్తతల పరిస్థితులను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు.

దిగుమతి సుంకంతో ధరలది ఎగువబాటే?

గత తొమ్మిది నెలల కాలంలో డాలర్‌తో రూపాయి మారకం విలువ 69 నుంచి 64కు దిగొచ్చింది. నిపుణులు మాత్రం ఇది ఎక్కువ కాలం కొనసాగుతుందని భావించడం లేదు. నిధుల ప్రవాహం వల్ల స్వల్ప కాలంలో బంగారం ధర కొంత మేర పెరగొచ్చని, రూపాయి వచ్చే ఏడాది పాటు 64–65 స్థాయిలోనే కొనసాగొచ్చని వారు అంచనా వేస్తున్నారు. మన దగ్గర బంగారం ధరలు అధికంగా ఉండటానికి కారణం ప్రభుత్వం దిగుమతులపై 10 శాతం పన్ను వేయడమే. దిగుమతులు తగ్గించటానికి ఈ పన్నులు విధించిన ప్రభుత్వం... భౌతిక బంగారంలో పెట్టుబడులకు ప్రత్యామ్నాయంగా గోల్డ్ బాండ్లను ప్రమోట్ చేస్తోంది. కనుక దిగుమతి సుంకం తగ్గించే అవకాశాల్లేవని మనోజ్ కుమార్ జైన్ అభిప్రాయపడ్డారు.

బంగారంపై పెట్టుబడి ఏ రూపంలో?

ఆభరణాల రూపంలో కొంటే ఎన్నో రకాల అదనపు చార్జీలు పడతాయి. భౌతిక రూపంలోనే బంగారాన్ని కొనాలనుకుంటే ఆభరణాలకు బదులు కడ్డీలు, కాయిన్ల రూపంలో కొనుగోలు చేయటం నయం. తరుగు, అదనపు చార్జీల రూపేణా నష్టం ఉండదు. పసిడి ఏ రూపంలో కొన్నా జీఎస్టీ భారం ఉండనే ఉంది. బంగారం బార్లను కొన్నప్పుడు 3 శాతం జీఎస్టీ చెల్లించాలి. అసాధారణ ఆర్థిక పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న బంగారం కంటే భౌతిక రూపంలో ఉన్న బంగారానికే డిమాండ్ ఉంటుందని మరో విశ్లేషణ. ఆర్‌బీఐ జారీ చేసే సార్వభౌమ బంగారం బాండ్లు మరో ఆప్షన్. పెట్టుబడి కోణంలో ఇది ఉత్తమ సాధనం. ఎందుకంటే వార్షికంగా వడ్డీ పొందడానికి అవకాశం ఉంది. ఐదేళ్లకు పైన పెట్టుబడులు కొనసాగించే వారికి ఇవి అనువైనవి. బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) మూడో ఆప్షన్. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు వెంటనే నగదు పొందాలనుకునే వారికి గోల్డ్ ఈటీఎఫ్‌లు అనువుగా ఉంటాయి. ఎందుకంటే వీటికి లిక్విడిటీ ఎక్కువ. అయితే ఈటీఎఫ్ పెట్టుబడుల విలువపై ఫండ్ హౌస్ వార్షికంగా ఒక శాతం వ్యయాల పేరుతో మినహాయించుకోవడం ప్రతికూలం.



సెలవు తీసుకుంటున్నారా...?

విరామంతో పనిలో చురుకుదనం ● ఏటా కొన్ని రోజుల పాటు బ్రేక్ ● అందుకు ముందు నుంచే ప్రణాళిక

విదేశాల్లోనయితే ఉద్యోగులు ఏటా కొన్ని రోజులు సెలవు పెట్టి వెళ్లడం సర్వ సాధారణం. కంపెనీలు కూడా దీన్ని ప్రోత్సహిస్తూ ఉద్యోగులకు సెలవు కాలంలో అదనపు వేతనాలు చెల్లిస్తుంటాయి. ఆస్ట్రేలియా పత్రిక సిడ్నీ హెరాల్డ్‌లో నిబంధనల ప్రకారం ఉద్యోగులు ఏటా 40 రోజులు సెలవుపై వెళ్లడం తప్పనిసరి. ఈ కాలంలో వారికి సాధారణ వేతనం కంటే 50 శాతం అదనంగా చెల్లిస్తారు. కానీ, మనదేశంలో పరిస్థితులు భిన్నం. నిత్య జీవితపు ఒత్తిళ్లను పక్కన పెట్టి కొన్ని రోజుల పాటు సెలవుపై వెళ్లొద్దామన్నా... సెలవు దొరకడం కష్టం. ఒకవేళ సెలవు దొరికినా... ఏదైనా టూర్‌కు వెళ్లి వద్దామనుకుంటే అందుకు సరిపడా నిధులుండవు. ఎక్కువ మందికి ఎదురయ్యేవి ఈ పరిస్థితులే.

మన దేశంలో ఉద్యోగంలో పని ఒత్తిడి కూడా ఎక్కువే. ఇక ఈ ప్రపంచంలో సెలవుల భాగ్యం నోచుకుని వారిలో భారతీయులు నాలుగో స్థానంలో ఉన్నట్టు ‘ఎక్స్‌పీడియా వెకేషన్ డిప్రీవియేషన్ రిపోర్ట్ 2016’ చెబుతోంది. ఇటీవలే ఎకనమిక్ టైమ్స్ నిర్వహించిన సర్వేలోనూ మూడింట రెండొంతులు తమకు తగినంత విరామం దొరకడం లేదనే చెప్పారు. మన దేశంలో ముఖ్యంగా మధ్య వయసులో ఉన్న వారు ఎక్కువగా సెలవులకు దూరమవుతున్నారు. 30 ఏళ్లలోపు వారిలో ఇది 64 శాతం ఉంటే 41–50 ఏళ్ల మధ్య వయసు వారిలో ఇది 71 శాతంగా ఉంది. ఒకవేళ వీలు దొరికి సెలవు చిక్కి ఎటైనా వెళ్లినా గానీ, వారు కార్యాలయానికి సంబంధించిన మెయిల్స్‌ను తరచూ చెక్ చేసుకోవడంతోపాటు, తమ ఫోన్‌కు వచ్చే ఆఫీసు సంబంధిత కాల్స్‌ను రిసీవ్ చేసుకుని సమాధానం చెప్పాల్సి వస్తుందట. కానీ, మనస్తత్వ శాస్త్రవేతల విశ్లేషణ ప్రకారం కేవలం ఉద్యోగం, పనే కాదు!! విరామం, విశ్రాంతి కూడా అవసరమే. ఈ రెండింటినీ సమన్వయం చేసుకోవాలి. ఉద్యోగికి తగినంత విశ్రాంతి లభిస్తే పని మీద ఎక్కువ దృష్టి సారించగలరనేది వారి మాట.

ఎందుకని...?

మన దేశంలో ఉద్యోగులు ఎక్కువ రోజుల పాటు సెలవు తీసుకునే సాహసం దాదాపు చేయరు. అన్నేసి రోజులు సెలవు పెట్టి యాజమాన్యం ఆగ్రహానికి గురి కావడం ఎందుకన్న ధోరణే అందుకు కారణమన్నది నిపుణుల మాట. కొన్ని కంపెనీల్లో ఉద్యోగులు సెలవు తీసుకోవడాన్ని నిరుత్సాహపరిచే విధానాలు కూడా అమలవుతుంటాయి. అయితే, మరింత మంది యువత ఉద్యోగాల్లోకి వస్తున్న నేపథ్యంలో ఈ ధోరణి మారాల్సి ఉందని పీపుల్ స్ట్రాంగ్‌కు చెందిన దేవాశిష్ శర్మ అభిప్రాయపడ్డారు.

ప్రాధాన్యతలు, ప్రణాళిక



సెలవు సంపాదించారనుకోండి... ఆ తర్వాత దృష్టి సారించాల్సింది ప్రణాళికపైనే. తగిన ప్రణాళిక, షెడ్యూల్‌తో సెలవులను పూర్తిగా ఆస్వాదించొచ్చంటున్నారు నిపుణులు. హైదరాబాద్‌కు చెందిన స్వాతి, కిరణ్ దంపతులు ఏటా ఓ పది రోజుల పాటు వెకేషన్‌కు వెళ్లడం తప్పనిసరిగా చేస్తుంటారు. అందుకోసం వారు టికెట్లు, హోటల్ రూమ్‌ను చాలా ముందుగానే బుక్ చేసుకుంటారు. దీంతో తక్కువ చార్జీలకే బుకింగ్ పూర్తి చేయడం ద్వారా వారు తగినంత ఆదా చేసుకుంటున్నారు. వీరి టూర్ బడ్జెట్ రూ.60,000. దీంతో ఎక్కడికి వెళ్లాలి, ఏ మార్గంలో వెళ్లాలి. అక్కడ ఏమేం చూడాలి, స్థానికంగా విడిది, భోజనం, ప్రయాణం ఇవన్నీ కూడా కచ్చితమైన ప్రణాళిక మేరకు ప్లాన్ చేసుకుని బడ్జెట్‌లోపే వెకేషన్ పూర్తి చేస్తామని వారు తెలియజేశారు.

బడ్జెట్ కీలకం

ప్రయాణానికి కావాల్సింది బడ్జెటే. వాస్తవానికి మన దేశంలో ఎక్కువ మంది పొదుపరులే. కానీ ఎటైనా వెళ్లాలనుకుంటే మాత్రం డబ్బులకు కటకట కనిపిస్తుంది. 34 శాతం మంది ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. కారణం సెలవు పెట్టి ఎటైనా వెళ్లి రావడం అన్నది వారి దృష్టిలో ముఖ్యం కాకపోవడం ఒకటైతే, రెండోది పొదుపు చేయకపోవడం. అందుకే వెకేషన్‌కు బడ్జెట్ నిర్ణయించుకుని ప్రతీ నెలా కొంత మొత్తం పక్కన పెడుతూ వెళ్లడమే దీనికి పరిష్కారం. ఇందుకోసం సిప్ మంచి మార్గం అంటున్నారు ఆర్థిక సలహాదారులు. బడ్జెట్‌కు అనుగుణంగా నెలకు రూ.2,000 నుంచి వీలైనంత షార్ట్ టర్మ్ డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు వీటిని నగదుగా మార్చుకోవచ్చు. పైగా ఆటుపోట్లు లేకుండా స్థిరమైన రాబడులు ఇస్తాయి ఇవి. ఏడాది, ఆలోపు అవసరాల కోసం స్టాక్స్‌లో, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే రిస్క్ కారణంగా అసలు లక్ష్యం నెరవేరకపోవచ్చు. గుర్తు పెట్టుకోవాల్సిన అంశం ఏమిటంటే మీ స్వల్ప కాలిక అవసరం కోసం పొదుపు చేస్తున్నారే గానీ, రాబడుల కోసం ఇన్వెస్ట్ చేయడం లేదు. అందుకే రిస్క్ సాధనాలను ఎంచుకోవడం తగదు. ఒకవేళ హాలిడే ప్లాన్‌కు మూడు, నాలుగేళ్ల సమయం ఉంటే అప్పుడు ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఎక్కువ వ్యవధి ఉంటుంది కనుక, రిస్క్ ఉన్నప్పటికీ పొదుపుతోపాటు మెరుగైన రాబడులూ అందుకోవచ్చు.

మార్పునకు నాంది... ఈ-అసెస్‌మెంట్లు

2006 నుంచి ఆదాయపు పన్ను రిటర్నులను ఈ-ఫైలింగ్ ద్వారా చేయాలి. జనాలు అలవాటు పడ్డారు. అది సజావుగానే సాగుతోంది. 10 సంవత్సరాల తర్వాత అంటే 2016లో ఈ-అసెస్‌మెంట్లకు నాంది పలికారు. మామూలు అసెస్‌మెంట్‌లో అధికారులు నోటీసులిస్తారు. బదులుగా మనం అధికారులను కలిసి వారు అడిగిన అన్ని కాగితాలు, డాక్యుమెంట్లు ఇవ్వాలి. అంతేకాక అకౌంట్స్ బుక్స్, పాస్‌బుక్‌లు, రుజువులు, ధ్రువీకరణ పత్రాలు, అగ్రిమెంట్లు ఇలా సవాలక్ష కాగితాలు అందివ్వాలి. వారు రమ్మన్నప్పుడు వెళ్లాలి. చాలా సార్లు కలవాలి. వివరణలివ్వాలి. ఎంతో కాలం, ప్రయాస, వెళ్లి రావడానికి రవాణా ఖర్చులు, నిరీక్షణ, వాదోపవాదాలు, అధికారులు అదిరింపు, అసెసీ భయపడటం, ఒక్కొక్క కేసుకు సంబంధించి డిపార్ట్‌మెంట్‌లో ఉన్న కాగితాల కట్టల గుట్టలు.. ఇలా ఎన్నో. సవ్యంగా సాగితే సవరణ, వివరణ ఉంటాయి. లేదంటే రణమే. వీటన్నింటికీ మించి వ్యక్తిగత అభిప్రాయం, అభిమానం, అనుమానం ఎక్కువ పాత్ర పోషిస్తాయి. వీటి ప్రభావం ఆదాయపు పన్ను భారంపై పడుతుంది. మంచి లేకపోలేదు. అధికారులు ఓపికగా ఉంటారు. ఇబ్బందులు వింటారు. సకాలంలో కాగితాలు ఇవ్వకపోతే తగిన కారణం ఉంటే సహకరిస్తారు. మానవతా దృక్పథం ఉంటుంది. అర్థం చేసుకుంటారు. సర్దుబాటు, దిద్దుబాటు, వెసులుబాటు ఉంటాయి. ఇలా గత 50 సంవత్సరాలుగా జరుగుతున్న ప్రక్రియలో... ఈ-గవర్నెన్స్‌లో భాగంగా వస్తున్నాయి ఈ-అసెస్‌మెంట్లు. ఈ-ప్రోసీడింగ్స్‌లో నోటీసులు, ప్రశ్నలు ఉంటాయి. మొబైల్ ఫోన్‌కి సంక్షిప్త సమాచారం ఇస్తారు. స్క్రూటినీ పాక్షికమా, సమగ్రమా తెలియజేస్తారు. అయితే అసెసీకి ఒక అవకాశమిస్తారు. ఇక్కడ మాన్యువల్ లేదా ఈ-అసెస్‌మెంట్ అనేది మన ఇష్టం. మీరు ఇవ్వాల్సిన సమాచారం ఈ-మెయిల్ ద్వారా ఇవ్వాలి. అది 10 మెగాబైట్స్ దాటకూడదు. ఎప్పటికప్పుడు మై అకౌంట్‌లోకి వెళ్లి చెక్ చేసుకోవాలి. మెయిల్స్ ఓపెన్ చేసి సమాధానమివ్వాలి. అధికారులకు తగిన సమాచారం లభించిన తర్వాత క్లోజ్ చేస్తారు. తర్వాత ఆర్డర్లు ఈ-మెయిల్ ద్వారా వస్తాయి. ఇది పూర్తిగా టెక్నాలజీ మీద ఆధారపడి జరిగే ప్రక్రియ. మీ కాగితాల్లో ఉన్న దాని ప్రకారం జరుగుతుంది. మీ కాగితాలే మాట్లాడతాయి. మీ మాట ఎవ్వరూ విన్నరు. మిమల్ని ఎవ్వరూ చూడరు. వయోవృద్ధులకు ఇది శరఘాతం. కాగితాల్లో తప్పు చోటుచేసుకుంటే అసెస్‌మెంట్ తప్పవుతుంది. సర్దుబాటుకు అవకాశం లేదు. వ్యక్తిగత విచారణ ఉండదు.



డిజిటలైజేషన్ జిందాబాద్

అక్షరాస్యతలో వెనకున్నాం. ఈ టెక్నాలజీతో పరిగెత్తగలమా? అధికారులకిది కొత్తే. అసెసీలకు వింత. కొత్తపొంతలు తొక్కేటప్పుడు వెసులుబాటు, సర్దుబాటు ఉండాలి. ఇన్‌కమ్ ట్యాక్స్ అసెస్‌మెంట్ కేవలం రికార్డుల ప్రకారం జరిగే ప్రక్రియ కాదు. ప్రతి దాన్నీ కాగితాలతో, రుజువులతో బేరీజు వేయకూడదు. కాగితం అంటే చట్టం. కానీ న్యాయం, ఔచిత్యం చూడాలి. ఎందుకంటే కాగితాలకందని ఎన్నో విషయాలుంటాయి. ఖర్చు స్వభావం, ప్రయోజనం, వాస్తవికత, నిజాయితీ, వర్తింపు, న్యాయం, విశ్వసనీయత, ఉద్దేశం వీటన్నింటిలో అధికారులు సంతృప్తి చెందాలి. వీటన్నింటికీ మానవ దృక్పథం వెన్నెముకలాగా ఉంటుంది. మొదట్లో ఇబ్బందులు ఉన్నా ఇరువురి సహకారంతో ముందుకు వెళ్లొచ్చు. విద్యతో నిమిత్తం లేకుండా కొన్ని కోట్ల మంది మొబైల్స్ వాడుతున్నారు. ఈ పేమెంట్లు చేస్తున్నారు. మార్పుకి ఓటేస్తున్నారు. మంచి ఫలితానిచ్చే ఏ మార్పునైనా ప్రజలు మన్నించక తప్పదు.

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య



ట్యాక్సేషన్ నిపుణులు

● యాప్‌కీ కహానీ...

తెలంగాణ ఇ-చలాన్





రవి ఎస్‌బీఐ చెక్‌బుక్ కోసం బ్యాంకుకు వెళ్లాడు. పార్కింగ్ స్థలం లేకపోవడంతో బైక్‌ను రోడ్డుపైనే ఆపాడు. పని అయిపోయిన వెంటనే ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత రోజూవారీ కార్యకలాపాల్లో బిజీ అయ్యాడు. ఒకరోజు రోడ్డుపై బైక్‌లో వెళ్తుంటే రవిని ట్రాఫిక్ పోలీసులు ఆపారు. డాక్యుమెంట్లు అడిగారు. చూపించాడు. అయితే హెల్మెట్ పెట్టుకోలేదు. దీంతో వారు జరిమానా వేసి పంపించారు. దాన్ని కట్టేదామని ఈ-సేవకు వెళ్లాడు. అక్కడ రవి షాక్ అయ్యాడు. ఎందుకంటే అతని బైక్‌పై రెండు చలానాలు ఉన్నాయి. ఒకటేమో హెల్మెట్‌ది అయితే. మరొకటేమో పార్కింగ్‌కు సంబంధించినది. ఇప్పుడు ఈ విషయం ఎందుకంటే మన వాహనంపై చలానాలు ఏమైనా ఉన్నాయా? లేవా? అని తెలుసుకునేందుకు ‘తెలంగాణ ఇ-చలాన్’ అనే యాప్ అందుబాటులో ఉంది. దీన్ని తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ ఆవిష్కరించింది. ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు


- వెహికల్ నంబర్, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ సాయంతో యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ట్రాఫిక్ పెండిగ్ చలానాలు ఏమైనా ఉన్నాయేమో చూసుకోవచ్చు. ఉంటే వాటికి సంబంధించిన పూర్తి వివరాలు పొందొచ్చు.
- చలానా మొత్తాన్ని యాప్ ద్వారా చెల్లించొచ్చు.

సాక్షి



బొమ్మ-బొరుసు

"చేసే పనిని ప్రేమిస్తే.. అద్భుతమైన ఫలితాలు వస్తాయి
– స్టీవ్ జాబ్స్, యాపిల్ సహవ్యవస్థాపకుడు."



ఈక్విటీల్లో మ్యూచువల్ ఫండ్స్
పెట్టుబడులు రూ.1.2లక్షల కోట్లు
2017లో స్టాక్ మార్కెట్లకు వెన్నుదన్ను



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ 2017 సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లో రూ.1.2 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టగా, 2018 పట్ల కూడా ఎంతో ఆశాభావంతో ఉన్నాయి. 2016లో చేసిన ఈక్విటీ పెట్టుబడుల కంటే రూ.48,000 కోట్లు అధికం. ''రియల్ ఎస్టేట్, బంగారం కంటే ఆర్థిక సాధనాలకు ప్రాధాన్యం ఇస్తున్న ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. ఇది ఇక ముందూ కొనసాగే అవకాశం ఉంది. మ్యూచువల్ ఫండ్స్ స్థిరమైన రాబడులు ఇస్తుండటం, వివేకంతో కూడిన రిస్క్ నిర్వహణ, ఇన్వెస్టర్లలో అవగాహనకు చేపడుతున్న చర్యలు మ్యూచువల్ ఫండ్ ఉత్పత్తుల విస్తరణకు దోహదం చేస్తోంది'' అని కోటక్ మ్యూచువల్ ఫండ్ సీఐవో హర్ష ఉపాధ్యాయ తెలిపారు. మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీల్లో అధిక పెట్టుబడులకు రిటైల్ ఇన్వెస్టర్ల బలమైన భాగస్వామ్యం చేదోడుగా నిలుస్తోంది. ఎక్కువ విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఆధారంగా నడిచే స్టాక్ మార్కెట్లకు ప్రస్తుతం దేశీయ ఇన్వెస్టర్ల నుంచే తగినంత లిక్విడిటీ లభిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనికి నిదర్శనం ఎఫ్‌పీఐలకు మించి ఈక్విటీల్లో ఫండ్స్ పెట్టుబడులు పెట్టడమే. ఎఫ్‌పీఐలు 2017లో రూ.50,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అంతకుముందు ఏడాదిలో ఈక్విటీ పెట్టుబడులు రూ.20,500 కోట్లుగానే ఉన్నాయి. ''ఈ ఏడాది దేశీయ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు ఈక్విటీ పెట్టుబడుల విషయంలో ఎఫ్‌పీఐలను మించిపోయారు. దీంతో మార్కెట్ ఎఫ్‌పీఐల నిధులపై తక్కువగా ఆధారపడింది. దీనివల్ల ఎఫ్‌పీఐల పెట్టుబడులు ఉపసంహరణ సమయాల్లోనూ మన మార్కెట్లకు తగినంత స్థిరత్వం ఏర్పడింది. దేశీయ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల మద్దతుగా స్టాక్ మార్కెట్లు ముందుకు కొనసాగాయి'' అని మార్నింగ్ స్టార్ ఇండియా సీనియర్ అనలిస్ట్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ పేర్కొన్నారు.

గణాంకాలు కీలకం

స్టాక్ మార్కెట్‌పై కొత్త ఏడాది తొలి వారంలో తయారీ, సేవల రంగానికి చెందిన పీఎంఐ(పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్) గణాంకాలు, వాహన విక్రయ వివరాలు ప్రభావం చూపుతాయని విశ్లేషకులంటున్నారు. డాలర్‌తో రూపాయి మారకం కదలికలు, విదేశీ, దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళి, ప్రపంచ మార్కెట్ల పోకడ, వీటితో పాటు పార్లమెంట్ శీతాకాల సమావేశాల పరిణామాల ప్రభావం కూడా స్టాక్ మార్కెట్‌పై ఉంటుందని వారంటున్నారు. కంపెనీల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలను కూడా ఇన్వెస్టర్లు గమనిస్తారని నిపుణులంటున్నారు.

ఈ వారం మార్కెట్ ప్రభావిత అంశాలు

- నేడు వాహన విక్రయ వివరాలు
- రేపు సేవల రంగం పీఎంఐ గణాంకాలు
- ఈ నెల 4న తయారీ రంగ పీఎంఐ గణాంకాలు

రేపు 'తయారీ' పీఎంఐ గణాంకాలు

రేపు(ఈ నెల 2 మంగళవారం) మార్కెట్ ఎకనామిక్స్ సంస్థ భారత తయారీ రంగానికి సంబంధించి గత నెల పీఎంఐ గణాంకాలను విడుదల చేస్తుంది. అక్టోబర్‌లో 50.3గా ఉన్న ఈ పీఎంఐ గత ఏడాది నవంబర్లో 52.6కు పెరిగింది. ఈ నెల 4వ తేదీ(గురువారం) మార్కెట్ ఎకనామిక్స్ సంస్థ భారత సేవల రంగానికి సంబంధించి గత ఏడాది డిసెంబర్ పీఎంఐ గణాంకాలను ఉదయం గం.10.30కు వెల్లడిస్తుంది. గత ఏడాది అక్టోబర్‌లో 51.7గా ఉన్న ఈ పీఎంఐ గత ఏడాది నవంబర్‌లో 48.5కు తగ్గింది.

వేల్యూయేషన్లు కొనసాగుతాయ్..!

ముడిచమురు ధరల గమనం స్టాక్ సూచీలపై ప్రభావం చూపుతుందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. స్టాక్‌మార్కెట్ సానుకూల ఫండమెంటల్స్ కారణంగా వేల్యూయేషన్లు కొనసాగుతాయని ఆయన అంచనా వేస్తున్నారు. కంపెనీల ఎర్నింగ్స్ ఏమైనా వృద్ధి చెందుతాయోమోనన్న ఆశతో ఇన్వెస్టర్లు క్యూ3 ఫలితాల కోసం చూస్తున్నారని తెలిపారు. రానున్న కేంద్ర బడ్జెట్, ప్రభుత్వ సంస్కరణలు.. రంగాల వారీ షేర్ల వైపు ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తాయని వివరించారు. కంపెనీల ఉత్పత్తి సామర్థ్య పెంపు యత్నాలు, మూలధన పెట్టుబడుల్లో రికవరీ పుంజుకుంటే,... మార్కెట్ ముందుకే సాగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాదికి కంపెనీల క్యూ3 ఫలితాలు అత్యంత కీలకం కానున్నాయని ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ చెప్పారు. ఇక అందరి కళ్లు బడ్జెట్‌పై ఉంటాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకే ఈ బడ్జెట్ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్న అంచనాలున్నాయని యాక్సిస్ సెక్యూరిటీస్ సీఈఓ అరుణ్ తుక్రల్ చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అశాంతిని తొలగించే మంచి అవకాశం ఇప్పుడు ప్రభుత్వానికి దక్కిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇక అంతర్జాతీయ పరంగా చూస్తే, చైనా, యూరోజోన్, అమెరికా తయారీ రంగ గణాంకాలు రేపు(మంగళవారం, జనవరి 2న) వస్తాయి. ఈ ప్రాంతాల సేవల రంగ గణాంకాలు గురువారం(జనవరి 4న) వస్తాయి. డిసెంబర్‌లో జరిగిన ఫెడ్ మినట్స్ బుధవారం(ఈ నెల 3న) వస్తాయి. కాగా గత ఏడాది సెన్సెక్స్ 28 శాతం, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 29 శాతం చొప్పున లాభపడ్డాయి. గత మూడేళ్లలో స్టాక్ మార్కెట్‌కు ఇదే మంచి పనితీరు.



విదేశీ ఈక్విటీ పెట్టుబడులు రూ.51 వేల కోట్లు

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌ఐఐ) గత నెలలో రూ.5,883 కోట్ల విలువైన పెట్టుబడులను స్టాక్ మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. రూ.2,350 కోట్ల మేర డెట్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టారు. ముడి చమురు ధరలు పెరుగుతుండటం, ద్రవ్యలోటు మరింతగా విస్తరిస్తుందనే ఆందోళనల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ చేశారని నిపుణులు పేర్కొన్నారు. కాగా గత ఏడాది(2017)లో విదేశీ ఇన్వెస్టర్లు మన స్టాక్ మార్కెట్లో నికరంగా రూ.51,000 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అయితే ఈ ఏడాది ఈ స్థాయిలో విదేశీ పెట్టుబడులు రాకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. లిక్విడిటీ తగ్గుతుండటం, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో వడ్డీరేట్లు పెరుగుతుండడమే దీనికి ప్రధాన కారణాలని వారంటున్నారు.

ఆటో రంగంలో తగ్గనున్న నియామకాలు

- కొత్త నైపుణ్యాలకు డిమాండ్
- ఫిక్కి, నాస్కామ్ అధ్యయనం వెల్లడి



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ రంగంలో నియామకాలు నెమ్మదించనున్నాయని ఫిక్కి-నాస్కామ్, ఈవై అధ్యయనం పేర్కొంది. ఈ రంగంలో నియామకాలు చారిత్రకంగా చూస్తే 3 నుంచి 3.5 శాతం మేర వృద్ధి చెందగా, 2 నుంచి 2.5 శాతానికి తగ్గుతాయని ఈ నివేదిక తెలిపింది. నూతన టెక్నాలజీల ప్రవేశం, ఆటోమేషన్ పెరగడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. నూతన తరం టెక్నాలజీల రాకతో కొత్త నైపుణ్యాల అవసరం ఈ రంగంలో ఏర్పడిందని 'భారత్‌లో ఉద్యోగాల భవిష్యత్తు' పేరుతో నిర్వహించిన అధ్యయనం వివరించింది.

ఇంకా ఏం చెప్పిందంటే?

''ఆటోమొబైల్ రంగం 2017 మార్చి నాటికి 1.28 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఈ రంగంలో ఉపాధి అవకాశాల సంఖ్య 2022 నాటికి 1.43 కోట్లకు పెరుగుతాయి. ఇందులో 60–65 శాతం మేర ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను సంతరించుకోవాల్సి ఉంటుంది. వెల్డింగ్, ప్రెస్, క్యాస్ట్, పెయింట్ షాపుల్లో రోబోలను ఇప్పటికే 70–100 శాతం మేర వినియోగిస్తున్నారు. రోబోల వాడకం పెరిగే కొద్దీ పెయింటింగ్, వెల్డింగ్ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడుతుంది. అదే సమయంలో రోబోటిక్ ప్రోగ్రామింగ్, నిర్వహణకు డిమాండ్ ఏర్పడుతుంది. వచ్చే ఐదేళ్లలో కనెక్టెడ్ కార్ల ప్రవేశం కారణంగా బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, కొత్త టెక్నాలజీలు అన్నవి డిజైన్, ఆపరేషన్ స్థాయిలో అవసరం అవుతాయి. ఆటోమొబైల్ అనలైటిక్స్ ఇంజనీర్, 3డీ ప్రింటింగ్ టెక్నీషియన్, మెషిన్ లెర్నింగ్, వాహన సైబర్ సెక్యూరిటీ నిపుణులు అనే ఉద్యోగాలు వస్తాయి''.

కొత్త టెక్నాలజీలకు సన్నద్ధం కావాలి...

ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటం, భారత్‌లో తయారీ కింద పెట్టుబడులు పెరగడం వల్ల భారత ఆటోమోటివ్ రంగంలో రానున్న సంవత్సరాల్లో నైపుణ్య కార్మికులకు డిమాండ్ పెరగనుంది. కొత్త టెక్నాలజీలు వచ్చినందున పరిశ్రమ అంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యోగులకు తిరిగి శిక్షణనివ్వడం ద్వారా కొత్త తరహా బాధ్యతలకు సన్నద్ధం కావాలి'' అని ఈవై పార్ట్‌నర్‌కు చెందిన అనురాగ్ మాలిక్ పేర్కొన్నారు.

టెల్కోలకు ట్రాయ్ నోటీసులు!

రూ.2,578 కోట్ల రికవరీకి చర్యలు



న్యూఢిల్లీ: టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ రూ.2,578 కోట్ల మేర వసూలు చేసుకునేందుకు గాను ఐదు టెలికం సంస్థలకు నోటీసులు జారీ చేయనుంది. టాటా టెలీ సర్వీసెస్, టెలినార్, వీడియోకాన్ టెలికామ్, క్వాడ్రంట్ (వీడియోకాన్ గ్రూపు సంస్థ), రిలయన్స్ జియో తమ ఆదాయాలను రూ.14,800 కోట్ల మేర తక్కువ చేసి చూపడంతో ప్రభుత్వ ఖజానాకు రూ.2,578 కోట్ల మేర ఆదాయం తక్కువగా వచ్చిందంటూ క్రంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఇవ్వగా, ఇది డిసెంబర్ 19న పార్లమెంటు ముందుకు చేరిన విషయం తెలిసిందే. లైసెన్స్ ఫీజు రూపంలో రూ.1,015 కోట్ల మేర తక్కువగా, స్పెక్ట్రమ్ వినియోగ ఫీజు రూ.511 కోట్ల మేర, ఆలస్యంగా చేసిన చెల్లింపులపై రూ.1,052 కోట్ల మేర వడ్డీ టెలికం సంస్థలు ప్రభుత్వానికి తక్కువగా చెల్లించాయన్నది నివేదిక సారాంశం. ఈ నేపథ్యంలో తగ్గిన ఆదాయాన్ని రాబట్టుకునేందుకు ఆయా టెలికం సంస్థలకు ట్రాయ్ డిమాండ్ నోటీసులు జారీ చేయనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.

ఎస్సార్, భూషణ్ స్టీల్ ఆస్తులపై సెయిల్ ఆసక్తి

న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ ఉక్కు దిగ్గజం స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) తీవ్ర రుణ భారంతో దివాలా చర్యలను ఎదుర్కొంటున్న ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్ ఆస్తుల కొనుగోలుకు ఆసక్తితో ఉంది. ప్రభుత్వ వర్గాల సమాచారం మేరకు... సెయిల్‌కు చెందిన ఓ బృందం ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్ యూనిట్లను 20 రోజుల క్రితమే సందర్శించింది. ఈ యూనిట్లు ఎలా నడుస్తున్నాయి, వీటి కొనుగోలుకు బిడ్లు వేయవచ్చా, లేదా అన్న అంశాలపై దృష్టి సారించింది. ఆర్‌బీఐ దివాలా చర్యల కింద తొలిగా గుర్తించిన 12 భారీ రుణ ఎగవేత కేసుల్లో ఎస్సార్ స్టీల్, భూషణ్ స్టీల్ ఉన్న విషయం తెలిసిందే. ''ఎస్సార్, సెయిల్ రెండూ ఒకే రంగంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సార్ స్టీల్ ఆస్తుల కొనుగోలుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నాం'' అని సెయిల్‌కు చెందిన ఓ అధికారి వెల్లడించారు. ఎస్సార్ స్టీల్ రూ.45,000 కోట్ల మేర, భూషణ్ స్టీల్ రూ.44,478 మేర బ్యాంకులకు రుణాలను చెల్లించాల్సి ఉంది.

గత వారం హీరోలు

స్టాక్స్	29 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
సన్ ఫార్మా	571	529	8
వక్రంజీ	421	393	7
ఐడియా	108	101	7
డీఎల్‌ఎఫ్	259	243	7
గ్లెన్‌మార్క్ ఫార్మా	595	563	6
విప్రో	313	298	5
టాటా గ్లోబల్ బేవరేజ్	316	301	5
భారతీ ఇన్‌ఫ్రాటెల్	378	361	5
యూపీఎల్	761	731	4
వేదాంత	330	317	4

ఎందుకు పెరిగాయంటే...

అమెరికా ఎఫ్‌డీఏ నుంచి ఔషధాలకు ఆమోదాలు లభించడంతో సన్ ఫార్మా, గ్లెన్‌మార్క్ ఫార్మా షేర్లు 6–8 శాతం రేంజ్‌లో ఎగిశాయి. రూ.11,250 కోట్ల ప్రమోటర్ల పెట్టుబడులకు ప్రతిగా డిబెంచర్లు, వారంట్లు జారీ చేయనుండటంతో డీఎల్‌ఎఫ్ 7% లాభపడింది. శ్రీలంకలోని వాటవాలా ప్లాంటేషన్‌లో32 % వాటాను రూ.120 కోట్లకు విక్రయించడంతో టాటా గ్లోబల్ బేవరేజేస్ షేర్ 5% వృద్ధి చెందింది. అంతర్జాతీయ మార్కెట్లో లోహాల ధరలు పెరగడంతో వేదాంత షేర్ 4 % పెరిగింది.

గత వారం జీరోలు

స్టాక్స్	29 ముగింపు	22 ముగింపు	మార్పు(%)
ఐఓసీ	388	411	-5
బ్యాంక్ ఆఫ్ బరోడా	160	167	-4
బీపీసీఎల్	519	535	-3
పిడిలైట్ ఇండస్ట్రీస్	903	926	-3
హెచ్‌పీసీఎల్	416	427	-2
బజాజ్ ఫిన్‌సర్వ్	5,238	5,363	-2
బజాజ్ హోల్డింగ్స్	2,883	2,950	-2
ఎస్‌బీఐ	309	317	-2
కోల్ ఇండియా	263	268	-2
పవర్ గ్రిడ్ కార్ప్	200	204	-2

ఎందుకు తగ్గాయంటే..,

ముడి చమురు ధరలు పెరగడంతో ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌లు 2–5 శాతం రేంజ్‌లో క్షీణించాయి. షేర్ల బైబ్యాక్ ప్రతిపాదనతో అంతకు ముందటి వారం బాగా లాభపడిన పిడిలైట్ ఇండస్ట్రీస్ షేర్‌లో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో ఈ షేర్ 3 శాతం పతనమైంది. ప్రభుత్వం రూ.50,000 కోట్లు సమీకరిస్తుండటంతో బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ వంటి ప్రభుత్వ రంగ బ్యాంక్ షేర్లు 4–2 శాతం రేంజ్‌లో నష్టపోయాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 01-01-2018

విజయవాడ	365–00
గోదావరి	365–00
విశాఖ	370–00
వరంగల్	351–00
చిత్తూరు	363–00
చెన్నై	370–00
ముంబై	395–00
నమక్కల్	365–00
31-12-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	350–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.10
బెంగళూరు	360–00
కోల్‌కతా	390–00
ఢిల్లీ	385–00

క్యాజువల్ కార్మికులపై
డీమోనిటైజేషన్ పిడుగు

- 53 వేల ఉద్యోగాలు పోయాయి
- 2017 జనవరి–మార్చి త్రైమాసికంపై కేంద్ర గణాంకాలు
- 1.85 లక్షల రెగ్యులర్ ఉద్యోగాలు పెరిగాయని వెల్లడి

న్యూఢిల్లీ: నరేంద్ర మోదీ సర్కారు పెద్ద నోట్లను రద్దు చేయడం తాత్కాలిక ప్రాతిపదికన, రోజువారీ వేతనాలపై పనిచేసే క్యాజువల్ కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. 2017 జనవరి–మార్చి త్రైమాసికంలో 53వేల సాధారణ కార్మికుల ఉద్యోగాలు పోయినట్టు కేంద్ర కార్మికశాఖ పరిధిలోని లేబర్ బ్యూరో సర్వే వెల్లడించింది. అంటే చిన్న జీవులపై డీమోనిటైజేషన్ ప్రతికూల ప్రభావం చూపించినట్టు కేంద్రమే పరోక్షంగా ఒప్పుకున్నట్టయింది. ''1.97 లక్షల రెగ్యులర్ కార్మికులు, 26వేల కాంట్రాక్టు కార్మికులు ఉన్న చోట, 53వేల క్యాజువల్ కార్మికులు తగ్గిపోయారు'' అని లేబర్ బ్యూరో తెలిపింది. అయితే, ఇదే కాలంలో (2017 జనవరి–మార్చి) తయారీ, ఐటీ తదితర ఎనిమిది రంగాల్లో ఉపాధి అవకాశాల పరిస్థితి మెరుగుపడిందని, 1.85 లక్షల ఉద్యోగాలు పెరిగాయని లేబర్ బ్యూరో పేర్కొంది. ఆతిథ్య, రెస్టారెంట్, ఐటీ, బీపీవో మినహా ఆరు రంగాల్లో క్యాజువల్ కార్మికులు తగ్గినట్టు లేబర్ బ్యూరో సర్వే వెల్లడించింది.



ఏ రంగంలో ఎంత మేర...


- తయారీలో నికరంగా 92,000 ఉద్యోగాలు పెరిగాయి. 22,000 క్యాజువల్ ఉద్యోగాలు తగ్గాయి.
- ఆరోగ్య రంగంలో ఉపాధి అవకాశాలు నికరంగా 28,000 పెరగ్గా, 7,000 మేర క్యాజువల్ ఉద్యోగాలు తగ్గిపోయాయి.
- నిర్మాణ రంగంలో నికరంగా 2,000 ఉద్యోగాలు పెరగ్గా, కాంట్రాక్టు కార్మికులు 9,000, క్యాజువల్ కార్మికులు 8,000 చొప్పున తగ్గిపోయారు.
- వాణిజ్య రంగంలో నికరంగా 28,000 ఉద్యోగాలు పెరిగాయి. క్యాజువల్ ఉద్యోగాలు 3,000 క్షీణించాయి.
- రవాణా రంగంలో నికరంగా 3,000 ఉద్యోగాలు పెరిగాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు 1,000, క్యాజువల్ ఉద్యోగాలు 5,000 చొప్పున తగ్గాయి.

తక్షణ మద్దతు 33,750

మార్కెట్ పంచాంగం


ప్రపంచ ప్రధాన సూచీలతో పాటు భారత్ మార్కెట్ కూడా 2017వ సంవత్సరంలో అతిపెద్ద ర్యాలీ జరిపింది. ఇలా భారీ ర్యాలీ జరిగిన తర్వాతి ఏడాది (2018) జనవరి–ఫిబ్రవరి నెలలు సాంకేతికంగా బాగా కీలకం. ఎందుకంటే 1999లో జరిగిన గొప్పర్యాలీ తర్వాత 2000 ఫిబ్రవరి నుంచి ప్రపంచ మార్కెట్లన్నీ భారీ పతనాన్ని చవిచూసాయి. అలాగే 2007లో జరిగిన పెద్ద అప్‌ట్రెండ్ తర్వాత 2008 జనవరి నుంచి భారత్‌తో సహా ప్రపంచ మార్కెట్లన్నీ కుప్పకూలాయి. 2000 పతనం డాట్‌కామ్ బుడగ పేలిపోవడంతోనూ, 2008 పతనం అమెరికా డెట్ బుడగ విచ్ఛిన్నమవడంతోనూ జరిగాయి. కారణలేవైనా...సూక్ష్మంగా చూస్తే, ఆ రెండు సందర్భాల్లోనూ పతన ప్రారంభం ముందు షేర్ల విలువలు ఆకాశాన్నంటాయి. కొత్త ఏడాది ఇటువంటి పతనం వస్తుందన్న సంకేతాలేవీ ప్రస్తుతం కన్పించనప్పటికీ, స్టాక్ విలువలు బాగా పెరిగిన ప్రస్తుత తరుణంలో ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇక మన సూచీల సాంకేతికాంశాల విషయానికొస్తే,,.

సెన్సెక్స్ సాంకేతికాంశాలు...



డిసెంబర్ 29తో ముగిసిన నాలుగు రోజుల ట్రేడింగ్‌వారంలో 1 శాతం శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన బీఎస్‌ఈ సెన్సెక్స్ 34,138 పాయింట్ల వద్ద మరో కొత్త రికార్డును నెలకొల్పింది. చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 117 పాయింట్ల లాభంతో 34,057పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం అమెరికా మార్కెట్ క్షీణించిన ప్రభావంతో ఈ సోమవారం మార్కెట్ తగ్గితే 33,750 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. గత రెండు వారాలుగా పలు దఫాలు మద్దతునిచ్చిన ఈ స్థాయిని కోల్పోతే 33,620 పాయింట్లస్థాయికి తగ్గవచ్చు. ఈ స్థాయి దిగువన ముగిస్తే క్రమేపీ 33,400 పాయింట్లస్థాయివరకూ క్షీణించవచ్చు. తొలి మద్దతును సెన్సెక్స్ పరిరక్షించుకుంటే 34,200–34,250 పాయింట్ల శ్రేణిని చేరవచ్చు. అటుపై క్రమేపీ 34,400 పాయింట్ల స్థాయిని సెన్సెక్స్ అందుకునే అవకాశం వుంటుంది.


నిఫ్టీ తక్షణ మద్దతు 10,460...



ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ గత వారం 10,552 పాయింట్ల వద్ద కొత్త రికార్డును నెలకొల్పినప్పటికీ, ఆపైన స్థిరపడలేకపోయింది. కేవలం 90 పాయింట్ల శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనైన నిఫ్టీ చివరకు అంత క్రితం వారంతో పోలిస్తే, 38 పాయింట్ల స్వల్పలాభంతో 10,531 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం అప్‌ట్రెండ్ కొనసాగాలంటే 10,550 పాయింట్లపైన నిఫ్టీ స్థిరపడాల్సివుంటుంది. అటుపైన ముగిస్తే క్రమేపీ 10,650 పాయింట్ల స్థాయివరకూ ర్యాలీ జరిపే అవకాశం వుంటుంది. బలమైన అప్‌ట్రెండ్ రావాలంటే 10,550–10,650 పాయింట్ల మధ్య ఎదురయ్యే కఠినమైన అవరోధ శ్రేణిని నిఫ్టీ అధిగమించాల్సివుంటుంది. ఈ వారం తొలి అవరోధాన్ని దాటలేకపోతే, 10,460 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతును కోల్పోతే 10,370 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ లోపున 10,320 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్

ఈఎల్ఎస్ఎస్‌ల్లో పెట్టుబడికి ఏ విధానం మంచిది?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను నా ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్–పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్) ఖాతాను రెండు సార్లు పొడిగించాను. ఇలా పొడిగించిన పీపీఎఫ్ ఖాతాలపై వచ్చే రాబడులపై నేను ఏమైనా పన్నులు చెల్లించాల్సి ఉంటుందా ? లేక పన్ను మినహాయింపులు లభిస్తాయా ?

– కృష్ణ, విజయవాడ

ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్) ఖాతాను రెండు సార్లు పొడిగించినప్పటికీ, ఈ ఖాతా రాబడులపై మీరు ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన పనిలేదు. పీపీఎఫ్‌ను పన్ను విషయంలో 'ట్రిపుల్ ఈ'(ఎగ్జెంప్ట్, ఎగ్జెంప్ట్, ఎగ్జెంప్ట్) గా పరిగణిస్తారు. అంటే అన్ని దశల్లో పీపీఎఫ్ ఖాతాకు పన్ను మినహాయింపులు లభిస్తాయి. ఇన్వెస్ట్‌మెంట్ దశలోనూ, అది పెట్టుబడి కాలంలోనూ, విత్‌డ్రాయల్ సమయంలోనూ పన్ను మినహాయింపులు పొందవచ్చు. ఇన్వెస్ట్‌మెంట్స్ చేసేటప్పుడు ఒక ఆర్థిక సంవత్సరంలో పీపీఎఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌పై రూ. లక్షన్నర వరకూ పన్ను మినహాయింపులు పొందవచ్చు. ఇక పెట్టుబడి కాలంలో మీరు ఇన్వెస్ట్ చేసిన మొత్తంపై వచ్చే వడ్డీపై ఎలాంటి పన్ను భారం ఉండదు. మరోవైపు పీపీఎఫ్ ఖాతా మెచ్యూరై, ఆ సొమ్ములను మీరు ఉపసంహరించుకునేటప్పుడు కూడా మీరు నయాపైసా పన్ను చెల్లించాల్సిన పనిలేదు. రెగ్యులర్ ఖాతాలకే కాకుండా, పొడిగించబడిన పీపీఎఫ్ ఖాతాలకు కూడా ఇది వర్తిస్తుంది.

నేను కొంత మొత్తాన్ని ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్(ఈఎల్ఎస్ఎస్)ల్లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఈఎల్ఎస్ఎస్‌లో సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయడం మంచిదా ? లేక ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం మంచిదా ? తగిన సలహా ఇవ్వగలరు.

– జాన్సన్, వరంగల్

మంచి రాబడుల కోసం ఇన్వెస్ట్‌చేయడానికి ఉన్న ఉత్తమ సాధనాల్లో ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్(ఈఎల్ఎస్ఎస్)లు ఒకటి. ఈఎల్ఎస్ఎస్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల మంచి రాబడులు రావడమే కాకుండా పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఇక ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడానికి సిప్(సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) అత్యుత్తమ ఇన్వెస్ట్‌మెంట్ విధానం. ఇదే ఈఎల్ఎస్ఎస్‌లకు కూడా వర్తిస్తుంది. మీరు నెలకు కొంత మొత్తం సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తేనే మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ పొందవచ్చు. అలా కాకుండా ఒకేసారి పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేశారనుకోండి. ఆ తర్వాత మార్కెట్ పతనమైతే మీకు భారీ నష్టాలు వచ్చే అవకాశాలుంటాయి. సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేస్తే ఇలాంటి ప్రతికూల పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చు. మీ దగ్గర పెద్ద మొత్తంలో ఇన్వెస్ట్ చేయదగ్గ సొమ్ములుంటే వాటిని కనీసం 6–12 భాగాలుగా విభజించి నెలకు కొంత మొత్తం చొప్పున సిప్ విధానంలో ఇన్వెస్ట్ చేయండి. చాలా మంది కేవలం పన్ను ఆదా కోసమే ఈఎల్ఎస్ఎస్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తారు. కానీ, సంపద సృష్టికి ఈఎల్ఎస్ఎస్‌లు మంచి మార్గమని చెప్పవచ్చు. వీటికి లాక్–ఇన్ పీరియడ్ ఉండటం ప్రయోజనకరమే. ఈ తరహా ఇన్వెస్ట్‌మెంట్ సాధనాల్లో కనీసం 5–7 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు పొందవచ్చు.

నేను షేర్లు, వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో గత కొన్నేళ్లుగా ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఈ ఆర్థిక సంవత్సరంలో షేర్ల ఇన్వెస్ట్‌మెంట్స్‌లో మూలధన నష్టాలు వచ్చాయి. అలాగే డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో స్వల్పకాలిక లాభాలు వచ్చాయి. షేర్లలో వచ్చిన నష్టాలను, మ్యూచువల్ ఫండ్స్‌లో వచ్చిన లాభాలతో భర్తీ చేసుకోవచ్చా?

– మౌనిక, హైదరాబాద్

షేర్లలో వచ్చిన స్వల్పకాలిక మూలధన నష్టాలను, డెట్ ఫండ్స్‌లో వచ్చిన స్వల్పకాలిక మూలధన లాభాలతో భర్తీ చేసుకోవచ్చు. అంతే కాకుండా ఈక్విటీ, డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలతో కూడా భర్తీ చేసుకోవచ్చు. అయితే ఈ నష్టాల భర్తీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జరగదు, ఈ నష్టాలను తర్వాతి ఆర్థిక సంవత్సరానికి క్యారీ ఫార్వార్డ్ చేసి, స్వల్పకాలిక లేదా దీర్ఘకాలిక మూలధన లాభాలతో భర్తీ చేసుకోవచ్చు. ఎనిమిదేళ్ల పాటు ఇలా నష్టాలను భర్తీ చేసుకునే అవకాశం ఉంది. కానైతే మీరు సకాలంలో ఐటీ రిటర్న్‌లు దాఖలు చేయాల్సి ఉంటుంది.

నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. మా అమ్మకు బంగారు గాజులు చేయిద్దామనుకుంటున్నాను. అలా కాకుండా గోల్డ్ ఈటీఎఫ్(ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్)ల్లో పెట్టుబడులు పెట్టమని మిత్రులు కొందరు సలహా ఇస్తున్నారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు పెట్టవచ్చా ? మంచి రాబడులు వస్తాయా ?

– రోహిత్, విశాఖపట్టణం

భారతీయులకు బంగారం అంటే మోజు. అందుకే బంగారు అభరణాలు కొనుగోలు చేస్తుంటారు. మనం వాడుకోవడం కోసం పుత్తడి ఆభరణాలు కొంటాం కానీ, ఇదొక ఇన్వెస్ట్‌మెంట్ అని కూడా అంటూ ఉంటాం. నా దృష్టిలో బంగారం అనేది అనుత్పాదక ఆస్తి. మీరు సావరిన్ గోల్డ్ బాండ్స్, గోల్డ్ ఈటీఎఫ్‌లు, గోల్డ్ ఫండ్... ఇలా ఏ రూపంలో ఇన్వెస్ట్ చేసినా పెద్దగా ఒరిగేది ఏమీ ఉండదు. కీలకమైన ఆర్థికపరమైన ఇన్వెస్ట్‌మెంట్స్ అంటే ఈక్విటీ, లేదా స్థిరాదాయం ఇచ్చే ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాలే. సావరిన్ గోల్డ్ బాండ్‌లో రికరింగ్ డిపాజిట్ స్కీమ్ ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీనిని పెట్టుబడులకు పరిశీలించవచ్చు. ఒక పెట్టుబడిగా పుత్తడిని ఎప్పుడూ పరిగణించవద్దు. అలాకాక మీ అమ్మగారికో, భార్యకో, తోబుట్టువుకో, లేక మీ చిన్నారికో వినియోగం కోసం అయితే బంగారం కొనుగోలు చేయండి. అంతేగాని దీనిని ఎప్పుడూ ఒక ఇన్వెస్ట్‌మెంట్‌గా చూడకండి.

సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్ర దాడి



ఉగ్రవాదులు దాడికి పాల్పడిన సీఆర్‌పీఎఫ్ క్యాంపు నుంచి వెలువడుతున్న పొగ

నేలకొరిగిన ఐదుగురు జవాన్లు

- ఇద్దరు ముష్కరులను చంపిన జవాన్లు
- తమదే బాధ్యతని ప్రకటించుకున్న జైష్–ఎ– మహ్మద్

శ్రీనగర్: పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు మరోసారి పేట్రేగిపోయారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రం పుల్వామా జిల్లా లెత్‌పొరాలోని సెంట్రల్ రిజర్వు పోలీస్ ఫోర్స్(సీఆర్పీఎఫ్) క్యాంప్‌పై జైష్ – ఎ – మహ్మద్ ఉగ్రవాదులు దాడి జరిపి ఐదుగురు జవాన్లను పొట్టనబెట్టుకున్నారు. గ్రెనేడ్ లాంఛర్లు, ఆటోమేటిక్ ఆయుధాలు ధరించిన కొందరు ముష్కరులు ఆదివారం వేకువజామున సీఆర్పీఎఫ్ క్యాంప్ వద్దకు వచ్చీ రావటంతోనే విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. క్యాంప్ లోపలికి దూసుకెళ్లటానికి వారు చేసిన యత్నాలను సీఆర్పీఎఫ్ గార్డులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు జవాన్లు అమరులు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భద్రతా బలగాల కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు కూడా ప్రాణాలు కోల్పోయారు. మరో ఉగ్రవాది కూడా మరణించి ఉంటాడని, అతని మృతదేహం కోసం క్యాంప్‌లో గాలిస్తున్నామని సీఆర్పీఎఫ్ అధికార ప్రతినిధి రాజేశ్ యాదవ్ తెలిపారు. అమరులైన వారిని సీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తౌఫయిల్ అహ్మద్, ఇన్‌స్పెక్టర్ కుల్దీప్ రాయ్ (హిమాచల్ ప్రదేశ్), కానిస్టేబుళ్లు.. షరీఫుద్దీన్ గనీ (బుద్గాం), రాజేందర్ నైన్(రాజస్థాన్), పీకే పాండా(ఒడిశా)గా గుర్తించారు. చనిపోయిన ఉగ్రవాదులను మంజూర్ అహ్మద్ బాబా(పుల్వామా), ఫర్దీన్ అహ్మద్ ఖన్‌దే(త్రాల్)గా భావిస్తున్నారు. వీరి వద్ద ఉన్న మారణాయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కాల్పుల నేపథ్యంలో జమ్మూకశ్మీర్ పోలీసులను పెద్ద సంఖ్యలో క్యాంప్‌నకు తరలించారు. ఈ దాడికి తమదే బాధ్యతని పాక్ ప్రేరేపిత జైష్–ఎ–మహమ్మద్ ఉగ్రవాద సంస్థ ప్రకటించుకుంది.



సీఆర్పీఎఫ్ జవాన్ల మృతదేహాలకు నివాళులు

పాక్ కాల్పుల ఉల్లంఘన

రాజౌరీ, పూంఛ్ జిల్లాల్లోని వాస్తవాధీన రేఖ(ఎల్వోసీ) వెంబడి భారత పోస్టులపైకి పాక్ దళాలు జరిపిన కాల్పుల్లో ఒక జవాను చనిపోయాడు. వేకువ జామున పాక్ బలగాలు రాజౌరీ జిల్లా నౌషేరా సెక్టార్‌లోని భారత్ ఫార్వర్డ్ పోస్టుల పైకి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన జవాను ప్రాణాలు కోల్పోయాడు. అదేవిధంగా పూంఛ్ జిల్లా దిగ్వార్ సెక్టార్‌లో అర్ధరాత్రి నుంచి వేకువజాము 5.30 గంటల వరకు పాక్ బలగాలు కాల్పులు కొనసాగించాయి. ఈ నేపథ్యంలో ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ జమ్మూకశ్మీర్‌లోని భద్రతా బలగాల యుద్ధ సన్నద్ధత, ప్రస్తుత పరిస్థితిపై సమీక్ష జరిపారు. రాజౌరీ సెక్టార్‌లోని నియంత్రణాధీన రేఖ వెంబడి ఫార్వర్డ్ పోస్టులను ఆదివారం పరిశీలించారు.

డిసెంబర్ 10వ తేదీ వరకు ఎల్వోసీ వెంబడి పాక్ కాల్పుల ఉల్లంఘన ఘటనలు 881 జరగ్గా, గత ఏడేళ్లలో ఇదే అత్యధికం కావటం గమనార్హం. దీంతోపాటు అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నవంబర్ వరకు మొత్తం 110 సార్లు పాక్ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడింది. ఈ ఘటనల్లో 14 మంది సైనికులు, 12 మంది పౌరులు, నలుగురు బీఎస్‌ఎఫ్ జవాన్లు అమరులయ్యారని సైన్యం తెలిపింది. 2003లో భారత్, పాక్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు దేశాల మధ్య మొత్తం 3,323 కిలోమీటర్ల మేర సరిహద్దు ఉంది.

'పుల్వామా దాడి ప్రధాని వైఫల్యం'

పుల్వామా సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదుల దాడి ప్రధాని మోదీ విదేశాంగ విధానం వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ మండిపడింది. దేశ విరోధులకు గట్టిగా బుద్ధి చెబుతామని ఎన్నికల సమయంలో చెప్పిన మోదీ మాటలు ఏమయ్యాయని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సుష్మితా దేవ్ ప్రశ్నించారు.

ఫిబ్రవరి 1 నుంచి జీఎస్టీ ఈ-వే బిల్లు



న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను అనుసరించి ఏవేనీ రెండు రాష్ట్రాల మధ్య రూ.50 వేలకు మించి విలువ కలిగిన సరకులను రవాణా చేయాలంటే ఫిబ్రవరి 1 నుంచి ఎలక్ట్రానిక్ వే (ఈ–వే) బిల్లు తప్పనిసరని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఒకే రాష్ట్రంలో రవాణాకు ఈ–వే బిల్లులను ఎప్పుడు అమలుచేయాలనే విషయం రాష్ట్రాలకే వదిలేస్తున్నామనీ, ఫిబ్రవరి 1 నుంచి జూన్ 1 మధ్య వారు ఎప్పుడైనా ఈ–వే బిల్లులను తప్పనిసరి చేయొచ్చని ఆయన వెల్లడించారు. ఈ–వే బిల్లులు జారీ చేసేందుకు తగిన సాంకేతిక వ్యవస్థ సిద్ధం కాకపోవడంతో దీన్ని ఇన్నాళ్లూ వాయిదా వేశారు.

ఢిల్లీలో విమానాలకు పొగమంచు దెబ్బ

న్యూఢిల్లీ: దేశరాజధానిలో ఆదివారం ఉదయం భారీగా పొగమంచు కురిసింది. దీంతో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 350కిపైగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దట్టంగా అలుముకున్న పొగమంచు ప్రభావంతో 270 విమానాలు ఆలస్యంగా నడవగా, 50 విమానాలను అధికారులు దారి మళ్లించారు. దీంతోపాటు మరో 35 విమానాలను రద్దుచేశారు. పొగమంచు దెబ్బకు దాదాపు 50 మీటర్లలోపు ఉన్న రన్‌వే మాత్రమే కన్పించడంతో.. కేటగిరీ 3బీ సాంకేతికతతో కొన్ని విమానాల రాకపోకల్ని కొనసాగించారు.

ఏపీవై చందాదారులకు కొత్త 'ఆధార్' పత్రం



న్యూఢిల్లీ: అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) చందాదారుల నుంచి ఆధార్ వివరాలు సేకరించేందుకు వీలుగా సోమవారం నుంచి కొత్త దరఖాస్తు పత్రాలను వినియోగించాలని పీఎఫ్‌ఆర్‌డీఏ (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) బ్యాంకులు, పోస్టాఫీసులను కోరింది. దీనిపై గతంలో అనేకసార్లు ఆర్థిక సేవల విభాగం, బ్యాంకులు, పోస్టాఫీసుల అధికారులతో చర్చలు జరిపామనీ, జనవరి 1 నుంచి అమలు చేసేందుకు నిర్ణయించామని పీఎఫ్‌ఆర్‌డీఏ వెల్లడించింది.

వేరే రాష్ట్రాల్లో ఆకస్మిక పర్యటనలు వద్దు

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎలాంటి సమాచారం లేకుండా వేరే రాష్ట్రాల్లో అకస్మాత్తుగా పర్యటిస్తుండటంపై కేంద్ర హోంశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఇలాంటి పర్యటనల వల్ల సదరు సీఎంలకు భద్రతాపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రులందరికీ తెలియజేయాలని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు లేఖ రాసింది. ముందుగా సమాచారం ఇస్తే ఆతిథ్య సీఎంకు తగిన భద్రత కల్పించడం వీలవుతుందని తెలిపింది. సీఎంలకు జెడ్(22 మందితో), జెడ్ ప్లస్(55 మందితో) భద్రత కల్పిస్తారు.

తమిళనాడులో ప్రమాదం.. 9 మంది మృతి

దిండిగల్: తమిళనాడులోని దిండిగల్ జిల్లాలో ఆదివారం ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. పళని నుంచి దిండిగల్ వస్తున్న ఓ ప్రైవేటు బస్సు కోయంబత్తూర్‌కు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ముగ్గురు చిన్నారులు సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోగా, మిగతా ఏడుగురు వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీసులు తెలిపారు.

నవ భారతానికి మీరే పునాది

మన్ కీ బాత్‌లో కొత్త ఓటర్లను ఉద్దేశించి ప్రధాని మోదీ

- ముస్లిం మహిళలు ఒంటరిగా హజ్‌కు వెళ్లేందుకు అనుమతించాం..
- ట్రిపుల్ తలాక్ నుంచి ముస్లిం మహిళలకు విముక్తి దొరికింది..
- జనవరి 4 నుంచి మార్చి 10 వరకూ స్వచ్ఛతా సర్వే

న్యూఢిల్లీ: నూతన సంవత్సరంలో 18 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న దేశ యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, వారి ఓట్లు నవ భారతానికి పునాది కావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. ఈ ఏడాది 'మన్ కీ బాత్' చివరి కార్యక్రమంలో ఆదివారం ఆయన ప్రసంగిస్తూ... ఆగస్టు 15 సమయంలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన యువ ప్రతినిధులతో ఢిల్లీలో మాక్ పార్లమెంట్ ఏర్పాటు చేసి.. నవ భారత నిర్మాణంపై మేధోమథనం చేయాలని మోదీ సూచించారు. కొత్త సంవత్సరంలో ప్రజలు ప్రగతిశీల భారతదేశం కోసం కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు పరీక్షలో ప్రథముడిగా నిలిచిన అజుమ్ బషీర్ ఖాన్ ఖట్టక్ స్ఫూర్తి కథనాన్ని అందరూ స్మరించుకోవాలని ప్రధాని అభిలషించారు.

మన్ కీ బాత్‌లోని ముఖ్యాంశాలు

2000వ సంవత్సరంలో పుట్టిన వారు జనవరి 1 , 2018 నుంచి కొత్త ఓటర్లుగా నమోదుకు అర్హులవుతారు. 21వ శతాబ్దం ఓటర్లకు భారత ప్రజాస్వామ్యం స్వాగతం పలుకుతోంది. వారిని నేను అభినందించడంతో పాటు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. మీ ఓట్లు నవ భారతానికి ఆధారం. కులతత్వం, మతతత్వం, ఉగ్రవాదం, అవినీతి నుంచి మీరు నిర్మించే నవ భారతం విముక్తి పొందాలి. నవ భారతంలో అందరికీ సమానమైన అవకాశాలు దక్కడంతో పాటు వారి ఆశలు, ఆకాంక్షలు తీరాలి. దేశంలోని ప్రతి జిల్లాలో మాక్ పార్లమెంటును ప్రారంభిద్దామా? 18 నుంచి 25 ఏళ్ల లోపు యువత నవ భారతంపై అందులో మేధోమథనం చేయాలి. ఆగస్టు 15 సమయంలో .. ఢిల్లీలో నిర్వహించే మాక్ పార్లమెంటులో ప్రతి జిల్లా నుంచి ఎంపికైన యువత పాల్గొని, రాబోయే ఐదేళ్లలో మన సంకల్పాల్ని సాకారం చేసుకునేందుకు ఏం చేయాలన్న అంశాలపై చర్చించాలని ఆకాంక్షిస్తున్నాను.



శివగిరి వేడుకలనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రసంగిస్తున్న మోదీ

అంజుమ్ గాథ అందరికీ స్ఫూర్తి

కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ పరీక్షల్లో ప్రథముడిగా నిలిచిన అంజుమ్ బషీర్ ఖాన్ ఖట్టక్ స్ఫూర్తి గాథ ఇటీవలే తెలిసింది. అతను కశ్మీర్‌లోని ఉగ్రవాదం, విద్వేష కోరల నుంచి బయటపడి తన లక్ష్యాన్ని సాధించాడు. 1990లో అతని పూర్వీకుల ఇంటిని ఉగ్రవాదులు తగులబెట్టారు. ఉగ్రవాదం, హింస వల్ల అంజుమ్ కుటుంబం స్వగ్రామం వదిలి వెళ్లిపోయింది. అతను మాత్రం ప్రజలకు సేవ చేయాలన్న మార్గంలో ముందుకు సాగాడు.

ముస్లిం మహిళల పోరాటం ఫలించింది

ఈ ఏడాది జనవరి 4 నుంచి మార్చి 10 వరకు ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛతా సర్వేను నిర్వహించబోతున్నాం. 4 వేల నగరాల్లో 40 కోట్ల మందిని సర్వే చేయనున్నాం. 2018 గణతంత్ర వేడుకలకు ఆసియా దేశాలకు చెందిన పది మంది అధినేతలు ప్రత్యేక అతిథులుగా హాజరవుతున్నారని మన్ కీ బాత్‌లో ప్రధాని తెలిపారు. ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభలో ఆమోదం అనంతరం ప్రధాని తొలిసారి స్పందించారు. కేరళలోని శివగిరి మఠం యాత్రికుల ఉత్సవాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తూ.. 'ముస్లిం తల్లులు, సోదరీమణుల ఎన్నో ఏళ్ల పోరాటం అనంతరం.. అప్పటికప్పుడు ఇచ్చే ట్రిపుల్ తలాక్ నుంచి విముక్తి మార్గం దొరికింది' అని చెప్పారు.

70 ఏళ్ల సంప్రదాయాన్ని మార్చాం..

ముస్లిం మహిళలు హజ్ యాత్రకు వెళ్లాలంటే.. తప్పకుండా మగవారి తోడు ఉండాల్సిందేనన్న విషయం తెలిసి ఆశ్చర్యపోయాను. 70 ఏళ్ల నుంచి వస్తున్న ఆ సంప్రదాయాన్ని మారుస్తూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకుంది. ఇక ముస్లిం మహిళలు ఏ సంరక్షకుడి తోడూ లేకుండా హజ్ యాత్ర చేయవచ్చు. ఈ ఏడాది ఒంటరిగా హజ్ యాత్ర చేసేందుకు 1300 మంది ముస్లిం మహిళలు నమోదు చేసుకున్నారు. వారికి అనుమతి ఇవ్వాల్సిందిగా మైనార్టీ వ్యవహారాల శాఖను నేను ఆదేశించాను.

అలక వీడిన నితిన్ పటేల్



అహ్మదాబాద్: శాఖల కేటాయింపుల్లో అవమానం జరిగిందంటూ కినుక వహించిన గుజరాత్ డిప్యూటీ సీఎం నితిన్ పటేల్.. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా జోక్యంతో వెనక్కి తగ్గారు. బాధ్యతలు చేపట్టి తన నియోజకవర్గం మెహసనాకు వెళ్లారు. ఆ వెంటనే.. ఆర్థిక శాఖను పటేల్‌కు కేటాయిస్తున్నట్లు గుజరాత్ సీఎం రూపానీ ప్రకటించారు. అంతకుముందు పటేల్ మాట్లాడుతూ.. 'అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. సరైన శాఖలు కేటాయించే విషయంలో హామీ ఇచ్చారు' అని మీడియాకు వెల్లడించారు. సీఎం విజయ్ రూపానీ గవర్నర్‌ను కలసి తన శాఖలకు సంబంధించిన లేఖ అందిస్తారని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ఆర్థిక, పట్టణాభివృద్ధి శాఖలను నితిన్ నిర్వహించగా.. కొత్త కేబినెట్‌లో ఆర్థిక శాఖను సౌరభ్ పటేల్‌కు కేటాయించారు. పట్టణాభివృద్ధి శాఖను సీఎం రూపానీ తన వద్దే ఉంచుకున్నారు. దీంతో కినుక వహించిన పటేల్.. ప్రాధాన్యమున్న శాఖలను ఇవ్వాలని లేదంటే కేబినెట్ నుంచి తప్పించాలని పార్టీ అధినాయకత్వాన్ని కోరారు.

ట్రాఫిక్ చిక్కులకు డ్రోన్లతో చెక్!

త్వరలోనే మార్గదర్శకాలు: కేంద్ర మంత్రి జయంత్ సిన్హా

ముంబై: ప్రయాణికుల్ని తరలించే డ్రోన్ల తయారీతో రోడ్లపై భారీగా ట్రాఫిక్‌ను తగ్గించవచ్చని కేంద్ర విమానయాన సహాయమంత్రి జయంత్ సిన్హా తెలిపారు. ఐఐటీ విద్యార్థులు ఈ డ్రోన్లకు సంబంధించి అధునాతన పరికరాలను అభివృద్ధి చేయవచ్చని వెల్లడించారు. ఆదివారం ఐఐటీ–బాంబే నిర్వహించిన టెక్‌ఫెస్ట్ కార్యక్రమంలో మాట్లాడుతూ.. దేశంలో డ్రోన్ల తయారీరంగం వేగంగా విస్తరించేందుకు త్వరలోనే మార్గదర్శకాలు రూపొందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రయాణికుల్ని తీసుకెళ్లే డ్రోన్ల రూపకల్పనపై పలువురు దృష్టి సారించారనీ.. ఈ రంగంలో భారీ వాటా పొందేందుకు మనం కూడా దేశీయంగా ఆ తరహా డ్రోన్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. సమర్థవంతంగా డ్రోన్లను తయారుచేయగలిగితే వాటి రవాణా వ్యయం ఆటో ప్రయాణానికయ్యే స్థాయిలోనే ఉంటుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎలక్ట్రానిక్, ఫైనాన్షియల్ టెక్నాలజీ రంగాల్లో భారీ అవకాశాలు ఉన్నాయన్నారు. తగిన చర్యలు తీసుకుంటే త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఎలక్ట్రానిక్ వాహనాలను ఎగుమతి చేసే దేశంగా భారత్ నిలుస్తుందని సిన్హా తెలిపారు.




'తత్కాల్' సాఫ్ట్‌వేర్లపై సీబీఐ దృష్టి



న్యూఢిల్లీ: అక్రమ సాఫ్ట్‌వేర్‌తో రైల్వే తత్కాల్ టికెట్ల కుంభకోణానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ తరహా సాఫ్ట్‌వేర్లపై సీబీఐ దృష్టి సారించింది. సీబీఐలో ప్రోగ్రామర్‌గా పనిచేస్తూ 'నియో' పేరిట అక్రమ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసిన అజయ్ గార్గ్ అనే వ్యక్తిని ఇటీవల సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఈ సాఫ్ట్‌వేర్లతో పీఎన్‌ఆర్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ఒకేసారి పలు యూజర్ ఐడీలతో పెద్దమొత్తంలో టికెట్లు పొందే అవకాశం ఉందని సీబీఐ వర్గాలు తెలిపాయి. ఆటో ఫిల్ విధానంలో ఈ సాఫ్ట్‌వేర్లు పనిచేయడంతో తత్కాల్ టికెట్ల బుకింగ్ ప్రారంభానికి ముందే ఏజెంట్లు టికెట్లను పొందుతున్నారని సీబీఐ అధికార ప్రతినిధి అభిషేక్ దయాళ్ తెలిపారు. ఈ తరహా సాఫ్ట్‌వేర్‌లపై దృష్టి సారించామని, ఎవరైనా తప్పుచేశారని తేలితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం అక్రమ సాఫ్ట్‌వేర్ వినియోగించడం నేరమని, సాఫ్ట్‌వేర్‌ల ద్వారా పొందిన టికెట్లను ఏజెంట్లు అధిక ధరకు విక్రయిస్తూ పెద్దమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారని వెల్లడించారు.

ద్రవిడ సిద్ధాంతాలకు సవాల్?

రజనీ 'ఆధ్యాత్మిక రాజకీయాల'తో ప్రకంపనలు



రజనీకాంత్ రాజకీయ ప్రవేశం కన్నా.. ఆయన ప్రసంగంలో పేర్కొన్న 'ఆధ్యాత్మిక రాజకీయం' కీలకమైన చర్చకు తెరలేపింది. రజనీకాంత్ (68) ఏ ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమిళనాట బహిరంగంగా ఓ వ్యక్తి భగవద్గీత శ్లోకాలను తన ప్రసంగంలో పేర్కొనటం దాదాపు జరగలేదనే చెప్పాలి. అలాంటిది రజనీ 'కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన' అని ప్రసంగించటం తమిళనాడు రాజకీయాల్లో 60 ఏళ్లుగా ప్రధాన పాత్ర పోషిస్తున్న ద్రవిడ ఉద్యమాలకు పెను సవాల్‌గా మారనుందనే చర్చ మొదలైంది. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికలు తమిళనాడు 'ద్రవిడ' భావానికి పరీక్షగా మారనున్నాయి. ఆరెస్సెస్, హిందుత్వ శక్తులతోపాటు చాలాకాలంగా తమిళనాడులో ప్రవేశానికి ఎదురుచూస్తున్న బీజేపీకి వచ్చే ఎన్నికలు చిట్టచివరి అడ్డంకి కానున్నాయనే పరిస్థితి గోచరిస్తోంది.

ఆధ్యాత్మిక రాజకీయాలంటే

సంఘసంస్కర్త ఈవీ రామస్వామి ప్రారంభించిన ద్రవిడ ఉద్యమ స్ఫూర్తి మతం, ఆధ్యాత్మికతను తీవ్రంగా వ్యతిరేకించింది. భగవద్గీత, వర్ణవ్యవస్థ, ఆర్య–ద్రవిడ సిద్ధాంతం, తమిళ సంస్కృతి వంటి అంశాలపై రామస్వామి తరచూ మాట్లాడేవారు. ఆ తర్వాత హేతువాది సీఎన్ అన్నాదురై దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు. అనంతరం తమిళనాడులో దేవుడిపై వ్యతిరేక వైఖరి పెరుగుతూ పోయింది. ఇలాంటి ఆలోచనలతోనే హిందీ వ్యతిరేక ఉద్యమం ద్వారా 1967లో ద్రవిడ మున్నేట్ర కజగం (డీఎంకే) అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత 60 ఏళ్లుగా రాజకీయాల్లో ఆధ్యాత్మికత గురించి ఎవరూ మాట్లాడే ధైర్యం చేయలేదు సరికదా.. తమ సిద్ధాంతాలను వెల్లడించే ప్రయత్నం కూడా చేయలేదు. దేవుణ్ణి నమ్మే ఎంజీఆర్ దేవాలయ సందర్శనను గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారు. జయలలిత తన నమ్మకాలను బహిరంగంగా ప్రదర్శించారు. దేవాలయాలకు విరాళాలిచ్చారు. దేవుని సాక్షిగానే ప్రమాణస్వీకారం చేసేవారు. కానీ.. తమిళ రాజకీయాల్లో ద్రవిడ సిద్ధాంతం పాత్రను మాత్రం ఎన్నడూ విస్మరించలేదు. ఎందుకంటే.. 2003లో మతప్రచార వ్యతిరేక బిల్లును తీసుకురాగా.. తర్వాతి పార్లమెంటు ఎన్నికల్లో అన్నాడీఎంకేకు ఒక్కసీటు కూడా దక్కలేదు. దీంతో తర్వాత ఎప్పుడూ జయ అలాంటి ప్రయోగాలు చేయలేదు.

ద్రవిడ సిద్ధాంత వ్యతిరేకులు తమిళప్రజల్లోని భావనలను తొలగించేందుకు చాలాసార్లు విఫలయత్నాలు చేశారు. చాలాకాలం తర్వాత రజనీకాంత్ బహిరంగంగానే భగవద్గీత శ్లోకాలను ప్రస్తావించటం ఆశ్చర్యం కలిగించింది. రజనీకాంత్‌కు ఆధ్యాత్మికతే సర్వస్వం. తమిళనాడులోని హిందుత్వ మూలాలు ప్రస్ఫుటంగా ఉన్నాయని.. కులం, మతం కంటే ఆధ్యాత్మికతే ముఖ్యమని రజనీ భావిస్తారు. కుల వ్యవస్థను వ్యతిరేకించిన రాఘవేంద్ర స్వామిని రజనీకాంత్ తన గురువుగా భావిస్తారు. హిమాలయాలను తరచూ సందర్శిస్తూ యోగి జీవితాన్ని గడిపేందుకు ఇష్టపడతారు. అలాంటి రజనీ రాజకీయ ప్రవేశం తమిళ రాజకీయ సిద్ధాంతాల్లో మార్పులు తీసుకొచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీనికితోడు 1967నాటి భాష, కులం ఆధారంగా నడిచిన ద్రవిడ రాజకీయాలు మచ్చుకైనా కనిపించటం లేదు. దీంతో రజనీకి పరిస్థితులు కలిసొస్తాయని.. ఆరెస్సెస్ చేయలేని పనిని ఈయన చేసే అవకాశముందని వారంటున్నారు. బెంగళూరులో స్థిరపడిన మరాఠీ కుటుంబంలో పుట్టిన రజనీకాంత్ దశాబ్దాల క్రితమే తమిళనాడును నివాసప్రాంతంగా చేసుకున్నారు. అయితే రాజకీయాల్లోకి వస్తే ఆయన్ను మరాఠీ వ్యక్తిగానే పరిగణించాలంటూ పలువురు విమర్శించినా దీనిపై రజనీ ఎన్నడూ పట్టించుకోలేదు.

- సాక్షి నేషనల్ డెస్క్

తమిళనాట సినీ రాజకీయం!

- ఎంజీఆర్, జయ, కరుణానిధి...అంతా చిత్రరంగం వారే
- రాజకీయాల్లో రాణించలేకపోయిన విజయ్‌కాంత్, శరత్ కుమార్

సూపర్‌స్టార్ రజనీకాంత్ కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో తమిళనాడులో రాజకీయాలకు సినీ రంగానికి ఉన్న సంబంధాన్ని ఓ సారి పరిశీలిస్తే... తమిళనాడులో ఈ రెండు రంగాలది విడదీయరాని బంధం. 1940ల చివరి నుంచి ఈ రాష్ట్రంలో రాజకీయాలు, సినిమాలు కలగలిసిపోయాయి. ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకే) విధానాల్లో అంతర్లీనంగా ఉన్న సాంఘిక సంస్కరణలు, సామాజిక న్యాయం వంటి కీలకాంశాలను, పార్టీ భావజాలాన్ని అప్పట్లో సినీ రచయితగా ఉన్న కరుణానిధి తెరపై ప్రదర్శించారు. 1960 దశకం నుంచి నాటి ప్రముఖ సినీ హీరో ఎంజీ రామచంద్రన్ డీఎంకేతో మమేకం అయ్యారు. పార్టీ సిద్ధాంతాలకు తోడు, సినీగ్లామర్ పనిచేయడంతో 1967 ఎన్నికల్లో డీఎంకే తొలిసారిగా గెలుపొందింది. కరుణానిధి సీఎం అయ్యారు. ఆ తర్వాత కరుణానిధి తన పెద్ద కొడుకు ముత్తును హీరోగా ప్రోత్సహించి, అభిమాన సంఘాలు ఏర్పాటు చేశారు. దీంతో కరుణానిధి, ఎంజీఆర్‌ల మధ్య మనస్పర్థలు వచ్చి ఎంజీఆర్‌ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఈ పరిణామాలు డీఎంకే చీలికకు దారితీశాయి. డీఎంకే వ్యవస్థాపకుడు అన్నాదురై పేరిట 1972లో అన్నా ద్రవిడ మున్నేట్ర కళగం (ఏఐఏడీఎంకే)పార్టీని ఎంజీఆర్ స్థాపించారు.

✦ తొలి హీరో–సీఎం ఎంజీఆర్...

ప్రజాదరణ కలిగిన సినీ హీరోగా కొనసాగుతూ ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన మొదటి వ్యక్తిగా 1977లో ఎంజీఆర్ చరిత్ర సృష్టించారు. దాదాపు పాతిక సినిమాల్లో ఎంజీఆర్‌తో కలిసి నటించిన జయలలిత ఆ తర్వాత ఏఐఏడీఎంకేలోనూ తన ఉనికిని చాటుకున్నారు. మొదట పార్టీలో చిన్న పదవితో ప్రారంభించిన ఆమె మెల్లగా రాజ్యసభకు వెళ్లారు. ఎంజీఆర్ మరణించాక ఆయన భార్య జానకీ రామచంద్రన్ సీఎం పదవిని చేపట్టారు. ఆ తర్వాత జానకి, జయలలితల మధ్య విభేదాలు పొడసూపడంతో పార్టీ చీలింది. తదనంతరం జరిగిన ఎన్నికల్లో ఇరు వర్గాలు ఓటమిని చవిచూశాయి. రాజకీయాల నుంచి జానకి వైదొలగడంతో జయలలిత పార్టీపై పూర్తి పట్టును సాధించి ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారు. 1991 ఎన్నికల్లో గెలుపొంది ఆ రాష్ట్ర తొలి మహిళా సీఎం అయ్యారు.

✦ ఫ్లాప్ అయిన విజయ్‌కాంత్...!

సినీరంగం నుంచే వచ్చిన మరో నేత విజయ్‌కాంత్. 2006 అసెంబ్లీ ఎన్నికలప్పుడు దేశీయ మురుపోక్కు ద్రవిడ కళగం (డీఎండీకే) పార్టీని స్థాపించి మొత్తం 234 సీట్లకు పోటీచేశారు. ఆ పార్టీ దాదాపు 28 లక్షల ఓట్ల వరకు తెచ్చుకున్నా, విజయకాంత్ మినహా ఎవరూ గెలవలేదు. 2011లో ఏఐఏడీఎంకేతో పొత్తు పెట్టుకుని 41 సీట్లలో పోటీ చేసి 29 గెలిచింది. 2016 ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం, వైగో ఎండీఎంకే, వీసీకే పార్టీలతో కలిసి విజయకాంత్ ప్రజాసంక్షేమ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశారు. మొత్తం 104 సీట్లకు పోటీచేసి ఒక్క సీటును కూడా గెలవలేకపోయారు. శివాజీ గణేశన్, శరత్ కుమార్, టి.రాజేందర్ తదితరులంతా రాణించలేకపోయారు.

✦ కమల్ హాసన్ నిర్ణయమెప్పుడో?

దాదాపు మూడునెలల క్రితం 'నేను రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నాను. తమిళనాడు సీఎం కావాలని కోరుకుంటున్నాను' అని మరో ప్రముఖ సినీనటుడు కమల్‌హాసన్ కూడా ప్రకటించారు. అయితే వంద రోజుల్లో ఎన్నికలు జరిగితే తాను రాజకీయాల్లోకి వచ్చినట్టేనంటూ కొంత సందిగ్ధతకు కూడా అవకాశమిచ్చారు. ప్రస్తుతమున్న ఏ రాజకీయపార్టీలోనూ చేరననీ, తానే సొంతంగా మరో పార్టీని ప్రారంభించబోతున్నట్టుగా సంకేతాలిచ్చారు. మరి ఆయన స్పష్టమైన నిర్ణయం ఎప్పుడు చెబుతారోనని దక్షిణ భారతం ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో రజనీ తొలి ప్రయత్నంలోనే విజయం సాధిస్తారో.. లేదో వేచి చూడాల్సిందే.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్







ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ధూంధాంగా జరిగాయి. వివిధ దేశాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య న్యూ ఇయర్‌ను జరుపుకున్నారు. ఇటు హైదరాబాద్‌లో కొత్త సంవత్సరం సందర్భంగా యువత ఉత్సాహం మిన్నంటింది.

వ్యవసాయం వ్యాపారం కావొద్దు

- సేంద్రియమే భూమికి, రైతులకు మేలు: మంత్రి ఈటల
- కోటి ఎకరాలకు నీరివ్వడమే ప్రభుత్వ లక్ష్యం: హరీశ్
- వ్యవసాయ వర్సిటీలో ఉత్తమ రైతులకు పురస్కారాలు

రాజేంద్రనగర్: వ్యవసాయాన్ని వ్యాపారాత్మకంగా నిర్వహిస్తుండటంతో భూమి శక్తిని కోల్పోయి రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. సేంద్రియ వ్యవసాయంతో భూమితోపాటు రైతులకూ మేలు జరుగుతుందని చెప్పారు. ఆదివారం రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీ ఆడిటోరియంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం, విశ్రాంత వ్యవసాయ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ రైతు పురస్కార ప్రదానం, వ్యవసాయ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. దేశానికి రైతులు వెన్నెముక లాంటివారన్నారు. అన్నదాతలను టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఈటల, హరీశ్, పోచారం, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఉత్తమ రైతులకు అవార్డులు

ఉత్తమ రైతులకు మంత్రులు అవార్డులు అందజేశారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా లాభాలు గడిస్తున్న యాదాద్రి జిల్లా చౌటుప్పల్ రైతు రజిత, నిజామాబాద్ జిల్లా బోధన్ మండలానికి చెందిన రైతు శివయ్య (బీఎస్సీ అగ్రికల్చర్), వనపర్తి జిల్లా రైతు ఆర్.వి.ఆంజనేయ సాగర్, ఖమ్మం రైతు జి.సత్యనారాయణరెడ్డిలకు అవార్డులు ప్రదానం చేశారు.

ఫాంహౌస్ కాదు.. ఫార్మర్ హౌస్: హరీశ్‌రావు

కృష్ణా, గోదావరి నీటితో పంటలు పండించేందుకు ఎత్తిపోతల పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభించారని, ఎత్తిపోతలతో కోటి ఎకరాలకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా వ్యవసాయానికి జనవరి 1 నుంచి 24 గంటల కరెంటు ఇస్తున్నామని, మిషన్ కాకతీయతో ప్రతి గ్రామంలోని చెరువులను బాగుచేస్తున్నామని తెలిపారు. సీఎం ఫాంహౌస్‌లోనే ఉంటారని కొందరు విమర్శిస్తున్నారని.. అది ఫాంహౌస్ కాదని ఫార్మర్‌హౌస్ అని చెప్పారు. మంత్రి పోచారం మాట్లాడుతూ.. లాభాలొచ్చే పంటలను పండించేలా రైతులకు సూచనలివ్వాలని.. ఎకరాకు రూ.50 వేల మిగులు ఉండేలా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులదేనని చెప్పారు. కార్యక్రమంలో నల్లగొండ జిల్లా బృందం ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. డైరీతో పాటు టేబుల్ క్యాలెండర్, అధికారుల ఫోన్ డైరీ, వ్యవసాయ శాఖ అధికారుల అసోసియేషన్ వెబ్‌సైట్‌ను మంత్రులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, హార్టికల్చర్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రవీణ్‌రావు, రాష్ట్ర వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీలకు వినియోగించింది 7 శాతమే!

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వంద ఆకర్షణీయ నగరాలు (స్మార్ట్ సిటీస్) నిర్మిస్తామంటూ చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టును పూర్తి చేయడంలో ప్రభుత్వం, అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ పథకానికి ఎంపికైన వివిధ పట్టణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటివరకు రూ.9,860 కోట్లు విడుదలవ్వగా, వాటిలో 7% నిధులను మాత్రమే ఖర్చు చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ లెక్కల ద్వారా ఈ విషయం వెల్లడైంది. నిధుల వినియోగంలో పలు పట్టణాలు పూర్తిగా వెనుకబడినట్లు ఆ శాఖ గుర్తించింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో స్మార్ట్ సిటీ పథకం కింద పనులు ఆశాజనకంగా ఉంటే.. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో మందగమనంతో సాగుతున్నట్లు అధికారులు చెప్పారు. దీంతో విడుదలైన నిధులను సక్రమంగా వినియోగించడంపై కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రాల మధ్య పోటీ పెట్టి జూన్‌లో స్మార్ట్ సిటీ అవార్డులను ప్రకటించాలని కేంద్రం యోచిస్తోంది.

ఉత్త కబుర్లు చెబుతున్నారు: రాహుల్

7 శాతమే నిధులే వినియోగించడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీటర్‌లో స్పందించారు. 'మోదీ భక్తులారా.. స్మార్ట్ సిటీ పథకంలో ఇప్పటివరకు కేవలం 7% నిధులే వినియోగించారు. చైనా అన్నింటిలో మనల్ని అధిగమిస్తుంటే మీ మాస్టారు (మోదీ) ఉత్త కబుర్లు చెబుతున్నారు'అంటూ విమర్శించారు. ఉద్యోగకల్పనకు ఏది అవసరమో మోదీకి చెప్పాలని బీజేపీ శ్రేణులను సూచిస్తూ చైనాలోని షెంజెన్‌లో వస్తున్న ఆవిష్కరణలకు సంబంధించిన వీడియోను రాహుల్ ట్విటర్‌లో పోస్ట్ చేశారు.

గౌరీ లంకేశ్ హత్య నన్ను మార్చేసింది

- పదేపదే సవాల్ చేస్తే రాజకీయాల్లోకి వస్తా
- ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్



శివాజీనగర (బెంగళూరు): తనకు రాజకీయాలంటే ఆసక్తి లేదని, అయితే పదేపదే సవాల్ చేస్తే రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధమేనని ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ అన్నారు. ఆదివారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన 'ఈ ఏటి (2017) ప్రెస్‌క్లబ్ వ్యక్తి' పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాజకీయం చాలా కష్టం. అందులో ఒక బాధ్యత ఉంటుంది. అందుకే నేను దూరంగా ఉంటాను. పదేపదే సవాల్ చేస్తే రాజకీయాల్లోకి వచ్చేందుకు సిద్ధం' అని పేర్కొన్నారు. జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్యోదంతం తనలో మార్పు తీసుకొచ్చిందని తెలిపారు. సమాజంలో జరుగుతున్న దారుణాలపై గళమెత్తాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. సీనియర్ పాత్రికేయులే తనకు ప్రశ్నించే ధైర్యాన్నిచ్చారని, వారి మార్గదర్శకత్వంలో పెరిగిన ఏకలవ్య శిష్యుడినని చెప్పారు. సమాజంలో బాధ్యతగా మాట్లాడేందుకు ప్రెస్‌క్లబ్ అందించిన పురస్కారం మరింత ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

S & D

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం
1-1-2018

నేను బావుంటే సరిపోదు.
నా ఒక్క ఇంట్లో సంతోషం ఉంటే సరిపోదు.
నా ఇల్లు మాత్రమే సుభిక్షంగా ఉంటే సరిపోదు.
ఏ?! ఉంటే తప్పేంటి!!?
ఉండదుగా! నువ్వు కావాలన్నా ఉండదు.
చెడు అన్న కారుమబ్బులు నీ ఇంటిని కమ్మేస్తాయి.

చెడు అలలు ఎగిరిపడుతున్న సముద్రం మధ్యలో
నీ దీవి ఒక ఎండమావి.
సమాజాన్ని పీడిస్తున్న చెడు
మన ఇంట్లోకి కూడా పాక్కుంటూ వచ్చేస్తుంది.
అప్పుడు నువ్వు కోరుకున్న సంతోషం, సుభిక్షం..
అన్నీ.. మాయమైపోతాయి.

మరేం చెయ్యాలి?
నువ్వు వికసించాలి.
నువ్వు మంచితనానికి నిర్వచనం కావాలి.
నువ్వు మంచికి ఉదాహరణ కావాలి.
మంచిది.



కొత్త సంవత్సరంలో చాలామంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు.

ఈ సంవత్సరం పెద్ద పదవి పొందాలని, ఈ సంవత్సరం డబ్బు బాగా సంపాదించాలని, ఈ సంవత్సరం స్మోకింగ్ మానేయాలని, ఈ సంవత్సరం కుటుంబానికి ఎక్కువ సమయం ఇవ్వాలని, ఈ సంవత్సరం ఎక్కువ ప్రయాణాలు చేయాలని, ఈ సంవత్సరం యోగా చేసి బాడీని ఫిట్‌గా ఉంచుకోవాలని...

ఒక్కో మనిషిది ఒక్కో నిర్ణయం.

అమెరికాలో ప్రతి ఒక్కరూ 2018 కొత్త సంవత్సరానికి ఏం నిర్ణయం తీసుకున్నారో తెలుసా?

'రాబోయే సంవత్సరంలో నేనొక మంచి వ్యక్తిగా ఉండాలి'– అని.

గతంలో అమెరికన్లు ఎక్కువమంది కొత్త సంవత్సర తీర్మానంగా 'ఈ ఏడు బరువు తగ్గాలనుకుంటున్నాను' అని చెప్పేవారు. అలాంటివారు 'మంచి వ్యక్తిగా ఉండాలనుకుంటున్నాను' అని చెబుతున్నారంటే ఒక్క అమెరికాలోనే కాదు ప్రపంచమంతా మనుషులు మానవధర్మాన్ని విస్మరించే స్థితిలో పడ్డారా అనిపిస్తోంది.

అసలు మనిషంటేనే మంచిగా ఉండేవాడు అని అర్థం.

మరితన ధర్మాన్ని తాను గుర్తు తెచ్చుకుని కొత్త సంవత్సర నిర్ణయంగా తీసుకునేంత దురవస్థలో మనిషి ఎందుకు పడ్డాడు? అంటే ఈ కాలానికి ఇది అవసరమైన నిర్ణయం అన్నమాట.

ఈ సంవత్సరం మన దేశంలో కూడా మంచి వ్యక్తిగా ఉండాలన్న నిర్ణయాన్ని ఎక్కువమంది తీసుకునేలా ప్రచారం జరిగిందనుకుందాం. కాని ఈ మంచి వ్యక్తిగా ఉండటం అంటే ఏమిటి? యూఎస్ఏ టుడేలో ప్రస్తావించిన అంశాల ఆధారంగా కొన్ని ఆలోచనలు....



పొరుగువారిని ప్రేమిస్తున్నామా?

ఇరుగు పొరుగు వారు ఎవరు? అని తెలుసుకోవడం ఇవాళ అతి పెద్ద మంచిగా అవతరించింది. గతంలో ఇరుగు పొరుగువారిని మన ప్రమేయం లేకుండానే తెలుసుకునేవాళ్లం. వాళ్ల ఇళ్లల్లో జరిగే మంచి చెడు మన ప్రమేయం లేకుండానే మనకు తెలిసేది. వాటిలో పాల్గొనడం మన జీవితంలో భాగం అనుకునేవాళ్లం. కాని ఇప్పుడు డోర్లు మూత పడ్డాయి. మన డోర్ మనం మూసుకున్నాం. పొరుగువారు వారి తలుపులు వారు మూసుకున్నారు. కామన్‌వాల్స్ ఉన్నా సరే అన్‌కామన్ బిహేవియన్ ప్రదర్శిస్తున్నాం. సాటివారిని మనవారని అనుకునే మంచితనం మనలో లేకపోతే మనల్ని సాటివారు మనవారని అనుకోరు. వారికి మంచితనం లేక మనలో మంచితనం లేకపోతే మనం నివసించే గ్రామం, గల్లీ, వీధి, కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్, ఇలాఖా, బస్తీ మంచిది లేనిది అవుతుంది. మంచితనం లేని సమాజం అక్కడే మొదలవుతుంది.

దయతో కరుణతో ఉంటున్నామా?

దయతో కరుణతో ఉండాలి. ఉన్నాం కదా అనుకుంటాం చాలామంది. దయతో కరుణతో ఉండాల్సింది కేవలం మన కుటుంబంతో కాదు. కేవలం మన స్నేహితులతో కాదు. కేవలం మనం ఇష్టపడేవారిని కాదు. అడ్రస్ కోసం వెతుక్కుంటున్న ఒక అపరిచితుడితో ఉండాలి. పర్స్ పోగొట్టుకుని సొంత ఊరికి చేరుకోలేని దురవస్థలో ఉన్న ఒక ప్రయాణికుడితో ఉండాలి. వైద్యం కోసం అగచాట్లు పడుతున్న ఒక రోగితో ఉండాలి. ఒక వీధి కుక్కతో, నీళ్లు లేక ఎండుతున్న పేవ్‌మెంట్ మొక్కతో, ఆకలితో అలమటించే బిచ్చగాడితో, మన సంతానం పొందిన మంచి స్కూలు, బట్టలు, సౌకర్యాలు పొందలేకపోతున్న మన బంధువుల అబ్బాయితో దయతో కరుణతో ఉండాలి.

ఒక టీచర్ తన కుమారుడితో మంచిగా ఉండి తన స్టూడెంట్స్ దగ్గర దుర్మార్గంగా ఉంటే ఆ టీచర్ మంచి వ్యక్తి కాదు. ఒక డాక్టర్ తన సోదరుడితో మంచిగా ఉండి తన పేషెంట్‌తో మోసకారిగా ఉంటే అతడు మంచి వ్యక్తి కాదు. ఒక కాంట్రాక్టర్ తన ఇంటిని దృఢంగా కట్టుకుని ఒక నిర్మాణాన్ని నాసిగా చేస్తే అతడు మంచి వ్యక్తి కాదు. ఒక నాయకుడు ఇంట్లో నిజాలు మాట్లాడుతూ ప్రజలతో అబద్ధాలు చెబుతుంటే అతడు మంచి వ్యక్తి కాదు. ఒక రచయిత మంచి విషయాలను రాయడానికే పరిమితం చేసి తాను కపటిగా ఉంటే అతడు మంచి వ్యక్తి కాదు.

చాలాసార్లు మంచి మన చేతుల్లోనే ఉంటుంది.

మంచిగా ఉండాలా లేదా అనేది మనమే నిర్ణయించుకోవచ్చు.

తలుచుకుంటే మంచిగా ఉండొచ్చు కూడా.

కన్వీనియంట్‌గా ఆ సంగతి మర్చిపోతున్నాం.

అందుకే నూతన సంవత్సరం సందర్భంగా మంచిగా ఉండాలి అని నిర్ణయం తీసుకునేవరకూ వచ్చాం.

బాధితుల పక్షం వహించామా?

చాలామంది ఏమనుకుంటారంటే పాప భీతి ఉంటే మంచిగా ఉంటాం అని. అంటే దేవుడు శిక్షిస్తాడు కనుక మంచిగా ఉండాలి అనుకోవడం. దేవుని పట్ల మన ప్రేమ, భక్తి ఎలా ఉన్నా మంచిగా ఉండటం అనేది మన విధి. మన మంచిని విశాలం చేసుకోవాలనుకోవడం కూడా మన విధి. ఇతర మతాల వారితో మంచిగా ఉండటం, ఇతర వర్గాలతో మంచిగా ఉండటం, ఇతర పక్షాలతో మంచిగా ఉండాలి అని అనుకోవాలి. కాని మనం మంచిగా ఉండటానికి కొన్ని సామాజిక ఒత్తిడులు, తీర్పులు కూడా అడ్డు పడుతూ ఉంటాయి.

స్త్రీలు, పురుషులతో మంచిగా ఉండే మనం థర్డ్ జండర్‌తో, లెస్బియన్లతో, హోమో సెక్సువల్స్‌తో మంచిగా ఎందుకు ఉండం అని ఎప్పుడైనా ఆలోచించామా? సింగిల్ ఉమన్‌తో, రేప్ విక్టిమ్స్‌తో, విడాకులు తీసుకున్నవారితో, పెళ్లి చేసుకోకూడదు అని నిశ్చయించుకున్నవారితో, సంతానం వద్దనుకున్నవారితో, బలవంతంగా వేశ్యావృత్తిలో దిగినవారితో మనం ఉండవలసినంత మంచిగా ఉంటున్నామా? కోల్పోయింది మన కుటుంబంలోని వ్యక్తి అయినా సరే ఉరిశిక్ష తప్పు అనేంత మంచిని మనం పెంచుకున్నామా? పగలు పర్సనల్ స్థాయిని దాటి ఎదుటి వ్యక్తి కులం, మతం, జాతి, దేశాన్ని కూడా ద్వేషించేంత చెడు మనలో ఎందుకు పేరుకుపోయిందో మనం ఆలోచించామా? ఎదుటివారి ఆకారాలను, భాషను, యాసను, ఆహారపు అలవాట్లను మంచిగా చూసేంత మంచి మనలో ఉందా? మంచిగా ఉండటం అంటే మరింత విశాలంగా ఉండటమే.



అమెరికాలో పబ్లిక్ సర్వేలు చేసే 'మేరిస్ ఇనిస్టిట్యూట్ సంస్థ' ఒక సర్వేను చేసి ఈ సంవత్సరం అమెరికాలో ఎక్కువ మంది 'ఈ సంవత్సరం మంచి వ్యక్తిగా మసులుకోవాలనుకుంటున్నాను' అనే కొత్త సంవత్సర తీర్మానం తీసుకున్నట్టు ప్రకటించింది. ఇదే విషయాన్ని 'యుఎస్ఏ టుడే' పత్రిక ప్రస్తావించి ముఖ్య వార్తగా ప్రచురించింది కూడా.

తక్కువ మంచి ఎక్కువ మంచి

లాభం కోసం కల్తీ చేయడం కన్నా ధర ఎక్కువ పెట్టడం మెరుగైన మంచి అవుతుంది. జీవిక కోసం తప్పుడు కేసు వాదించడం కన్నా న్యాయమున్న కేసులు రెండు ఎక్కువ వాదించడం మెరుగైన మంచి అవుతుంది. పది వాగ్దానాలు చేసి నిలబెట్టుకోకపోవడం కన్నా ఒక్క వాగ్దానం చేసి పూర్తి చేయడం మెరుగైన మంచి అవుతుంది. చాలాసార్లు మేలు చేయకపోయినా కనీసం కీడు తలపెట్టకపోవడమే మంచి అవుతుంది.

అయితే చాలామంది మనస్తత్వ నిపుణులు ఏమంటారంటే అన్ని వేళలా మంచిగా ఉండటం రుషులకు కూడా సాధ్యం కాదు. సర్దుబాట్లు ఉంటాయి. చిన్న చిన్న లోపాలు, వెలుతులు, స్వార్థాలు ఉంటాయి. తుఫానులో చిక్కుకున్నవారిని కాపాడేందుకు ఐదుమంది ఉన్న వైపు వెళ్లాలా ఒక్కరు ఉన్నవైపు వెళ్లాలా అనే విషయంలో సాపేక్ష మంచి ఉంది.

అయినా సరే ఎక్కువ మంచి వైపే మనం మొగ్గు చూపాల్సి ఉంటుంది.

నిపుణులు ఏమంటారంటే మనిషి సహజంగానే జన్మతః మంచితనంతో పుడతాడని.

మనం చేయవలసిందల్లా ఆ మంచితనాన్ని వెతికి, కలుగులో దాక్కుని లోయలో జారిపోయి ఉన్న ఆ మొగ్గని బయటకు తీసి, నీరు స్ప్రే చేసి వికసింప చేయడమే.

2018 మనందరిలో అందుకు నాంది పలుకుతుందని ఆశిద్దాం.

- సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

చెట్టు నీడ

ఇవ్వవలసినంత

● మాధవ్ శింగరాజు

మనిషికి ఏం కావాలి? చేతి నిండా డబ్బా? గుప్పెట నిండా అధికారమా? గుండె నిండా ప్రేమా? అన్నీ కావలసిందే. అన్నిటికన్నా గౌరవం.. అది మెయిన్‌గా కావాలనుకుంటాడు మనిషి. గౌరవం దక్కకపోతే, ఆశించినంతగా అందకపోతే విలవిలలాడిపోతాడు. ఎందుకు అంత బాధ కలుగుతుంది? మన మీద మనకు గౌరవం లేక!

ఓ సాధువు దగ్గరికి ఒక వ్యక్తి వచ్చాడు. ''నా పేరు గౌరయ్య. నేను గౌరవంగా బతుకుతున్నాను. కానీ నాకెవ్వరూ గౌరవం ఇవ్వడం లేదు'' అని గోడు వెళ్లబోసుకున్నాడు.

''ఇవ్వడం లేదా? అసలు ఇవ్వడం లేదా?'' అడిగాడు సాధువు.

''ఇవ్వవలసినంత ఇవ్వడం లేదని నాకు అనిపిస్తోంది'' అని గౌరయ్య బాధపడ్డాడు.

సాధువు అతడికి మెరుస్తూ ఉన్న ఒక ఎర్రటి రాయిని ఇచ్చాడు. ''ఇది విలువైన రాయి. దీని విలువ ఎంతో తెలుసుకునిరా. అమ్మకానికి మాత్రం పెట్టకు'' అని చెప్పి పంపించాడు.

గౌరయ్య మొదట ఓ పండ్లవ్యాపారికి ఆ రాయిని చూపించాడు. ''డజను అరటిపండ్లు ఇస్తాను. రాయిని ఇచ్చి వెళ్లు' అన్నాడు వ్యాపారి. ''ఇది అమ్మడానికి కాదు'' అని చెప్పి, దగ్గర్లో సంత జరుగుతుంటే అక్కడికి వెళ్లి రాయిని చూపించాడు గౌరయ్య.

''ఈ రాయికి ఏమొస్తాయి? పోనీ, కిలో ఉల్లిపాయలు తీసుకో'' అన్నాడు సంత వ్యాపారి. అమ్మడానికి కాదని చెప్పి, అక్కడి నుంచి నగల దుకాణానికి వెళ్లాడు గౌరయ్య.

''ఐదు లక్షలు ఇస్తాను.. ఇస్తావా?'' అన్నాడు నగల వ్యాపారి! ''అమ్మడానికి కాదు'' అన్నాడు.

''రెండు కోట్లు ఇస్తాను. ఆ రాయిని ఇచ్చెయి'' అన్నాడు నగల వ్యాపారి ఈసారి!!

గౌరయ్య ఆశ్చర్యపోయాడు. అయినా రాయిని అమ్మలేదు. చివరిగా రాళ్లూ రత్నాలు అమ్మే దుకాణానికి వెళ్లి, తన దగ్గరి రాయిని చూపించి ''విలువెంతుంటుంది?'' అని అడిగాడు. ఆ దుకాణందారు వెంటనే లేచి నిలబడ్డాడు. ఆ రాయికి రెండు చేతులు జోడించి నమస్కరించాడు. నేలపై శుభ్రమైన మెత్తటి గుడ్డను పరిచి, దాని మధ్యలో రాయిని ఉంచి, రాయికి ప్రణమిల్లాడు. ''ఈ రాయి ఎంతో అమూల్యమైనది. నా జీవితాన్నంతా ధారపోసినా ఈ అమూల్యాన్ని కొనలేను'' అని, గౌరయ్యకు కూడా ఓ నమస్కారం పెట్టి పంపాడు.



బయటి గురువు దారి చూపిస్తాడు.
లోపలి గురువు దారిలో నడిపిస్తాడు: (ప్రతీకాత్మక చిత్రం)

సాధువు దగ్గరికి వచ్చి జరిగిందంతా చెప్పాడు గౌరయ్య.


సాధువు నవ్వాడు. ''మనకు లభించే గౌరవం, మన గురించి ఎవరికి ఎంత తెలుసో అంతవరకే ఉంటుంది'' అని గౌరయ్యకు చెప్పాడు.

మనలో కూడా ఒక గౌరయ్య ఉంటాడు! తనను అంతా ఒకేలా గౌరవించాలని ఆ గౌరయ్య ఎప్పుడూ అనుకుంటూ ఉంటాడు. ఎక్కడైనా కొద్దిగా గౌరవం తగ్గితే, తనకు ఇవ్వవలసినంత గౌరవం ఇవ్వడం లేదని గుదులుకుంటూ ఉంటాడు. గౌరవాల్లోని హెచ్చుతగ్గులను బట్టి వ్యక్తి గౌరవం పెరగడం, తగ్గడం ఉండదు. ఎవరు ఎన్ని రకాలుగా విలువ కట్టినా.. అన్నిటినీ సమాన విలువగా స్వీకరించే అమూల్యమైన సెల్ఫ్ రెస్పెక్ట్ (సాధువు ఇచ్చిన రాయిలా) మనకు ఉండాలి. అది లేనప్పుడే.. గౌరయ్యలా బయటి నుంచి వచ్చే గౌరవాలను తక్కెట్లో వేసుకుని చూసుకుంటూ ఉంటాం. సెల్ఫ్ రెస్పెక్ట్.. మన లోపలి గురువు. ఆ గురువుకు మనం ఇవ్వవలసినంత ఇవ్వాలి. అప్పుడు మనకు కోరుకున్నంత రాలేదన్న చింత ఉండదు. హ్యాపీ న్యూ ఇయర్.

కవనం

నూతన విరామ చిహ్నం

అప్పుడే మళ్ళీ
మరొక సంవత్సరం తెగిన గాలిపటంలా
తెలియని ఏ దిక్కుల ఆవలికో
ఎగిరిపోయింది.
ఇదిగో ఇప్పుడే
ఏడు రంగుల ఏడాది ఒకటి
రెక్కలు రెపరెపలాడిస్తూ ఎక్కడినుంచో
ఖగోళ శాస్త్రజ్ఞులు ఇంకా కనిపెట్టని
ఏ అగోచర మార్మిక గ్రహం నుంచో
వచ్చి మనం మనదనుకుంటున్న



ఈ లోకపు భుజం మీద వాలింది.
వానలూ తుపానులూ భూకంపాలూ
ఎన్నికలూ వాగ్దానాలూ వంచనలూ
వరదలూ ఊచకోతలూ మళ్ళీ మరొకసారి
కొత్త గజ్జెలు కట్టి కాల రంగస్థలం మీద నర్తిస్తాయి...
అంతా బాగున్నట్టే ప్రవర్తిస్తాయి.
చౌరస్తాలలో యాచక బాలల చేతుల్లో
హేపీ న్యూ ఇయర్ జెండాలు ఎప్పటిలాగే ఊగుతాయి.
దలాల్ స్ట్రీట్‌లో క్షణాలలో
లక్షలూ కోట్లూ ఎప్పటిలాగే చేతులు మారతాయి;
మురికివాడలకీ, విలాస నివాసాలకీ
ఆడీ కార్లకీ తుప్పుపట్టిన సైకిల్ చక్రాలకీ
ఏ దేశంలోనయినా ఏ సంవత్సరంలో అయినా
కేలెండర్లతో పంచాంగాలతో ఏమి పని...
అనంత కాలవాక్యంలో
పాతదయినా కొత్తదయినా
సంవత్సరం ఒక సూక్ష్మ విరామ చిహ్నమే.

- దేవిప్రియ

హేయ్ హ్యూమన్స్!

వినదగు నెవ్వరీ ఇయర్

ఎవ్రీ ఇయర్ చేసినట్టే.. ఈ ఇయర్‌లోనూ కొన్ని డూస్ అండ్ డోన్ట్స్‌కి టిక్కు పెట్టుకుందాం. మాటల్తో చెప్తే మనుషులు వినడం లేదు కాబట్టి, ఈసారి మూగ ప్రాణులతో చెప్పిస్తున్నాం. ఎవరు చెప్పినా, ఎలా చెప్పినా మంచిని స్వీకరించడం మానవధర్మం. న్యూ ఇయర్‌కి ఇది తగిన సందర్భం.


● బ్యాడ్ హ్యాబిట్స్ మానేయండి


● కపుల్‌ని కామెంట్ చెయ్యకండి


● దొంగచూపులు చూడకండి


● ఎవర్నీ డిస్టర్బ్ చెయ్యకండి


● ఎవరో చేశారనీ మీరూ చెయ్యకండి


● కంటినిండా నిద్రపోండి


● కోపం తగ్గించుకోండి


● మలుపుల్లో జాగ్రత్తండీ


● మాణింగ్ మాణింగ్ లేవండి.


● వీపుమోత తగ్గించుకోండి.

సాక్షి ఫ్యామిలీ
సన్నిధి
హైదరాబాద్
సోమవారం
1-1-2018

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్

హలో రామ్ అన్నయ్యా! నువ్వు ఎలా ఉన్నా.. నేను మాత్రం అస్సలు బాగో లేను. నేను ఒక అబ్బాయిని లవ్ చేశాను. తను కూడా నన్ను ప్రాణం కంటే ఎక్కువగా ఇష్టపడ్డాడు. బట్ ప్రాబ్లమ్ అంతా నా దగ్గరే ఉంది. ఇప్పుడు నా ఫ్యామిలీ ఇంపార్టెంట్ అని చెప్పి.. ఆ అబ్బాయికి దూరం అవుతున్నా. కానీ, ఆ అబ్బాయి లేకుండా లైఫ్‌నే ఊహించుకోలేకపో తున్నా. మా పేరెంట్స్ కోసం నా హ్యాపీ నెస్‌ని వదిలేసుకుందాం అనుకున్నా కానీ, నా లవ్‌ని శాక్రిఫైజ్ చేస్తే నా జీవితంలో ఇంకేం మిగలదు. ఆ అబ్బాయి వాళ్ల ఇంట్లో చెప్పి ఒప్పించే శాడు. వాళ్ల అమ్మ నన్ను కూతుర్లా చూసుకుంటోంది. మా లవ్ మేటర్ మా ఇంట్లో చెప్పలేదు. చెప్పినా ఒప్పుకోరు. ఎందుకంటే మా నేపథ్యాలు వేరు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? లవ్ చేసిన వాడితో ఉండాలా? ఫ్యామిలీ కోసం లవ్‌ని వదిలెయ్యాలా??

– మౌనిక



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

లవ్ అంటేనే ఛాయిస్!
ఒకటి కావాలంటే ఒకటి వదులుకోవాలి!!
వదులుకోవడానికి రెడీ అయితేనే ఇంకొకటి దొరుకుతుంది!!

రెండూ కావాలంటే....

‘లవ్ డాక్టర్‌కి ఉత్తరం రాయాలి కదా సార్??’

నీది చాలా బిజినెస్ మైండ్ నీలాంబరీ!

‘అరటిపండ్లేమైనా చెట్లకు కాస్తున్నాయా సార్???’

కాయట్లేదా?

‘బజారుకెళ్లి జీఎస్‌టీ కట్టి మరీ తెచ్చుకోవాలి సార్!!’

చెట్టుకు కాయకుండా బజారుకు ఎలా వస్తాయి నీలూ??

‘సార్ నన్ను ఇంటెలిజెంట్ క్వశ్చన్లు అడగకండి. అరటిపండ్లు ఏమయినా చెట్లకు కాస్తాయా.. బజారులో దొరుకుతాయి అన్నాను. అది నిజం కాదా? కాసేది చెట్లకే అయినా ఎంత కాస్ట్‌లీ అయిపోయా యంటే.. డబ్బులు చెట్లకు కాస్తేనే కొనగలిగేంత.. అని చమత్కరిం చాను! దానికే మీరు మళ్లీ క్లాస్ పీకడం బాగోలేదు సార్!!!’

కరెక్ట్‌గా చెప్పావు నీలూ.. అమ్మాయి ఏమయినా చెట్టుకు కాసిందా? అబ్బాయి ఇష్టపడగానే తెంచుకుని వెళ్లిపోవడానికి..?? అమ్మాయి అమ్మ కడుపులో కాసింది. నాన్న కష్టంతో పెరిగింది. ఇంటి గౌరవంతో ముడిప డింది. ఇన్నింటినీ తెంచేసుకుని వెళ్లిపోవడం కరెక్టా? కాదు! ప్రేమ చెట్టిం టిదయినా, మెట్టినింటిదయినా అంతే గొప్పది!

మౌనికకి రెండూ దొరుకుతాయి కానీ, దానికి సాహసం కన్నా, తెగింపు కన్నా.. స్వార్థం కన్నా...

‘సార్ కన్నా ఏంటి సార్?’

కన్నవారి ప్రేమ కన్నా, వారి అభిప్రాయం కన్నా, వారి అంగీకారం అవసరం!!

‘కుదరదు అని మమ్మీడాడీ అంటారని చెబుతోంది కదా సార్???’

చాక్లెట్ వద్దంటే మానేసిందా..? ఐస్‌క్రీమ్ వద్దంటే మానేసిందా..? కొత్త బట్టలు ఇప్పుడు వద్దులేరా అంటే మానేసిందా? కాస్త మారాం చెయ్యాలి. కాస్త ప్రేమగా అడగాలి. కాస్త బుజ్జగించుకోవాలి. కాస్త నిబ్బరంగా ఉండాలి. కాస్త పేషెన్స్ చూపించాలి. ఇప్పుడు మౌనిక ప్రేమ ఇంకా పిందె దశలోనే ఉంది. పండు అవ్వడానికి, చెట్టు నుంచి వీడటానికి ఇంకా సమయం ఉంది. అప్పుడు మమ్మీడాడీలే పండంటి మౌనికను తమలపాకులో పెట్టి మరీ అబ్బాయికి ఇస్తారు!

‘సార్ మీ పాజిటివ్ థింకింగ్ తప్పకుండా వర్కౌట్ కావాలి సార్!’

ప్రేమ, ఆకర్షణ, టీనేజ్ అనుబంధాల్లోని అయోమయం మిమ్మల్ని గందరగోళపరుస్తుంటే ప్లీజ్ ఈ అడ్రస్‌కు మాత్రం అస్సలు రాయకండి.

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబర్ 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

సుడోకు

2	9		7	4	3	5		
		3	1	2				
	7	4					3	
	1		5			8		7
	3	5	4		1	6	9	
6		8			2		1	
	2					7	8	
				1	8	4		
		6	2	9	7		5	3

నిబంధనలు
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

2	9	4	5	6	1	8	7	3
5	6	8	4	3	7	2	1	9
1	3	7	9	8	2	5	6	4
8	7	9	2	4	3	1	5	6
4	5	2	6	1	8	3	9	7
3	1	6	7	5	9	4	2	8
9	4	5	8	2	6	7	3	1
7	2	3	1	9	4	6	8	5
6	8	1	3	7	5	9	4	2

ఆచార్య దేవోభవ

నీలోని గుడికి... 18 మెట్లు

మనిషి మనసులో దైవత్వం ఉంటే... మనిషి ఉనికి ఆలయం అవుతుంది. 2018లో ఈ 18 మెట్లను అధిరోహించి... మీలోని దైవత్వాన్ని చాటి చెప్పండి. మీలోని సుగుణాలతో... సమాజంలో పరివర్తనకు దారులు వేయండి. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాల నుంచి జల్లెడ పట్టి... మీ కోసం అల్లిన విశిష్ట సుమమాల ఇది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సృష్టిలో ఎదుటివారు చెప్పినది విని దాంట్లోని నిజానిజాలు తర్కించే శక్తి మానవుడి కొక్కడికే ఉన్నది. కానీ దురదృష్టం ఏమంటే నేటిరో జుల్లో నేను నమ్మిందే కరెక్టు, నా ఇష్టం వచ్చిందే నేను చేస్తాను అన డమే గొప్ప విషయంగా చలామణి అవుతోంది. మహాభారతంలో దుర్యోధనుని వెంట భీష్మద్రోణ కృపాచార్యులున్నా ఎందుచేత మట్టు పెట్టబడ్డాడనేదానికి ఒకటే కారణం చెబుతారు పెద్దలు. దుర్యోధను డితో మహర్షులందరూ చెప్పారు... ‘‘నీవు చేస్తున్నది తప్పు. నీ పని వల్ల పాడైపోతావు. మా మాట విను. ఇలా చెయ్యకు’’ అన్నారు. అందుకాయన– ‘‘మీరు చెప్పేది మంచని తెలిసినా నేను పాటించను, మీరు చెప్పేది చెడని తెలిసినా నేను పాటించకుండా ఉండలేను’’ అన్నాడు. ఆ తత్వం పశువు కన్నా హీనం, అత్యంత ప్రమాదకరం.

1 సంస్కారబలం ఉండాలి

సంస్కారమనే మాట గొప్పది. చదువు దేనికోసం? సంస్కారబలం కోసం. చదువుకు సంస్కారం తోడ యితే మీరు లోకానికి ఏ హితకార్యమైనా చేయగ లరు. యుక్తాయుక్త విచక్షణ ఏర్పడుతుంది. సంస్కారబలంతో మీకు తెలియకుండానే గొప్ప వ్యక్తిత్వం ఏర్పడుతుంది.

2 మోహాన్ని పోగొట్టుకోవాలి

మిమ్మల్ని పొగుడుతూ మాట్లాడేవాళ్లు ఎక్కడికెళ్ళినా దొరుకుతారు. మీ క్షేమం కోరి, మీతో కఠినంగా మాట్లాడేవ్యక్తి దొరకడం కష్టం. దొరికినా అటువంటి మాట వినేవారు ఉండరు. ఒకవేళ అలా ఇద్దరూ దొరికితే జన్మ సార్థక మౌతుంది. మోహంలో పడిన అర్జునుడికి భగవద్గీతంతా చెప్పాడు కృష్ణ పరమాత్మ. చివరన ‘నీకేం అర్థమయింది’ అని అడిగాడు. ‘‘నాకు మోహం పోయింది. స్మృతి కలిగింది. నేను యుద్ధానికి బయల్దే రుతున్నా’’ అన్నాడు అర్జునుడు.

3 తప్పొప్పుల కూడిక

ఈప్రపంచంలో ఎవరూ ఒప్పులకుప్ప కాదు. నాలో దోషం తెలుసుకుంటే క్షమార్పణ అడుగుతా. మారీ చుడు చెప్పాడు రావణుడికి... ‘‘నీకేంలోటు, ఇంత మంది భార్యలున్నారు. కాంచనలంక ఉంది, భటులున్నారు. రాముడి జోలికి వెళ్ళకు. వెళ్ళావా, అన్నీపోతాయి’’ అన్నాడు. అన్నీ విన్న రావ ణుడు ‘‘నువు చెప్పేది అయిపోయిందా. అయితే విను. నువ్వు చచ్చి పోవడానికి ఎలాగూ సిద్ధం. నామాట వింటే రాముడిచేతిలో చచ్చిపో తావు. వినకపోతే నా చేతిలో చస్తావు. ఎలా చచ్చిపోతావో చెప్పు’’ అన్నాడు. అంతేతప్ప నేను వింటానని అనలేదు. అలా అననందుకు అంత తపశ్శక్తి ఉన్న రావణాసురుడు చివరకు ఏమయిపోయాడు?

4 మాట వినడమన్నది తెలుసుకోవాలి

మహాభారతం సమస్తసారాంశం ఇదే. దుర్యోధనుడి దగ్గరకెళ్ళి మహర్షులందరూ చెప్పారు, కొన్ని గంటల పాటూ చెప్పారు... అన్నీ విన్నాడు. అన్నీ విని వెటకా రమైన మాటొకటన్నాడు. అహంకారబలం అది – ‘‘నాకు ధర్మం తెలి యదా! తెలుసు. కానీ అలా చెయ్యాలనిపించడం లేదు. అయినా నేను తప్పులు చెయ్యడమేమిటి! నాకు చెబుతారెందుకు’’ అన్నాడు. మహర్షులు మాట్లాడుతుంటే సరిగా వినకుండా తొడలుకొట్టాడు, చివ రకు తొడలు విరిగి పడి పోయాడు.

5 పెద్దలమాట శిరోధార్యంగా స్వీకరించు

తల్లి, తండ్రి, గురువులు, అనుభవజ్ఞులు, సమాజం లోని పెద్దలు చెప్పేది శ్రద్ధగా వినాలి. అయితే వారె ప్పుడూ నీ దగ్గరే ఉండి ఇలా చెప్పడం సాధ్యపడు తుందా ? సాధ్యమే, ఎలానో తెలుసా? నేను చంద్రశేఖరేంద్ర భారతీ స్వామివారి అనుగ్రహభాషణం చదువుతుంటే, నా పక్కనే వచ్చి కూర్చుని స్వామి నాతో మాట్లాడుతుంటాడు. పరమాచార్య ప్రసం గాలు చదవండి, భారతీతీర్థస్వామి వారి ప్రసంగాలు చదవండి. పీఠా ధిపత్యం వహించిన వారి వాక్కులు చదవండి. రామకృష్ణ పరమ హంస, ఎపిజె అబ్దుల్ కలాం గారి మాటలు చదవండి.

6 బాగుపడినా, పాడయిపోయినా కారణం-జడత్వమే

జడమనే మాట ఒకటుంది. జడం–అంటే చైతన్యముంటుంది, కానీ ప్రతిస్పందన ఉండదు. ఒక రాతిలో చైతన్యం లేదని చెప్పలేం. కానీ దానిలో ప్రతిస్పందన ఉండదు. మీరు వెళ్ళి ఒక చెట్టును కొట్టారనుకోండి. మీకు వినబడకపోవచ్చు కానీ, దానిలో ప్రతిస్పందన ఉంటుంది. ఈ ప్రతిస్పందించగల శక్తి జడత్వానికి విరోధి. జడత్వం–అంటే చైతన్యం ఉండి కూడా ప్రతిస్పందించలేని బతుకు. ఒక మాటంటే ప్రతిస్పందన ఉండదు. అలాంటి ప్రతిస్పందనలేని లక్షణంలో నుంచి జడత్వం ఆవ హిస్తుంది. అసలు లోకంలో ఒక వ్యక్తి వృద్ధిలోకి వచ్చినా, ఒక వ్యక్తి పాడయిపోయినా కారణమేమిటని అడిగింది శాస్త్రం. అందుకు జడ త్వమే కారణం.

7 ఆదర్శాలు చెప్పడమే కాదు... ఆదర్శంగా మారాలి

ఎప్పుడు ఏం చేస్తున్నా శ్రీరామాయణంలో చెప్పిన విషయాలను ఆదర్శంగా తీసుకుని ఆచరణలోకి తీసుకు వచ్చే ఒక కార్యశీలిని ‘నడిచే రామాయణం’ అంటారు. తాను చెప్పడం వేరు, తానే ఆ వస్తువుగా మారడం వేరు. చెప్పడం అందరూ చెప్తారు. ‘‘సర్వోపదేవ ఉపదేశాయ సర్వే వ్యాసప రాశరః:’’. ఇంకొకడికి చెప్పమంటే ప్రతివాడూ వ్యాసుడే, ప్రతివాడూ పరాశరుడే. కానీ నీవు చెప్పినదాంట్లో నీవెంత ఆచరిస్తావన్నదాన్నిబట్టి నీవు ఆదర్శంగా మారడమనే వస్తువు సిద్ధిస్తుంది.

8 ఎవరిలోపాన్ని వారే దిద్దుకోవాలి

నాకు ఇలా ఉండటం తప్ప ఇంకోలా రాదనుకోవడం చాలా భయంకరమైన స్థితి. అది దిద్దుకోవలసిన స్థితి. మనిషి తాను తనలో ఉండకూడని లోపాన్ని దిద్దుకుంటే పదిమందికీ అతను పనికొస్తాడు. పదిమంది మీతో మాట్లాడటానికి అవకాశం ఇస్తే, మీరేమీ చేయాలో మీరు నిర్ణయం చేసుకోగలరు. మీ అభిప్రాయానికి ఒక స్పష్టత వస్తుంది. అసలు అందరూ మీ దగ్గరికి రావడానికి భయపడిపోయే స్థితిని కలిగిస్తే, ‘‘మీరు ఎక్కడ ఎలా ఉండి ఏం ప్రయోజనం’’ చెప్పండి.

9 కోపాన్ని తగ్గించుకోవాలి

మీ కోపాన్ని మీకు మీరుగా పరిశీలించి దిద్దుకోవాలి తప్ప. నాకు కోపం వచ్చేసిందండీ. నేను కోపిష్టివాడి నండీ అన్న తరువాత మీ ఆ కోపాన్ని తగ్గించగలిగే వాడు ఉండడు. దానికన్నా శత్రువు లేదు. నేను ఇలా ఉండవచ్చా? ఇంతటి కోపమేమిటి నాకు. ఈ కోపం వల్ల నేను సాధించేదేమిటి? అని కోపం వచ్చినప్పుడు మీరు కాసేపు ఏకాంతంలో కూర్చుని మిమ్మల్ని మీరు పరిశీలించుకోవాలి. మీకు వచ్చిన కోపాన్ని మీరు పరి శీలనం చేసుకొని కోపాన్ని విడిచిపెట్టగలిగిన వాడెవరో వాడు దేశా నికి, సమాజానికి పనికొచ్చి తీరుతాడు.

10 జీవితం ప్రణాళికా బద్ధంగా ఉండాలి

అధికారులు కింది వారిని సంప్రదించాలి. పని చేయ డంలోని సాధకబాధకాలను తెలుసుకోవాలి. అధికా రి చేతిలో వేలకోట్ల రూపాయల నిధులు విడుదల చేసే అధికారం ఉంటుంది. అవి సక్రమంగా ఖర్చుకావాలి. ప్రజలకు ఉపయోగపడాలి. అందుకు సరైన ప్రణాళిక ఉండాలి. రేపు మీరే ఆ అధికారి అయితే? అందుకే కత్తికి రెండు వైపులనూ అర్థం చేసుకుని ప్రణాళిక రచన చేయడానికి తగిన నైపుణ్యాన్ని అలవరుచుకోవాలి.

11 వినండి, వినడం నేర్చుకోండి

ఒక సమస్యను బాగా పరిశీలించి, అవసరం అయితే కిందికి వచ్చి విని దానిని విశ్లేషణం చేసే నైపుణ్యం ఉండాలి. ఎవరైనా మాట్లాడటం మొదలు పెట్టేటప్ప టికి రంధ్రాన్వేషణ చేయడం అన్నది జీవితంలో అల వాటు అయిపోయిందనుకోండి. అంతకన్నా ప్రమాదకరమైన అల వాటు ఇంకోటి లేదు. మీ జీవితంలో పైకి రావాల్సిన మార్గాలన్నీ మూసేసుకున్నట్టే. ఎవరు మాట్లాడుతున్నారన్నది కాదు. ఆ మాట లలో మనకు ఏమైనా సారాంశం అందుతుందా? అని ఎదురు చూసి, అందులో ఒక్క మంచి మాటను పట్టుకుని జీవితాన్ని మార్చుకోగలి గితే... వారి జీవితం చక్కబడుతుంది.

12 మీరు ఏది ఎందుకు చేస్తున్నారో స్పష్టమైన అభిప్రాయంతో ఉండండి

నేను ఒక మాట చెబుతాను. మహాపురుషుడు వేరు, ఆ మహాపురుషుడు రాసిన పుస్తకం వేరు కాదు. వాల్మీకి వేరు, వాల్మీకి రామాయణం వేరు కాదు. ఇవి కలిసే ఉంటాయి. ఒక చంద్రశేఖరేంద్రస్వామివారు ఎప్పుడూ మీ పక్కన ఉండాలంటే ఆయన సందేశాల పుస్తకం మీ దగ్గర ఉండాలి.

13 మృత్పిండంలా కాదు... రబ్బరు బంతిలా ఉండాలి

పదిమందికి ఉపయోగపడకుండా ఎప్పుడు పోతారో తెలుసాండి. మీలో తట్టుకునే శక్తి లేనప్పుడు. మట్టి ముద్దను మీరు ఇలా పట్టుకుంటే పొరపాటున మీ చేతిలోంచి జారికిందపడిపోయిందనుకోండి. ఇహ అది పైకి లేవదు. అదే రబ్బరు బంతి అయితే ఎంత కిందపడిందో అంతపైకి లేస్తుంది. చిన్న పొరపాటు కూడా జరగకుండా మీ జీవితం ముందుకు సాగదు. మీరు ఎంత గొప్పవాళ్లయినా మీకు వంక పెట్టకుండా ఉండలేరు. ఎవరో ఒకరు వంకపెట్టారని మీరు మృత్పిండమై పాడైపోకండి. మీవల్ల ఏదో ఒకనాడు పొరపాటు జరగవచ్చు. జరిగిననాడు మట్టి ముద్దలా కిందపడిపోకండి.

14 నిరాశను దరిచేరనివ్వకండి

అబ్దుల్ కలాంగారి కెరీర్ ఎక్కడ నుండి ప్రారంభం. ఆయన కోరుకున్న ఉద్యోగం ఒకటి. ఆయనకు వచ్చిన ఉద్యోగం ఒకటి ఆయన నిరాశతో ఋషికేశ్‌లోని ఒక స్వామిజీ దగ్గరికి వెళ్లి కూర్చున్నారు. స్వామిజీ అలా వెళుతూ నీరసంగా కూర్చున్న కలాంగా రిని పిలిచి అడిగారు. ఏం ఎందుకలా కూర్చున్నావని. ఈయనన్నారు. ‘‘నేను ఫలానా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్లాను, అది పొందడం నాకిష్టం. కాని నేను సెలెక్ట్ అవ్వలేదు. ఏదో ఈ ఇంటర్వ్యూ అని మరో దానికి వెళ్లాను, సెలెక్ట్ అయ్యాను. ఇప్పుడు నాకీ ఉద్యోగం చేయాలని లేదు. నాకిష్టంలేదు’’ ఆ స్వామీజీ ఒక చిరునవ్వు నవ్వి అన్నారు. ‘‘నీవు కోరుకుంటున్నదే దొరకాలని ఎందుకనుకుంటు న్నావు. ఏమో ఈశ్వరుడు నీ ద్వారా ఈ జాతికి యేం చేయించాలను కుంటున్నాడో’’ ఆ మాట ఆయన మీద పనిచేసింది. అంతే ఈ దేశా నికి ఉపగ్రహాలు తయారు చేసుకోవడానికి సత్తానిచ్చిన మహాపురుష డయ్యాడు.

15 మంచి మంచి పుస్తకాలు చదవండి

ఏ పుస్తకం పడితే అది చదవకండి. వివేకానందుని ఉపన్యాసాలు చదవండి. మీకెంతో ధైర్యం వస్తుంది. పేడలో పురుగుపుట్టి పెరిగినట్లు బ్రతకకూడదు. మంచిగా బ్రతకడానికి కలేజా కావాలి. రామకృష్ణ పరమహంస కథలు చదవండి. చాలామందిలో తెలుగు మాట్లా డాలా? ఇంగ్లిషు మాట్లాడాలా అన్న సందిగ్ధం మొదలైంది. ఇంగ్లిషు బాగా చదువుకుని పాసవండి. చక్కగా తెలుగులో మాట్లాడండి. మీరు పెద్దయ్యాక రామాయణ గ్రంథప్రతుల్ని వేయి ముద్రించి పంచి పెట్టండి. ఆదివారాలు సాహితీ సభలకు వెళితే చక్కగా తెలుగులో మాట్లాడండి. పోతన గారి నాలుగు పద్యాలు చెబుతూ ప్రసంగం చేయండి. గురువుల పట్ల, పెద్దల పట్ల మర్యాదను సంతరించుకోండి.

16 ఆరాధించడం కాదు... ఆదర్శంగా తీసుకోవాలి

ప్రపంచ ప్రఖ్యాత బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్క ర్‌కు ఉత్థాన పతనాలున్నాయి. ఎంత కిందకి పడిపో యాడో అంతపైకి లేచాడు. టెండూల్కర్ క్రికెట్ చూడటం కాదు. టెండూల్కర్ వెనుక ఆ స్థాయికి ఎదగడానికి ఉన్న కారణం చూడండి. ఒక బాల్ వస్తున్నప్పుడు గ్రద్ద ఆకాశంలో ఉండి కోడిపిల్లను చూస్తున్నట్టు చూస్తూ ఉంటాను. బంతి ఎక్కడ పడుతుంది. దీన్ని ఏ డైరెక్షన్లో కొట్టాలి? అని... అంతే! స్ట్రోక్ అప్లై చేస్తాను అన్నాడు. అలా మీరు కూడా మీ గురువుల గురించి చెప్పేటటువంటి శీలాన్ని అలవాటు చేసుకోండి.

17 విజయాన్నీ, వైఫల్యాన్నీ సమానంగా తీసుకోవాలి

మనం చేసే ప్రతి ప్రయత్నంలో విజయం, వైఫల్యం ఉంటుంటాయి. ఒక చోట విజయం వరిస్తే ఇక నా అంతటి వాడు లేడని రొమ్ము విరుచుకుని తిరగకూ డదు, అక్కరలేని భేషజాలకు పోయి పాడయి పోకూ డదు. అలాగే ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రయత్నం ఫెయిల్ అయినట్లు కనబడుతుంటుంది. అలా ఫెయిలవడం నీ జీవితంలో వృద్ధిలోకి రావడానికి కారణం కావాలి. కాబట్టి ఎప్పుడైనా ఎవరికైనా వైఫల్యం సంభవిస్తే బెంగపెట్టుకుని స్తంభించి పోకూడదు. మళ్ళీ ఉత్సాహంగా పూనికతో వృద్ధిలోకి రావాలి.

18 పొగడ్తకు పొంగిపోకండి


ఎప్పుడైనా సరే పొగడ్తకు మించిన మత్తు ఉండదు. పొగడ్తకు మించి లోకంలో పాడవడానికి మరొక కారణం కూడా కనిపించదు. జీవితంలో పొగడ్త అన్నది ఎంతమోతాదులో పుచ్చుకోవాలో అంతే మోతాదులో పుచ్చు కోవాలి. మందులే కదా అని మోతాదుకు మించి తీసుకుంటే విషమై చచ్చిపోతారు. అలాగే నీవు వృద్ధిలోకి రావడానికి పొగడ్త కూడా ఎంత వాడాలో అంతే వాడాలి.

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

రాశి ఫలితాలు - 2018

టారో





ఇన్సియా
టారో అనలిస్ట్

కొత్త సంవత్సరం ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అందరికీ తహతహగా ఉండటం సహజం. అయితే, మీ జన్మనక్షత్రం, రాశి తెలియదే అని నిరాశపడవద్దు. పుట్టిన నెల, తేదీ తెలిస్తే చాలు... టారోకార్డులు ఈ సంవత్సరం మీకు ఎలా ఉంటే బాగుంటుందో తెలియజేస్తాయి. అవసరమైతే తగిన పరిష్కారాలూ చెబుతాయి. ఇంకెందుకాలస్యం... టారో ఏం చెబుతోందో చూడండి మరి!

మేషం (మార్చి 21 - ఏప్రిల్ 19)

2018 మీ జీవితంలో ఒక మైలురా యిగా నిలుస్తుంది. ఉన్నత శిఖరా లకు ఎదుగుతారు. కష్టపడి పని చేసే మీ స్వభావానికి, జ్ఞానం కూడా తోడైతే విజయం మీదేనన్న విషయాన్ని బలంగా నమ్మండి. ఆరోగ్యం విష యంలో జాగ్రత్త అవసరం. ముఖ్యంగా లేని జబ్బులను ఉన్నాయనుకొని భయ పడే మీ ఆలోచనా తీరు కూడా కాస్త మారాల్సి ఉంది. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, మీకేం కావాలో నిర్ణయించుకొని, ఆ దిశగా కష్టపడండి. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామిని సంతోషపెట్టడం గురించి ఎక్కువ ఆలోచిస్తారు. వారిచ్చే చిన్న చిన్న బహుమతులు మిమ్మల్ని ఉత్సాహపరుస్తాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. కొత్త పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం చూపిస్తారు.

మార్చి – జూన్ కాలంలో చేపట్టే పనులన్నీ విజయవం తంగా పూర్తవుతాయి. ఆగస్ట్, నవంబర్ నెలల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తే సూచనలు కనిపిస్తున్నాయి. జాగ్రత్త పడండి.

కలిసి వచ్చే రంగు: గోధుమ రంగు

వృషభం (ఏప్రిల్ 20 - మే 20)

2018లో మీరు చేపట్టిన పనులన్నీ విజ యవంతంగా పూర్తవుతాయి. జీవితా శయం వైపుకు అడుగులు వేస్తారు. ఎప్పట్నుంచో ఈ దిశగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నా, ఇప్పటికి అన్నీ కుదురు తాయి. ఈ క్రమంలో ఇతరుల నిర్ణ యాలు, సహాయం కంటే మిమ్మల్ని మీరు నమ్మడం అన్న ఆలోచనే ముందుకు తీసుకెళుతుంది. సరైన పద్ధతిలో, సరైన మార్గంలో పనిచేస్తూ వెళ్లండి. ఒక కొత్త వ్యక్తి రాక మీ జీవితాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ఆ వ్యక్తి ఈ ఏడాదిలోనే మీతో జీవితం పంచు కునేంత దగ్గరైపోతారు. మీవైన స్థిరమైన ఆలోచనలు కొన్ని ఎవ్వరి కోసమూ మార్చుకోవాల్సిన అవసరం లేదన్నది గ్రహించండి. కొత్త పెట్టుబడులకు ఈ ఏడాది బాగా కలిసివ స్తుంది. మీ చుట్టూ ఉండేవారిలో మీదైన గుర్తింపు తెచ్చుకుం టారు. నిజాయితీగా, కష్టపడి పనిచేయడమే మీ ఆయుధమని మరవకండి.

జనవరి నుంచి ఏప్రిల్ వరకూ మీరు పట్టిందల్లా బంగా రంలా ఉంటుంది. ఏప్రిల్ లేదా అక్టోబర్‌లో పెళ్లి సూచనలు కని పిస్తున్నాయి. 2017 ఊహించిన స్థాయిలో లేదని బాధపడుతు న్నట్లైతే, 2018 మాత్రం బాగా కలిసివస్తుందని నమ్మండి.

కలిసి వచ్చే రంగు: లేత గోధుమ రంగు

మిథునం (మే 21 - జూన్ 20)

2018 మీకు బాగా కలిసివచ్చే సంవత్స రంగానే చెప్పుకో వచ్చు. కొత్త అవకా శాలను అందిపుచ్చు కొని మీదైన శైలిలో కష్టపడి పనిచేస్తారు. 2017లో మొదలుపెట్టిన ఒక పని 2018లో మీకు విజయాన్ని అంది స్తుంది. ఉన్నత పదవిని అలంకరిస్తారు. ఆర్థిక పరిస్థితి కూడా ఊహించని స్థాయిలో మెరుగుపడుతుంది. ఆత్మవి శ్వాసంతో పనిచేయండి. మీదైన ప్రతి భను ప్రపంచానికి చాటుకునే అవకాశం ఏడాది మొదట్లోనే వస్తుంది. మీ చుట్టూ ఉండేవారి అభిమానం చూరగొంటారు. మీ ఆలోచనలు స్థిరంగా ఉండేలా చూసుకుంటే అన్నింట్లోనూ ముందుం టారన్న విషయం గ్రహించండి. గతాన్ని గురించి ఎక్కువ ఆలోచించకండి. మీ భయాలన్నింటినీ తరిమివేయాల్సిన అవసరం కూడా ఉంది.

జనవరి నెల అద్భుతంగా ఉంటుంది. జూన్ నుంచి మీ స్థాయి పైపైకి ఎగబాకుతుంది. సెప్టెంబర్‌లో విహారయాత్రకు వెళతారు. మార్చి, మే నెలల్లో కీలక నిర్ణయాలు తీసుకోవ డంలో జాగ్రత్తగా ఉండండి. ఈ నెలల్లో పెట్టుబడులకు కూడా దూరంగా ఉండండి.

కలిసి వచ్చే రంగు: కుంకుమరంగు

కర్కాటకం (జూన్ 21 - జూలై 22)

2018ని ఒక రకంగా మీకు కలల సంవత్స రంగా చెప్పుకోవచ్చు. ఊహించని స్థాయిలో ఓ భారీ విజయం మీ సొంతమవుతుంది. ఎప్పట్నుంచో అనుకొని, పరిస్థితులు అనుకూలిం చకో, మరింకోటో జీవితాశయం వైపుకు వెయ్యలేకపోయిన మొదటి అడుగును ఈ ఏడాది వేస్తారు. ఆత్మవిశ్వాసమే ఆయుధంగా ముందుకు వెళ్లండి. కొన్ని అనుకోని సవాళ్లు ఎదురవుతాయి. గతానుభవాలనుంచి ఆ సవాళ్లు ఎదుర్కొనే శక్తిని పొందుతారు. కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితులు వస్తాయి. అన్నివిధాలా ఆలోచించి మీరు కోరు కున్న భవిష్యత్ కోసం ఏ వైపు అడుగులు వేయాలో, నిర్ణయాలూ అలాగే ఉండేలా చూసుకోండి. మీకు బాగా ఇష్టమైన వ్యక్తితో బంధం ఈ ఏడాది మరింత బాగా బలపడు తుంది. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆలోచనలు స్థిరంగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలు బాగా కలిసివస్తాయి. ఫిబ్రవరి నుండి సెప్టెం బర్ వరకు కొన్ని ప్రతికూల పరిస్థితులు ఎదు రవుతాయి. ముఖ్యంగా మీతోనే ఉంటూ మీపై తప్పుడు ప్రచారం చేసేవారితో ఈ నెలల్లో ఇబ్బందులు తలెత్తే సూచనలున్నాయి.

కలిసి వచ్చే రంగు: కాషాయం

సింహం (జూలై 23 - ఆగస్ట్ 22)

2018లో మీ వ్యాపారం ఊహించని స్థాయిలో వృద్ధిలోకి వస్తుంది. ఉద్యోగులకు కూడా ఈ ఏడాది అన్నివిధాలా కలిసివ స్తుంది. ఆర్థిక పరిస్థితి బాగా మెరుగుపడుతుంది. కొత్త ఉత్సా హంతో పనిచేస్తారు. డబ్బు, పేరు లాంటి విషయాల గూర్చి ఆలోచించకుండా ఆత్మసంతృప్తినిచ్చే పనులు చేసేందుకు ఇష్టప డతారు. ఇదే మీకు సంఘంలో కొత్త గుర్తింపును తెచ్చిపెడు తుంది. గతేడాది చేసిన తప్పులు కొన్ని పునరావృతం కాకుండా చూసుకుంటారు. ముఖ్యంగా సమయాన్ని సరిగ్గా వాడుకోవా లన్న ఆలోచన మిమ్మల్ని సరికొత్త విజయాల వైపుకు తీసుకెళుతుంది. మీరు ప్రేమిం చిన వ్యక్తితో ఒక కొత్త జీవితాన్ని మొదలుపెడతారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. వ్యాయామం చేయడమన్నది ఈ ఏడాదికన్నా అలవాటుగా చేసుకుంటే మంచిది. అక్టోబర్ – డిసెంబర్ కాలంలో వృత్తి జీవితం చాలా బాగుంటుంది. ఈ నెల ల్లోనే మీ సొంతింటి కల కూడా నెరవేరుతుంది. ఏప్రిల్, మే నెలల్లో కొత్త పెట్టుబడుల విషయంలో జాగ్రత్త అవసరం. ఆగస్ట్ – అక్టోబర్ కాలంలో ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

కలిసి వచ్చే రంగు: ఆకుపచ్చ

కన్య (ఆగస్ట్ 23 - సెప్టెంబర్ 22)


2018లో ఒక గొప్ప అవకాశం మీ తలుపు తడుతుంది. అయితే ఆ అవకాశాన్ని అందిపుచ్చుకోవడానికి అన్నివి ధాలా సిద్ధంగా ఉండండి. మీ ఆలోచనా విధానం పూర్తిగా మారాల్సిన కొన్ని పరిస్థితులు తలెత్తుతాయి. మారే మీ ఈ ఆలోచనావిధానమే మిమ్మల్ని విజయం వైపుకు నడిపిస్తుందని నమ్మండి. ఆర్థిక పరిస్థితి బాగా మెరుగుపడుతుంది. కొత్త కొత్త ఆదాయ మార్గాలను వెతుక్కుంటారు. జీవితాశయం గురించి ఎక్కువ ఆలోచిస్తారు. చాలాకాలంగా ఈ ఆలోచనలు ఉన్నా, ఇప్పుడే ఆ దిశగా అడుగులు వేసేందుకు ప్రయత్నిస్తారు. చెడు అలవాట్లకు ఈ ఏడాది స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏడాది మొదట్లో అనుకున్న పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయి. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఈ ఏడాది మిమ్మల్ని సంతోషంగా ఉంచే విషయాల్లో జీవిత భాగస్వా మితో ఎక్కువ సమయం గడపడం అన్నది ముందు వరుసలో ఉంటుంది.

ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో మీ పనికి సరైన గుర్తింపు దక్కుతుంది.

కలిసి వచ్చే రంగు: గులాబీరంగు

S & D

పాశుర ప్రభాతం



17వ పాశురం

అమ్బరమే! తణ్ణీరే, శోతే, అఱమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నందగోపాలా! ఎళుందిరాయ్?
కొమ్బనార్కెల్లామ్ కొళుందే! కులవిళక్కే!
ఎంబెరుమాట్టి! యశోదాయ్! అతివుఱాయ్
అంబర మూడఱుత్తోంగి యులగళంద
ఉంబర్ కోమానే! ఉఱంగాదెళుందిరాయ్
శెయ్ పొర్ఖళ లడి చ్చెల్వా! బలదేవా
ఉంబియుమ్ నీయుం ఉఱంగే లోరెంబావాయ్

భావం: వస్త్రాలు అవసరమైన వారికి వస్త్రాలను, దాహంతో ఉన్న వారికి మంచినీటిని, ఆకలితో ఉన్నవారికి అన్నాన్ని, ధర్మబుద్ధితో దానం చేయు నందగోపాలా! మా స్వామీ మేల్కొనుము. ప్రబ్బలి చెట్లవలె సుకుమారమైన శరీరాలు గల స్త్రీలలో చిగురు వంటిదానా! మా వంశానికి మంగళదీపం వంటి దానా! మాకు యజమానురాలవైన ఓ యశోదా! మేల్కొనుము. ఆకాశ మధ్యభాగాన్ని చీల్చుకుంటూ పెరిగి లోకాలన్నింటిని కొలిచిన ఓ త్రివిక్రమా! సకల దేవవర్గానికి నాయకుడా! నిద్రించద్దు. మేల్కోవయ్యా! స్వచ్ఛమైన ఎర్రని బంగారంతో చేసిన కడియాన్ని ధరించిన ఓ బలరామా! నీవు, నీ తమ్ముడు మేల్కొనండి అని గోపికలు ప్రార్థించారు.

- ఎస్. శ్రీప్రియ

ముగ్గు-ముచ్చట



22 చుక్కలు
4 వరుసలు
4 వరకు



ఎ. ఇందిర
హన్మాన్ వాడ
యాదాద్రి జిల్లా



19 చుక్కలు
5 వరుసలు
5 చుక్కలు వచ్చే వరకు



బాణాల ఇంద్రాణి
న్యూ విద్యానగర్ కాలనీ
నల్లగొండ

ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
muggulu.sakshi@gmail.com



ఈ హీరోయిన్లు ఈ ఏడాది మేకప్ తీసేట్టు లేరు.
సినిమా తర్వాత సినిమా, సినిమా తర్వాత సినిమా....
డైరీ బిజీ. ఫుల్‌గా సినిమాలు... నిల్‌గా డేట్స్.

బోం బోం బాటుగుందిరా డైరీ

నయా తార: ఎంతమంది కొత్త నాయికలు వచ్చినా.. నయనతార 'నయా తార'లానే ఉన్నారు. గతేడాది డోరా, ఆరమ్, వేలైక్కారన్ ఇలా.. మూడు తమిళ సినిమాలు చేశారు. ఇందులో 'డోరా' తెలుగులో విడుదలైంది. మరి... ఈ ఏడాది స్కోర్ ఎంత అంటే? గతేడాది కన్నా ఎక్కువ. నయనతార ఖాతాలో మూడు తమిళ సినిమాలు (ఇమైక్క నొడిగళ్, కొలైయుదిర్ కాలమ్, కోలమావు కోకిల) ఉన్నాయి. ఇక తెలుగులో సంక్రాంతికి వస్తున్న 'జై సింహా'లో నయనతారే కథానాయిక. 'సైరా'కి సై అన్న విషయం తెలిసిందే. 'కర్తవ్యం' అనే టైటిల్‌తో 'ఆరమ్'ని తెలుగులో రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సినిమాల సంగతి ఇలా ఉంచితే.. దర్శకుడు విఘ్నేష్ శివన్‌తో నయనతార లవ్‌లో ఉన్నారని చెన్నై ఇండస్ట్రీ కోడై కూస్తోంది. పెళ్లి ఎప్పుడు అనేది కాలమే నిర్ణయించాలి.

సౌత్‌లో ఆ గౌరవం త్రిషదే: చెన్నై చందమామ త్రిష గత ఏడాది సిల్వర్ స్క్రీన్‌పై మెరవలేదు. అలాగని అవకాశాలు తగ్గిపోయాయనుకుంటే పొరపాటే. ఎందుకంటే ఏకంగా ఆరు సినిమాలు (మోహిని, గర్జనై, చతురంగ వెట్టై 2, 1818, 96, హే జ్యూడ్) ఆమె చేతిలో ఉన్నాయి. మరో మూడు సినిమాలకు డిస్కషన్స్ జరుగుతున్నాయి. సో... 2018లో లెక్క ఎక్కువ. సినిమాలవైజ్‌గా గతేడాది వెనక్కి తగ్గారేమో కానీ,, అరుదైన గౌరవం దక్కించుకున్నారు త్రిష. యూనిసెఫ్ (యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్) సెలబ్రిటీ అడ్వకేట్ స్టేటస్‌ను పొందారామె. సౌత్‌లో ఈ గౌరవం దక్కించుకున్న ఫస్ట్ హీరోయిన్ త్రిషనే అట.

వెరీ వెరీ స్పెషల్: గతేడాది సమంతకు వెరీ వెరీ స్పెషల్. మరి... నచ్చిన కుర్రాడి (నాగచైతన్య)తో మూడు ముళ్లు వేయించుకోవడం అంటే స్పెషల్ కాక ఏంటి? పెళ్లి తర్వాత సినిమాల పరంగా స్పీడ్ తగ్గిస్తారేమో? అన్నది కొందరి ఊహ. కానీ, సమంతకు ఆ ఆలోచన లేదు. గతేడాది 'రాజుగారి గది 2', తమిళంలో 'మెర్సెల్'లో నటించారు. ఈ ఏడాది విషయానికొస్తే... 'రంగస్థలం , మహానటి' సినిమాల్లో నటిస్తున్నారు. తమిళంలో 'ఇరంబుదురై, ఇంకా టైటిల్ డిసైడ్ కాని ఓ సినిమా, 'సూపర్ డీలక్స్' సినిమాల్లో నటిస్తున్నారు. సో.. లెక్క పెరిగిందే కానీ, తగ్గలేదు.

ఫిదా చేసింది: బాన్సువాడ భానుమతి అందానికి, అభినయానికి అందరూ ఫిదా అయ్యారు. కథానాయిక సాయిపల్లవి గురించి చెబుతున్నామని గ్రహించే ఉంటారు. గతేడాది 'ఫిదా, ఎంసీఏ' సినిమాలతో తెలుగు తెరపై కనిపించారామె. తమిళంలో చేసిన 'కరు' తెలుగులో ఈ ఏడాది 'కణం' పేరుతో రిలీజ్ కానుంది. తమిళంలో మరో రెండు సినిమాలు చేయనున్నారు. ఇక తెలుగులో నెక్ట్స్ శర్వానంద్‌తో జోడీ కట్టారు సాయిపల్లవి.

పక్కా స్కెచ్: గత ఏడాది 'బాహుబలి-2'లో అవంతికగా, 'జైలవకుశ'లో స్పెషల్ సాంగ్, తమిళ చిత్రం 'ఏఏఏ'లో నాయికగా కనిపించారు తమన్నా. అందుకే ఈ ఏడాది పక్కా స్కెచ్ వేసుకున్నారామె. తెలుగులో మూడు సినిమాలు (సందీప్‌కిషన్ సరసన ఓ మూవీ, కల్యాణ్‌రామ్‌తో ఓ సినిమా, 'క్వీన్' తెలుగు రీమేక్) లైన్‌లో పెట్టారామె. అంతేకాదు ఈ జనవరిలో తెలుగు, తమిళ భాషల్లో 'స్కెచ్' రిలీజ్ కానుంది. అంతేకాదండోయ్ 'కామోషీ' సినిమాతో మరోసారి హిందీ ఇండస్ట్రీలో లక్‌ను చెక్ చేసుకోవడానికి రెడీ అయ్యారు. లెక్క బాగుంది కదూ.

బొమ్మాళీ... తగ్గొద్దు : ఓ వైపు స్టార్ హీరోలతో కమర్షియల్ మూవీస్ చేస్తూనే మరో పక్క సోలోగా కత్తి తిప్పారు ఈ 'అరుంధతి'. 2017లో అనుష్క మూడు చిత్రాల్లో కనిపించారు. 'సింగమ్ 3', 'ఓం నమో వెంకటేశాయ'లో మెరిశారు. ఆ తర్వాత 'బాహుబలి ది కన్‌క్లూజన్'లో దేవసేనగా అభిమానులను అలరించారు అనుష్క. ఈ ఏడాది జనవరిలో 'భాగమతి'గా కనిపించనున్నారు. జనవరి 26న ఈ సినిమా రిలీజ్ కానుంది. ప్రస్తుతానికి శివ దర్శకత్వంలో అజిత్ చేయబోతున్న 'విశ్వాసం' సినిమాలో హీరోయిన్‌గా ఈ భామ పేరును పరిశీలిస్తున్నట్టు కోలీవుడ్ టాక్.

సిక్సర్ : తమిళంలో 'భైరవ', 'పాంబు సాట్టై', తెలుగులో 'నేను లోకల్'.. ఇలా 2017లో మూడు సినిమాల్లో కనిపించారు కీర్తీ సురేశ్. వచ్చే ఏడాది ఏకంగా సిక్సర్ కొట్టనున్నారు కీర్తి. 'గ్యాంగ్', 'అజ్ఞాతవాసి'తో సంక్రాంతి పండగకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు. మళ్లీ మార్చిలో 'మహానటి'గా రానున్నారు. ఆ తర్వాత 'సామీ స్క్వేర్'లో, 2005లో వచ్చిన 'పందెంకోడి' చిత్రానికి సీక్వెల్‌లో, విజయ్ సరసన ఓ సినిమాలోనూ హీరోయిన్‌గా కనిపిస్తారు కీర్తీ సురేశ్. ఆ విధంగా 2018లో అరడజను సినిమాల్లో సందడి చేయనున్నారు. లెక్క అదిరిందబ్బా.

అదే దూకుడు: ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు పన్నెండేళ్లవుతున్నా.. కాజల్ దూకుడు ఏమాత్రం తగ్గలేదనే చెప్పాలి. స్టార్ హీరోలతో సినిమాలు చేస్తూనే చిన్న హీరోల పక్కన నటిస్తున్నారు. 2017లో 'ఖైదీ నంబర్ 150'లో, 'నేనే రాజు నేనే మంత్రి', తమిళంలో విజయ్‌తో 'మెర్సల్' (తెలుగులో 'అదిరింది'), అజిత్‌తో 'వివేగం' (తెలుగులో 'వివేకం')' సినిమాల్లో కనిపించారు కాజల్. ఆ ఉత్సాహంతో 2018లోను నాలుగు సినిమాల్లో కనిపించనున్నారామె. కల్యాణ్ రామ్ 'ఎమ్మెల్యే', 'క్వీన్' రీమేక్ 'ప్యారిస్ ప్యారిస్', నాని నిర్మిస్తున్న 'అ' చిత్రాల్లో సందడి చేయనున్నారు.

రాశి బాగుంది:
రాశీ ఖన్నా 2017లో మూడు సినిమాల్లో కనిపించారు. 'జై లవ కుశ', 'ఆక్సిజన్' చిత్రాల్లో మెరిశారు. 'విలన్' సినిమా ద్వారా మలయాళ తెరకు పరిచయమయ్యారు. ఈ ఏడాది రాశీ ఖన్నా చేతిలో ఐదు సినిమాలు ఉన్నాయి. అందులో మూడు తమిళ సినిమాలు రెండు తెలుగు సినిమాలు. 'టచ్ చేసి చూడు', 'తొలిప్రేమ'. 'సైతాన్ కా బచ్చా, ఇమైక్క నొడిగల్, అడంగమారు'... ఇలా ఐదు సినిమాలతో ఈ ఏడాది రాశీ ఖన్నా డైరీ బిజీ.

లెక్క తేలలేదు:
అతి కొద్ది కాలంలోనే టాప్ హీరోయిన్స్ లిస్ట్‌లోకి చేరిపోయారు రకుల్ ప్రీత్‌సింగ్. గతేడాది 'విన్నర్, స్పైడర్, జయ జానకి నాయక, రారండోయ్ వేడుక చూద్దాం, ఖాకీ' సినిమాల్లో కనిపించారు రకుల్. ఈ ఏడాది మాత్రం కేవలం ఒక్కటే సినిమా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. అది కూడా బాలీవుడ్ 'అయ్యారీ'. ప్రస్తుతానికి కొన్ని రోజులు రకుల్ డైరీ ఖాళీ. అధికారికంగా ప్రకటించలేదు కానీ, రవితేజ-కల్యాణ్ కృష్ణ సినిమా, హరీష్ శంకర్-'దిల్' రాజు కాంబినేషన్ మూవీ (దాగుడు మూతలు), బోయపాటి-రామ్‌చరణ్ సినిమాలకు రకుల్ పేరుని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇంకా లెక్క తేలలేదు.

2017 ఏం చేశారు? 2018 ఏం చేయబోతున్నారు?
గతేడాది స్ట్రైట్‌గా నాలుగు సినిమాల్లో కనిపించారు హీరోయిన్ మెహరీన్ (మహానుభావుడు, రాజా ది గ్రేట్, జవాన్). తమిళ, తెలుగు బైలింగ్వల్ 'కేరాఫ్ సూర్య'లో నటించారామె. ఈ ఏడాది ఇప్పటివరకు గోపీచంద్ 25వ సినిమాలో హీరోయిన్‌గా చేస్తున్నారు. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ షాలినీ పాండే తెలుగులో ఒక సినిమా చేసిందో లేదో అప్పుడే కోలీవుడ్ నుంచి కాలింగ్ రావడం, ఆమె రెండు తమిళ సినిమాలకు (జీవాతో ఓ సినిమా, జీవీ ప్రకాశ్‌కుమార్‌తో '100% లవ్' రీమేక్) సైన్ చేశారు. కెరీర్‌లో దూసుకెళ్తున్నారు సీనియర్ హీరోయిన్ శ్రియ. 2017లో 'గౌతమిపుత్ర శాతకర్ణి, పైసా వసూల్' సినిమాల్లో ఆమె హీరోయిన్‌గా కనిపించారు. తమిళ సినిమా 'ఏఏఏ'లో నటించారు. ఇక ఈ ఏడాది తమిళంలో ఆమె నటించిన 'నరగాసురన్' (తెలుగులో నరకాసురుడు) థియేటర్స్‌కు రానుంది. హిందీలో ప్రకాశ్‌రాజ్ దర్శకత్వంలో వస్తోన్న 'ఢడ్కా' రిలీజ్‌కి సిద్ధమైంది. 'గాయత్రి, 'వీరభోగ వసంతరాయలు'లో కీలక పాత్రలు చేస్తున్నారామె. బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత జోరు పెంచారు తాప్సీ. 2017లో మూడు హిందీ సినిమాల్లో (రన్నింగ్ షాదీ, నామ్ షబానా, జుడ్వా 2) నటించారు. 'ఘాజీ'లో చిన్న పాత్ర చేసి, తెలుగు తెరపై మెరిసిన తాప్సీ 'ఆనందో బ్రహ్మ' సినిమా చేశారు. ఈ ఏడాది కూడా అదే స్పీడ్‌లో నాలుగు హిందీ సినిమాలను లైన్లో పెట్టారు. మరో తెలుగు సినిమా కోసం డిస్కస్ చేస్తున్నారు. గతేడాది 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త, ఆక్సిజన్, తుప్పరివాలన్' (తెలుగులో డిటెక్టివ్) సినిమాలతో థియేటర్స్‌లో సందడి చేసిన అనూ ఇమ్మాన్యుయేల్ ఈ ఏడాది ఇప్పటికే మూడు సినిమాల్లో హీరోయిన్‌గా నటిస్తున్నారు. అందులో 'అజ్ఞాతవాసి' సంక్రాంతికి రిలీజ్ అవుతుండగా, 'నా పేరు సూర్య' వేసవి బరిలో ఉంది. నాగచైతన్యతో చేయనున్న సినిమా సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. 'లై' ఫేమ్ మేఘా ఆకాశ్ తొలి హీరో నితిన్‌తో మరో సినిమా చేస్తున్నారు.

తెలుగులో 'మిస్టర్, రాధ, యుద్ధం శరణం, ఉన్నది ఒక్కటే జిందగీ' చిత్రాలతో అలరించిన లావణ్య త్రిపాఠి ప్రజెంట్ సాయిధరమ్ తేజ్ సినిమా చేస్తున్నారు. అనుపమా పరమేశ్వరన్ గతేడాది 'శతమానం భవతి, జోమొంటే సువిశంగల్, ఉన్నది ఒక్కటే జిందగీ' చిత్రాల్లో కనిపించారు. ఈ సంవత్సరం నాని 'కృష్ణార్జున యుద్ధం', సాయిధరమ్‌తో ఓ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనున్నారు. 2017లో తెలుగులో నక్షత్రం, బాలకృష్ణుడు, తమిళంలో మా నగరం, సరవనన్ ఇరుక్క భయమేన్, నెంజమ్ మరప్పదిల్లయ్, జెమిని గణేశన్ సురళీ రాజనుమ్... ఇలా ఆరు సినిమాల్లో కనిపించారు రెజీనా. ఈ సంవత్సరం తమిళంలో పార్టీ, చంద్రమౌళి, తెలుగులో అ! రిలీజ్‌కు రెడీ అవుతున్నాయి. 'పెళ్ళి చూపులు'తో ఫేమస్ అయిన రీతూ వర్మ ఈ ఏడాది తమిళంలో విక్రమ్ సరసన 'ధృవనక్షత్రం', దుల్కర్ సల్మాన్‌తో 'కన్నుమ్ కన్నుమ్ కొల్లైయడిత్తాల్' సినిమాల్లో కనిపించనున్నారు. వీళ్లు కాకుండా మరికొంత మంది భామలు ఈ సంవత్సరంలో తెలుగు తెరపై తమ సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు.

కొందరు బాలీవుడ్ భామల సినిమాలు ఈ ఏడాది తెలుగులో రిలీజ్ కానున్నాయి. వారి హిందీ సినిమాల విషయం పక్కనపెడితే.. ఆ లిస్ట్‌లో శ్రద్ధాకపూర్ ('సాహో') అదితిరావ్ హైదరి (సుధీర్‌బాబు సినిమా), కియారా అద్వాని (మహేశ్ 24), కంగనా రనౌత్ (మణికర్ణిక), సన్నీ లియోన్ (వీరమహాదేవి) ఉన్నారు. తెలుగు చిత్రపరిశ్రమ ఎంతమందినైనా ఆహ్వానిస్తుంది. సో.. ఈ ఏడాది ఇంకా నయా తారలు చాలామంది వస్తారని ఊహించవచ్చు.

తుల
(సెప్టెంబర్ 23 - అక్టోబర్ 22)

2018 మీ జీవితంలో ఓ కీలక సంవత్సరంగా నిలిచిపోతుంది. మీ శక్తినంతా వెచ్చించి పనిచేయాల్సి ఉంటుంది. ఎప్పుడూ ఖాళీ అన్నదే లేకుండా పనిచేస్తారు. ఫలితం కూడా మీరు ఊహించిన స్థాయిలోనే అద్భుతంగా ఉంటుంది. తెలివిగా, అన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. తొందరపడి తీసుకున్న నిర్ణయాలు మిమ్మల్ని మరింత వెనక్కి నెట్టేస్తాయన్న విషయాన్ని నమ్మండి. ధైర్యంగా, అభయంగా, ఆత్మవిశ్వాసంతో పనిచేస్తూ ఉండడానికి ఇష్టపడతారు. స్నేహితులకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. ఉద్యోగరీత్యా మార్పు సూచనలు కనిపిస్తున్నాయి. ఆరోగ్య పరిస్థితి గతంలో కంటే బాగా మెరుగుపడుతుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. యోగా, ధ్యానం లాంటివి చేయడం ప్రారంభిస్తే మంచిది.

జనవరి, ఫిబ్రవరి, మార్చి, సెప్టెంబర్, అక్టోబర్ నెలలు బాగా కలిసివస్తాయి. ఏప్రిల్ – జూన్ మధ్య కాలంలో ఆరోగ్యం పట్ల జాగ్రత్త.

కలిసి వచ్చే రంగు: వెండి రంగు

వృశ్చికం
(అక్టోబర్ 23 - నవంబర్ 21)

2018లో మీ వృత్తి జీవితం అద్భుతంగా ఉంటుంది. గత కొన్నాళ్లుగా ఎదురు చూస్తున్న అవకాశాలన్నీ ఒకేసారి వచ్చిపడతాయి. అయితే కొన్ని అనవసర విషయాల గురించి ఎక్కువ ఆలోచిస్తూ మానసికంగా ఒత్తిడికి లోనవుతారు. అందరితో కలిసిపోయే మీ స్వభావమే మీకు అన్నివిధాలా మంచిదన్న విషయాన్ని బలంగా నమ్మండి. అందంగా కనిపించేందుకు ప్రయత్నిస్తారు. ఇది మీలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. మీకు బాగా ఇష్టమైన వ్యక్తికి ఎక్కువ సమయం కేటాయిస్తారు. ఏడాది మధ్యలో కొన్ని అనుకోని అవాంతరాలు ఎదురవుతాయి. అవసరమైన పరిస్థితుల్లో పనులు వాయిదా వేస్తారు. ఆర్థిక పరిస్థితి చాలా బాగుంటుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం. ముఖ్యంగా వేసవిలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

జనవరి – ఆగష్టు నెలల్లో మీరు చేపట్టిన పనులన్నీ విజయవంతం అవుతాయి. సెప్టెంబర్ నెలలో మాత్రం ఊహించని పరిస్థితులు కొన్ని ఎదురవుతాయి.

కలిసి వచ్చే రంగు: తెలుపు

ధనుస్సు
(నవంబర్ 22 - డిసెంబర్ 21)

2018లో కొన్ని కీలక విషయాల్లో ఎంతో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితులు తలెత్తుతాయి. ఆ నిర్ణయాలు మిమ్మల్ని జీవితాశయం వైపుకు నడిపించేలా ఉండేట్టు చూసుకోండి. సరదాగా, ఎక్కువ ఒత్తిడి తీసుకోకుండా, మీదైన శైలిలో పనిచేస్తూ ఉండడమే మీ విజయ రహస్యం. ఎప్పుడూ అలాగే ఉంటూ ఎప్పటికప్పుడు విజయాలను అందుకుంటారు. ఈ ఏడాదిలో మీరు ఎప్పట్నుంచో కోరుకుంటోన్న ఓ గుర్తింపు దక్కుతుంది. ఆ గుర్తింపు వచ్చాక అవకాశాలు వరుసగా వెల్లువెత్తుతాయి. చేపట్టే పనులన్నీ పకడ్బందీగా, సాఫీగా సాగిపోతాయి. ఏడాది మధ్యలో ఖాళీ సమయం దొరుకుతుంది. ఆ సమయంలో మీకు బాగా ఇష్టమైన వ్యక్తితో కలిసి విహారయాత్రకు వెళతారు. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. అదృష్టం మిమ్మల్ని పట్టి ఉంచుతుంది. ఎప్పటికప్పుడు మీ ఆలోచనలు మారిపోతుంటాయి. మీరేలా ఇలా ఉంటున్నది అని కూడా ఆలోచిస్తారు. ఏదేమైనా ప్రశాంతంగా, జీవితమన్నది అనుభవించడానికే అన్నట్టుగా ఈ ఏడాదిని ఆస్వాదిస్తారు. మీ జీవితంలోకి ఒక కొత్త వ్యక్తి రావడం కూడా మీకు ఉత్సాహాన్నిచ్చేలా చేస్తుంది.

మే – నవంబర్ కాలం అన్నివిధాలా కలిసివస్తుంది. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో మాత్రం పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. ఈ సమయంలోనే అనవసర ఖర్చులు, పెట్టుబడులతో డబ్బులు పోగొట్టుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

కలిసి వచ్చే రంగు: ఎరుపు

మకరం
(డిసెంబర్ 22 - జనవరి 19)

2018లో మీ చిరకాల కోరిక ఒకటి నెరవేరుతుంది. ఎప్పట్నుంచో కలలుగన్న పేరు, గుర్తింపు దక్కుతాయి. ఆత్మవిశ్వాసమే మీ బలమైన ఆయుధమన్న విషయాన్ని నమ్మండి. ఏడాది మొదట్లో కొన్ని విషయాల్లో ఎటువంటి స్పష్టతా దొరకదు. అన్నింట్లోనూ వెనకబడ్డ ఆలోచన మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. అయితే ఈ పరిస్థితులన్నీ దాటి వచ్చాక ఇక అంతా మంచే జరుగుతుంది. వృత్తి జీవితంలో ఒక ఊహించని మార్పు చోటుచేసుకోబోతోంది. అందుకు అన్నివిధాలా మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. జీవితాశయం వైపుకు అడుగులు వేస్తారు. ఏడాది చివర్లో ఒక భారీ విజయం మీ సొంతమవుతుంది. ఒక వ్యక్తి పరిచయం మీ ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేస్తుంది. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. విహారయాత్రకు కూడా సన్నాహాలు చేసుకుంటారు.

ఏప్రిల్ – నవంబర్ కాలం అన్నివిధాలా కలిసివస్తుందని చెప్పొచ్చు. డిసెంబర్ నెలలో ఆరోగ్యం దెబ్బతినే సూచనలు కనిపిస్తున్నాయి.

కలిసి వచ్చే రంగు: నీలం

కుంభం
(జనవరి 20 - ఫిబ్రవరి 18)

2018 మీ జీవితంలో ఓ కీలక సంవత్సరంగా నిలుస్తుందని చెప్పుకోవచ్చు. మీ ఆలోచన విధానాన్ని పూర్తిగా మార్చేసే వ్యక్తిని కలుసుకుంటారు. ఆ వ్యక్తి ఇచ్చే ప్రోత్సాహంతోనే జీవితాశయం వైపుకు అడుగులు వేస్తారు. జీవితం విలువ తెలుస్తుంది. అందుకు కారణమయ్యే పరిస్థితులను కూడా ధైర్యంగా ఎదుర్కొంటారు. కొన్ని సవాళ్లు ఎదురైనా, అనుకున్న పనిని చేపట్టడంలో అస్సలు వెనుకాడరు. ప్రేమ జీవితం ఆహ్లాదకరంగా ఉంటుంది. జీవిత భాగస్వామికి ఎక్కువ సమయం కేటాయిస్తారు. ఆర్థిక పరిస్థితి గతేడాదితో పోల్చితే బాగా మెరుగుపడుతుంది. అనవసర ఖర్చులకు దూరంగా ఉంటే మంచిది. కొత్త పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

జనవరి నెలలో కొత్త అవకాశాలు వచ్చిపడతాయి. జూన్‌లో పెళ్లి సూచనలు కనిపిస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చి నెలల్లో కొన్ని సవాళ్లు ఎదురవుతాయి. ధైర్యంగా ఎదుర్కోండి.

కలిసి వచ్చే రంగు: కాషాయం

మీనం
(ఫిబ్రవరి 19 - మార్చి 20)

2018లో ప్రేమ జీవితం కొన్ని కీలక మలుపులు తీసుకుంటుంది. ఇది కొన్నిసార్లు మీకు ఇబ్బందిగా కూడా కనిపిస్తుంది. అయితే అన్ని కష్టాలనూ ఎదుర్కొని ప్రేమలో విజయం సాధిస్తారు. జీవితాశయం వైపుకు ఈ ఏడాదే అడుగులు వేస్తారు. అందుకు మిమ్మల్ని మీరు సిద్ధంగా ఉంచుకోవడానికి ఎవరెవరి సాయం తీసుకోవాలో వారందరినీ సంప్రదిస్తారు. చాలాకాలంగా మీకిష్టమైన ప్రాంతాన్ని సందర్శించాలన్న కల కంటున్న మీకు, ఆ కల ఈ ఏడాది నెరవేరుతుంది. కొత్త బాధ్యతలు మీద పడతాయి. ఆ బాధ్యతలను నెరవేర్చే క్రమంలో ఎక్కువ ఒత్తిడికి లోనవుతారు. కొన్ని ఊహించని పరిణామాల మధ్యన, మీ ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన పరిస్థితికి వస్తారు. ఒకరకంగా అది కూడా మీ మంచికే అని నమ్మండి.

నవంబర్, డిసెంబర్ నెలల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతాయి. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకూ చేపట్టిన పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయి.

కలిసి వచ్చే రంగు: ఆకుపచ్చ

సినిమా
హైదరాబాద్
సోమవారం
1-1-2018
సాక్షి ఫ్యామిలీ

హాలీవుడ్ స్పైస్


● మేఘన్ మార్కల్, ప్రిన్స్ హ్యారీ

అసలు విషయం అప్పుడు చెప్పింది!!


● మేఘన్ మార్కల్

హాలీవుడ్ స్టార్ మేఘన్ మార్కల్ ఇంకో ఐదు నెలల్లో ప్రిన్స్ హ్యారీని పెళ్లి చేసుకొని బ్రిటీష్ రాయల్ ఫ్యామిలీ మెంబర్ కానుంది. నవంబర్ 27న హ్యారీ ఉంగరం తొడిగి ప్రపోజ్ చేశాక మేఘన్ నటనకు దూరమైపోయింది. అప్పటికే బాగా పాపులర్ అయిన 'సూట్స్' టీవీ సిరీస్ నుంచి బయటకొచ్చేసింది. ఇకపై సినిమాలు చేయనని మాట కూడా ఇచ్చేసింది. అలాగే అదేమీ కష్టంగా తీసుకుంటున్న నిర్ణయం కాదని, సినిమాలకు దూరమవ్వడం ఒక కొత్త జీవితం మొదలుపెట్టడానికే అని చెప్పుకొచ్చింది.

ఇంతవరకూ బాగానే ఉంది కానీ, హ్యారీతో మేఘన్ ప్రేమలో ఉన్న విషయం తెలియని రోజుల్లో జేమ్స్‌బాండ్ 25వ సినిమాకు ఆమెను హీరోయిన్‌గా అనుకున్నారట. అనుకోవడమేంటీ? ఆమెనే బాండ్ భామ అని ఫిక్స్ చేసుకొని, అడిగేసారట! సరిగ్గా అప్పుడు చెప్పింది మేఘన్.. అసలు విషయం. ఇంకేముంది.. 'బాండ్ 25' టీమ్ వేరొకర్ని ఎంపిక చేసే పనిలో పడిపోయింది. ప్రపంచవ్యాప్తంగా తిరుగులేని మూవీ సిరీస్‌లో ఒకటైన జేమ్స్‌బాండ్ సిరీస్‌లో వస్తోన్న 25వ సినిమా కావడంతో ఇంకా టైటిల్ కూడా ఫిక్స్ అవ్వని బాండ్ 25పై ఇప్పట్నుంచే భారీ అంచనాలున్నాయి. డేనియల్ క్రెయిగ్ జేమ్స్‌బాండ్‌గా నటిస్తోన్న ఈ సినిమా 2019 నవంబర్‌లో విడుదలవుతుంది.


● 'బ్లాక్ పాంథర్' సృష్టికర్త స్టాన్ లీ

మనం మెచ్చిన హాలీవుడ్!

హాలీవుడ్‌కు ప్రపంచమంతా మార్కెట్ ఉన్న రోజుల్లో, ఆ సినిమాలు ఆడని ఒకే ఒక్క మార్కెట్ ఇండియా అంటారు. అలాంటి ఇండియన్ సినిమా మార్కెట్‌లోకీ హాలీవుడ్ చొచ్చుకొచ్చి రెండు దశాబ్దాలు దాటింది. ఈ రెండు దశాబ్దాల్లో ఇండియన్ సినిమా అభిమానికి హాలీవుడ్ పంచిన వినోదం అంతా ఇంతా కాదు. 'జురాసిక్ పార్క్' చూసి సంబరపడిపోయాం. 'టైటానిక్' చూసి అద్భుతం అనేసుకున్నాం. 'స్పైడర్‌మేన్' అన్నాం. 'టెర్మినేటర్' వెంటపడ్డాం. 'అవతార్' ప్రపంచంలో కొట్టుకుపోయాం. 'ఇంటర్‌స్టెల్లార్'ను వింతగా చూశాం. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ పరంగా అద్భుతాలు సృష్టించగల పేరున్న హాలీవుడ్ సినిమాలు ఇండియాలోనూ ఆ పేరుతోనే పాపులర్ అయ్యాయి. ఆ జానర్ సినిమాలే ఇక్కడ ఫేమస్. ఇక గతేడాది హాలీవుడ్‌కు ఇండియన్ సినిమా మంచి మార్కెట్‌గా అవతరించింది. 2017లో వండర్‌వుమన్, స్పైడర్‌మేన్ లాంటి సూపర్‌హీరో సినిమాలు ఇండియాలో దుమ్మురేపాయి. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమాలు వసూళ్ల వర్షం కురిపించాయి. యాక్షన్, అడ్వెంచరస్ సినిమాలకే ఇండియాలో ఇప్పటికీ క్రేజ్ కనిపిస్తుందన్నది ఒప్పుకొని తీరాల్సిన విషయం.
ఇక 2017కి ఏమాత్రం తగ్గకుండా ఇండియన్ సినిమా అభిమాని టేస్ట్‌కి తగ్గ భారీ బడ్జెట్ హాలీవుడ్ సినిమాలు 2018లోనూ బాక్సాఫీస్‌ను కొల్లగొట్టేందుకు వచ్చేస్తున్నాయి.
ఇండియాలో ఈ ఏడాది చాలా సినిమాలే దుమ్మురేపుతాయని ట్రేడ్ భావిస్తోంది. ముఖ్యంగా 'జురాసిక్ వరల్డ్ 2', 'అవెంజర్స్', 'డెడ్‌పూల్ 2', 'బ్లాక్ పాంథర్', 'ఎక్స్ మెన్' తదితర సినిమాలపై ట్రేడ్ భారీ అంచనాలే పెట్టుకుంది. ఇప్పటికే వంద కోట్ల గ్రాస్ మార్క్ అన్నది ఇండియాలో హాలీవుడ్ సినిమాకు కామన్ అయిపోయింది. ఈ ఏడాది సరికొత్త రికార్డులు సెట్ చేసే సినిమాలు వస్తున్నాయని అభిమానులు కూడా ఆశిస్తున్నారు. మరి ఆ అంచనాలను ఈ భారీ బడ్జెట్ సినిమాలు అందుకుంటాయా? చూడాలి!


● కేట్ విన్‌స్లెట్

అతనికి అంత సీన్ లేదు!


● హార్వీ వెయిన్‌స్టీన్


2009... 'ది రీడర్' సినిమాకు హాలీవుడ్ స్టార్ హీరోయిన్ కేట్ విన్‌స్లెట్ ఉత్తమ నటిగా ఆస్కార్‌కు ఎంపికయింది. ఆస్కార్ అందుకునే రోజు స్పీచ్‌లో హార్వీ వెయిన్‌స్టీన్ గురించి మాట్లాడమని ఆమెపై అందరూ ఒత్తిడి తెచ్చారు. హార్వీ ఆ సినిమాకు ఫైనాన్స్ అందించడంతో పాటు డిస్ట్రిబ్యూటర్‌గా కూడా వ్యవహరించాడు. అయితే, కేట్ మాత్రం అతని గురించి మాట్లాడనంటే మాట్లాడను అని చెప్పింది. నిజంగానే స్పీచ్‌లో హార్వీకి కేట్ కనీసం థ్యాంక్స్ కూడా చెప్పలేదు. ఎనిమిదేళ్లు గడిచాయి. ఇప్పుడు హార్వీ వెయిన్‌స్టీన్ గురించిన వార్తలే వినిపిస్తున్నాయి.. ఎక్కడ చూసినా! కారణం, అవకాశాల కోసం తన వద్దకు వచ్చిన అమ్మాయిలపై హార్వీ లైంగిక దాడికి పాల్పడడమే! 2009లో ఆస్కార్ అవార్డు అందుకుంటూ తాను హార్వీ పేరు ఎందుకు ఎత్తలేదన్న విషయాన్ని కేట్ విన్‌స్లెట్ ఇప్పుడు బయటపెట్టింది. అందరూ కంప్లైంట్ చేస్తున్నట్లే హార్వీ లాంటి వాడిని భరించడం కష్టం అంది కేట్. కేట్ మొదటి సినిమా 'హెవెన్లీ క్రియేచర్స్'కు హార్వీ ఓ నిర్మాత. ''ఆ సినిమా అప్పట్నుంచి ఎప్పుడు నన్ను కలిసినా 'నీకు మొదటి అవకాశం నేనే ఇచ్చా!' అంటూండేవాడు. వాడు నాకు ఆఫర్ ఇవ్వడమేంటి? నేను ఆడిషన్‌లో సెలెక్ట్ అయ్యా. అదే సినిమాకు మూడు సార్లు ఆడిషన్ ఇచ్చా. ఎప్పుడు కలిసినా రూడ్‌గా మాట్లాడేవాడు. అయితే నాతో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడే సీన్ లేదతనికి. కావాలనే పట్టుబట్టి ఆస్కార్ వేడుకలో హార్వీ గురించి మాట్లాడలేదు..'' అని చెప్పుకొచ్చింది కేట్.

టైమ్ ట్రావెల్ బ్యూటీ!!

చిన్నప్పటి ఫోటోలు చూసుకున్నప్పుడు మనకేం అనిపిస్తుంటుంది? 'అబ్బా భలే క్యూట్‌గా ఉన్నాం' అనుకుంటాం కదా! అప్పటుండే క్యూట్‌నెస్ వయసొచ్చాక ఎక్కడన్నా ఉంటుందా? అని మళ్లీ మనమే ఆ రోజులను గుర్తు చేసుకొని, ఆ ఫోటోలను చూసుకొని మురిసిపోతుంటాం. డ్రూ బేరిమోర్ మాత్రం ఇక్కడే ఆగిపోలేదు. చిన్నప్పుడు ఉన్న క్యూట్‌నెస్‌ను మళ్లీ తిరిగి పొందాలనుకుంది. అప్పుడు దిగినట్లుగానే, క్యూట్‌గా పోజులిచ్చి ఫోటోలు దిగాలనుకుంది. దిగింది కూడా! చిత్రమేంటంటే ఆ అందం ఇప్పటికీ ఏమాత్రం తగ్గలేదు. ఆ క్యూట్‌నెస్ ఇప్పుడింకా అలాగే ఉంది. ఆ ఫోటోలకు ఇప్పుడు ఫ్యాన్స్ అంతా ఫిదా! డ్రూ బేరిమోర్ 1980–85 కాలంలో, తనకు 5–10 ఏళ్ల వయసున్న రోజుల్లో దిగిన ఫోటోలు చూసి సంబరపడింది. అలాంటి డ్రెస్సే వేసుకొని, అలాగే ఇప్పుడు ఫోటో దిగితే ఎలా ఉంటుందన్న ఆలోచనతో ఆమె తన కొత్త ఫోటోషూట్‌కు రంగం సిద్ధం చేసుకొంది. 42 ఏళ్ల డ్రూ.. 32 ఏళ్లు వెనక్కి వెళ్లి పదేళ్ల నాటి తన ఫోటోలు చూసుకుంటూ అలాంటి పోజులతోనే క్యూట్ క్యూట్ ఫోటోలు విడుదల చేసింది. కాలంలో ఎన్నేళ్లు వెనక్కి వెళ్లినా, ఈ బ్యూటీ బ్యూటీయే కదూ!!


● డ్రూ బేరిమోర్

అభిమానికి ఇల్లు కొనిచ్చింది!


● టేలర్ స్విఫ్ట్

మాంచెస్టర్‌లో పాప్‌స్టార్ టేలర్ స్విఫ్ట్ షో జరుగుతోంది. ఆమె పాటలు వినడం కోసం వేలాదిమంది అభిమానులు వచ్చారు. అందులో స్టెఫానీ కూడా ఓ అభిమాని. ఆమె ఓ గర్భిణి. టేలర్ స్విఫ్ట్ షో చూడడానికి మాత్రమే కాక, ఆమెతో చిన్న అపాయింట్‌మెంట్ కూడా దక్కించుకుంది స్టెఫానీ. అప్పటికే టేలర్ స్విఫ్ట్‌తో స్టెఫీనా తల్లి మాట్లాడి ఉంది. 'స్టెఫానీని సంతోషపెట్టేలా ఆమెతో మాట్లాడు' అని మాత్రమే స్విఫ్ట్‌ను అడిగింది స్టెఫానీ తల్లి. షో అయ్యాక స్టెఫానీని తన గదికి పిలిపించుకొని.. 'నీకేం కావాలో చెప్పు..' అనడిగింది స్విఫ్ట్. స్టెఫానీ తన బాధ చెప్పుకుంది. ఆ బాధ విన్న టేలర్ స్విఫ్ట్ ఆమెకు ఏ కొన్ని డబ్బులో, ఏదో చిన్న సాయమో చేసి పంపితే అది ఇంత పెద్ద వార్త అయ్యేదే కాదు. స్టెఫానీకి ఓ ఇల్లు కొనుక్కోమని డబ్బులిచ్చి, అందుకు తగ్గ ఏర్పాట్లు కూడా చేసి పంపింది టేలర్. ఇది జరిగిన సమయానికి స్టెఫానీ ఎనిమిది నెలల గర్భిణి. ఇప్పుడామెకు ఓ కూతురు. ''నాకు ఇల్లు లేదు. అప్పుల్లో చిక్కుకొని అమ్మేసుకోవాల్సి వచ్చింది. నా భర్తకు ఉద్యోగం పోయింది. అప్పుడే టేలర్ షో చూడడానికి వెళ్లా. షో అయ్యాక నా గురించి తెలుసుకొని, ఇల్లు కొనుక్కోమని డబ్బులు ఇచ్చింది. నేనిది ఊహించలేదు. టేలర్ ఈజ్ లవ్..'' అని తన కథను షేర్ చేసుకుంది స్టెఫానీ.